NPROI F 206

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)

రాష్ట్ర మహాసభల సావనీర్



2005
జూన్ 6,7,8
అనకాపల్లి

మహాసభలో జెండా ఆవిష్కరణ , కళారూపాలు





జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఝాన్సీ, హాజరైన డా. బి.డి.శర్మ
కామ్రేడ్స్ అరవింద్ సిన్హా సౌరవ్ యాదవ్, జి. విజయకుమార్, దేవతోటి నాగయ్య, కృష్ణమూర్తి, ఆడారి అప్పారావు









NPROIF 206

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)

ఎంత అణచివేతను ఎదిరించాలో
గగనాన మండే సూర్యునిలా,
అగ్ని శిరస్సులా
రెపరెపలతో తల ఎత్తుకు ఎగిరే
పతాకనడుగు
ఉద్యమావసరాల జవాబై నిలుస్తుంది.

ఎంత త్యాగం చెయ్యాలో
మృతవీరుల రక్తాన్ని మూట కట్టుకొని
రంగై మెరిసే ఎరుపునడుగు
వెలికిరాని పోరు చరితల లోతుని
చూపుతుంది.

ఇంకా ఎంత శ్రమ చెయ్యాలో
శ్రమించే చేతులకే సంపదా, అధికారం
లేదెందుకని నిలబెట్టి ప్రశ్నించే
కొడవలి నడుగు
దోపిడీ రహస్యాల మూలాన్ని ఛేదించి మన
ముందు పరుస్తుంది.

ఇంకెంత బరువు బాధ్యతలను మొయ్యాలో
వంకర టింకరల బీభత్స దోపిడీ వ్యవస్థను
విప్లవాగ్నిలో మండించి
కొత్త సౌందర్యాలను సృష్టించటానికి
ఎదురుదెబ్బపై దెబ్బను భరిస్తున్న
సుత్తినడుగు
అనుభవాల గని నుండి గుణపాఠాలను
సిద్ధాంతం చేటలతో చెరిగి
మన ముందు కుమ్మరిస్తుంది.

- దివి కుమార్

మహాసభల సావనీర్ - 2005

విషయసూచిక

1. రాష్ట్ర మహాసభల విశేషాలు - ఉపన్యాసాలు - సందేశాలు	1-49
II ప్రత్యేక వ్యాసాలు	
1. నల్లగొండ ప్రజల వీరోచిత పోరాటం- కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు	51-60
2. వెంకటగిరి జమీ వ్యతిరేకోద్యమం - ఒక పరిశీలన	61-66
3. అడవులు, ఆదివాసులు - షెడ్యూలు తెగల బిల్లు - 2005	67-70
4. జలయజ్ఞంలో రైతాంగం, ప్రజలు సమిధలు కారాదు	71-77
5. బట్టబయలు అయిన భూపంపక బండారం	78-81
6. దున్నేవాడికే భూమి పంపకం చేయాలి (జయతీఘోష్ కమీషన్‌కి రైతుకూలీ సంఘం అందజేసిన మెమోరాండం)	82-83
III జిల్లా మహాసభల రిపోర్టులు	84-92

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)
రాష్ట్ర మహాసభల సావనీర్ - 2005

వెల : రు. 30/-

ప్రతులకు : **మైత్రీ బుక్‌హౌస్**
మసీదు వీధి,
కారల్ మార్క్స్ రోడ్,
విజయవాడ -2

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)
ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్స్,
కృష్ణలంక, విజయవాడ - 10

ప్రచురణకర్తలు : కా॥ ఎస్.ఝాన్సీ, కా॥ కె. కోటయ్య, అధ్యక్ష, కార్యదర్శులు. రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)
ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్స్, కృష్ణలంక, విజయవాడ - 10

మా మాట

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభల సావనీర్‌ను మీముందుకు తెస్తున్నాం. 2001 గుంటూరు రాష్ట్ర మహాసభల సందర్భంగా సావనీర్‌ను తెచ్చాం. అ తర్వాత 2002, 2003 సంవత్సరాల వార్షిక సంచికలు తెచ్చాము. ఇప్పుడు 2005 రాష్ట్ర మహాసభల సావనీర్ విడుదల అవుతున్నది.

ఒకపక్కఎండ, మరోపక్క పెద్ద వర్షం మధ్య అనకాపల్లి రాష్ట్ర మహాసభలు విజయవంతమయ్యాయి. వేలాది మంది రైతు-కూలీలు, గిరిజనులు, మహిళలు, పిన్నలు, పెద్దలు, మహాసభలకి విచ్చేసిన మేధావులు ప్రతికూల వాతావరణాల మధ్య సైతం ఎండకు ఎండి, వానలో తడిసి మహాసభలను విజయవంతం చేసారు. ఈ మహాసభల విశేషాలను వక్తల ఉపన్యాస పాఠాలను దీనిలో పొందుపరిచాము.

నాటి మహోజ్వల పోరాటాల అడుగుజాడలు కనుమరుగు కారాదనే స్పృహను, మరింత తీవ్రమైన కృషి మనం జరపాల్సి ఉందనే ఎరుకను కలిగించుకొనేందుకు తెలంగాణా వీరోచిత రైతాంగ పోరాటంపై అమరులు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు గారు 1947లో వ్రాసిన వ్యాసాన్ని దీనిలో ప్రచురించాం. అలాగే వెంకటగిరి జమీందారీ వ్యతిరేక పోరాటం, ఇతర ప్రాధాన్యత గల అంశాలపై వ్యాసాలను దీనిలో ప్రచురించాము.

15 సంవత్సరాల క్రితం భారతపాలకులు ప్రజల ఆమోదం లేకుండా 'డంకెల్ మరణశాసనం' పై సంతకం పెట్టారు. ఈ కాలం అంతటా వ్యక్తమైన తీవ్ర సంక్షోభం ఆత్మహత్యలు, కరువులు, వలసలు, వ్యభిచారం వంటి అనేక వేదనాభరిత రూపాలతో నిండివుంది. అధికార పీఠం మీద ఉన్న పార్టీలు తప్ప, రేపు అధికారంలోకి వస్తామనుకొంటున్న ప్రతిపక్ష పాలకపార్టీలు సైతం ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణలను వ్యతిరేకిస్తున్నట్లు నటించాల్సినంతగా సంక్షోభం తీవ్రం అయింది. ఈ స్థితిలో సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే పోరాటం - సామ్రాజ్యవాదులకు ఆర్థిక, సాంఘిక పునాదిగా ఉన్న దేశీయ పాలకవర్గాల (భూస్వాముల, దళారీల) దోపిడీకి వ్యతిరేకంగా చేసే పోరాటంగా శక్తివంతంగా జోడించకపోతే గాలిలో యుద్ధంగా మారిపోతుంది. దీన్ని వెల్లడిచేసేందుకు ఈ సావనీర్ ప్రయత్నించింది.

రైతుకూలీ సంఘంగా గ్రామీణ ప్రాంతపు వర్గ సమస్యలు, వైరుధ్యాలు; గ్రామీణ పేదల ఐక్యత - ఐక్యసంఘటనా నిర్మాణంలోని జటిలత్వం; వివిధ రైతుకూలీ నిర్మాణాల మధ్య ఐక్యకార్యాచరణ - ఐక్యతాక్రమం; వీటి కోసం సంఘర్షణ పడుతున్నాం. ఈ క్రమంలో గత మహాసభల నుంచి ఈ మహాసభల కాలం వరకు ఎన్నో అనుకూల, ప్రతికూల అనుభవాలను పొందాం. జిల్లాస్థాయిలలో ఈ కృషిని సంఘటితపరుచుకునేందుకు వివిధ జిల్లాల మహాసభలు జరిగాయి. వీటి సంక్షిప్త వివరణ ఈ సంచికలో ఇచ్చాము.

ఈ సావనీర్ కోసం కొన్ని కవితలు, రచనలు, కార్టూన్‌లు, చిత్రలేఖనాలను సందర్భోచితంగా ఉపయోగించాము. ఆయా రచయితలు, కవులు, చిత్రకారులు, కార్టూనిస్టులకు, రచనల సంపాదకులందరికీ కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము.

ఈ సంచిక వెలువరించడానికి ఆర్థికంగానూ, ఇతరత్రా సహకరించిన మిత్రులకు, శ్రమకోర్చి చక్కగా డిటిపి, కంపోజింగ్, డిజైనింగ్ చేసిన సహచరులకు అందంగా అచ్చువేసి ఇచ్చిన ముద్రాపకులకు, కార్మికులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

విజయవాడ,
సెప్టెంబర్ 11, 2005.

రాష్ట్ర కార్యవర్గం
రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

భూస్వామ్యమా! దళారీ ధనస్వామ్యమా!
భుజమెక్కిన సామ్రాజ్యవాద దొరతనమా!

ఈ నేలపై ఇంకిన మానెత్తురూ
చెమట ఊటలజలపాతాలూ
కరిగి మరిగిన కండరాలే
ఎగిరే ఎర్రెర్రని జెండాలు
అణచబడ్డ జన మహాసముద్రంలో
అల్పపీడనం పుట్టింది
ఆకలి కెరటం లేచింది
మీగుండెలకే అది తాకింది
మీ పీడన సమాధికై
ఇక మొలకెత్తేవన్నీ మా పిడికిళ్ళే !



భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక వ్యవసాయిక విప్లవం వర్ధిల్లాలి!

ఉత్తేజాన్ని, బరువైన కర్తవ్యాలను అందిస్తూ విజయవంతం అయిన

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలు

జూన్ 6,7,8 తేదీలలో అనకాపల్లి పట్టణం తను ఇంతకుముందెన్నడూ చూడని ఒక ముఖ్య సంఘటనకు వేదికగా మారింది. రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహా సభలు ఆ తేదీలలో విజయవంతంగా జరిగాయి.

చారిత్రక, వీరోచిత ఆదివాసీ, రైతాంగ పోరాటాల నేపధ్యం, వర్తమాన ప్రపంచీకరణ దుష్పలితాలకు వ్యతిరేకంగా కదలబారుచున్న రైతాంగ, కార్మిక జన సందోహం-ఇవి అనకాపల్లి ఒక రాష్ట్ర మహాసభకి వేదిక అయ్యేందుకు ఒనకూడిన అంశాలు.

గతంనుంచి నేటి వరకు వివిధ ఉద్యమాల్లో క్రియాశీలకంగా నిలచిన నిస్వార్థ ప్రజా నాయకులు పి.వి.రమణ అధ్యక్షులుగా 97 మందితో 30-5-2005న ఆహ్వాన సంఘం ఏర్పాటుతో మహాసభల ప్రచార సన్నాహక కృషి ప్రారంభమైంది. అనకాపల్లి చుట్టుపక్కల కార్మిక, రైతాంగ శ్రేణుల్లో విస్తృతమైన ప్రచారం జరిగింది. గ్రామాలలోను, పట్టణవీధుల్లోను, కార్మిక పేటల్లోను, రైళ్ళలోను డప్పు, పాటలతో ప్రచారం చేస్తూ 1 రూపాయి నుండి 10 రూపాయల వరకు కార్యకర్తలు విరాళాలు వసూలు చేశారు. విపరీతమైన ఎండ, ఎండ తర్వాత వర్షం వంటి విరుద్ధ వాతావరణ పరిస్థితుల మధ్య ప్రచార దళాలు, కార్యకర్తలు ముఖ్యంగా విద్యార్థులు, యువకులు, బాల సంఘ కార్యకర్తలు విశేష కృషి చేసి ఒక నూతన రాజకీయ వాతావరణాన్ని అనకాపల్లిలో నెలకొల్పారు.


5వ తేదీ రాత్రికే పట్టణంలో మహాసభల అలంకరణ పూర్తయింది. ఎక్కడ చూసినా వాల్‌పోస్టర్లు దర్శనమిచ్చాయి. రైతుకూలీ సంఘం జండాలు, బ్యానర్లు, ఎర్రజెండాల తోరణాలు, మహాసభల ద్వారాలు అనకాపల్లి పట్టణాన్ని కమ్మివేసి ఎరుపుశోభను తెచ్చిపెట్టింది.

6వ తేదీ ఉదయం రాష్ట్రవ్యాపితంగా వేలాదిమంది రైతుకూలీలు, సంఘ నాయకులు, మహిళలు, పిల్లలు, కళాకారులు అనకాపల్లి లోని కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి నగర్ (ఎన్టీఆర్ స్టేడియం)కు చేరుకున్నారు. తూర్పుకనుమల పచ్చటి అడవుల నిగూఢమైన గంభీరత్వం, బంగాళాఖాత సముద్రపుహోరు ఆ ప్రాంగణంలో వ్యక్తం అవుతుండగా రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ రైతుకూలీ సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య గారు అమరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. కా॥ఝాన్సీ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టిన వెంటనే సభాస్థల మంతా మౌనముద్ర దాల్చి అమరులకి నివాళులు అర్పించింది.



ప్రారంభసభలో ఉపన్యసిస్తున్న డా.బి.డి.శర్మ. వేదికపై కామ్రేడ్స్ అడారి అప్పారావు, అరవింద్‌సిన్హా, ఝాన్సీ, ప్రా॥ కె.ఆర్. చౌదరి, పి.వి. రమణ, కృష్ణమూర్తి, దేవతోటి నాగయ్య తదితరులు

ప్రారంభసభ : ఉత్తరాంధ్ర కళారూపాలైన తప్పెటగుళ్ళు, కిందిరి నృత్యాలు, అరుణోదయ కళాబృందాల పాటలతో మహాసభల ప్రారంభ సభ ఆరంభమైంది. ఈ ప్రారంభ సభకి రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ - ప్రారంభోపన్యాసకులు అయిన కామ్రేడ్ అరవింద్ సిన్హా, ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి, డాక్టరు బి.డి.శర్మ వంటి ప్రముఖులను, ఇతర రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సీనియర్ నాయకులను, ఇతర ప్రతినిధులను



ఊరేగింపుకు సంసిద్ధమవుతున్న జనసందోహం

వేదికపైకి ఆహ్వానించారు. కామ్రేడ్ ఝాన్సీ సభకి అధ్యక్షత వహించారు.

మొదట రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన రైతుకూలీ ప్రజానీకానికి ఆహ్వాన సంఘ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే శ్రీ పి.వి. రమణ గారు స్వాగతం పలికారు.

ప్రారంభోపన్యాసకులుగా వచ్చిన బీహార్, జార్ఖండ్ పీడిత ప్రజల ఉద్యమాల నాయకులు కామ్రేడ్ అరవింద్‌సిన్హా ఉపన్యసిస్తూ వ్యవసాయ రంగంలో దేశంలో సామ్రాజ్యవాదుల సంస్కరణల క్రమాన్ని, వీటికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరాన్ని వివరించారు. పాలకుల తోక పట్టుకొని పోవద్దని, అదే సమయంలో ప్రజలను వదలి, ఒంటెద్దు పోకడలు పోవడం తగదని చెప్పారు. వేదికపై ఆసీనులైన కె.ఆర్.చౌదరి గారి ఉపన్యాసం జయతీఘోష్ కమీషన్ ఏర్పాటు వెనుక పూర్వరంగాన్ని, కమీషన్ నివేదిక వచ్చినా ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరిని వెల్లడి చేసింది. అనంతరం భారత జనాందోళన్ జాతీయ అధ్యక్షులు డా॥ బి.డి.శర్మ గారు ఉపన్యసిస్తూ రైతాంగానికి వ్యతిరేకంగా పాలకుల నిశ్శబ్ద కుట్రను-దానికి మానవీయ ముఖాన్ని తొడగాలనే కుటిల యత్నాన్ని వివరించి, ప్రత్యామ్నాయం కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు.

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) మహాసభలకి హాజరైన రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల వివిధ నాయకులు తమ సందేశాలను ఇచ్చారు. గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర నాయకులు కా॥దేవతోటి నాగయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకులు కా॥ కృష్ణమూర్తి, అఖిల భారత రైతుకూలీ సంఘం కార్యదర్శి కా॥ప్రభాకర్, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కా॥ వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం తరపున కా॥ తులసీదాస్ తదితరులు సందేశాలనిచ్చారు.

ఆహ్వాన సంఘం కార్యదర్శి, ప్రముఖ కార్మిక నాయకులు ఆడారి అప్పారావు మాట్లాడుతూ విశాఖ జిల్లాలోని, ఇతర ప్రాంతాలలోని పారిశ్రామిక, వ్యవసాయ సంక్షోభాన్ని; రైతు, కార్మిక ఐక్యత అవసరాన్ని వివరించారు. అనంతరం కామ్రేడ్ ఝాన్సీ వక్తలకు, సౌహార్ద్ర ప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతూ బలమైన ఏకీకృతమైన రైతు ఉద్యమ నిర్మాణం అవసరమని; దీనికోసం అన్ని అభిప్రాయాలను చర్చిస్తూ, బేధాభిప్రాయాలను పరిష్కరించుకొంటూ వ్యవసాయక విప్లవ ఉద్యమ నిర్మాణం కోసం సాగాలని; ఐక్య కార్యాచరణ, ఐక్య పోరాటాలను ముందుకు కొనిపోవాలని, సోదర సంస్థలు కూడా ఇదే వైఖరిని కలిగి ఉండాలని కోరుతూ ముగించారు.

అనంతరం ఆహ్వానసంఘ కోశాధికారి పి. కోటిరెడ్డి వందన సమర్పణతో ప్రారంభసభ ముగిసింది. ఒకపక్క ఎండ మండిపోతున్నా పిల్లాపాపలతో మహాసభలకి వచ్చిన వేలాది మంది రైతుకూలీ, గిరిజన ప్రజానీకం ప్రారంభ సభ అంతటా అత్యంత క్రమశిక్షణతో పాల్గొన్నారు. నాయకుల ప్రసంగాలను, అనువాదాలను శ్రద్ధగా విన్నారు. కళారూపాలు, పాటలు విని పరవశించారు.

ఎండకు ఎండి వానకు తడిసినా ఉత్తేజాన్ని వెదజల్లుతూ సాగిన మహాసభ ఊరేగింపు : ఊరేగింపు ప్రారంభమైన వెంటనే వర్షం మొదలైంది. అప్పటివరకు 42 డిగ్రీల ఉష్ణోగ్రతను భరించిన జనమే ఈ వర్షాన్ని లెక్కచేయక ఊరేగింపు సాగించారు. వర్షం కురుస్తున్నా వరుస చెదరకుండా నినాదాలు చేస్తూ సాగిపోయారు. ఎండను, వర్షాన్ని లెక్క చేయని ప్రజల నిబ్బరాన్ని, నినాదాలను చూసి అనకాపల్లి ప్రజలు, పత్రికలు ఆనందాశ్చర్యాలకు గురైనారు. అవును! ఈ జనం సుదీర్ఘ కాల వర్గ, ప్రజాఉద్యమాలలో రాటుదేలిన వారు. వీళ్ళే ఇంతవరకూ తమ భూములు కాజేసిన భూస్వాముల (తమ) చేలల్లో జోరు వర్షంలో జలగలు, జెర్రుల మధ్య నాట్లు వేసింది. మండుటెండలో చేలు కోసింది. కుప్పలు వేసిందీ వీళ్లే. ఈ రోజు భూములు సాధించుకుంటూనే, భూములను నిలబెట్టుకుంటూనే, సంఘ నాయకత్వాన పోరాడుతున్న వీరే ఏ ఆటంకాలను లెక్కచేయని ధీరోదాత్తులు. ఈ విధంగా మండుటెండలో ప్రారంభసభ-జోరువర్షంలో ఊరేగింపు ప్రజల నిబ్బరాన్ని, సంఘనిర్మాణ దారుఢ్యాన్ని చాటి చెప్పాయి. ఊరేగింపు పొడవునా అతిథులు, నాయకులు కూడా వర్షంలోనే తడుస్తూ చివరివరకూ నాయకత్వం వహించారు. ☆

మహాసభల సంతాప తీర్మానం

అమరులకు నివాళి

★ విప్లవ రైతుకూలీ ఉద్యమ నిర్మాణం కోసం, నూతన ప్రజాస్వామికం కోసం అహరహం శ్రమించి మనకొక ఒరవడి దిద్దిన మన రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డికి; నిబద్ధతతో, నిరాడంబరతతో పీడిత ప్రజల నాయ కులుగా నిలిచిన మన రాష్ట్ర ఉపాధ్యక్షు లు కామ్రేడ్ కనమత రెడ్డి అంజిరెడ్డికి;

★ మట్టినుంచి, శ్రమనుంచి ఉద్యమం లోకి ఎదిగి వచ్చి ప్రజాపోరాటాలకు ఊపిరిలూదుతూ పీడిత ప్రజల ఆశా జ్యోతిగా రూపుదిద్దు కుంటున్న క్రమంలో హత్యా రాజకీయాలకి బలైన కామ్రేడ్ అంగడి చెన్నయ్యకి;

★ అగ్రకుల పెత్తందార్లకి సవాలుగా నిల్చి హత్యారాజకీ యాలకు బలైన గుంటూరు జిల్లా ప్రజా నాయకుడు కామ్రేడ్ దూపాటి అప్పారావుకి;

★ పోలీసు క్రూర హింసా విధానానికి బలైన దుగ్గేరు గిరిజన ముద్దుబిడ్డ తాడంగి కన్నుకి; రైతుకూలీ, గిరిజన ఉద్యమ నిర్మాణానికి, సంఘ నిర్మాణానికి కృషి చేస్తూ మరణించిన కామ్రేడ్స్ సి. నారాయణ రెడ్డి (అనంతపురం), వంజం కన్నమ్మ (కొండ మొదలు) ముత్తిరెడ్డి వెంకటేశ్వరరావు (రేపల్లె, గుంటూరుజిల్లా) తదితర నాయకులకు ఈ మహాసభ విప్లవ జోహార్లు అర్పిస్తున్నది.

★ పీడిత జనాలమధ్య సహృద్భావం, ఐక్యత కోసం కృషిచేస్తూ, తమ తమ రంగాలలో చిరస్మరణీయమైన కృషి చేసిన ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు సింగరాజు రామకృష్ణయ్య గారు; ప్రజాతంత్ర నాయకులు పెరికల రత్తయ్య, ఆదివాసీ సంఘీభావ ఉద్యమనాయకులు బి.జనార్ధనరావు గారికి; రైతుకూలీ ఉద్యమ నిర్మాణం కోసం, ఉన్నత విలువలను పాదు కొల్పేందుకు దశాబ్దాలుగా వివిధ పార్టీలలో, ఉద్యమాలలో, వివిధ ప్రాంతాలలో, వివిధ కాలాలలో కృషి చేసి మరణించిన మహానీయు లైన నాయకులందరికీ ఈ మహాసభ నివాళులు అర్పిస్తున్నది.

★ పాలకుల బూటకపు ఎన్‌కౌంటర్ లలో, రాజ్యహింసకు బలై అమరులైన వారంద రికీ ఈ మహాసభ జోహార్లు అర్పిస్తున్నది.

★ పాలకుల రాజకీయ, ఆర్థిక విధానాల నుండి తీవ్ర నిరాశా నిస్పృహలకి లోనై ఆత్మహత్యలకు పాల్పడిన రైతులు, చేతి, చేనేత వృత్తుల సోదరులందరికీ ఈ మహాసభ సంతాపం తెలియ జేస్తున్నది.

★ సామ్రాజ్యవాద దురాక్రమణ, పీడన లకి వ్యతిరేకంగా ప్రపంచ దేశాల పీడిత ప్రజలకి, పోరాటాలకి ఉత్తేజమిచ్చిన యాసర్ ఆరాఫత్‌కి; ఇంకా అనేక ప్రపంచదేశాల, పీడిత ప్రజల, జాతుల అమరనాయకులకి ఈ మహాసభ విప్లవ జోహార్లు అర్పిస్తున్నది.



అమరులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ప్రజాహితం కోరే వాళ్ళ కోసం -
ప్రాణాలు తృణప్రాయంగా భావించే వాళ్ళ కోసం
కని పెంచిన అనుబంధం తాడు తెంపుకొని
కన్నవాళ్ళనీ, కావలసిన వాళ్ళనీ - ప్రజల్లో చూసుకునే వాళ్ళకోసం
సర్వసుఖాలూ వదిలీ పోటురాళ్ళ దెబ్బల్లో రాటుదేలీ -
అభిమానం కలగలిపి వండిన అన్నం తినీ, గంజి తాగీ -
ఎండలో, వానలో, చలిలో, మాడి, తడిసి ఘనీభవించీ -
చెట్టుకిందనో, గట్టుకిందనో సేదదీరీ- అవిశ్రాంత పోరాటబాటలో
అడుగై, మడుగై వికసించీ - విజృంభించీ దీక్షా కంకణ బద్ధులై-
పరవళ్ళు తొక్కే వాగు వురకలై తరగలై వర్షపు మోతలై -
ఈ నేల తల్లిని విముక్తం చేస్తున్న ఆదర్శ మానవులారా!
శ్రమశక్తిని నమ్ముకున్న గుండెల్లో తలుస్తే మొలిచే మొలకల్లారా!
వెలుగురేఖలారా! వేగుచుక్కలారా! ధైర్యకాంతి పుంజాలై వికసించే వీరులారా!
యోధులారా! మీకు మా లాల్‌సలాం!!

- పస్పుల రాజిరెడ్డి

ప్రారంభోపన్యాసం

ప్రజాశక్తులన్నీ ఐక్యమై సంఘటిత ప్రజా ఉద్యమాలు నిర్మించాలి

కామ్రేడ్ అరవింద్ సిన్హా
బీహార్ - జార్ఖండ్ కార్మిక పీడిత ప్రజా నాయకులు



కామ్రేడ్స్! అధ్యక్షా!

వేదికపైనున్న పెద్దలకు, సోదరులకు, ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి హాజరైన రైతు కూలీ ప్రజానీకానికి, రైతాంగ కార్యకర్తలకు నా విప్లవాభినందనలు. కామ్రేడ్ మండ్ల సుబ్బా రెడ్డి ప్రాంగణంలో జరుగుతున్న ఈ కాన్ఫరెన్సుకు హాజరైన మనమంతా ఒక్కసారి మనదేశ ఆర్థిక రాజకీయ పరిస్థితిని గమనించాలి. కేంద్రం లోను, రాష్ట్రంలోను, ఒక ఏడాది యుపిఎ పరిపాలనలో ఏర్పడిన ఈ సంక్షోభ పరిస్థితిని మనం అవగతం చేసుకోవాలి. ఈ విషయాల్లోకి నేను వెళ్లేముందు కామ్రేడ్ ఎమ్.ఎస్.కి నా రెడ్‌సెల్యూట్స్ అర్పిస్తున్నాను. ఆయన, నేను ఆరు సంవత్సరాల పాటు సహచరులంగా వున్నాం. ఆయన అంకితభావం నన్ను ఎంతో ఉత్తేజితుల్ని చేసింది.

ఇక విషయానికొస్తే కేంద్రంలో మన్‌మోహన్‌సింగ్ నాయకత్వంలో ఉన్న యుపిఎ సంకీర్ణ ప్రభుత్వాలు, ఆంధ్రప్రదేశ్‌లో వైయస్ఆర్ నాయకత్వంలో ఉన్న సంకీర్ణ ప్రభుత్వం కాని-భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో రైతాంగాన్ని, కార్మికులను కష్టాల నుండి, తమ బాధల నుండి విముక్తి కల్పిస్తామని, హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఈ సంవత్సర పరిపాలనా కాలంలో వారు కార్మిక వర్గానికి, రైతాంగానికి, మొత్తం దేశ ప్రజానీకానికీ ద్రోహం చేసి వాళ్ళ పాలన సాగించారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకొన్నా రంటే కారణం వారికి వేరే ప్రభుత్వం కావాలని కాదు. ఎన్.డి.ఎ. ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలు, రైతాంగ వ్యతిరేక, మధ్యతరగతి ప్రజల వ్యతిరేక విధానాలకి నిరసనగా ప్రజలు ఓటువేశారు. ఏ విధానాలైతే నిరుద్యోగాన్నిపెంచాయో, రైతుల్ని ఆత్మహత్యల వైపు నెట్టాయో, ప్రభుత్వరంగ సంస్థల్లో కార్మికుల రిట్రెంచ్‌మెంట్‌లకు దారితీసాయో-వాటన్నింటికీ వ్యతిరేకంగా ప్రజలు ఓటు వేశారు. ఫలితంగా కాంగ్రెస్ నాయకత్వాన యు.పి.ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విషయమేమిటంటే ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే ప్రజావ్యతిరేక దిశలో నడుస్తున్నది.

ఈ మధ్య పార్లమెంట్‌లో బడ్జెట్ సెషన్‌లో మనం పెద్ద డ్రామా చూశాము. ఏ ప్రభుత్వ విధానానికైనా బడ్జెట్ అనేది చాలా ముఖ్యమైనది. పార్లమెంట్‌లో బడ్జెట్‌పై చర్చ సాగుతున్నంత కాలం ప్రతిపక్షం బడ్జెట్‌పై చర్చలో పాల్గొనకుండా ఆ సభను బహిష్కరిస్తూ బయటకు వచ్చింది. చివరికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎలాంటి వ్యతిరేకత, చర్చ, వాదన లేకుండానే పార్లమెంట్ ఆమోదాన్ని పొందింది. అంటే ప్రతిపక్షానికి, అధికార పక్షానికి ఈ బడ్జెట్‌ను ఆమోదించడంలో, బడ్జెట్‌లోని విధానాలను అమలుపరచడంలో ఏకాభిప్రాయం ఉందనుకోవాలి. ఇదంతా దేశ ప్రజల్ని, ప్రజల ఆకాంక్షల్ని తొక్కిపెట్టి దేశాన్ని సామ్రాజ్యవాదులకి ధారాదత్తం చేయడానికి జరుగుతున్న తంతే.

కొద్దిరోజుల క్రితం ప్రధాని మన్‌మోహన్ సింగ్ ఒక సమావేశంలో మాట్లాడుతూ "దేశ ఆర్థికాభివృద్ధికి నేడు వ్యవసాయరంగంలో భారీ పెట్టుబడులు అవసరం, అదే సమయంలో సబ్సిడీలు ఉండరాదు" అని ప్రకటించారు. మన్‌మోహన్‌సింగ్ ఒకవైపు రైతాంగానికి, రైతుకూలీలకు ప్రభుత్వ రుణవిధానాన్ని వర్తింపజేస్తామని చెబుతూనే, మరోవైపు ఎరువుల మీద, విత్తనాలమీద సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేయాలని అంటున్నాడు. ఒక్క జిల్లాలోనే 150 మంది రైతులు ఆర్థిక సమస్యల వల్ల ఆత్మహత్యలు చేసుకున్నారంటే సంక్షోభం యొక్క తీవ్రత ఎలా ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం ఎరువులమీద, నీటి సరఫరా, విద్యుత్‌ల మీద మన దేశంలో సబ్సిడీలు నామమాత్రంగా ఇస్తూ డీజిల్ ధరలను పెంచేసింది. దేశంలో అధిక ప్రాంతాలలో రైతులు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు అందడం లేదు. సాధారణంగా జాతీయ బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వవు. దానితో స్థానికంగా ఉన్న వడ్డీ వ్యాపారుల నుంచి చాలా ఎక్కువ వడ్డీ రేట్లకు రైతులు అప్పులు తీసుకుంటున్నారు. బీహార్, జార్ఖండ్‌లలో రైతుల దగ్గర నుండి 20% వడ్డీని వసూలు చేయడం నేను చూశాను. వీటన్నింటి మధ్య రైతాంగం కనీసం తమ పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాక తమ ఉత్పత్తుల్ని చాలా తక్కువ రేటుకు అమ్ముకునే దుస్థితికి నెట్టబడుచున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో రైతులకు ఆత్మహత్యలు తప్ప మరోమార్గం లేకుండా పోయింది. ఇంకా అనేకమంది దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు. ఇదీ, ప్రభుత్వం చేత వంచింపబడిన మన రైతాంగం యొక్క దుస్థితి. మనదేశ రైతాంగం ఏ జాతీయ బ్యాంకులు, ప్రయివేటు బ్యాంకుల సహకారం లేకుండానే మన దేశాన్ని గోధుమ ఉత్పత్తుల్లో అగ్రగామిగా నిలబెట్టింది. రైతాంగం విశేషంగా కృషిచేసి ఆహార ధాన్యాల రంగంలో దేశానికి స్వయం పోషకత్వాన్ని సాధించిపెడితే; ఈ పాలకులు రైతాంగం వెన్ను విరుస్తూ, వ్యవసాయార్థిక వ్యవస్థను దుంపనాశనం చేస్తూ బహుళజాతి సంస్థలకు, కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయ రంగాన్ని కట్టబెడుతున్నారు. ఈ దేశంలో అవలంభిస్తున్న ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల ద్వారా ప్రజాసంక్షేమానికి వ్యతిరేకంగా వ్యవహరించడమే ఇది. ఇక్కడ మన పాలకుల, యూరప్ దేశాల పాలకుల కపటత్వాన్ని గుర్తు చేస్తాను. వీరు అమెరికా, యూరోపియన్ యూనియన్, జర్మనీ, తదితర అభివృద్ధి చెందిన దేశాలలో వ్యవసాయ రంగానికి పెద్దఎత్తున 300 బిలియన్ డాలర్ల సబ్సిడీని ఇస్తున్నారు. అదే సమయంలో వీరు మనదేశంలో ప్రభుత్వ,

ప్రయివేటు రంగాలలో ఇస్తున్న సబ్సిడీలను రద్దు చేయమని, తగ్గించమని వత్తిడి చేస్తున్నారు. ఈ రకంగా చేయడం ద్వారా వారి ఉత్పత్తులకు మనదేశం మార్కెట్‌గా ఉపయోగపడుతున్నది. ఇదీ అభివృద్ధి చెందిన దేశాల 'ప్రపంచీకరణ' నినాదం యొక్క కపటత్వం. ఈ అభివృద్ధి చెందిన దేశాలు నిర్దేశిస్తున్న, మన ప్రభుత్వం ప్రకటిస్తున్న విధానాలను గనుక అమలు చేస్తే మన దేశ స్వయం సమృద్ధిని మనం కోల్పోతాం. ఇప్పటికీ గత సంవత్సరం ఆహార ఉత్పత్తుల్లో 40 లక్షల టన్నుల తగ్గుదల కనిపించింది. ఇదే దిశలో ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గుతూ పోతూందనే అంచనా కూడా ఉంది. ఎగుమతులకు అవసరమైన పంటలు పండించవలసిందిగా రైతాంగానికి సూచిస్తున్నారు. ఇది అభివృద్ధి చెందిన దేశాల అవసరాలను తీర్చడమే కాకుండా, ఆహార ధాన్యాల విషయంలో మనదేశ స్వయంసమృద్ధిని కూడా అది దెబ్బతీస్తుంది. అమెరికా, యూరప్ దేశాల ఆహార ఉత్పత్తులకు మనదేశం మార్కెట్‌గా తయారై, ఇక్కడ ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతే అనివార్యంగా మనం 'ఆనాటి స్థితికి' అంటే అభివృద్ధి చెందిన దేశాల నుండి దిగుమతి చేసుకున్న ఆహార ధాన్యాల మీద ఆధారపడి బతకాల్సి వస్తుంది. బ్యాంకుల రుణవిధానంలో ప్రభుత్వం యొక్క రైతు వ్యతిరేక విధానం, కపటత్వం కొట్టొచ్చినట్లుగా కన్పిస్తున్నది. నేనొక ఉదాహరణ చెబుతాను. పారిశ్రామిక రంగానికి జాతీయ బ్యాంకులు లక్షల కోట్ల రూపాయల ఋణం ఇచ్చాయి. లక్ష కోట్ల రూపాయలకు పైగా రుణాలు చెల్లింపులేని, తిరిగిరాని బాకీలుగా ఉన్నాయి. ఇందులో నలభైవేల కోట్ల రూపాయల బాకీలు పరిశ్రమ పెట్టలేమంటూ, ఆ పరిశ్రమ పనిచేయడం లేదంటూ మొండికి పడినవే. కానీ భారత ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని తన ముద్దుబిడ్డగా భావించి ఆ నలభైవేలకోట్ల రూపాయలు చెల్లించనవసరం లేదంటూ పారిశ్రామిక రంగానికి ఒక బహుమతిని ప్రసాదించింది. పైగా మన దేశ బడా పారిశ్రామిక వేత్తలు "అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే రుణాలపై వడ్డీ రేటు చాలా ఎక్కువని, అందువల్ల గ్లోబల్ మార్కెట్‌లో ఇతర దేశాలతో పోటీ పడలేకపోతున్నామని" అంటున్నారు. అందువలన ప్రభుత్వం వారికిచ్చే రుణాలమీద వడ్డీ బాగా తగ్గించింది. కాని నూటికి డెబ్భైమంది ప్రజలు ఆధారపడి బ్రతికే వ్యవసాయరంగానికి మరిన్ని వసతులు కల్పించాల్సింది పోయి ఇప్పటి వరకూ ఉన్న వాటిని కూడా రద్దు చేస్తూవస్తున్నది. ఇది అత్యంత హేయమైన ప్రజావ్యతిరేక చర్య. భారతదేశంలో వ్యవసాయరంగంలో పాలకులు ఒక నిశ్చితమైన విధానాలను అవలంభించడం ఒక లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత వ్యవసాయరంగాన్ని అమెరికా, యూరప్ దేశాలకు అనుగుణంగా కార్పొరేట్‌రంగంగా మార్చడమే దీని ఉద్దేశ్యం. భారతదేశంలో ఉన్న పేద రైతులు, సామాన్య రైతుల్ని వ్యవసాయ వ్యవస్థ నుండి గెంటివేసి; వారిని నిరుపేదలుగా, భూమిలేని వారిగా మార్చి; ఆ భూములన్నింటిని బహుళజాతి కార్పోరేట్‌లకు, దేశీయ దళారీ కార్పోరేట్లకు అప్పగించి; అమెరికా, యూరప్ దేశాలలో మానవ సాయం లేకుండా అన్నీ యంత్రాలతో ఎలా అయితే వ్యవసాయం జరుగుతుందో, అటువంటి మొత్తం యంత్రాలతో కూడిన వ్యవసాయ విధానాన్ని భారతదేశంలో సృష్టించడమే ఈ కార్పోరేట్ వ్యవసాయ విధానం వెనుక ఉన్న లక్ష్యం. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెంచడం అంటే మన్‌మోహన్‌సింగ్ అర్థం ఇదే.

మన్‌మోహన్‌సింగ్ 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్'లో చదివి వచ్చారు. ఆయన అక్కడ బ్రిటీష్ వారి ఆర్థికాన్ని చదివారు. భారతదేశాన్ని కూడా అలాగే పెట్టుబడిదారీ పంథాలో అభివృద్ధి చేయాలని, చేస్తానని అంటున్నాడు. కానీ చరిత్రలో చూస్తే భారతదేశం లాంటి వలస దేశాలలో కోట్లాది రూపాయల సంపదను దోపిడీ చేయడం ద్వారానే ఇంగ్లండ్‌లో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందింది. పేద దేశాలను దోచుకోకుండా ఏ పెట్టుబడిదారీ దేశం, సామ్రాజ్యవాదదేశం అభివృద్ధి సాధించలేదు. అయితే మన్‌మోహన్ సింగ్ భారతదేశంలోని కోట్లాదిమంది రైతులను, కార్మికులను దోచుకుంటూ, పెట్టుబడిదారీ అభివృద్ధి సాధిస్తాడా?

150 సంవత్సరాల క్రితమే ఈ పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమాన్ని చూసి, ప్రపంచ మార్కెట్‌తో పాటే ఈ పెట్టుబడిదారీ ఆర్థిక, రాజకీయ వ్యవస్థను కూల్చే శక్తులు కూడా ఈ క్రమంలోనే అభివృద్ధి అవుతాయని కారల్ మార్క్స్ చెప్పారు. సరిగ్గా నేడు అలాగే జరుగుతోంది. ఘోరమైన సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా, ప్రపంచవ్యాప్తంగా ప్రజాఉద్యమాలు ముందుకొస్తున్నాయి. లాటిన్ అమెరికా, ఇండియా, ఇతర ఆసియా దేశాలలో మార్క్స్ చెప్పినట్లు పెట్టుబడిదారీ దోపిడీకి, సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యశక్తులన్నీ ఐక్యం అవుతున్నాయి.

కామ్రేడ్స్! ఈ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను మనం ఓడించాలి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగా దేశ పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ విధానాలను ఓడించాలి. అయితే ఈ విధానా లను ఓడించడం ఎలా? అన్నది మన ముందున్న ప్రశ్న. ఈ విధానాలను ఓడించడం సాధ్యమే. అయితే **ఈ విధానాలను ఓడించ డానికి రైతాంగ విప్లవోద్యమం అవసరం. విప్లవ కార్మికోద్యమం అవసరం. విప్లవ విద్యార్థి ఉద్యమం అవసరం. ఈ విధానాలను ఓడించ డానికి సమాజంలోని పీడిత ప్రజా ఉద్యమాలు అవసరం.** ఈ దోపిడీ విధానాల్ని పీడిత ప్రజా విప్లవోద్యమాల ద్వారానే ఓడించగలం, ఎదిరించగలం, ఇదొక్కటే మార్గం.


అయితే వామపక్ష శక్తులన్నీ ఏకమై విప్లవోద్యమాన్ని సృష్టించకుండా ఇవి ఓడించ బడవు. వామపక్షాలలో సిపిఐ, సిపియంలు మతతత్వశక్తుల్ని ఓడించడం అనే పేరుతో మౌళిక సూత్రాలను, ప్రజల మౌలిక ప్రయోజనాల విషయంలో పాలకవర్గ పార్టీలతో రాజీపడుతున్నంత కాలం; అలాగే మరికొన్ని వామపక్షశక్తులు విప్లవ రాజకీయాలకు, విప్లవోద్యమానికి బదులుగా తుపాకీని ముందు పెట్టినంతకాలం ఈ దోపిడీ విధానాలు ఓడిపోవు. ప్రపంచీకరణ, సరళీకరణ, నూతన ఆర్థిక విధానాలు సామాన్య ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నాయి. కాబట్టి ప్రజావ్యతిరేక విధానాలను ఓడించడానికి పేద ప్రజల శక్తులన్నీ ఏకం కావాలి. ఇవాళ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నిజాయితీ కలిగిన పార్టీ ఏమీ కాదు. బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ అయినా,

కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఏ అయినా, వారి మౌలిక ఆర్థిక విధానాలు ఒక్కటే. ఈ రెండు కూటములు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అవలంభిస్తూ, రెండు పక్షాలుగా విడిపోయి, పాలకవర్గ కూటములుగా ఏర్పడి ప్రజలను మోసం చేస్తున్నాయి.

నేను ఈ వేదిక మీద నుండి యుపిఎని సమర్థిస్తున్న సిపిఐ, సిపియంలకు, ఇతర వామపక్ష పార్టీలకు ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రజాపక్షం తరపున వారిని తిరిగి ప్రజాపోరాటాల పక్షాన నిలబడమని; కమ్యూనిస్టు విప్లవకారులతో చేయి చేయి కలపమని; కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలను ఓడించడానికి, ప్రజాశక్తులన్నింటితో మమేకం కావాలని విజ్ఞప్తి చేస్తున్నాను. నేడు జరగాల్సి ఉన్న ప్రజాపోరాటం యొక్క స్వరూప, స్వభావాల్ని అర్థం చేసుకొని ఇతర కమ్యూనిస్టు, విప్లవ కమ్యూనిస్టు శక్తులతోను; ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే శక్తులతోను కలిసి రమ్మని సిపిఐ (మావోయిస్ట్)లకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఆ రకమైన ఉద్యమం ఈ ప్రవేటీకరణను ఖచ్చితంగా నిలవేస్తుంది. భారత ప్రజలు, భారత రైతాంగం, కార్మికవర్గం ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయగలరన్న పూర్తి విశ్వాసం నాకున్నది.

కామ్రేడ్స్!

ప్రజాశక్తులన్నీ ఐక్యమై, సంఘటిత ఉద్యమాలను నిర్మించ డానికి, సామ్రాజ్యవాదుల, పాలకవర్గాల దోపిడీ, కుట్రలను ఓడించడానికి సమాయత్తం అవుదాం. ☆



దుక్కి మడికన్నా గొప్ప పేజీ, సాలు తిరుగుతున్న నాగలికన్నా గొప్ప కలం ఎక్కడైనా ఉంటుందా? కౌలుదారుడిగా కంబారిగా రైతు తనదికాని బురదమడిలో నాగలిని దించి, మేడిని లోతుల్లోనికి అదిమి - దుఃఖంల్లోంచి దుర్భర జీవిత అనుభవాలలోంచి వెలువరిస్తున్న ముక్కుళ్ళు మూలుగులు కన్నా అర్థవంతమైన గొప్ప అభివ్యక్తి మరెక్కడైనా వుంటుందా! వ్యవసాయిక విప్లవాన్ని చిత్రించలేని, శిల్పించలేని, గానం చెయ్యలేని కళాకారులకు అన్నం ఎలా సహిస్తుంది!

అన్నం పెట్టే రైతాంగాన్ని అన్యాయం చేస్తున్న దుష్టశక్తులకు పుట్టగతులుండాల్సిన అవసరం లేదు - వారి నాశనాన్ని గానం చేయాలి. రైతాంగాన్ని మేల్కొలపాలి. వారి ఆగ్రహాగ్నిలో మన్నును పుష్పించనివ్వాలి. అందుకే దుఃఖోగ్రజ్వాలల్ని తాపి నాగళ్ళను శృతి చేస్తున్నాను.

- ఛాయరాజ్

- జన్ని ముసలమ్మ సామ్రాజ్యవాదం అంటే ఏంటన్న పిఓ ప్రశ్న విని-

"... కానుగుసెట్టి అడివిల - కాఫీతోట పెరగడం, జీనువుగింజల పోడు మీద - నీలగిరి మొక్క లెదగటం, యింటి -పెరటి భూమి మీద వనన చెట్టు మాయమయిపోయి - పామాయిలు చెట్టు కొమ్మలిర బోసుకోవడం - నా యింటి ఎన్నుకప్ప మీద - యెక్కడిదో తెల్లకొంగ వోలటం..." అని చెప్పి, అంతేగదర్రా అన్నట్టు ఆదెయ్యవేపూ, ట్టిపా వేపూ చూసింది.

(ఒక పాట్టివాడు కొందరు పాడవువాళ్ళ కథ నుంచి) - అట్టాడ అప్పల్నాయుడు


గుండె పిడికెడు-కూడు పిడికెడు
పుట్టిన పుట్టుకా బిగించిన పిడికిళ్ళతోనే
నిలబెట్టుకోవాల్సిన ప్రాణాలూ పిడికిట్లోనే
సడలించని పిడికిలే కదా బతుకు!

- పి.ఎస్.నాగరాజు

ప్రముఖుల ప్రసంగాలు - సందేశాలు

మహాసభల రెండవరోజు అనగా 7.6.2005న మహాసభ ప్రముఖుల ప్రసంగాలు, సందేశాలతో నడించింది. కామ్రేడ్ కనమతరెడ్డి అంజిరెడ్డి ప్రాంగణం (రావు గోపాలరావు కళాక్షేత్రం) లో ఉ.10 గం॥లకు ప్రారంభమైంది. గత రాత్రి 6.6.2005న ఉరేగింపులో వర్షంలో బట్టలు తదితర సామాన్లు అన్నీ తడిసి పోయినప్పటికి సభికులు సమయానికి సిద్ధపడి సభాస్థలికి చేరుకొన్నారు. నినాదాలతో, పాటలతో సభ ప్రారంభమైంది. ప్రత్యేకంగా ఆహ్వానించిన ప్రముఖుల ప్రసంగాల సభకు కామ్రేడ్స్ యస్. ఝాన్సీ, కిశోర్‌బాబు, సోని, రామిరెడ్డి అధ్యక్ష వర్గంగా ఉన్నారు.

"ప్రపంచీకరణ - వ్యవసాయ రంగంపై ప్రభావం" అనే అంశంపై కె.ఆర్.చౌదరి గారు, "రైతాంగ రుణభారం- ఆత్మహత్యలు-పరిష్కారం" అనే అంశంపై డాక్టర్ బి.డి.శర్మగారు, "ఆహార భద్రత- ప్రజాపంపిణీ వ్యవస్థ" అనే అంశంపై జాతీయ మానవ హక్కులు దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధి కె.ఆర్. వేణుగోపాల్ గారు, "గిరిజనులు - భూమి పరాయీకరణ" అనే అంశంపై జనశక్తి సంపాదకులు డా॥ పి.జస్వంత్‌రావు గారు ప్రసంగించారు. "ప్రాజెక్టుల పునరావాసం" పై కామ్రేడ్ కోటయ్య గారు ప్రసంగించారు. అనంతరం వివిధ రాష్ట్రాల సోదరసంస్థల నాయకులు సందేశాలు ఇచ్చారు. కర్నాటక నుంచి కా॥ మానసయ్య, తమిళనాడు నుంచి కా॥సుందరం, చత్తీస్‌ఘడ్ నుంచి కా॥సౌరవ్ యాదవ్, ఒరిస్సా నుంచి కా॥ శ్రీకాంత్, రైతు సంఘం నుంచి కా॥ కొల్లి నాగేశ్వరరావు, యస్.యు.సి.ఐ. నుంచి కా॥రమేష్ పట్నాయక్‌లు సౌహార్ద్ర సందేశం ఇచ్చినవారిలో ఉన్నారు. మన రాష్ట్రం నుంచి ఎపిఎఫ్‌టియు తరపున కా॥ విజయకుమార్, జనసాహితి తరపున అట్టాడ అప్పల నాయుడు, ఓపిడిఆర్ తరపున టి.యల్. నారాయణ, నవయువ సమాఖ్య నుంచి కా॥శ్రీహరి, స్త్రీ విముక్తి సంఘటన నుంచి కా॥ శ్రీదేవి, పి.డి.యస్.ఓ. నుంచి కా॥భాషా, ఎ.పి.టి.ఎఫ్ నుంచి కా॥ విజయానంద్, ఎపిసియల్‌సి నుంచి శ్రీరామమూర్తి, విశాఖ జిల్లా దేవాదాయ, ధర్మాదాయ కౌలుదార్ల సంఘం అధ్యక్షులు వెలగా వీరభద్రరావుగార్లు తమ సందేశాలు ఇచ్చారు. ☆



రెండవరోజు సభలో ప్రసంగిస్తున్న వేణుగోపాల్ గారు, వేదికపై డా.బి.డి. శర్మ, ప్రొ॥ కె.ఆర్.చౌదరి, కా॥ఝాన్సీ తదితరులు

మనుషులు ఊరే గింపులవుతారు
ఉద్యమాలవుతారు
మట్టి కణాల జీవానికి మాత్రం
చలన దార్ఢ్యం లేనే లేదు
శ్రమ నుండి పుట్టే చెమటకు తప్ప
దేనికైనా ఎవరైనా ఎందుకు
తలవంచాలి

- దొట్ల దేవదానం రాజు

ఏదో శక్తి నడిపిస్తుంది మనల్ని
నిజం
అదే
కష్టజీవుల
శ్రమశక్తి

- బి. సూర్యసాగర్

—— ప్రపంచీకరణ - వ్యవసాయరంగంపై ప్రభావం ——

వ్యవసాయరంగ కమీషన్‌ల సిఫార్సుల అమలుకై ఉద్యమించండి !

ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి
వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త



మహాసభ అధ్యక్షులు ఝూన్సీగారు, వేదికపైన ఉన్న రైతుకూలీ ఉద్యమనాయకులు, మిత్రులారా!

సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఎండలు మండిపోతున్నాయే అట్లాగే పాలకులు కూడా తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. చూపించారు. అందువల్ల పేదల బతుకులు మాడి మసైపోతున్నాయి. ఈ మాడి మసైపోతున్న పేదల బతుకుల్ని మనం అభివృద్ధి చేయాలంటే, వారికొక సంక్షేమాన్ని ఒదిగించాలంటే ఉద్యమాలు అవసరం. మనకు ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా కూడా ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం వుంది.

గత 10-15 సంవత్సరాలుగా వ్యవసాయరంగం సంక్షోభంలో వుందని చెప్తున్నారు. కానీ నిజానికి సంక్షోభం మొదటి నుంచీ వుంది. మనకి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి కూడా వ్యవసాయరంగం సంక్షోభంలో వుందని చెప్తున్నారు. కాకపోతే కొన్ని కొన్ని సమయాల్లో ప్రభుత్వం అరకొర చర్యలు తీసుకున్నందువల్ల కొంత అభివృద్ధి కనిపించింది. కాని స్వతంత్ర్యం వచ్చినప్పటి నుండి చూసినా మన పాలకుల విధానాలు మాత్రం వ్యవసాయ రంగంలో సమూలంగా రావలసిన మార్పులు తీసుకురాలేకపోయింది. ముఖ్యంగా భూపంపకాల విషయంలో నైతేనేం, మధ్య దళారుల నుంచి రైతాంగాన్ని రక్షించే విషయంలో నైతేనేం, ప్రభుత్వాలు ఏ విధమైన ప్రయత్నాలు చేయలేదన్నది మనకి స్పష్టంగా తెలుస్తున్నది. కానీ ఈ 10-15 సంవత్సరాలలో వ్యవసాయ రంగంలో సంక్షోభం మరింత తీవ్రం అయినమాట మాత్రం వాస్తవమే. రైతులు ఈనాడు మరీ దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నారు. దారిద్ర్యంలో మగ్గిపోతున్నారు. ఆత్మహత్యలు జరుగుతున్న విషయం మనకి తెలుసు. అలాగే వలసలు పోతున్న విషయం కూడా మనకి తెలుసు. కూలీల బతుకులైతే మరింత దరిద్రంగా తయారయినాయి. చేయడానికి పనిలేదు. మన రాష్ట్రంలోనే కొన్ని వందల మంది ఆకలి చావులకు గురయ్యారనే రిపోర్టులున్నాయి. ఆకలిచావులు లేవని ప్రభుత్వం బుకాయిస్తుంది. వ్యవసాయ రంగంలో ఈ విధమైన సంక్షోభం వున్నది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు 9 వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. "అయ్యా! వ్యవసాయం రంగం సంక్షోభంలో కూరుకునిపోయి వుంది. రైతుల్ని రక్షించాల్సిన అవసరం వుంది. మీరు ఒక కమీషన్‌ని వేయండి" అని డిమాండ్ చేస్తే ఆయన వ్యవసాయ రంగాన్ని పట్టించుకోలేదు. ప్రజల్ని పట్టించుకోలేదు.

అప్పటికీ 9 పార్టీలు కలసి జస్టిస్ పి.ఎ. చౌదరి కమీషన్‌ను ఏర్పాటు చేశాయి. ఆ కమీషన్ చాలా మంచి రిపోర్టు ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత తెలుగుదేశం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ "మేం అధికారంలోకి వస్తే వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తాం. రైతాంగానికి కావలసిన అన్ని వసతులు కల్పిస్తాం. రైతుల్ని రక్షిస్తాం. రైతుల ఆత్మహత్యలు వుండవు." అని చెప్పడం జరిగింది. దాంట్లో భాగంగానే వామపక్ష పార్టీల డిమాండును అనుసరించి 'రైతు సంక్షేమ కమీషన్' అని ఒక కమీషన్‌ను వేసింది. దానికి జయతీఘోష్ అధ్యక్షురాలిగా వుంది. ఆ కమీషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అంటే ఈ రైతాంగ సంక్షోభాన్ని ఏ విధంగా పరిష్కరించాలి? సంక్షోభం అసలు ఎందుకు వచ్చింది? అనే విషయాల్ని కమీషన్ బాగా అధ్యయనం చేసింది. **ప్రభుత్వం యొక్క ఆర్థిక వ్యూహం-ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకరణ విధానాలు, ప్రపంచీకరణ విధానాలు-అవే ఈ సంక్షోభానికి కారణమని స్పష్టంగా ఈ జయతీఘోష్ కమీషన్ చెప్పడం జరిగింది.** సరళీకరణ, ప్రైవేటీకరణలో భాగంగానే వ్యవసాయరంగం పైన పెడుతున్న పెట్టుబడులు లేక ఖర్చుల్ని ప్రభుత్వం తగ్గించుకొన్నది. ప్రభుత్వరంగ సంస్థలు రైతాంగానికి కల్పిస్తున్న మైనర్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్, సీడ్స్ కార్పొరేషన్ అనే ఈ కార్పొరేషన్లన్నింటినీ ప్రభుత్వం నిర్వీర్యం చేయడం, మూసివేయించటమూ జరిగింది. గత ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి కావలసిన అభివృద్ధి పథకాలు చేపట్టలేదని మనకి స్పష్టంగా తెలుస్తున్నది. మరొక ముఖ్యమైన కారణమేమిటంటే రైతులు మార్కెట్లో తమ సరుకుల్ని అమ్ముకోవాలంటే మార్కెట్‌ను సరళీకరణ చేశారు. ఏవిధమైన నియంత్రణలూ లేవు. ప్రైవేటు లాభాలకే అక్కడ ప్రాధాన్యత లభించింది. ఆ విధంగా వ్యవసాయ రంగంలో ఉన్నవారు కాకుండా వ్యవసాయేతర రంగాల వారికి కూడా దానిని విస్తరించడానికి ఏవిధమైన ప్రయత్నమూ చేయలేదు. గత ప్రభుత్వాలు చేసిన విధానాల లోపాల వల్ల ఏ విధంగా సంక్షోభం వచ్చిందన్నది తెలియ జెప్తూ, ఇప్పుడేం చేయాలి? ఏయే విషయాలపైన ప్రభుత్వం శ్రద్ధ వహించాలో జయతీఘోష్ కమీషన్ చెప్పింది. దాంట్లో ముఖ్యంగా మన రాష్ట్రం తీసుకొంటే సాగునీరు సమస్య వుంది. వివిధ ప్రాంతాల మధ్య చాలా అసమానతలు కూడా వున్నాయి. కౌలు రైతుల గురించి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని చెప్పటం జరిగింది. పాత సాగునీటిని సమకూర్చినా కూడాను ఇంకా మెట్ట ప్రాంతాలు చాలా

ఎక్కువగా వుంటాయి. ఈ మెట్ట సేద్యాన్ని అభివృద్ధి చేయడానికి కూడా నీటి వనరులు కావాలన్నా దాన్ని కూడా ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలి. రైతాంగానికి అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు– ఇలాంటి వాటిని ప్రభుత్వమే ఎక్కువగా సమకూర్చవలసి వుంటుందని అనుకున్నారు. అట్లాగే ధరల విషయంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని, రైతులు పండించిన పంటకు విలువ చేకూర్చాలని, ఈ వ్యవసాయ – ఇతర కార్యక్రమాల్ని విస్తరిం చాలని కూడాను ఈ కమీషన్ సిఫార్సులను చేసింది.

దీంట్లో ప్రధానమైన సమస్య ఏమిటంటే **'భూమి పంపకాలు'.** ఈనాటికి కూడాను "మేమేదో భూములు పంచుతున్నాము. సీలింగు చట్టంచేసి మిగలు భూములు పంచాము. బంజరు భూములుపంచాము". అని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ ఇప్పటికి కూడా భూమి కొద్ది మందిచేతుల్లోనే కేంద్రీకృతమై వుంది. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని నిరుపేద రైతులు, వ్యవసాయ కార్మికులు చాలామంది వున్నారు. కనీసం 50%మంది వీళ్ళు వుంటారు. కాబట్టి భూమి అనేది చాలా అవసరం. **వ్యవసాయ రంగంలో వున్నటువంటి వారికి ఎప్పుడైతే భూ పంపకాలు జరుగుతాయో, రైతులకి, కూలీలకి ఒక భద్రతా భావం వస్తుంది. సామాజిక న్యాయం అనేది వుంటుంది. అంతే కాకుండా ఒక విధమైన సాధికారత కూడా వస్తుంది. కాబట్టి భూమి పంపకం చాలా ముఖ్యమైనది.**

గత 50 ఏళ్ళుగా వామపక్షాలు, విప్లవ పక్షాలు భూమి పంపకం కొరకు కృషి చేస్తూనే వున్నారు. ఉద్యమాలు నడుపుతూనే వున్నారు. ఈ విషయంలో జయతీఘోష్ కమీషన్ భూమి పంపకాన్ని గురించి చెప్పింది. కానీ ఏ విధంగా ఈ భూమిని పంచాలి? ఏవిధంగా సంస్కరణలు తీసుకురావాలి? అన్న విషయంలో అంత స్పష్టంగా చెప్పలేదు. ఇప్పుడు ప్రభుత్వ భూములున్నాయి. వాటిని మేం పంచుతున్నా మన్నారు. ఇప్పటికే 1 లక్ష 50 వేల ఎకరాలు పంచామన్నారు. కానీ తెలిసినవాళ్ళు ఏం చెప్తున్నారంటే ప్రభుత్వం భూమిని పంచలేదు. అంతకుముందే 20–30 ఏళ్ళ నుండీ భూములు ఎవరైతే చేసుకొంటున్నారో వారికి పట్టాలిచ్చారు అని. మరల ఇప్పుడు ఇంకొక లక్ష ఎకరాలు పంచుతామన్నారు. మరిక భూమి లేదన్నారు. మరి ఇప్పుడు ఈ లక్ష ఎకరాలు ఎక్కడినుండి వచ్చింది? కాబట్టి భూమిని గురించి ప్రభుత్వం చెప్పే లెక్కలన్నీ కూడా తప్పుల తడకే. ప్రభుత్వ భూమి ఎంతోవుంది. ఇప్పటికి కూడా బంజరు భూములున్నాయి. దేవాదాయ భూములు వున్నాయి. శోత్రీయ భూములున్నాయి. ఒక్క అనంతపురం జిల్లాలోనే 1 లక్ష ఎకరాల శోత్రియ భూములున్నాయి. అట్లాగే తీర ప్రాంత భూములున్నాయి. వీటి లెక్కలు తేల్చాలి. ఇటీవలే మేము రెవెన్యూ మినిస్టర్ గారిని కలిశాం. వారికి చెప్పాం, "అయ్యా! భూమి ఎంతవున్నది? ప్రభుత్వ భూమి ఎంత వుంది? దీని లెక్కలు తేల్చాలి? మీరు తేల్చరు. మేం తేల్చాలంటే ఆ లెక్కలు మాకు అందుబాటులో లేవు. కాబట్టి ప్రతి గ్రామంలో కూడా వుండే సర్వే నెంబరు మాకు చెప్పాలి. దానికి యజమాని ఎవరో చెప్పాలి? ఆ యజమాని రైతా? లేక ప్రభుత్వమా? అయితే ఇప్పుడది ఎవరి కబ్జాలో వున్నది? ఇవి తెలిస్తే, మేమే కొన్ని మండలాల్లో అయినా ఇంత భూమి వుంది అని, మిగులు భూమిని అంచనా వేయవచ్చు, దీన్ని పంచవచ్చు" అని. ఆయన ఈ విషయంలో ప్రభుత్వం గానే లెక్కలు తీస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లాలో సర్వే చేస్తున్నామన్నారు. దీనికి రెండేళ్ళు పడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అంతా సర్వే చేయాలంటే వాళ్ళు చెప్పిన ప్రకారం 300 కోట్ల రూపాయలు కావాలంట. ఎన్నేళ్ళు పడుతుందో తెలియదట. సర్వే చేయించటానికి కూడా సులభమైన పద్ధతులున్నాయి. అటువంటి వాటి జోలికి ఈ ప్రభుత్వం పోకుండా వుంది. అనేక అంచనాల ప్రకారం 60–70 లక్షల ఎకరాలకు తక్కువ కాకుండా ఈ రాష్ట్రంలో భూమివుందని నిపుణులు చెప్తున్నారు. ఇటువంటి భూముల్ని పంచాల్సి వుందని జయతీఘోష్ కమీషన్ చెప్పింది "కేవలం భూములు పంచితే చాలదు. ముఖ్యంగా సన్నకారు, చిన్నకారు రైతులకు లేక వ్యవసాయకూలీలకు వనరులు లేవు. ఆర్థిక స్థోమత లేదు. కాబట్టి వాళ్ళు భూములు సాగు చేసుకోవాలంటే ప్రభుత్వం యొక్క తోడ్పాటు అవసరం. వాళ్ళకు కావలసిన అన్ని వనరులు, ఉత్పాదకాలు, అన్ని రకాల సపోర్ట్ కూడా ప్రభుత్వం కల్పించాలని" చెప్పటం జరిగింది.

మరి ఇక రెండో విషయానికొస్తే **సాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలి.** గత కొన్నేళ్ళుగా సాగునీటికి ప్రాధాన్యత ఇవ్వలేదు. మేం చెప్పింది ఏంటంటే కేవలం మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులే కాకుండా చిన్ననీటి వనరుల్ని అభివృద్ధి చేయ మన్నాం. ఈ రాష్ట్రంలో వేలాది చెరువులున్నాయి. ఊటకుంటలున్నాయి. వీటిని అభివృద్ధి చేయమని, ఇంకా అవసరమైన చోట చెరువులు కట్టమని కూడా చెప్పటం జరిగింది. ప్రభుత్వం ఈనాడు ఏది మాట్లాడినా భారీ ప్రాజెక్టుల గురించి మాత్రమే మాట్లాడుతున్నారు. దాదాపు 31 ప్రాజెక్టులను 46,000 కోట్ల రూపాయలతో ఐదేళ్ళలో ముగిస్తామని చెప్పటం జరిగింది. ఇప్పుడు ఒక సంవత్సరం గడిచిపోయింది. మరి ఐదేళ్ళలో ఈ ప్రాజెక్టులన్నీ కట్టడానికి సాధ్యమవుతుందా? చాలా వాటికి అనుమతులు లేవు. నిధులున్నాయో, లేదో తెలియదు. నిధులు లేకపోయినా దాదాపు 900 కోట్ల రూ॥లు మొబలైజేషన్ ఫండ్ పేరుతో కాంట్రాక్టర్లకు అప్పజెప్పడం జరిగింది. అంటే ఈ ప్రాజెక్టులు రైతుల కోసం కడుతున్నారా? కాంట్రాక్టర్ల కోసం కడుతున్నారా? మీ కమీషన్లకోసం కడుతున్నారా? అనేది అర్థం కావటం లేదు. అన్ని ప్రాజెక్టులు ఒక్కసారి కట్టడం సాధ్యంకాదని ఏమాత్రం ఇంగితజ్ఞానం వున్న వారెవరికైనా తెలుస్తుంది. అదే రాజశేఖర్ రెడ్డి గారితో మేం చెప్పాం "అయ్యా, ఈప్రాజెక్టులన్నీ నీవు ఒక్కసారిగా కట్టలేవు. వీటిని ప్రాధాన్యతల ప్రకారం చేయమని చెప్పాం. ఎక్కడైతే వెనుక బడిన ప్రాంతాలున్నాయో, శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖపట్నం, అటు అనంతపురం, రాయలసీమ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇటువంటి వెనుకబడిన ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును మొట్టమొదట కట్టండి. ఎక్కడైతే తక్కువ పెట్టుబడితో ఎక్కువ సాగునీరు అందించడానికి అవకాశముంటుందో– ముఖ్యంగా విజయనగరం, శ్రీకాకుళం ఇటువంటి జిల్లాల్లో – ఇటువంటి వెనుకబడిన

ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టులను మొట్టమొదట కట్టండి" అని చెప్పడం జరిగింది. కానీ అలా కాకుండా అన్నీ మేం ఒకేసారి కడతామని చెప్పి వాళ్ళు తీసుకున్నారు. ఈ ప్రాజెక్టులు కడతామని చెప్పడంలో ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇది లక్షలాది మందిని నిర్వాసితుల్ని చేస్తున్నది. గ్రామాలకు గ్రామాలే కొన్ని ప్రాజెక్టుల కింద లేచిపోతున్నాయి. మరి వాళ్ళకి ఏవిధంగా నీవు శాశ్వతమైన వసతిని కల్పిస్తావు? అంటే దానికి సమాధానంలేదు. ప్రభుత్వంలో వుండేది ఒకటే ఒకటన్నమాట. అదేమిటంటే నష్ట పరిహారం ఇస్తామని. మనం ఈ దేశంలో గత 50-60 ఏళ్ళలో జరిగినటువంటి ఈ ప్రాజెక్టుల చరిత్రలు చూస్తే ప్రతి ప్రాజెక్టు కింద ఇళ్ళు కోల్పోయిన వాళ్ళు, గ్రామాలు పోయిన వాళ్ళు, భూములు కోల్పోయిన వాళ్ళు, వృత్తులు కోల్పోయిన వాళ్ళు నిరాశ్రయులయ్యారు. వారికి న్యాయం జరగలేదు. వాళ్ళకి కావలసిన నష్ట పరిహారం ఇవ్వలేదు. శ్రీశైలం ప్రాజెక్టులో కానివ్వండి, నాగార్జునసాగర్ నిర్వాసితులు కానివ్వండి, 30-35 ఏళ్ళు జరిగినప్పటికీ ఇప్పటికి కూడా వాళ్ళకి నష్టపరిహారం ఇవ్వలేదు. ఇది నిజమైనటువంటి అనుభవం. మరి ఇటువంటి అనుభవాన్ని మనం దృష్టిలో పెట్టుకొని ఈ ప్రభుత్వం మేం కాంపెన్సేషన్ ఇస్తాం అని చెప్తే నమ్ముతారా? ముందు ఇవ్వమని అడుగుతాం. ఈ నష్ట పరిహారం ఏ విధంగా నువ్వు లెక్కగడతావు? మార్కెట్ రేటు ప్రకారం ఇస్తావా? ముందైతే రిజిస్ట్రేషన్ రేటు ప్రకారం ఇస్తామని, ఇప్పుడు మార్కెట్ రేటు ప్రకారం ఇస్తామని చెప్తున్నారు. అదికూడాను ఆర్‌బిట్రేషన్ కింద ప్రభుత్వమూ, రైతులూ మాట్లాడుకొని ఈ నష్ట పరిహారం అమౌంట్‌ను మీరు ఫిక్స్ చేసుకోవచ్చునని చెప్తున్నారు. ఇవన్నీ చూస్తే ఈ ప్రాజెక్టుల కింద ఉన్నటువంటి వారికి నష్ట పరిహారం వచ్చే అవకాశం లేదు. న్యాయంగా లేదని మనకి స్పష్టంగా తెలుస్తోంది. ఏదో నష్ట పరిహారం వాళ్ళకి అప్పజెప్పి చేతులు తుడిచేసుకొంటే చాలదు. భూములు కోల్పోయినవారికి భూములివ్వాలి. అట్లాగే ఇళ్ళు కోల్పోయిన వారికి, ఇళ్ళు లేని వారికి అందరికీ ఇళ్ళు కట్టించాలి. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వమే 1 లక్ష రూ॥లు ఖర్చుపెట్టి ఇళ్ళు కట్టించాలి. కేంద్ర ప్రభుత్వం పునరావాసం యొక్క విధానాన్ని చక్కగా చెప్పింది. మన ప్రభుత్వం కూడా ఆమోదించింది. కాని దాన్ని అమలు మాత్రం చేయటం లేదు. ఈనాడు మన రాష్ట్రంలో దాదాపు లక్షలాది ఎకరాలు ముంపుకు గురవుతాయి. లక్షలాది మంది ప్రజలు వాళ్ళ భూములు కోల్పోతారు. అనేక గ్రామాలు వదులుకోవలసిన పరిస్థితి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో మనం డిమాండ్ చేయాల్సింది ఏమిటంటే "జయతీఘోష్ కమిషన్‌లో కూడా ఈ నిర్వాసితుల సమస్య చాలా ముఖ్యమైనది. వారికి పునరావాసం కల్పించండి". అని స్పష్టంగా మేం చెప్పడం జరిగింది. "ఇప్పుడు ఎక్కడవుంది భూమి?" అంటారు. ప్రాజెక్టు కట్టకముందు అక్కడ భూమి విలువ లక్షరూపాయలు వుంటుంది. నీళ్ళు వచ్చిన వెంటనే దాని విలువ 4లక్షలకు పెరగవచ్చు. అంటే 10 ఎకరాలు ఉన్నరైతుకి నీళ్ళు వచ్చాక ఈ పది ఎకరాల భూమి విలువ 40 లక్షలు అవుతుంది. దానికి ఉత్పత్తి కూడా పెరుగుతుంది. కాబట్టి నీళ్ళు మీకు కావాలంటే సగం భూమి మాకు ఇవ్వు అని ప్రభుత్వమే రైతులనుండి సగం భూమి తీసుకొని అదే ఏరియాలో భూమి లేని పేదలకు పంచాలనే ప్రతిపాదనకూడా చాలా నిర్దిష్టంగా వుంది. భూగర్భ జలాలు నేడు అడుగంటి పోయాయి. దాన్ని రీచార్జ్ చేయడానికి ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. కాబట్టి ప్రభుత్వానికి ఎన్ని బోరుబావులున్నాయన్నదాన్ని రిజిష్టర్ చేయమని, దీనిపైన ప్రభుత్వానికి కొంత నియంత్రణ ఉండాలని కూడా మేం చెప్పాలని అనుకొంటున్నాం.

అట్లాగే రుణ సౌకర్యాన్ని గురించి కూడా మేం అనేక సూచనలు చేశాం. ఈనాడు ఈ వాణిజ్య బ్యాంకులకి వాణ్యజ్యపరమైన అభిప్రాయాలే వున్నాయి. వాళ్ళు సాంఘిక, సామాజిక బాధ్యతను నేడు గుర్తించటం లేదు. "భూమి వున్న ప్రతిరైతుకి, కౌలు రైతుకి కూడా కిసాన్ క్రెడిట్ కార్టును ఇచ్చి, వారికి అప్పులు ఇచ్చే ఏర్పాటు చేయమని" సిఫార్సు చేయటం జరిగింది. ఈ రుణాల విషయం గురించి బి.డి. శర్మగారు మాట్లాడతారు.

ఈనాడు వ్యవసాయం ఈ విధంగా అభివృద్ధి కావడానికి అనేక కారణాలు వున్నాయి. దాంట్లో ముఖ్యమైన కారణం పరిశోధనలు, నూతన సాంకేతిక విజ్ఞానం. ఇక్కడ అనకాపల్లిలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం వుంది. వాళ్ళు అనేక రకాలైనటువంటి చెరకు రకాలను, పైర్ల రకాలను తయారు చేశారు. ఈ పైర్ల రకాలు అధిక దిగుబడిని ఇచ్చేవే కాకుండా, దాంట్లో ఉన్న చక్కెర శాతాన్ని కూడా ఎక్కువగా ఇచ్చింది. ఈ రకాల నుండి షుగర్ ఫ్యాక్టరీస్‌కి కోట్లరూపాయల ఆదాయం వచ్చింది. అట్లే గతంలో మన ఎకరాకు దిగుబడి చాలా తక్కువగా వుండేది. ఈ పరిశోధనల వల్ల, నూతన సాంకేతిక విజ్ఞానం వల్ల బాగా ఉత్పత్తి పెరిగిన విషయం మనకందరకూ తెలుసు. కానీ **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యవసాయ పరిశోధనలకు ఏమాత్రం ప్రాముఖ్యం ఇవ్వలేదు, వ్యవసాయ ఉత్పత్తుల విలువలో కేవలం 0.26% ఈ పరిశోధనలకు పెడుతున్నారు.** మరిన్ని పరిశోధనలు జరిపి వీటిని రైతాంగానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. రైతులకి సమాచార మందుతున్నదా? సాంకేతిక విజ్ఞానం అందుతున్నదా? పరిశోధనా ఫలితాలు అందుతున్నాయా? అంటే లేదనే చెప్పాలి. ఎవరు వాళ్లకి సమాచారం అందిస్తున్నారంటే ఈ పురుగుమందుల వాళ్ళో, విత్తనాల కంపెనీల వాళ్ళో చెప్తున్నారు. వాళ్ళ మాటలు విని రైతులు అనుసరిస్తున్నారు. కానీ ప్రభుత్వం యొక్క విస్తరణాశాఖ ఏం చేస్తున్నది? దీంట్లో గత ప్రభుత్వం నామమాత్రంగా 7 వేల మంది ఎం.పి.డిఓ లను అప్పాయింట్ చేశారు. ఈ ప్రభుత్వం వస్తూనే 7,000 మందిని పీకి పారేశారు. మేం చెప్పాం. "ఇది చాలా దారుణం, వీరిని తీసేయించకూడదు, గ్రామ స్థాయిలో వీళ్ళు ఉపయోగంగానే వున్నారు. కాబట్టి వీళ్ళందర్ని మరలా తీసుకోవలసింది" అని మేము రికమెండ్ చేయడం జరిగింది. ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకొంటోంది. రైతాంగానికి అందించాల్సిన ఉత్పాదకాలు ప్రభుత్వమే ఎక్కువగా అందించాలి. అది ప్రైవేటు కంపెనీలపైన


కోడిగుడ్డంత గోధుమ గింజలుండేవని విన్నాను
ఇప్పుడు సముద్రాల ఆవలి నుండి
ఫిరంగి గుళ్ళంత గింజలు నెత్తినపడి చెట్టంత చెమట బిందువులు
ఆకలితో చావటం చూస్తున్నాము
నీ కష్టాన్ని బట్టికాక ప్రపంచ పోలీసుల లాభనష్టాలను బట్టే
విత్తనం నుదుటి మీద పంట వెలకట్టి వుంది
ఈ యేడాది నువ్వెన్ని పూటలు పస్తుండాలో
దుక్కి దున్నక మునుపే ఎత్తేసిన సబ్సిడీల మీదే
అమ్మబోయే విత్తనాల మీదే చల్లబోయే ఎరువుల మీదే
వచ్చే తెగుళ్ళ మీదే వాటికి కొట్టే మందుల మీదే రాసి వుంది

- వసీరా

ఆధారపడేట్లుగా చేయకూడదు. మరి మార్కెట్ లో మోసాల గురించి మీకు తెలుసు. ఈ దళారులు ఏవిధంగా దోపిడీ చేస్తున్నారో మీకు తెలుసు. ఈ దోపిడీ నుండి రక్షించడానికి రైతులకు క్రమబద్ధీకరించిన మార్కెట్లు, మార్కెట్ కమిటీలు, రెగ్యులేటరీ మార్కెట్స్ వేశారు. ఆ రెగ్యులేటరీ మార్కెట్‌లో కూడా కొన్ని అన్యాయాలు జరుగుతున్నాయి. అక్రమ పద్ధతులు జరుగుతున్నాయి. ఈ అక్రమ పద్ధతుల్ని అదుపుచేసి, ఇంకా రెగ్యులేటరీ మార్కెట్స్ ఎక్కువ వేసి, రైతాంగానికి రక్షణ కల్పించాలి. దానికి బదులుగా మన కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్లను ప్రైవేటైజ్ చేస్తామన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా, ఒక చట్టమే చేసింది. ఉన్న వ్యవసాయ మార్కెట్ల ప్రైవేటీకరణ కూడా జరుగుతుంది. "ఈ వ్యవసాయ మార్కెట్ల ప్రైవేటీకరణ ఆపివేయ మని" మా కమిషన్‌లో రికమండ్ చేశాం. మరి గిట్టుబాటు ధరల గురించి మీకు తెలుసు. మిర్చి రైతులు, పొగాకు రైతులు, పసుపు రైతులు, అన్ని పంటలు పండించే రైతులు కూడాను గిట్టుబాటు ధరలు లేక ఏ విధంగా బాధపడు తున్నారో మన అందరికి తెలుసు. ఈ గిట్టుబాటు ధరల విషయాలలో కూడా మేము సలహాలు అందించటం జరిగింది. ఈ విధంగా అనేక రకాలైన సలహాలు మేము చెప్పాము.

వ్యవసాయ కూలీల గురించి మేము చెప్పాము. 'ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్' ఏదో 100 మందిలో ఒకరికి ఉపాధి కల్పిస్తే చాలదు. ప్రతి మనిషికి 100 రోజులు పని కల్పించాలి. ఇది మన రాష్ట్రంలో 8 జిల్లాలలోనే పెడుతున్నారు. అలా కాకుండా మొత్తం రాష్ట్రంలో అన్ని జిల్లాలలో, అన్ని గ్రామాల్లో కూడా 'ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీము' పెట్టి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని మేము చెప్పటం జరిగింది.


చేనేత కార్మికుల విషయం గురించి తెలుసు. వారి ఆత్మహత్యల పరంపర జరుగుతున్నది. వారికి ఏం చేయాలి? వారికి నూలు ఇవ్వాలి. వారి ఆప్కోని ఆధునీకరించాలి. జనతా వస్త్రాల స్కీము ఒకటి ఉండేది. దానిని మరలా ప్రవేశ పెట్టాలని మేము రికమండ్ చేయటం జరిగింది. ఇట్లా 175 సిఫార్సులు మేము చేస్తే ప్రభుత్వమేమో "114 సిఫార్సులు మేం అంగీకరించాం, 14 తిరస్కరించాం. 24 కేంద్ర ప్రభుత్వానికి రాశామని చెప్పారు. 114 అంగీకరించారని మేము సంతోషించాము. కాని ఏ విధంగాను ఈ ప్రభుత్వం వాటిని అమలు చేసే పరిస్థితిలో లేదు. మా సిఫార్సులన్నీ అటక ఎక్కుతున్నాయి. మేం చెప్పాం - మా సిఫార్సులన్నీ అమలుచేయాలంటే దాదాపు 1000 కోట్ల రూపాయలు కావాలి. కానీ ఈ గవర్నమెంటు ఏం చెప్పిందంటే "జయతీఘోష్ కమిషన్ రిపోర్టును మేము అమలు చేస్తాము. ఉన్న బడ్జెట్‌లోనే అమలు చేస్తామని" చెప్పారు. అంటే ఇవి ఏవీ అమలు కావు. వీటిని అమలు చేసుకోవడానికి మనమంతా గట్టిగా పోరాడ వలసిన అవసరం ఉన్నది. ఈ ఉద్యమం నడప డానికి మరలా మన వామపక్షాలు అన్నీ కలిసి జయతీఘోష్ కమిషన్ సిఫార్సుల్ని అమలు జరపాలని ప్రభుత్వంపై వత్తిడి తీసుకు రావటానికి ఒక ఉద్యమాన్ని చేపట్టబోతున్నాయి. ఆ ఉద్యమంలో మనమందరం కూడా భాగం తీసుకోవాలి. ఈ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తే కొంతవరకైనా రైతులకి సహాయం జరుగుతుంది. వాళ్ళ పరిస్థితి బాగుపడుతుంది. కూలీల పరిస్థితి బాగుపడుతుందని మేము విశ్వసిస్తున్నాము. కాబట్టి ఆ దిశలో మన ప్రయత్నాలు ఉండాలని, ఈ మహాసభలో దాని గురించి తీర్మానాలు చేస్తూ కార్యక్రమాలను, ఐక్యకార్యాచరణ కార్యక్రమాలను రూపొందిం చుకుంటారని చెప్పి ఆశిస్తూ నేను శెలవు తీసుకుంటున్నాను. ☆



రైతాంగ రుణభారం - ఆత్మహత్యలు - పరిష్కారాలు

రైతాంగానికి వ్యతిరేకంగా సాగుతున్న నిశ్శబ్ద కుట్రను ఛేదించండి!

డా॥ బి.డి. శర్మ
జాతీయ అధ్యక్షులు, భారత్ జన్‌ఆందోళన్



అధ్యక్షా, మిత్రులారా!

నిన్న నేను రైతాంగపు రుణభారం గురించి మాట్లాడాను. రైతుల్ని వ్యవసాయ ఉత్పత్తిరంగం నుండి తప్పించడం కోసం ఒక నిశ్శబ్దమైన కుట్ర సాగుతోంది అని, ఈ వ్యవస్థ మొత్తంగానే ఆ కుట్రని సాగిస్తోంది అని మీకు వివరించాను.

బ్రిటీషు వలసపాలకులు అత్యంత దోపిడీ పూరితంగా తమ పాలనని సాగించిన ఫలితంగా దేశంలో వరుసగా అనేక కరువులు సంభవించాయి. దీంతో బ్రిటీషు పాలకులు మొట్టమొదటి సారిగా రైతాంగానికి ఉపశమనం కలిగించగలిగిన చట్టాలని తీసుకురావలసి వచ్చింది. అలా 1883-84లో మొట్టమొదటి సారిగా బ్రిటీషు వలసపాలకులు ఈ చట్టాలను తీసుకువచ్చారు. ఈ చట్టాల గురించి నేను మాట్లాడినపుడు అనేక మంది రాజకీయ నాయకులు, పరిపాలన నిర్వహిస్తున్న అధికారులు ఇలాంటి చట్టాలు ఉన్నాయా? అని ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచారు. ఈ చట్టాలు మొత్తం వ్యవసాయానికి, రైతాంగానికి సంబంధించిన చట్టాలు. వాళ్ళ భూమిని అభివృద్ధి చేయటానికి, వాళ్ళ పంట అవసరాలు తీర్చడానికి రుణాలు ఇవ్వడానికి చేసిన చట్టాలివి. ఈ చట్టాలనే మన పరిపాలనా దక్షులకి తక్కావీ రుణాలని పిలుస్తారని తెలుసు.

ఈ చట్టాల్లో ఉన్న అత్యంత ముఖ్యమైన మొట్టమొదటి అంశమేంటంటే "రైతాంగానికి ఇచ్చే రుణాలకి చక్రవడ్డీని వసూలు చేయరాదు" అని. ఈ చట్టం గత 125 ఏళ్ళుగా ఈ దేశంలో అమల్లో ఉంది. ఈ చక్రవడ్డీ కూడా సాలుకి 4%కి మించి వసూలు చేయరాదు. నేనిప్పుడు అడగగలిగింది ఒకటే. ఒక రైతుకి లక్ష రూపాయాలు అప్పు ఇచ్చి, సాలుకి 4% వడ్డీ లెక్కనఇస్తే, ఏ రైతైనా ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఎందుకు వస్తుంది? ఇక్కడ ఈ రుణాలను కూడా ఎంతకాలానికి ఇస్తున్నారు అన్నది మనం పరిశీలించుకోవాలి. మధ్యస్థ రుణాలుగానీ, దీర్ఘకాలిక రుణాలుగానీ 5 సం॥-9 సం॥ మాగ్జిమంగా ఇస్తున్నది. వ్యవసాయ మన్నది వరుణ దేవుని కరుణ మీద ఆధారపడిన అదృష్ట దురదృష్టాల వ్యాపారమని మనకందరికి తెలుసు. రెండేళ్ళు దుష్ప్రభావాల పరిమితి వుండి, రెండేళ్ళు సామాన్యంగా వుంటుంది. ఒక ఏడాది మంచి వర్షాలు పడి బాగా సాగు తుంది. ఈ చక్రం కూడా మార్పు ఉండవచ్చు. మూడేళ్ళు, నాల్గుగైదేళ్ళు వర్షాలు పడకపోవచ్చు. అసలు వర్షాలు లేకుండా దీర్ఘకాలపు కరువూ రావొచ్చు. అలాంటి సమయంలో రైతుకి తను విత్తనాలకు పెట్టిన డబ్బు కూడా తిరిగిరాని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పుడు సహకార సంఘాలు గానీ, వాణిజ్యబ్యాంకులు గాని సాలుకి 15% చక్రవడ్డీని వసూలు చేస్తున్నాయి. మరి రైతు 3 సంవత్సరాలు కరువు బారిన పడితే దీర్ఘకాలిక రుణాన్ని ఎలా తీర్చగలుగు తాడు? చక్రవడ్డీ అంటే 100 రూ॥లు అప్పు తీసుకుంటే 5 సం॥రాల్లో అది 200 రూ॥లు అవుతుంది. మరి ఏ పరిస్థితుల్లో రైతు ఇంత వడ్డీతో కరువు కాటకాల బారినపడి 5 సంవత్సరముల లోపల తీసుకున్న అప్పును ఎలా తీర్చగలుగుతాడని నేను ఈ రాజకీయ పార్టీల్ని, నాయకుల్ని అడుగుతున్నాను. ఈ మధ్య కర్నాటకలో ఒక సభనుద్దేశించి నేను ప్రసంగించాను. ఆ సభలో వేదిక మీద మాజీ ప్రధాని దేవగౌడగారు కూడా వున్నారు. అక్కడ నేనొక ప్రశ్న అడిగాను. "రైతుకు అప్పిస్తే తిరిగి ఎంతకాలంలో వసూలు చేస్తున్నారు? ఆ కాలమెంత"? అని అడిగాను. "మధ్యస్థ రుణాలు, దీర్ఘకాలిక రుణాలకున్న కాలపరిమితి ఏంటని" అడిగాను. దానికి వారినుండి సమాధానం రాలేదు. ఆ కర్ణాటకలో ఉన్న చట్టం ప్రకారమే, అంతకు ముందున్న చట్టం ప్రకారమే ఒక రైతుకు అప్పిస్తే తిరిగి 35 సం॥రాల లోపల ఆ అప్పును వసూలు చేసు కోవాలి. అదీ 4% సామాన్య వడ్డీతోనే. బారు వడ్డీతోటి చక్రవడ్డీ కాదు. ఈ విషయం విన్న దేవగౌడ గారు ఆశ్చర్యపోయారు. అలాంటి చట్టం ఒకటి ఉందా? అని. అక్కడ వున్న కర్ణాటక అసెంబ్లీలోని చిన్న వయసులో వున్న ఒక సభ్యుడు "ఇలాంటి చట్టం వుంటే, వెంటనే మా శాసన సభలో పెట్టి 35 సం॥రాలు కాదు, 50 సం॥రాలు అని కాలపరిమితి తిరిగి రాయించాలన్న" ప్రతిపాదనను చేస్తానన్నాడు.

ఇప్పుడు ఇందాక అడిగిన ప్రశ్ననే మళ్ళీ అడుగుతున్నాను. ఏ రైతుకైనా లక్షరూపాయలు అప్పిచ్చి 4% వడ్డీ (సంవత్సరానికి) ఇస్తే ఈ దేశంలో ఏ రైతు తన అప్పు తీర్చకుండా బకాయి పడతాడు? అలా కాకుండా తిరిగి 7 సంవత్సరాల్లో చక్రవడ్డీ లెక్కన వసూలు చేస్తే ఏ రైతైనా నష్టపోకుండా, దివాళా తీయకుండా ఎలా మిగుల్తాడు? కాబట్టే నేను మొదట నుండీ చెబుతున్నాను. ఇలాంటి చట్టం ఈ దేశంలో ఉన్నట్టుగానే తెలియకుండా రాజకీయ వ్యవస్థ పాలిస్తోంది. ఈ రైతాంగాన్ని నాశనం చేయటమనే ఉద్దేశ్యపూర్వకమైన మిష తోటి వాళ్ళు ఈ చట్టాలను అతిక్రమిస్తున్నారు. ఈ చట్టాలకు భిన్నంగా వివిధ రూపాల్లో రైతాంగం దగ్గర 12%, 15% వడ్డీ వసూలు చేయడం ద్వారా రైతాంగాన్ని నాశనం చేయడానికి ఈ రాజకీయ వ్యవస్థ పూనుకొంది అని నేను ఆరోపించాల్సిన స్థితి ఏర్పడింది. **ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా ఎన్నికైన రాష్ట్ర అసెంబ్లీలో ఒక చట్టాన్ని చేశారు. ఆ చట్టంలో చక్రవడ్డీని వసూలు చేయటం అక్రమమని చెప్పారు. రైతుల దగ్గర చక్రవడ్డీ వసూలు చేయరాదు అని ఆ చట్టాన్ని తెచ్చారు.**

1936లో చేసిన ఈ చట్టం ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత కూడా, ఈ రోజుకి కూడా చట్టాల, శాసనాల్లో వుంది. ఇప్పటికీ అది

అమల్లో ఉండాల్సిన చట్టంగానే ఉంది. ఈ రోజున ఆంధ్రప్రదేశ్‌లో నిలబడి చెప్పుకొన్న ప్పటికీ, అది మద్రాసు ప్రెసిడెన్సీ చేసినప్పటికీ, ఆ చట్టాన్ని తిరిగి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది. ఆ చట్టం ఈ రోజున శాసనాల గ్రంధంలో నిలిచేవుంది. మీరెన్నుకున్న ప్రతినిధుల సభ అసెంబ్లీ రైతుల దగ్గర చక్రవడ్డీ వసూలు చేయడం అక్రమమనీ, అలా చేయ రాదని ప్రకటించింది. **అలాగే మీరెన్నుకున్న ఆ ప్రతినిధుల సభ ఇలా చేసిన చట్టాన్ని రద్దు చేస్తూ ఒక్క తీర్మానాన్ని కూడా చేయలేదు. అంటే ఈ రోజుకీ ఆ చట్టం శాసనాల గ్రంధంలో నిబిడీకృతమై వుంది. అది ఈ దేశంలో పాలకులు అమలు జరిపి తీరవలసిన చట్టంగా వుంది.** ఇలాంటి చట్టం అమలులో వున్నపుడు ఇలాంటి చట్టం శాసనాల గ్రంధంలో మిగిలి వుండగా **ఈ దేశంలో కో-ఆపరేటివ్ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు ఏ విధంగా 15% చక్రవడ్డీతో రైతాంగం దగ్గర రుణాలు వసూలు చేయగలుగు తున్నాయి? చేస్తున్నాయి?** దీనిగురించి ఏ ఒక్కరూ మాట్లాడరు. దీని గురించి రైతాంగం ఆత్మహత్యలు చేసుకొంటుంటే అందరూ మొసలి కన్నీరు కారుస్తున్నారు తప్ప ఈ చట్టం ప్రకారం రైతాంగానికి రుణ విముక్తి కలిగించేందుకు ఏ ఒక్కరూ ఆలోచించడం లేదు. నేను మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగాలి. బ్యాంకులు ఏం చేస్తున్నాయి? మనకి అప్పులు ఇవ్వటం లేదా? అప్పులిచ్చేటప్పుడు అతన్ని అప్పిచ్చేవాడు అని పిలవక్కరలేదా? బ్యాంకులనేవి ఇక్కడ అందరికీ అప్పిచ్చి, దాని మీద వడ్డీ వసూలు చేసి వ్యాపారం చేసే సంస్థలు. అదీ ఒక వడ్డీ వ్యాపారస్థుడే. కానీ జరుగుతోందేంటి? మన అసెంబ్లీ "బ్యాంకులు, సహకార బ్యాంకులు వడ్డీ వ్యాపారస్తులు కాదు". అని చట్టం చేశాయి. అప్పిచ్చి, తిరిగి వడ్డీ వసూలు చేసుకుని వ్యాపారం చేసేవాడు వడ్డీ వ్యాపారస్తుడు గాక మరేమవు తాడు? కానీ ఈ ప్రభుత్వాలు బ్యాంకులు చేసేది వడ్డీ వ్యాపారం కాదు అని తీర్మానించడం ద్వారా అంతకుముందు చేసిన చట్టం అంటే "వడ్డీ వ్యాపారం ద్వారా చక్ర వడ్డీ వసూలు చేయరాదు" అన్న చట్టం నుండి బ్యాంకులను మినహాయించుకొంటూ పోయారు. ఆ విధంగా మీ ప్రతినిధులుగా వున్న అసెంబ్లీయే వాళ్ళ వడ్డీ వ్యాపారాన్ని వడ్డీ వ్యాపారం కాదని, అధిక వడ్డీని, చక్రవడ్డీని వసూలు చేసుకోవడానికి వారికి అవకాశం కల్పించింది. ఈ చట్టం వల్ల ఏర్పడుతున్న ఒక విచిత్ర పరిస్థితిని మీ దృష్టికి తీసుకురావాలి. గ్రామంలో ఏ సీతారామచౌదరి అన్నాయనో మీకు వడ్డీకి ఇచ్చాడనుకోండి. అతను చక్రవడ్డీని వసూలు చేస్తే, ప్రభుత్వ చట్టం ప్రకారం అతన్ని తీసుకెళ్ళి జైల్లో పెట్టవచ్చు. అదే ఏ ఆంధ్రాబ్యాంకు ఛైర్మనో మనకి చక్రవడ్డీకి ఇస్తే, దాన్ని మనం తిరిగి కట్టలేకపోతే రైతు వెళ్ళి జైల్లో కూర్చోవాల్సి వస్తుంది. ఎందుకని ఈ రెండు రకాల వడ్డీ వ్యాపారస్తులు ఏర్పడ్డారు? ఒక వడ్డీ వ్యాపారి చక్రవడ్డీ వసూలు చేసినందుకు జైల్లో కూర్చుంటాడు. రెండో రకం వడ్డీ వ్యాపారికి ఆ రుణం తీసుకున్నవాడు చెల్లించనందుకు ఆ రుణం తీసుకున్నవాడే వెళ్ళి కూర్చోవలసి వస్తుది. ఎందుకని? ఆ రెండో రకం వడ్డీ వ్యాపారి పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు అప్పులిచ్చి, పెద్ద ఎత్తున చేస్తున్నాడు కాబట్టి! వాడొక వడ్డీ వ్యాపారి అయినా వాడికి ఈ దేశపు చట్టాలు వర్తించవు. అదే సమయంలో గ్రామంలో ఉండి ఇచ్చే వడ్డీ వ్యాపారికి ఈ చట్టాలు వర్తిస్తాయి.

సమస్య గురించి చెప్పుకున్నాం. మరి పరిష్కారం ఏమిటి? 125 సం॥రాల నుంచి ఈ దేశంలో ఒక చట్టం అమల్లో వుంది. ఈ చట్టం ప్రకారం చక్రవడ్డీ వసూలు చేయకూడదు. మనం మొదట గమనించాల్సిన అంశం ఒకటి వుంది. **వ్యవసాయం అంటే పరిశ్రమ కాదు, వ్యాపారం కాదు. వ్యవసాయం ఒక జీవన విధానం.** కాబట్టే పరిశ్రమకి ఇచ్చినట్టే ఇవాళ అప్పిస్తే రేప్రొద్దుట నుంచీ వాడి దగ్గర నుండీ వడ్డీ, అసలు కలిపి వసూలు చేసుకున్నట్లుగా వ్యవసాయ దారులకు రుణాలు ఇస్తే అలా సాధ్యం కాదు. వ్యవసాయ రుణానికి ప్రత్యేకమైన నిబంధనలు, ప్రత్యేకమైన పద్ధతులు వుండాలి. దీన్ని గుర్తించారు కాబట్టే గత అసెంబ్లీలు 125 సం॥రాల క్రితం ఇలాంటి చట్టాలు చేసాయి. అధిక వడ్డీలు వసూలు చేయకుండా, 35 సం॥రాలు తిరిగి చెల్లించే కాలవ్యవధిని ఇస్తూ ఆ చట్టాలు చేయబడ్డాయి. కనుక ఈ సమస్యకు పరిష్కారాన్ని మనం ఇంకో విధంగా ఆలోచించాలి. **"మేం చక్రవడ్డీని చెల్లించం అని మొండికేయాలి, చెల్లించ నిరాకరించ పూనుకోవాలి" అలాగే ఆ బారువడ్డీ వసూలు కూడా సాలుకి 100కి 4 రూ॥ల మాత్రమే వసూలు చేయాలి. పేరుకుపోయిన వడ్డీ ఎట్టి పరిస్థితుల్లోనూ అసలును మించరాదు. రైతు తిరిగి చెల్లింపు చేసేటప్పుడు అది వడ్డీలోంచి తగ్గించటం కాకుండా మొదటి అసలులోంచి తగ్గించాలి.** ఆ అసలంతా తీరిపోయిన తర్వాతే వడ్డీకి చెల్లింపులు వేయాలి తప్ప రైతు చెల్లించిన దాన్ని వడ్డీ కింద తీయకూడదు. ఈ సూత్రాలు 125 సం॥రాల క్రితం మీరు చేసిన చట్టం లోనివే. మేం ఈ రోజున మా డిమాండ్‌గా అడుగుతున్నాం. "వాటిలో పేరుకుపోయిన వడ్డీ ఎట్టి పరిస్థితుల్లోనూ అసలును మించ రాదు" అన్న సూత్రమైతే 2000 సం॥రాల క్రితం కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో పేర్కొన్నాడు. ఆనాటి నుండి మన భారత వ్యవస్థలో అది వుంది.

వ్యవసాయానికి ప్రత్యేకమైన రుణ సౌకర్యా లుండాలని ఎందుకు కోరుకొంటున్నానంటే ఇది భారతీయ సాంప్రదాయంలో రైతాంగపు జీవన విధానంలో వుంది. ఏ రైతూ తను చనిపోయేటప్పుడు బాకీపడి చనిపోవాలని కోరుకోడు. రైతు తను చనిపోయేటపుడు తన అప్పును కొడుక్కి అప్పజెప్పి, ఈ బాకీ నువ్వు తీర్చాలి అని అడుగుతాడు. అలాగే కొడుకు కూడా ఆ బాకీ తీర్చడానికి సిద్ధపడతాడు. కాబట్టే దేశంలో వున్న 7లక్షల గ్రామాలు ఇలాంటి నిర్ణయానికి రావాలి. ఈ నాలుగు అంశాల్ని మనం ముందుకు తీసుకురావాలి. ఈ నాలుగు అంశాలు హేతుబద్ధమైనవి అని అంటానికి ఇంతకుముందు చెప్పిందే కారణం. ఏ చట్టాలనైతే 125 సం॥రాల క్రితం చేశారో, ఆ చట్టాలలోని అంశాలనే మేం పునరుద్ధ రిస్తున్నాం తప్ప ఎవరో దయాధర్మం గానో, మ రెవరో రుణాల మాఫీ ద్వారానో మాకెవరూ సహాయం చేయాల్సిన అవసరం లేదు. రైతు ఆత్మగౌరవంతో తన అప్పును తిరిగి చెల్లించే స్థితి ఏర్పడుతుంది. కాబట్టి నేనిక్కడ అడుగు తున్నది ప్రతి గ్రామం నుండీ రైతాంగం ఇవాళ ఉన్న రుణ విధానాన్ని వ్యతిరేకించాలి. సూటిగా చెప్పాలంటే చక్రవడ్డీతోటి అధిక వడ్డీ 15% వసూలు చేస్తున్న ప్రభుత్వం; అవతల అధిక వడ్డీ వసూలు చేస్తున్న ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుణ్ణి అడగగల స్థితిలో వుండదు. కాబట్టే ఈ వ్యవస్థ,

ఈ ప్రభుత్వం తన నైతిక అధికారాన్ని కోల్పోయింది. ఏ మొహం పెట్టుకొని ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుని దగ్గరకు వెళ్ళి "నువ్వెక్కువ వడ్డీ వసూలు చేస్తున్నావేమిటని" అడగ్గలుగుతుంది? కాబట్టే 7లక్షల గ్రామాలనుండి మనం ఈ డిమాండ్లను ముందుకు తీసుకు రావాలి. ఇవాళ రైతాంగానికి రుణాలిస్తున్న ఈ విధానాన్ని మనం తిరస్కరించాలి. పైన చెప్పిన నాలుగు అంశాల తోటి మనకు కొత్త రుణవ్యవస్థ కావాలని కోరుతూ డిమాండ్ చేయాలి.

రైతాంగానికి రుణ పరపతి సౌకర్యం కల్పించటమన్నది ఒక అంశం మాత్రమే. రైతాంగానికి వ్యతిరేకంగా సాగుతున్న ఈ కుట్ర ఇంకా చాలా లోతైనదిగా వుంది. ఈ దేశంలో గ్రామసీమల్ని ఒక బానిసగా వ్యవహరిస్తున్నారు. ఈ దేశంలో పాలక వర్గాలు– వాళ్ళు ఎన్నికల సందర్భంలో రచించిన ఎన్నిక ప్రణాళికల్ని చూస్తున్నాం. కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని, యుపిఎ ప్రభుత్వం ప్రకటించినదాన్ని చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఇక్కడ ఏ పాలక పార్టీ అధికారంలో ఉన్నా ఈఅంశం స్పష్టంగానే కన్పిస్తూంది. ఈ దేశంలో 10%గా వున్న ఒక వర్గానికి మాత్రమే వాళ్ళు ఉపయోగ పడుతున్నారు. ఈ దేశంలో 90% గా వున్న జనం వాళ్ళ దృష్టిలో మనుషులు కాదు; పురుగులు. కాబట్టే ఏరివేయటానికి వాళ్ళు సిద్ధపడుతున్నారు. వీళ్ళందరూ అనుసరించేది ఒకే విధానం. కాకపోతే కొంతమంది దీనికి మానవీయ ముఖం వుండాలి అంటారు. కొంతమంది ఈ ముసుగులన్నీ అక్కరలేదు; సూటిగా అమలు జరుపుతాము అంటారు. మానవీయ ముఖం అంటే "నువ్వు అప్పులపాలై, నీలోపం వల్ల నువ్వు చచ్చిపోయావు" అని చెప్పడానికి ఉపయోగపడేది తప్ప వ్యవహారంలో ఏ తేడాలేదు. నిజానికి నీకు తాగడానికి మంచినీళ్ళు దొరకవు. కానీ దేశమంతటా సారా దొరుకుతుంది. ఆ సారా తాగి నువ్వు లోకాన్ని మర్చిపోవాలి. ఆ సారా తాగి, ఆరోగ్యం చెడి చచ్చిపోతే, నువ్వు నీ తప్పు వల్ల సారా తాగి చనిపోయావని నిందించటమే మానవీయ ముఖం యొక్క అర్థం. కాబట్టే రైతాంగానికి వ్యతిరేకంగా సాగుతున్న కుట్ర ఒక రుణ పరపతి సౌకర్యానికి పరిమితమై లేదు. అంటే లోతుగా వున్నది. ఆ లోతుగా వున్నది – గ్రామ సీమల్ని దోపిడీ చేసి పట్టణాలకు తరలించడం; 10%గా వున్న కొద్దిమందికి సంపదను మరింతగా అందించటం.

"వ్యవసాయ సంక్షోభంపై ఒక విమర్శ" అన్న ఒక గ్రంధాన్ని నేను రాశాను. దీన్నే ఒక బహిరంగ లేఖగా కాంగ్రెస్ నుంచి ఇవతల వామపక్షాల వరకూ అందరికీ పంపించాను. దీంట్లోనే రైతాంగానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ చర్యలన్నింటినీ పేర్కొని గ్రామీణ ప్రాంతాల్లో సంక్షోభానికి కారణమేమిటో చెప్తూ, దీనిమీద మీ అభిప్రాయాలు తెలియజేయండని అందర్నీ అడిగాను. ఒక బహిరంగ లేఖగానే దాన్ని అందరికీ పంపాను. ఏ ఒక్కళ్ళు దానికి సమాధానం రాయలేదు. బహుశా నాతో వ్యక్తిగతంగా పరిచయం ఉన్నందువల్ల కావొచ్చు, ప్రణాళికా సంఘం అధ్యక్షునిగా పనిచేసిన కె.సి. పంత్, మాజీ ప్రధాని చంద్రశేఖర్, ఇద్దరు మాత్రం దీనికి సమాధానం రాశారు. మరెవరి నుండీ దీనికి సమాధానం రాలేదు. నేను చెప్పిన విశ్లేషణ గనుక సరైనది కాదని మీరనుకొంటే, లేదని తెలియజేస్తే ఆవిషయాన్ని నేను సరిచేసుకోవడానికి వీలవుతుందని కూడా నేను పేర్కొన్నాను. అయినాసరే, ఒక్కళ్ళూ మాట్లాడలేదు. **కాబట్టే ఇది ఒక 'నిశ్శబ్ద కుట్ర' అని నేను పేర్కొనవలసి వస్తోంది.** ఈ దేశంలో వున్న రాజకీయ వ్యవస్థ మొత్తంగానే దాని వెనుక వుంది. ఈ రాజకీయ వ్యవస్థ ఈ సంస్కరణల్ని, వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడం వెనకాల వీరందరికీ అంగీకారం వుంది. దీన్ని మౌలికంగా ఈ దేశంలో అమలు జరుపుతున్న 2000సం॥లో ఆమోదించిన వ్యవసాయ విధానపత్రాన్ని వీళ్ళందరూ ఆమోదించారు. దానిమీద వీళ్ళందరికీ ఆమోదం వుంది. కాబట్టి ఈనాటి రాజకీయ వ్యవస్థ మొత్తంగా రైతాంగానికి వ్యతిరేకమైన విధానాలు తీసుకొంటోంది అని మనం భావించాల్సి వస్తోంది. కాబట్టి రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు జరగడం వెనకాల ఈ రాజకీయ వ్యవస్థ మొత్తంగా నిలబడి వుందన్న అంశాన్ని మనం గమనించాలి.

మన కళ్ళ ముందు జరుగుతున్న విషయాలని చెప్పుకోవటం మాత్రమే సరిపోదు. ఈ ఫలితాలు మరి కొద్దికాలంలో ఎలాంటి విపరీతమైన ఫలితాలను ఇస్తాయో కూడా చెప్పుకోవాల్సి వుంది. అందుకే ఈ బహిరంగ లేఖలో ఒక విషయాన్ని స్పష్టంగా రాజకీయ పక్షాల ముందుకి తీసుకువచ్చాం. ఈ రోజు ఏదైతే అభివృద్ధి అని చెబుతున్నారో, ఆ అభివృద్ధిలో – పట్టణాల గురించిన అభివృద్ధిలో నాశనమైపోతున్న రైతాంగానికి ఏ మాత్రం చోటు లేకుండా పోతోంది. రైతు బిడ్డలు ఇది వరకు తన తండ్రి వ్యవసాయం తనే చేసుకొంటూ, ఉత్పత్తిలో పాలుపంచుకొనే రైతు బిడ్డలు ఈ రోజు భూమి కోల్పోయిన తర్వాత పట్టణాలకు వెళ్తే ఈ అభివృద్ధిలో వాళ్ళకి ఏమాత్రం చోటులేదు. నగరంలో రోడ్లమీద తిరగడమే వాళ్ళకు మిగిలింది. అక్కడ దొరికే సారాయి తాగి ఏ మురుక్కాలువ ప్రక్కనో స్పృహతప్పి పడిపోవటం తప్ప తిరిగి కుటుంబానికి వాళ్ళు చేయగలిగిన సాయం అంటూ ఏమీ లేదు. ఈరోజు రైతుకి మద్దతుగా నిలుస్తున్నది ఆ రైతు కూతురే. ఎందువల్ల? ఆమె శరీరానికి మార్కెట్ వుంది కాబట్టి తన శరీరాన్ని అమ్ముకొని వాళ్ళు తమ కుటుంబాన్ని పోషించగలుగుతున్నారు. కాబట్టి ఈ రోజున జార్ఖండ్ నుండి వేలాది మంది మహిళల్ని తీసుకువెళ్ళి ఢిల్లీ నగరంలో వ్యాపారం చేసుకొంటున్నారు. థాయిలాండ్ మనలాంటి దేశమే. మనలాంటి సాంప్రదాయాలు ఉన్న దేశమే. ఈ రోజున 33% జాతీయ ఆదాయం ఒక్క వ్యభిచార పరిశ్రమ నుంచే ఆ దేశానికి వస్తుంది అంటే రాబోయే పరిస్థితులు ఎంత దౌర్భాగ్య స్థితికి మనల్ని నెడతాయో, మన దేశంలో టూరిజాన్ని ప్రోత్సాహిస్తున్నామని చెప్తున్నా దాని ఫలితం ఏమిటో మనకు తెలుసు. ఏం చేద్దాం? మౌనంగా వుందామా? **రైతాంగం బూడిదలోంచి తిరిగి జీవం పోసుకొని లేచే పక్షిలా ముందుకు లేచిరావాలి. దీనిని ప్రశ్నించాలి. దీనిని తిరస్కరించాలి. ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం వాళ్ళు నిలబడిపోరాడాలి** అనే విజ్ఞప్తితోటి నేను మీ నుండి శలవు తీసుకొంటున్నాను. ☆

వాడి కుట్రమీద
యుద్ధం చెయ్యాలి
లెండి!
సకల సామగ్రితో
సమాయుత్తమవ్వండి!
ఈ సరికొత్త యుద్ధానికి
నగారా మ్రోగించండి!!

- అల

ఆహార భద్రత - ప్రజాపంపిణీ వ్యవస్థ

జీవన వేతనం కోసం పోరాడడం మన హక్కు

కె.ఆర్. వేణుగోపాల్, ఐఎఎస్
జాతీయ మానవ హక్కుల కమీషన్ సభ్యులు

ఝాన్సీ గారు, కోటయ్యగారు, మా నుంచి వస్తాయంటే? కేవలం ఒక రెండు మిత్రులు ప్రొఫెసర్ చౌదరిగారు, పూజ్యులు, పెద్దలు డా॥శర్మగారు, ఇక్కడికి విచ్చేసిన మన రైతాంగానికి, సన్న రైతాంగానికి మరియు వ్యవసాయ కూలీ రిప్రజెంటేటివ్స్ అందరికీ నా నమస్కారములు. శర్మగారు అప్పుల గురించి మాట్లాడారు. దానికి ముందు చౌదరిగారు ఈ ప్రపంచీకరణ వల్ల ఏమేమి అన్యాయాలు, ఇబ్బందులు కలుగుతున్నాయో చెప్పారు. వ్యవసాయం గురించి చాలా పెద్ద ఎత్తున వారిద్దరు కూడా చెప్పడం జరిగింది. దానికి ముందు పెద్దలు కోటయ్యగారు ఎలాగ భూమిని ఆధారంగా పెట్టుకొని దానిమీద ఈ పోరాటాలు జరపాలన్న దాని గురించి చెప్పారు. వారందరూ మాట్లాడిన తర్వాత నేను ఎక్కువగా మాట్లాడటం పెద్ద భావ్యంగా నాకనిపించడం లేదు. ఎందుకంటే మౌలిక విషయాలన్నీ చెప్పటం జరిగింది. అయితే అప్పుల గురించి మాట్లాడమని నాకు ఝాన్సీగారుగానీ, కోటయ్య గారు గానీ ఆదేశం ఇవ్వలేదు గానీ; ఈ అప్పుల విషయంలో ఏమేరకు మనకి అన్యాయాలు జరుగుతున్నాయన్నది శర్మగారు చెప్పటం, మరి ఇప్పుడే దాని గురించి పాట ఒకటి పాడడం, అది విని మనం నినాదాలు లేపటం- నేననుకుంటాను అన్ని విషయాలకన్నా చాలా మౌలికమైన విషయం ఈ అప్పులని చెప్పి. అందుకని ఝాన్సీగారి పర్మిషన్‌తో ఈ అప్పుల గురించి మాట్లాడక తప్పదని మీకు మనవిచేస్తున్నాను.

మనకు ఎలాంటి అవసరాలున్నాయో ఈ రోజు రైతుకి, రైతుకూలీకి అంతకంటే ఎక్కువ కష్టాలున్నాయి. అప్పు అవసరం. ఎందుకంటే తారతమ్యాలు సమాజంలో ఉండేదానికి కారణం ఏదైతే మనం ఎస్సెట్స్ అని చెప్తామో- ఆ విధంగా ఒక భూమో, ఒక పనో ఏదైనా గానీ చేతిలో ఉంటే దానిని వాడుకొని మనం బీదరికాన్ని తొలగించుకొని ముందుకు వెళ్తామన్నమాట. ఎప్పుడైతే భారత సమాజంలో ఇన్ని తేడాలు ఉన్నాయో- కుల తేడాలున్నాయి, వర్గ తేడాలున్నాయి, ఇవన్నీ కూడా ఎక్కడ లేకపోవటం. లేదంటే నేనొక 10 రూ॥లు సంపాదించుకొని నా పిల్లా జెల్లాని చూసుకోగలగడం, దానికి అవకాశం లేకపోవడం-అంటే ఇది ఆంగ్లంలో చెప్పాలంటే సమాజంలోనున్న అసమానతలు- ఇది బీదరికానికి మౌలికమైన కారణం. అంచేత మౌలిక కారణాన్ని మనం తప్పించాలంటే భూమైనా ఇవ్వాలి; బీదలకి భూసంస్కరణలు న్యాయంగా జరగాలి. లేదూ, భూమి ఎప్పుడైతే మీరు ఇవ్వలేదో, దానికి తగ్గట్లు వనరులు ప్రతిఒక్క కుటుంబానికీ కూడా ఇప్పించి, ఆ వనరుల ద్వారా ఆదాయాన్ని పెంచుకొని, ఆ రకంగా బీదరికం నుండి బయటపడవెయ్యాలి. అయితే దానికి అర్థం ఏమిటి? అప్పులు అన్నమాట. నాకు మీరు నాలుగెకరాల భూమి ఇవ్వలేకపోతే దానికి సమానమైనన్ని అప్పులు మీరు అందజేయాలి. అంటే నాలుగెకరాలకు సమానమైన డబ్బు మీరు నాకు అందజేస్తే, నేను దాన్ని మూల ధనంగా పెట్టుకొని, ఏదో ఒక కార్యక్రమం చేసుకొని తద్వారా నేను నా ఆదాయాన్ని పెంచుకొని బయటపడాలన్నమాట. అందుచేత ఏ సందర్భంలో కూడా, పబ్లిక్‌లోగానీ, గ్రామంలోగానీ మనం మాట్లాడేటప్పుడు నాయకులైన మీరు ఆలోచించాల్సింది ఏమిటంటే మనకి భూమి దొరకుతుందాన్నది సమస్య. ఏ కారణం వల్లనైనా దొరకకపోతే ప్రభుత్వం దగ్గర, శర్మగారన్నారు వ్యవసాయం రాష్ట్రానికి సంబంధించిన సబ్జెక్టు - మన రాజ్యాంగం ప్రకారం, కో ఆపరేటివ్స్ స్టేట్‌కి సబంధించిన సబ్జెక్టు అన్నమాట. అయితే ఒక పాయింట్ నేను మీకు మనవి చేసేదేమిటంటే ఈ బ్యాంకులు స్టేట్ సబ్జెక్టు కాదు కదా! అది కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంది కదా! రిజర్వ్ బ్యాంక్ కేంద్ర ప్రభుత్వం చేతులోనే కదా వుంది. మన్మోహన్‌సింగ్ గారే కదాండి! నోట్లు కొడతారు. అందుచేత ఎప్పుడైతే ఈ అధికారాలు ఆయన చేతిలో ఉన్నాయో, ఆయన మనకి భూసంస్కరణలు చేసి భూములైనా ఇప్పించాలి. లేదంటే



దానికి తగ్గట్టు మనకి అప్పులైనా అంద జేయాలి. దానిమీద వడ్డీ శర్మగారు చెప్పినట్లు 4% లేక ఈయగలిగితే అసలు వడ్డీనే లేకుండాను అందజేయాల్సిన బాధ్యత వుంటుంది. అంచేత ఇది చాలా మౌలికమైన విషయం. రైతాంగాన్ని గురించి శర్మగారు చాలా న్యాయంగా మనవి చేశారు. అయితే దారిద్ర్యరేఖ కిందనున్న బీదలకు మన రాష్ట్రంలో ఈ వెలుగు, స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా లాంటి సంఘాలు) వాళ్లందరికీ కూడా రుణాలిప్పించినపుడు, మనందరికీ తెలుసు - ఇప్పుడొక సంవత్సరానికి ముందుదాకా 24% వడ్డీకి ఇచ్చారు. రైతాంగానికి 9,10,13 శాతం దాకా దొరికింది. అందుచేత ఇవ్వాళకూడా 3% వడ్డీరేటుకు అని ప్రభుత్వం చెప్తుందే కానీ మనం చూడాల్సింది గ్రామ స్థాయిలో చివరకి ఆ స్వయంసహాయక సంఘాలకి ఏ 10శాతానికో వెళ్ళటం; ఆఖరికి ఆ మహిళకి ఏ రేట్లో వెళ్తున్నది కూడా మనం చూడాల్సివుంటుంది. ఈ అవకతవకలన్నీ కూడా పోవాలి. ఇవి పోతేగానీ బీదరికం తొలిగే పరిస్థితి లేదు. మనం ఉన్న పరిస్థితి లోనే ఉంటాం. అందుచేత ఏ ఆందోళనగానీ, ఏ పోరాటం గానీ జరిగినప్పుడు, చేసినప్పుడు ఇది చాలా ముఖ్యంగా- ఈ తత్వాన్ని మనం మనసులో పెట్టుకొని ముందుకు వెళ్ళాల్సి వుంటుంది. ఎందుకంటే తత్వం అన్నది మనం అర్థం చేసుకుంటే ఆందోళనకి ఎప్పుడు కూడా బలం పెద్ద ఎత్తున దొరుకుతుంది. బీదరికంలో ఉన్నవారికి, రైతుకూలీకి ముఖ్యమైనది భూమి.

ఇది చాల ప్రధానమైనది. పోతే పని చాలా ప్రధానమైనది– అంటే ఉద్యోగభద్రత. అయితే పని ఎట్లాగయినా దొరుకుతుంది మన దేశంలో. దీని అర్థం మన ప్రభుత్వం లెక్కల ప్రకారం ఎవరికైతే 4 గం॥ల సేపు పని దొరికితే కూడా అది పూర్తికాలపు పని కల్పించడం అనేది మన ఎన్ఎస్ఎస్ లెక్కలు. మన ప్రణాళిక సంఘం వారు మనకి అందజేసే లెక్కల ప్రకారం 1000 మందికి 536 మంది పనిచేస్తున్నారు అని ప్రతి నివేదికలోనూ లెక్కలు చెప్తారన్నమాట. మన రాష్ట్రప్రభుత్వం పెట్టే నివేదికలూ అలాగే వుంటాయి. కేంద్రప్రభుత్వం వారి ప్రణాళిక సంఘం పెట్టే నివేదికలూ అలాగే వుంటాయి. అయితే కొంచెంలోతుగా వెళ్ళి చూస్తే ఎవరైతే 4 గంటల సేపు పనిచేశారో, అటువంటివాళ్ళు ఈ 536 మంది. 4 గంటల సేపు పనిచేస్తే మొత్తం కూలీ ఇస్తారాండి ఎవరైనా? అసలు కూలే మనకు లేదు గదండీ? కనీస వేతనాల చట్టం ఒకటి వుంది. అది 5 ఏళ్లకు ఒకసారి కూడా పునఃసమీక్ష చేయట్లేదు. పెద్దరైతుకు పనికి వచ్చేసరికి కనీస మద్దతు ధర అన్నది ప్రతి సంవత్సరమూ చేస్తారు. క్రమంగా పెంచుతారు. నేను పెంచకూడదని చెప్పటం లేదు. పెంచాలి. రైతు బాగుపడాలి.

కనీసపు వేతనాలు, కనీస కూలీ ఏదైతే ఉన్నాయో వాటిని ఏ ప్రభుత్వమయినా ప్రతి సంవత్సరము పెంచిన పాపాన పోయిందా అన్న విషయం మనం అడగాలి. మన రాష్ట్రంలో ఐదేళ్ళుగా మార్చలేదు. రైతుకి మాత్రం ఆయనకి రావలసిన ధాన్యం ధరలు పెరుగుతున్నాయి. రైతు పండించడానికి ఎవరైతే కూలీ చేస్తారో, వారి కనీసవేతన చట్టంకి మాత్రం 4 సంవత్సరాలకి కూడా మార్పులు లేవు. ఈ అన్యాయం గురించి ఎవరు అడగాలి? ఈ కనీస వేతనం అమల్లోపెట్టే దానికి, ఆ పాపానికి పోయినవాడు ఎవడూ లేడు. కార్మిక శాఖ ఆ పన్లు చేయాలి. అయితే ఆ కార్మికశాఖలో జిల్లాకి నలుగురు ఇన్స్పెక్టర్లు వుంటారు. ఆయన వెయ్యి గ్రామాలు తిరుగుతాడా? అసలు ఆయనకు తిరిగే ఆలోచన వుందా? ఎప్పుడైతే ఈ ప్రపంచీకరణ సంస్కరణలు చేశాక కార్మికశాఖకు అసలు పని లేదని చెప్పేశామన్న మాట. ఇది ఇంకొక స్థితి. అంటే ఈ కనీస మద్దతు ధర అనేది ఒక రకంగా పెద్ద రైతుది. చాలా పెద్ద రైతులు ఇవాళ కూడా ఉన్నారు. ఈ మధ్య నేనొక లేబర్ ఇన్స్పెక్టర్‌తో మాట్లాడాను. ఆయన తూర్పుగోదావరికి చెంది నాయన. ఆయనతో మాట్లాడుతూ "ఏమండీ! భూసంస్కరణ చేద్దామంటే మరి చాలా భూములున్నాయని మన లీడర్సే అంటున్నారు కదా! ఈ నాలుగు జిల్లాల్లో మనం తేల్చాలంటే ఎన్ని ఎకరాలు దొరుకుతాయి?" అంటే ఆయన "కనీసం 10 లక్షల ఎకరాలు దొరుకుతాయ" న్నాడు. ప్రభుత్వ అధికారి చెప్పిన విషయం ఇది. నా మొహం చూసి చెప్పాడనుకున్నా పోనీ 2 లక్షల ఎకరాలు తీసేద్దాం. కనీసం 7, 8లక్షల ఎకరాలు ఎటువంటి భూములవి? బంగారమంటి భూములు. అందులో ఏదివేసినా పండుతుందన్నమాట. ఇటువంటి పరిస్థితుల్లో భూసంస్కరణలు అనేవి జరగడం లేదు. మా ఫ్రెండ్ ఒకాయన ప్రణాళికా సంఘంలో ఉన్నాడు. ఆయన ఒక విదేశీయుడితో చెప్తున్నాడు, మేం భూసంస్కరణలను తీసుకొంటున్నామని. నేను చెప్పాను– "అవునండీ, ఈయన పదవసారి భూసంస్కరణలు తీసుకొంటున్నాడు, ఇది పదవ ప్లాను కదా ! అది ప్రతిప్లాన్‌లోనూ రాయాలి కదా, భూసంస్కరణలు చేస్తాము." అని. ఈ భూసంస్కరణలు చేయటం– ప్రభుత్వం నుండి, అర్హతలేని వారి ఆక్రమణలో నుండి భూములు తొలగింపు జరగాలి. ఈ మధ్యలో దేవాలయ భూములు గురించి కూడా మనం వింటున్నాం. ఈ దేవాలయ భూముల సమస్యకి ఒక తీర్పు రావాలి. అంటే 4 లక్షల ఎకరాల దేవాలయ భూముల్ని తీసి బీదలకి అసైన్‌మెంట్ కింద ఇవ్వటమొక్కటే పరిష్కారం తప్ప మరొకటి లేదని మనవి చేస్తున్నాను. ఇందులో ఇబ్బందు లుంటాయి. అంటే ఎటువంటి ఇబ్బందు లుంటాయి? ఎప్పుడో పెద్దలు దేవుడి మీద భక్తితో ఉన్నవాటిలో మంచి భూములను దేవుడి మీద పండుగలు చేయాలనో, పూజలు చేయాలనో ఇచ్చి వున్నారు. అంటే నెహ్రూ గారు సోషలిజం తీసుకొచ్చినట్లు, మనమందరం నిజాయితీపరులమని చెప్పి ఆయన తీసుకు వచ్చాడు. సోషలిజం, కమ్యూనిజం నిజాయితీ వుంటేనే జరుగుతుంది. నిజాయితీ లేకపోతే జరుగదు. అధికారులు నిజాయితీతో ఎందుకు ఉంటారు? నేను స్వయంగా చూశాను. ప్రతి ప్రభుత్వరంగ సంస్థ సమావేశానికి సూట్‌కేసులు వెళ్ళాయి. మంత్రులకు, ముఖ్యమంత్రులకి, ప్రధానమంత్రులకి. అదే ప్రకారం దేవాదాయ భూములు ఒక నమ్మకంతో ఇచ్చిన భూములు. అంచేత రేపు ఏ సుప్రీమ్‌కోర్టో, హైకోర్టో అభ్యంతరం చెప్పవచ్చు. ఆ భూమి ఇవాళ ప్రభుత్వం చేతిలో వుంది. దేవాదాయశాఖ చేతిలో వుంది. దాన్నితీసి ఎలాగ మీరు పట్టా ఇవ్వగలరని అడగవచ్చు. అయితే నా పాయింట్ ఏమిటంటే ఒకప్పుడు అన్నిభూములు కూడా బ్రిటీష్ రాజు లేక రాణి భూములు. బ్రిటీష్ క్రౌన్ భూములు. అంటే ప్రభుత్వానికి చెందింది. ఎటువంటి భూస్వామి అయినా కూడా శిస్తు ఎందుకు చెల్లిస్తాడు? రెండ్రూపాయలో, పది రూపాయలో, వందరూపాయలో ఎంతోకొంత శిస్తు చెల్లించటం ఎందుకోసం? "అయ్యా! ఇది ప్రభుత్వానికి చెందిన భూమి. దీనిని నేను వాడుతున్నాను అన్న విషయం నేను ఎప్పుడూ గుర్తులో పెట్టుకుంటాను" అని. ఆ గుర్తింపు కోసం పెట్టిన శిస్తు అది. రామారావుగారు తీసేశారు; ఆయనకి తెలియదు కనుక. అయితే దానికి అవసరమైన చట్టం ఒకటి తీసుకురావాలి. జి.ఓ కింద చేసేది లేదు. చట్టబద్ధమైన ఒకపాలసీ తీసుకొని రావాలి. తీసుకొచ్చి ఈ భూములు పేదలకి పంచాలి. అయితే దేవాలయాలు జరగనివ్వండి. దేవాలయాలు జరగొద్దని చెప్పేదానికి నేనెవర్ని? ఇప్పుడు టిటిడి జరుపుతున్నది. దాని దగ్గర ఏ రాష్ట్రానికైనా మించిన డబ్బు ఉన్నది. ఆ టిటిడి నడపలేదా ఈ 33000 దేవాలయాల్ని? లేదూ, ప్రభుత్వమే ఒక బడ్జెట్ పెట్టనివ్వండి. అయితే ఈ దేవాలయ భూములు కూడా తీసి ఇవ్వాల్సిన అవసరం ఉంది. మొత్తం రాష్ట్రం మీద 7 లక్షల హెక్టార్ల మిగులు భూమి వుందని మన రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన నివేదికలో వుంది. ఆర్థికసర్వేలో ఇన్ని భూములు ఉన్నప్పుడు దాన్ని సక్రమంగా పరిశీలించి భూసంస్కరణల చట్టం కింద– నేను సబ్ కలెక్టరుగా రాజమండ్రి లో ఉన్న రోజుల్లో గోదావరి జిల్లాల్లో కాటన్ బ్యారేజి కింద రొటేషన్ (ఒకటి తర్వాత ఒకటి పద్ధతిలో) కింద రెండో పంటకి ఇచ్చేవాళ్ళు. అంటే మూడవ వంతు ఈ సంవత్సరం, ఇంకో మూడవ వంతు మరుసటి సంవత్సరం, ఇంకో మూడోవంతు మూడవ సంవత్సరం; దానిని ప్రాంతీయ ప్రభుత్వ ఉత్తర్వు అని చెప్పేవారు. ఈ మధ్యలో ఆ కాలువకి ఆధునికీకరణ

జరిగిన తర్వాత అన్నింటిలోనూ ఖచ్చితంగా రెండు పంటలు పండుతాయన్నమాట. అవన్నీ రెండేసి పంటలు పండే భూములు. ఎప్పుడైతే దాని వర్గీకరణ మారిపోయిందో, తద్వారా వచ్చే ఆదాయం మారిపోయిందో, మరి భూసంస్కరణల చట్టాన్ని కూడా మార్చాలి కదా! అది చేయలేదు. అంచేత కోటయ్యగారు, ఝాన్సీ గారు ఇవ్వాళ నాకిచ్చిన సలహా ఏమిటంటే ఆహారభద్రత బీదలకి ఎలాగ రావాలి? అన్నది నన్ను మాట్లాడమని చెప్పారు.

ఆహారభద్రత అన్నది కేవలం రేషన్ దుకాణాల వల్ల రాదు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాదు. పోషకాహార భద్రత ఆహారభద్రత కన్నా మరింత ముఖ్యం. అంటే పోషకాహార భద్రత అన్నది, పిల్లలకు, ఆడ పిల్లలకు కావాలి. వాళ్ళకు అవసరమైనది కేవలం ఇంత తిండి మాత్రమే కాదు. ప్రకృతి ఆడవారికి వ్యతిరేకం. వాళ్ళకున్న ఇబ్బందులు, బాధలు మొగవాడికి లేవన్న మాట. దీన్ని గుర్తులో వుంచుకొని ఆడవారికి పోషకాహార పద్ధతుల్లో అందించడానికి పథకాలు ఉన్నాయి. సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడియస్) వుంది, అంగన్‌వాడీ సెంటర్లు వున్నాయి. ఆ స్కీమ్‌కి భారతదేశం మొత్తంమీద 4 సం॥లు నేను ఉన్నాను దాన్ని నడుపుతూ. మరి కేవలం తిండి కాదు కదా! గర్భిణీ స్త్రీకి, బాలింతకి ఎక్కువగా ఇనుము అవసరం వుంటుంది. గర్భిణీ స్త్రీకి అయోడిన్ పెద్ద ఎత్తున అవసరం ఉంది. కాల్షియం అవసరం. ఇవి లేకపోతే పుట్టే పిల్ల సక్రమంగా పుట్టదు. పుట్టే పిల్ల 2 1/2 కేజీకి తక్కువగా పుడితే ఆ పుట్టే పిల్ల సక్రమమైన మెదడుతో ఉండే అవకాశం బొత్తిగా లేదని నేను మీకు మనవి చేస్తున్నాను. అంచేత 'ఆహారభద్రత' అన్న అంశంలో చాలా విషయాలున్నాయి. మహిళల సంగతి ఏమిటి, పిల్లల సంగతి ఏమిటి? ఆడపిల్లల సంగతి ఏమిటి? మరి మొగవాళ్ల సంగతి ఏమిటి? ఇలా వివిధ రకాలుగా వుంటాయి. మనం ఏ ఆందోళనను చేసినప్పటికీ, అందరి హక్కును కూడా మనం సమకూర్చే విధంగా పోరాటాలు జరగాలి. ఇంతమంది మహిళలు ఇక్కడికి వచ్చారు పనంతా వదిలేసి. గ్రామంలో మనకి 100 రోజులు పని వుంటుందని అనుకుందాం. ఉదయం 8 గం॥ల నుండి సాయంత్రం 6 గం॥ల వరకు అనుకోండి; ఇప్పుడు ఈ అంగన్‌వాడీ సెంటర్లు ఉదయం 7గం॥ల నుండి సాయంత్రం 6 గం॥ల వరకు పనిచేస్తాయి. అంటే పని చేసేవి, అసలు పని చేయని సెంటర్లుంటాయని మీకు తెలుసు. పనిచేసే సెంటర్ల గురించి చెప్తున్నాను 9-1 గం॥ వరకు పనిచేస్తాయి. అందులో పుట్టినప్పటి నుండి 6 సం॥ల దాకా చిన్నపిల్లలు వెళ్ళవచ్చు. గర్భిణీ స్త్రీలు వెళ్ళి పోషకాహారం తీసుకోవచ్చు. వారికి అవసరమైన ఆరోగ్య విషయాలు చూడవలసిన బాధ్యత కూడా వుంటుంది. గర్భిణీ స్త్రీలకి, బాలింతలకు, ఇది మన అంగన్‌వాడీ సెంటర్ల లో జరగాల్సిన విషయం. అయితే పుట్టినప్పటి నుండి 6 ఏళ్ళ వరకు ఒకటే కాదుగదా! బిడ్డకు 3 సం॥లు వస్తే అంగన్‌వాడీ సెంటర్‌లో వదిలేసి వెళ్ళగలను. కానీ నా పాపకు రెండునెల్లు. నేను బాలింత, అయినా నేను పనికి వెళ్ళి తీరాలి. లేకుంటే పొట్ట గడవదు. ఈ పరిస్థితుల్లో ఆ పిల్లను నేను ఎక్కడవదిలి వెళ్ళాలి. ఎవరో ఒక ముసలమ్మ దగ్గర వదిలేయడానికా! నేను కన్నాను నా పిల్లల్ని? ఏం భద్రత వుంటుంది? గత 30 ఏళ్ళుగా మా బోటివాళ్ళం చెప్తున్న దేమంటే అంగన్‌వాడీ సెంటర్లు ఉదయం 8 గం॥ ల నుండి సా॥ 5 గం॥ల దాకా పనిచేసే స్థితి రావాలి. మాలాంటి తెల్లచొక్కా వాళ్ళపిల్లల్ని పెట్టే వాటిని క్రెష్ అంటారు. నా పిల్లలైనా, వ్యవసాయకూలీ పిల్లలైనా అందరూ ఒకటే. అందుచేత ఈ అంగన్‌వాడీ సెంటర్లను క్రెష్‌గా మార్చి, సాయంత్రం దాకా పెట్టి నలుగురు వర్కర్లను అందులో పెట్టాలి. దానివల్ల ఎంతో ఖర్చుకాదు. ఒకరున్న చోట ఇద్దర్ని పెడతాం. గ్రామంలో ఉన్న అమ్మాయిల్ని పెడతాం. ఆ అమ్మాయికి పని దొరుకుతుంది. అనుభవం వస్తుంది. మంచి, చెడు తెలుస్తుంది. ట్రైనింగ్ పొందుతుంది. ఈ ప్రకారం మనం చేస్తే తల్లి కూలికి వెళ్తుంది. బిడ్డకి పోషకాహారం లభిస్తుంది. ఆడా, మగా అందరికి సమాన అవకాశాలు లభిస్తాయి. ఇలాంటి మార్పులు తీసుకువచ్చేందుకు కూడా మన ఉద్యమాలు ఉండాలని నేను మీకు మనవి చేస్తున్నాను.

ఉపాధి అంటే మన రాజ్యంగం ఏం చెప్పింది? మన చట్టాలు ఏంచెప్తున్నాయి? ఇవన్నీ కూడా గుర్తులో పెట్టుకొని దాని ఆధారంగా మనం ముందుకు వెళ్ళాలి. ఇప్పుడు మన భారత రాజ్యంగం కూలిపనిచేసే వారికి ఒక రోజు వేతనం మీద ఆడవారికి, మగవారికి సమానంగా ఇవ్వాలని చెప్పింది. ఈ సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని ఎక్కడైతే మనం చెప్పామో, పైన పేర్కొన్నట్టు అంగన్‌వాడీలు ఎప్పుడైతే మీరు నా పిల్లను వదిలిపెట్టడానికి అవకాశం ఇవ్వకపోతే మీరు రాజ్యాంగాన్ని ఉల్లఘించినవారు అవుతారు. రాజ్యాంగం ప్రకారం ఇది మాకు కల్పించబడిన హక్కు. అయితే ఈ హక్కు నేను అనుభవించాలంటే దానికి కొన్ని అవకాశాలు కలగాలి. అంగన్ వాడీ క్రెష్ ఒక అవకాశమని నేను మీకు మనవి చేస్తున్నాను. దీనికి దానికి ముడి ఉంది. ఈ ప్రకారం మనం ఆలోచన చేయాలి. ప్రతి ఒక్క చట్టం గురించి కూడా. ఎప్పుడైతే మనకు న్యాయమైన కూలీ దొరకట్లేదో అప్పుడు మనకు పూట గడవదు. ఆహారభద్రత ఉండదు. పోషకాహార భద్రత ఉండదు. అయితే దీనిగురించి రాజ్యాంగం ఏం చెప్పింది? దీని గురించి సుప్రీంకోర్టు ఏంచెప్పిందన్నది మీరు, మన మహిళలు, ప్రతినిధులు తెలుసుకోవలసి ఉంటుంది. మన రాజ్యాంగ విధానం ప్రకారం, ఆర్టికల్ 43వ ఆధికరణ కింద ప్రతి ఒక్కరికీ జీవనం సక్రమంగా జరగటానికి ఎంత అవసరమో అంత రోజుకూలీ దొరకాలని చెప్పింది. దీన్ని జీవన భృతి అంటారు. మన రాజ్యాంగం 1950లో వచ్చింది. మన కనీస వేతన చట్టం ఆవిర్భావం తర్వాతనే రాజ్యాంగం ఉనికిలోకి వచ్చింది. ఈరోజు కనీస వేతన చట్టం గురించి మాట్లాడడం భావ్యం కాదని మీకు మనవి చేస్తున్నాను. ఇవాళ మనం మాట్లాడవలసింది కనీస వేతనాలకు కాదు. జీవనానికి సరిపడా వేతనం. ఇది మన రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కు. జీవనానికి సరిపడా వేతనం అంటే ఏమిటి? జీవితాన్ని అర్థవంతంగా గడపడానికి అవసరమైనది అని చెప్పుకోవచ్చు. జీవించే హక్కు ఇచ్చారు. నాకు దేవుడిచ్చిన ప్రాణాన్ని ఎవడూ తీయలేడు. ప్రకృతి నాకు ఇచ్చిన ప్రాణాన్ని ఎవరూ తీసేయలేరు అని నాకు హామీ ఇచ్చివుండింది మన రాజ్యాంగం. అంటే నాకు రావాల్సిన కూలి నాకు రాకపోతే ఆ హామీ పోయినట్లే. అంచేత నాల్గవ అధ్యాయం కింద 'ఆదేశిక సూత్రాలు' కింద ఉన్న జీవన భృతి అన్నది మూడవ అధ్యాయం కింద ఉన్న 'ప్రాథమిక హక్కు'ల్ని ప్రభావితం చేస్తుంది. ఇవన్నీ మనం ప్రజలకు చెప్పాలి. ఈ హక్కు 40 ఆర్టికల్

ద్వారా సక్రమించినది. ప్రాధమిక హక్కులనేవి రాజ్యాంగంలో అధ్యాయం 3లో వున్నాయి. దాన్ని తీసుకెళ్ళి మనం కోర్టులో పోరాడగలం. ఇది న్యాయసమ్మతమైనది. అయితే నాల్గవ అధ్యాయం కింద ఉన్న ఆర్థిక సూత్రాల ప్రకారమైతే అది న్యాయసమ్మతమైనది కాకపోవచ్చు అన్నమాట ఇంతవరకూ ఉండేది. అయితే ప్రస్తుత భారతదేశంలో ఆ పరిస్థితి లేదు. ప్రతివారికి ఈ విషయం మనవి చేస్తున్నాను. ఎందుకంటే ఈ వేళ సుప్రీమ్‌కోర్టు మన మౌలికమైన హక్కులన్నింటిని నాల్గవ అధ్యాయంలో ఉన్న సూత్రాలను బట్టే నిర్వచిస్తున్నది. మూడవ అధ్యాయం, నాల్గవ అధ్యాయంలోని సూత్రాల ఆధారంగా అమలు చేయబడుచున్నది. దాని ప్రకారం జీవనానికి సరిపడు వేతనం గురించి నాల్గవ అధ్యాయం మాట్లాడుతున్నట్లే, ప్రభుత్వ పాలసీ కనీస వేతనాలు కాదని; జీవనానికి సరిపడా వేతనం ఉండాలని సుప్రీమ్‌కోర్టు ఖచ్చితంగా చెప్పింది. ప్రతిఒక్క వ్యవసాయకూలీకి ఈ హక్కు గురించి తెలియపరచాలి. మన రాష్ట్రంలో మాట్లాడే టప్పుడు హక్కులకు, అవసరాలకు కూడా తేడా వుండదు. నాలాంటి ఐఏఎస్ అధికారికి తేడా ఉండవచ్చు. నాకు 20 వేల పెన్షన్ వస్తుంది. నా హక్కులు వేరు. నా అవసరాలు వేరు. అట్టడుగున ఉన్న బీదల గురించి మనం మాట్లాడేటప్పుడు వాళ్ళ అవసరాలకి, హక్కులకి తేడా లేదని మీకు మనవి చేస్తున్నాను. అంబేద్కర్ చెప్పింది అదే. పేదప్రజలకు సంబంధించినంతవరకు వాళ్ళ అవసరాలు, హక్కులూ రెండూ ఒకటే. రెండింటి మధ్య ఏమీ తేడా లేదు. ఏవైతే మన అవసరాలో అవన్నీ కూడా మన హక్కులే. అందుచేత అసలు మనం ప్రాణంతో ఉందామా? వద్దా? అన్నది ప్రశ్న. కనుక మన పోరాటం తప్పదు. ఇవన్నీ మన హక్కులు. అందుచేత అది భూమి గురించి గాని, వేతనం గురించి గానీ, జీవితం జరగాలంటే జీవన వేతనం ఎంత ఉండాలి? కనీస వేతనం అనేది మన ప్రభుత్వం ఐదేళ్ళకొకసారి కమిటీ వేస్తారు. వారు అంచనా చెప్పారు. అది మనకు అవసరం. నేను, నా కుటుంబంలో ఉన్నవాళ్ళు మూడుపూట్ల శుభ్రంగా తిండి తినాలి. "వేతనం అనేది కేవలం మృగాల్లా ఉండటానికి కాదు. మనిషి మనిషిగా ఉండటానికి అవసరమైన వేతనమని" సుప్రీంకోర్టు చెప్పింది. అంటే "నా తిండి, నేను ఉండటానికి స్థలం, బట్టలు; నా ఆరోగ్యానికి అవసరమైనవి; నాకు వయస్సు వచ్చినపుడు కొంత అట్టిపెట్టుకొని ఖర్చుపెట్టుకోవడానికి డబ్బు; ఇన్ని అవసరాలు తీర్చేదిగా ఉండాలని" సుప్రీంకోర్టు ఆదేశం ఇచ్చింది. అందువల్ల మన పోరాటం కనీస వేతనం కోసం కాదు; జీవించడానికి సరిపడా వేతనం కోసం. అరుణారాయ్, జాన్ గౌస్ తదితరులు భోపాల్‌లో ఒక ఆందోళన చేస్తూ, మనం న్యాయమైన వేతనాల కొరకు పోరాడాలని అన్నారు. ఆయనది తప్పు. న్యాయమైన వేతనాలు అన్న భావన మనదేశంలో కుదరదు. నేను 'హిందూ'లో న్యాయమైన వేతనాల గురించి లెటర్ రాశాను. వాళ్ళు ప్రచురించలేదు. ఎందుకు వేస్తారండి! "జాన్‌గౌస్ గారూ! న్యాయమైన వేతనాల గురించి కాదు; జీవనానికి సరిపడా వేతనం గురించి మాట్లాడాల"ని రాశాను. ఎందుకంటే సోనియాగాంధీ గారి కమిటీలో ఆయన వెళ్ళి కూర్చున్నాడు. నేను వెళ్ళి కూర్చోలేదుగదండీ! న్యాయమైన వేతనాన్ని ఎవరు నిర్ణయం చేయాలి? ఏది న్యాయం? ఏది అన్యాయం? అని ఎవరు నిర్ణయించాలి? దానికే సుప్రీంకోర్టు తీర్పులో ఉంది. దానికి అధికరణలున్నాయి. ఆ కారణంగా మనలాంటి వాళ్ళం పెన్సిల్ కాగితాలు పట్టుకొని లెక్కవేస్తే 120, 130 రూ॥లకు తక్కువగాకుండా తేలుతుంది. ఈవాళ మేం 30, 40 రూ॥లే రాక తంటాలు పడుతుంటే, నువ్వు 130 అంటావేమని మీరడగవచ్చు. ఒకప్పుడు అన్నీ అలా కనిపిస్తాయి మనకు. బి.డి. శర్మగారి పుస్తకం చదివాను, బీదరికంలో ఉన్నపుడు అది స్వతహాగా ఉండేదని అనుకుంటారు; కాని అలా అనుకోకూడదు. ఇతరులు వారిని బీదలుగా చేస్తారు. కాబట్టి వారు బీదలుగా ఉన్నారని రాశారాయన. దాన్ని గనక గుర్తుకుతెచ్చుకుంటే 130 రూ॥లు అడిగితే కొత్తగా వుంటుంది ఇవాళ. పదిరోజుల తర్వాత కొత్తదనం పోతుంది. పెళ్ళిలో కూడా కొత్తదనం పోతుంది గదండీ! అలాగే 130రూ॥ మనం అడిగితే కొత్తదనం పోతుంది. అడగాలి. చార్లెస్ డికెన్స్ బీదలగురించి చాల రాశాడు. ఆయన రచనలలో బంబుల్ అని ఒకాయన ఉండేవాడు. ఆయన అబ్బాయికి ఒక గరిట సూప్ ఇచ్చాడు. ఒక గరిట కడుపు కాలినవాడికి ఏం సరిపోతుంది? మరలా లేచి అయ్యా! ఇంకొక గరిట దొరకుతుందా? అని అడుగుతాడు. ఆ బంబుల్‌కి పెరాలసిస్ వచ్చేసింది. నాకు ఇంకొంచెం ఇస్తారా? అని అడిగాడు. ఇంకొంచెం అనే వార్త బంబుల్‌కి మూర్ఛ వచ్చేంతపని అయింది. అంటే బీదలు మొట్ట మొదటిసారిగా తమ హక్కులు, అవసరాల గురించి అడిగితే కటకటలాడి పోతాయి ప్రభుత్వాలు. కాబట్టి ఈ హక్కులన్నీ రాజ్యాంగం మనకు చెప్పింది. సుప్రీంకోర్టు చెప్పింది. సుప్రీంకోర్టు ఆప్ చైనా చెప్పలేదండీ! సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా చెప్పిందండీ! అందుచేత ఇవన్నీ కూడా మనం తీసుకొని వస్తేగాని ఆహార భద్రత సమకూరదు. ఈ వైపుగా మీరందరు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను. ☆

జీవన సంఘర్షణలో
పని సమస్య! కూలి సమస్య!
వేతన సమస్య! వేసట ఎవరిది?
ఆకలి అలసట ఎవరిది?
అసహనం ఎవరిది?

రంగుల చీకటి పాగలెగజిమ్మే
బహుళజాతీయ మార్కెట్
మాయాజాలంలో
శ్రమ వెలివేతకి గురైపోతే
బతుకు సమస్య ఎవరిది?
పూటగడవని పుండుపడిన
కలలు కుట్టే గుండెకోత ఇంకెవరిది?

తిమింగలాల తిరుగుడులో
చిన్నచేపలదే జీవన సమస్య?
బిగ్ షార్క్‌ల దేవులాటలో
బక్కజీవుల దుఃఖాశ్రువులు!

గుత్తవ్యాపార లాభాల మోహం
ఆరేదా? తీరేదా?
జన-జల-సమస్త వనరుల్నీ
ఘనంగా దిగమింగే
వ్యాపారాత్మక తీరని మహాదాహం
బహుళజాతి బాన కడుపు
బకాసురుడి బాపతు!

-పి.ఎస్.నాగరాజు

గిరిజనులు-భూ పరాయీకరణ

అడవిపై హక్కుకోసం, జీవించే హక్కుకోసం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్ని తీవ్రతరం చేయండి!

డా॥ పి. జస్వంతరావు
ఎడిటర్, జనశక్తి



అధ్యక్షా, కామ్రేడ్స్

"గిరిజనుల భూమి సమస్య-భూ పరాయీకరణ గతంలోని యన్.డి.ఏ ప్రభుత్వంలోనూ, ఇప్పటి యు.పి.ఏ. ప్రభుత్వంలోనూ మౌలికమైన మార్పేమీ లేదన్నది మీ దృష్టికి తేదలచుకున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని చిలుకపలుకులు వల్లించ వచ్చు కానీ; భూస్వాముల దురాక్రమణలోని భూములను ఆదివాసీలకు అప్పగించడంలో మాత్రం భూస్వాముల కొమ్ముగాస్తున్నది. రాజీవ్‌గాంధీ అధికారంలో ఉన్న కాలంలో నియమించిన భూరియా కమిటీ సిఫార్సుల నుంచి కొంతలో కొంత కేంద్రప్రభుత్వం తయారుచేసిన పంచాయితీ రాజ్ సవరణ 40/96 చట్టం; దానిని అనుసరించి రాష్ట్రం 7/98 చట్టం ప్రకారం భూవివాదాల్ని గ్రామసభలే పరిష్కరించాలి. కానీ ప్రభుత్వం నేటికీ ఆ చట్టానికి నియమాలు తయారు చెయ్యలేదు. అసలు దానిని అమలుచేసేందుకే పూనుకోవడం లేదని మన విజయనగరం, గోదావరి జిల్లాల ఆదివాసీల అనుభవం చెపుతున్నది. వివరాలు పరిశీలిస్తే 1901లో 5% ఉన్న గిరిజనేతర జనాభా రాష్ట్రంలోని వివిధ ఆదివాసీ ప్రాంతాలలో 45%కి మించిపోయి విలువైన భూమినంతా చట్టవిరుద్ధంగా ఆక్రమించారు. దానిని తిరిగి ఆదివాసుల కిమ్మంటే ప్రభుత్వం నిర్భంధం అమలుచేస్తున్నది తప్ప చట్టాన్ని అమలు చేయడం లేదు.

భూమి సమస్య తీవ్రత కొనసాగుతూ ఉండగా; ఇపుడు ఆదివాసులు అడవులలో నివసించడం వల్లనే అడవి నాశనం అవుతోందని పాలకులు ప్రచారం సాగిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి 2002 సంవత్సరం నుంచి 'పర్యావరణ పరిరక్షణ' పేరుతో ఆదివాసీ గ్రామాలను బలవంతంగా ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. అస్సాంలో ఏనుగులతో ఇళ్ళు పెకిలించారు. మహారాష్ట్రలో లక్షమందిని గెంటివేసారు. మనరాష్ట్రంలో ఖమ్మంజిల్లాలో గొత్తికోయల గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు వేసిన బోర్లను పీకి, గ్రామాలను తగలబెట్టిన సంగతి మీకు తెలిసిందే. దానికి వ్యతిరేకంగా మనం చేస్తున్న పోరాటాలు కూడా అందరూ గమనించారు. ఈ విధంగా ఆదివాసులు అడవులలో ఉంటున్నందుకు 42వేల కోట్ల రూపాయలు నష్టం జరిగిందనే లెక్కలు వేసి లక్షలాది మంది ఆదివాసుల్ని; తరతరాలుగా అడవులలో నివసిస్తున్న వారిని క్రూరంగా గెంటివేయాలని ప్రయత్నిస్తున్నారు. ఈ విధంగా భూమి హక్కు అటుంచి జీవించే హక్కును కూడా కాలరాస్తున్నారు.

మరోపక్క ఆదివాసీ ప్రాంతాలన్నీ తీవ్ర అనారోగ్యంతో మలేరియా, డెంగ్యూ, టి.బి. వంటి అనేక రోగాలతో తల్లడిల్లుతున్నాయి. ప్రధాన సమస్య పౌష్టికాహార లోపమే. మధ్యప్రదేశ్‌లోని 1500 గ్రామాలలో ఆదివాసీ పేదలు పౌష్టికాహార లోపంవల్ల డెంగ్యూవ్యాధికి గురవుతున్నారు. టీకాలు వేసినా డెంగ్యూవ్యాధితో చనిపోతున్నారు. మన విశాఖ, ఖమ్మం తదితర జిల్లాలో మలేరియా, టి.బి. నిరంతరం వ్యాపిస్తూనే ఉన్నాయి. మన రాష్ట్రంలో గతంలో ఆదివాసీల ప్రభుత్వం అభివృద్ధికి బడ్జెట్లో కేటాయించింది. 1090 కోట్లు ఖర్చు పెట్టినట్టు చూపింది. అయితే ఖర్చు పెట్టింది 382 కోట్లు మాత్రమే. ఈ విధంగా నిధులని దారి మళ్ళించారు. పెట్టినట్టు చెబుతున్న ఖర్చు కూడా రాజకీయ, అధికార యంత్రాంగాల అవినీతి ఫలితంగా దానిలో గిరిజనులకు అందింది నామమాత్రమే. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మనరాష్ట్రం, ఎక్కడైనా ఇది పరిస్థితి. ఒకప్పుడు ఆదివాసీ ప్రాంతాలు పంటల మార్పుతో అనేకరకాల పంటలతో, ఆహారభద్రతతో జీవించేవారు. భూములు కబళించడం, కొండపోడులను గుంజుకోవడంతో జీవించే హక్కు ప్రమాదంలో పడుతోంది.

ఇక్కడ మరో అంశం ఉంది. అపారమైన సహజ వనరులు, ఖనిజాలు ఆదివాసీ ప్రాంతాలలోనే ఉన్నాయి. వాటిని తీసుకెళ్ళాలంటే ఏం చేయాలి? ఆదివాసులను ఖాళీ చేయించాలి. చట్టాలను సవరించాలి. మన పాలకులు ప్రపంచంలో ఎక్కడా ఒప్పుకోని ఫ్యాక్టరీలను, గనులను ఇక్కడకు తెస్తారు. బాక్సైట్ మైనింగు అనేది దానిలో భాగం. విమానాలు తయారు చేయాలంటే అల్యూమినియం (అనే చేవెండి) కావాలి. ఈ అల్యూమినియం అల్యుమినా అనే పదార్థం నుంచి వస్తుంది. అల్యుమినా అనేది బాక్సైట్ అనే ఖనిజం నుంచి వస్తుంది. మట్టిలో ఉన్న ఈ బాక్సైట్‌ని తీసి కడిగి, శుద్ధి చేయడానికి చాలా నీరు కావాలి. ఆ బాక్సైట్‌ని తెచ్చి విశాఖపట్నం దగ్గర అల్యూమినాగా తయారుచేస్తారు. విదేశీ సామ్రాజ్యవాదులు ఈ అల్యూమినా నుంచి విమానాలు తయారుచేసి మనకే అమ్ముతారు. చింతపల్లిలో బాక్సైట్ మైనింగ్ తవ్వాలంటే తూర్పు కనుమలలోని తాండవ, వరహా, ఇప్పుడు మనం ఉన్న అనకాపల్లి పక్కనే పోతున్న శారద, మేఘాద్రి గడ్డల నీరు అంతటిని వాడాలి. ఆ బాక్సైట్ మైనింగ్‌వల్ల ఈ నదుల ద్వారా ఇక్కడి భూములు కలుషితం అవుతాయి. చంద్రబాబు కాలంలో అందరం దీన్ని వ్యతిరేకించాం. మన బి.డి. శర్మగారు కూడా అప్పుడు విశాఖపట్నం వచ్చారు. మరల టిడిపి చెప్పులో కాళ్ళు దూర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరల బాక్సైట్ మైనింగ్ కోసం ప్రయత్నిస్తున్నది. దీనికోసం స్టెరిలైట్, వేదాంత, జిందాల్‌తో సంభాషణలు చేస్తున్నది. ఒరిస్సా రాష్ట్రంలోని రాయగడలో వేదాంత, స్టెరిలైట్ కంపెనీలు బాక్సైట్ మైనింగ్ కోసం సాగిస్తున్న ప్రయత్నాలను అక్కడి ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. ఈ నిరసనోద్యమ నాయకుడు సుక్రూమాజీని స్టెరిలైట్ కంపెనీ వాళ్ళు జీపుతో గుద్దించి

(తరువాయి 21వ పేజీలో...) →

ప్రాజెక్టులు-పునరావాసం

భూమికి, భూమి - అడవికి అడవి, శాస్త్రీయ పునరావాసం కోసం పోరాడడం నిర్వాసితుల మౌలిక హక్కు

కామ్రేడ్ కోటయ్య
కార్యదర్శి, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.)



అధ్యక్షా, కామ్రేడ్స్

ఈనాడు పత్రికలలో, టీవిలలో ఎక్కడ చూసినా ప్రాజెక్టుల గురించి చర్చ జరుగుతోంది.

మనం మెదటి నుండి కరువు నివారణ లేకుండా వరదనివారణ లేదని చెపుతున్నాం. అమరులు మండ్ల సుబ్బారెడ్డిగారు గతంలో ప్రతి మీటింగులో ఈ విషయాన్ని నొక్కి వక్కాణించేవారు. ప్రతి సంవత్సరం ధవళేశ్వరం బ్యారేజి నుండి గోదావరిలో 3వేల టి.ఎం.సి.ల దాకా నీరు సముద్రంలో కలుస్తోంది. ఇప్పటికే కొన్నివేల క్యూసెక్కుల నీరు ధవళేశ్వరం నుంచి గోదావరిలో కలుస్తున్నది. కనుక సక్రమ నీటి పారుదల నిర్మాణాల కోసం పోరాడుతున్న స్థితిలో మనం ఉన్నాం.

మరోపక్క ప్రాజెక్టుల నిర్మాణం వెన్నంటే పునరావాసం సమస్యముందుకు వస్తుంది. ఆనాడు ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగుగంగ నిర్మాణం ప్రారంభమైంది. ఆ సమయంలో మన మండ్ల సుబ్బారెడ్డి గారు రహస్య జీవితం నుంచి ఇవతల కు వచ్చి వెలుగోడు ముంపుబాధితుల సమస్యలను తీసుకొన్నారు. "మా భూములు మునిగి పోవడం వల్ల రాయలసీమకి నీరు అందితే అది సంతోషమే. అయితే మా భూములకి నష్టపరిహారం లేకుండా ప్రాజెక్టు నిర్మాణంకి అంగీకరించమని" స్పష్టం చేసారు. వెలుగోడు తెలుగుగంగ మునకబాధితుల పోరాటం ఫలితంగా నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్ పే అండ్ టేక్ (డబ్బు చెల్లించి భూములు తీసుకోండి) అని ఆర్డరు వేసారు.

ఇటీవల చరిత్రలో మొట్టమొదటిసారి ముంపు నష్టపరిహారం చెల్లించి పనులు ప్రారంభించిన పరిస్థతి అప్పుడే మొదలు అయింది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం జీవో ఇచ్చింది. అయితే ఈజీవోను, నష్టపరిహారంను పాలకులు భ్రష్టుపట్టించారు. కాంగ్రెసు హయంలో తెలుగుగంగ కింద కండలేరు మునక బాధితుల పేరుతో ఎన్.జనార్ధన్‌రెడ్డి గ్రూపు కోట్లాది రూపాయలు నష్టపరిహారం పేరుతో కొల్లగొట్టింది. అదే చంద్రబాబు తెలుగుదేశం పాలనలో ఏలేరు కుంభకోణంలో తెలుగుదేశం గ్రూపు నష్టపరిహారం పేరుతో కోట్లు కొల్లగొట్టింది. కండలేరు, ఏలేశ్వరంలో నిరుపేదలు, రైతుకూలీలు నష్టపోయారు. కన్నతల్లి వంటి ఉన్న ఊరును వదులుకొని వలసలు పోయారు.

తిరిగి కాంగ్రెసు ప్రభుత్వం రాజశేఖరరెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చింది. 46 వేల కోట్ల జలయజ్ఞం ప్రారంభించింది.

రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి రాగానే గత పునరావాస అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గత సంవత్సరం కొవ్వాడ ప్రాజెక్టు ప్రారంభోత్సవంకి పశ్చిమగోదావరిజిల్లా పోలవరం దగ్గర కొవ్వాడకి ముఖ్యమంత్రి వచ్చినపుడు ఆదివాసులందర్ని సాగుదారులుగా గుర్తించాలని వందల మందితో వినతిపత్రం ఇచ్చాం. ముందు పునరావాసం, తర్వాత నిర్మాణం అని స్పష్టపరిచాం. పునరావాసం డబ్బుల రూపంలో కాక భూమికి భూమి, అడవికి అడవిగా ఉండాలని; అదివాసులందర్ని సాగుదారులుగా గుర్తించాలని డిమాండ్ చేసాం. తిరిగి పోలవరంలో నవంబరు 8న ఇదే డిమాండ్ చేసాం.

అదే విధంగా తోటపల్లి, జంఝావతి నిర్వాసితులు పోరాడుతున్నారు. మనవారు చురుగ్గా వున్నారు. జంఝావతి ప్రాజెక్టు కింద అసలు సాగుదారులు కాక కొందరు పెద్ద రైతులకి నష్టపరిహారం ఇచ్చింది. డి. పట్టాలు పోరంబోకులు చేసుకొంటున్న పేదలకు నష్టపరిహారం ఇవ్వకుండా ఎగ్గొటారు. వారికి ఇపుడు ఏమీ లేదన్న వైఖరిని వ్యతిరేకిస్తున్నాం. దీనికోసం జరుగుతున్న ఆందోళనలో మనం ముఖ్యపాత్ర వహిస్తున్నాము.

ఈ విధంగా తెలుగుగంగ, ఏలేరు, కొవ్వాడ, సూరంపాలెం, వెంగళరాయసాగర్, జంఝావతి,తోటపల్లి నిర్వాసితుల చరిత్ర అంతా ప్రభుత్వ నిర్లక్ష్యాల చరిత్రే. ప్రభుత్వం 2004 ఏప్రియల్ 8న పునరావాసం గురించి జీవో 68ని విడుదల చేసింది. దీనిలో ఉన్న అంశాలేమిటన్నది పక్కనపెట్టి తోటపల్లి, పోలవరం నిర్వాసితుల ఆందోళనలు ఆ తర్వాతే జరిగాయి. ప్రభుత్వం ప్రకటించిన జీవోను ప్రజలకు వివరించడానికి పోరాటం జరగాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన జీవో 68 కూడా 64 కంటే అధ్వాన్నంగా వుంది. ఆదివాసులకి భూములు ఇవ్వడంలో ప్రాధాన్యత ఇస్తామని చెప్పింది. అంటే దొరికితే ఇవ్వడంలో ప్రాధాన్యత ఇస్తారు కానీ భూమి అక్కడ ఎంత అవసరమో దాన్ని సమకూర్చరని చెప్పినట్లైంది. అడవితల్లి బిడ్డలైన గిరిజనులకి అడవితల్లిని కోల్పోయే నష్టాన్ని ఇవ్వవుకాక ఇవ్వవు. ఈ విధంగా ప్రకటించిన పునరావాస పథకం అమలు చేసేందుకు కాక మరలా కుంభకోణాలు చేసుకొనేందుకు వీలుగా డబ్బులు చుట్టే తిరుగుతుంది.

ప్రాజెక్టు బాధితుల సమస్యలు ఇలా ఉంటే కాలువ మునక బాధితులు తీవ్రంగా బాధలు పడుతున్నారు. వేల ఎకరాల భూమి పోలవరం కుడి, ఎడమ కాలువల కింద పోతున్నది. 300 మీటర్ల నుంచి 500 మీటర్ల వెడల్పున అంటే అర కిలోమీటరు వెడల్పున 130-150 కిలోమీటర్ల భూములు పోతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంతో రైతులు అక్కడే అంతే భూమిని కొనడం అసాధ్యం. దేవరపల్లిలో రైతుల సదస్సు జరిగింది. దానిలో మనం వివిధ రైతు పెద్దలతో

కలిసి చర్చించాము. మొత్తం భూమి కాలువ కింద కొల్పోయే రైతులకి వారి భూమి 5 ఎకరాలకి మించి ఉంటే 5 ఎకరాల వరకు భూమికి భూమి అదే ఆయకట్టలో ఇవ్వాలని; మిగిలిన భూమికి నష్టపరిహారం మార్కెట్ రేటుప్రకారం ఇవ్వాలని డిమాండ్ పెట్టాం. ప్రాజెక్టు నిర్వాసితులు, కాలువ ముంపు బాధితులు కలసి నిలబడాలని పిలుపునిచ్చాము.

ఈ విధంగా పునరావాసం బిచ్చం కాదు. ప్రజలకోసం సర్వస్వం త్యాగం చేస్తున్న వారిగా పునరావాస బాధితులను గౌరవించాలి. క్యూటో సదస్సు, ప్రపంచ జల సదస్సు తీర్మానాలు బాధితులకి పునరావాసం కల్పించడంలో– అదీ ప్రాజెక్టువల్ల లాభపడే ప్రజలకి సరిసమానమైన, అంతకన్నా ఎక్కువ జీవిత సౌకర్యాలను ఏర్పరచిన తర్వాతే ప్రాజెక్టులు కట్టాలన్న తీర్మానాలను ప్రభుత్వాలు ఆమోదించాయి. వీటన్నింటిని బట్టి సమగ్ర, శాస్త్రీయ, పునరావాసం కోసం పోరాడే హక్కు నిర్వాసితులకి ఉందని, పోరాటం కొనసాగించాల్సిందేనని స్పష్టం చేస్తూ ముగిస్తున్నాను. ☆



నిరసన

- కె.యస్. రమణ

వారు మనందరికన్నా మిన్నగా
యీ ప్రకృతిని ప్రేమించినవారే
తమ స్వేద జలాలతో యీ భూమిని
సస్యశ్యామలం చేసిన వారే
తమకెంతో ప్రియమైన
వాన చినుకునీ మట్టి పరిమళాన్నీ
పచ్చటి పులకరింపునీ పక్షి పాటనీ
వున్నట్లుండి వొదిలి వెళ్ళడం
వారికీ యిష్టం లేదు

కార్పొరేట్ కన్ను

- కందుకూరి శ్రీరాములు

మేం ఏమన్నా
భూమి ఇయ్యమన్నమా!
బంగారం ఇయ్యమన్నమా!
ఎండిపోయిన బొండిగ కాయను
తడుపుకుంటానికి
కవుచిప్పెడు నీళ్ళియ్యమన్నాం
పుట్టంగనే బిడ్డకు పాలు ఇవ్వని
తల్లి ఒక తల్లి కానట్టే
మట్టిలో బతికే వాళ్ళకు నీళ్ళివ్వని
పాలకులు ఒక పాలకులు కారు

→(19వ పేజీ తరువాయి ...)

చంపేశారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం సాగుతున్నది. మనం కూడా పోరాటం సాగించాలి.

కనుక అడవిపై హక్కు కోసం, భూమిపై హక్కు కోసం, జీవించే హక్కుకోసం ఆదివాసులు చేసే పోరాటం; మన పర్యావరణంను, మన ప్రజలని రక్షించుకోవడం కోసం చేసే పోరాటమే. భూస్వాముల, సామ్రాజ్యవాదుల విధానాలు; పాలకుల ప్రయత్నాలకి వ్యతిరేకంగా పోరాటం తీవ్రతరం కావలసిందేనని తెలియజేస్తూ ముగిస్తున్నాను. ◆

సందేశాలు

కామ్రేడ్ దేవతోటి నాగయ్య

గ్రామీణ పేదల సంఘం



కా॥ఝాన్సీ, డా॥బి.డి.శర్మ, ప్రొ॥ కె. ఆర్. చౌదరిగార్లకు, సోదరీ సోదరులారా! నేను ట్రైయిన్‌లో వస్తుంటే నెల్లూరు బాలకళాకారులు విప్లవపార్టీలు ఐక్యంకావాలని పాటలు పాడుతున్నారు. ఐక్యత ఎంతో అవసరం. మన పాలకులు రాజ్యాంగం ఏర్పాటు చేసుకొని చట్టబద్ధంగా పరిపాలిస్తున్నామని చెప్తున్నారు. రాజ్యాంగంలో ప్రాథమిక సూత్రం ప్రకారం పేద-ధనికుల మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చటం, ఆర్టికల్ 22 బి(1) ప్రకారం ఆలస్యంగానైనా భూసంస్కరణల చట్టం చేశారు. భూసంస్కరణల చట్టం చేస్తూనే దాన్ని వమ్ము చేయటానికి పాలకులు పూనుకొన్నారు. కేంద్ర ప్రభుత్వం భూసంస్కరణల గురించి చెప్పినా; రాష్ట్ర పాలకవర్గం, పాలనా యంత్రాంగం, హైకోర్టు వమ్ము చేయడానికి పూనుకున్నాయి. అందువలన ఈ ప్రభుత్వానికి రాజ్యాంగం మీద, చట్టంమీద, సుప్రీమ్‌కోర్టు పైన విశ్వాసం లేదు. బినామీ భూములు పేదలకు పంచాలని సుప్రీమ్‌కోర్టు తీర్పు ఇచ్చినా ఇంతవరకు ఏ రాష్ట్ర పాలకులు ఆ భూములను స్వాధీనం చేసుకోలేదు. పేదలకు పంచలేదు. చట్టం తనపని తాను చేసుకుపోతుందని అంటున్న పాలకులు ఆ చట్టం చెప్పిన దాన్ని ఎందుకు అంగీకరించటం లేదు? అనేక రాయితీలు చేసినా సీలింగ్ చట్టం వలన 20 లక్షల ఎకరాల మిగులు భూములు ఉండాలి. ఈ భూములు పంచటంతోనే ఏదో అవుతుందని చెప్పటం లేదు. ఎన్నో త్యాగాలు-పోరాటాల ఫలితంగా భూసంస్కరణల చట్టం వచ్చింది. **ఫ్యూడల్ వ్యతిరేక ఉద్యమం ద్వారా భూస్వాముల భూములు పంపకం జరిగినప్పుడే పేదలు సుఖంగా బ్రతకగలుగుతారు.** సుప్రీమ్‌కోర్టు తీర్పును అంజయ్యగారు అసెంబ్లీలో పెడతానన్నారు. ఆయన్ని ఎత్తి వేయించింది భూస్వామ్యవర్గం.

ఇవాళ మా ప్రాంతంలోని కోస్టల్ ఏరియాలో ఆక్వా కల్చర్ వచ్చాక భూములు ఉప్పునీళ్ళ వలన పనికిరాకుండా పోయాయి. మంచీనీళ్ళ బావులు కూడా ఉప్పునీళ్ళు అయినాయి. సుప్రీమ్‌కోర్టు ప్రధాన న్యాయ మూర్తి ఆక్వాసాగులో తీసుకోవాల్సిన పద్ధతులు - జాగ్రత్తలు చెప్పారు. ఇది ప్రజలకు నష్టంగా ఉంటే వెంటనే ధ్వంసం చేయాలని ప్రకటించాడు. ఇది అమలు జరుగుతుందా? కొత్తపట్నం నుండి ఓడరేవు వరకు అక్వా కల్చర్ వలన నీరు కలుషితమైపోయింది. మరి దీనిపై ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకోగలదు? ధనాడ్య వర్గాల రాజకీయ ప్రాబల్యం అట్లాగే కొనసాగుతున్నది. వీరు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. రొయ్యల చెరువులు 21వేలకు పైగా ఉన్నాయి. వీటికి ఎవరు పర్మిషన్ ఇచ్చారు.?

సముద్రవేటలో మెకనైజ్డ్ బోట్లు వచ్చాక, ట్రాలర్లు వచ్చాక పల్లెకారులకు భుక్తి గడవడం కష్టమైపోయింది. రొయ్యల చెరువుల వల్ల ఉన్న భూమికూడా పోయింది. రొయ్యల చెరువుల వల్ల నష్టపోయిన రైతుల భూములకు నష్టపరిహారం ఇవ్వాలని సుప్రీమ్‌కోర్టు చెప్పింది. అదీ ఆమలు జరగడం లేదు. చట్టాన్ని ఎందుకు అమలుపర్చరని పాలకులను నిలదీయాలి.


కౌలుచట్టాలు ఉన్నా కౌలుదారులకు ఆ చట్టం అమలు జరగడం లేదు. భూమి భూస్వాముల పేర పట్టా ఉండడంతో రైతుకు ఇచ్చే అప్పులు వగైరాలు భూస్వాములే పొందుతున్నారు. నెల్లూరు జిల్లాలో కొండాపూర్ మండలంలో ఆరుగ్రామాల్లో భూస్వాముల క్రింద ఉన్న బంజరు భూములను స్వాధీనం చేసుకొని, వారిపై కేసులు పెట్టి, పేదలకు ఆ భూములు పంచితే, వెంటనే ఆ కలెక్టరును అక్కడినుండి పంపించివేశారు. ఇందుకు భూస్వాములే కారణం.

వ్యవసాయరంగాన్ని బహుళజాతి కంపెనీలు కబళించివేస్తున్నాయి. బోల్‌గార్డు విత్తనాల పేరుతో రైతులను దోచుకుంటున్నాయి. కందుకూరు తాలూకాలో 'సీడ్‌ఫామ్' అని చంద్రబాబు నాయుడు పెడితే, అక్కడ బిల్డింగ్ లన్నీ కూల్చారు. ఇప్పుడు రాజశేఖర్‌రెడ్డి మరలా సీడ్ ఫ్యాక్టరీ పెట్టబోతున్నారు. వీటికి వ్యతిరేకంగా ఆందోళన చేయాలి.

ప్రజాఉద్యమాల ద్వారా ఈ ప్రజల సమస్యలు పరిష్కారం చేయాలి. వివిధ రైతు కూలీ ఉద్యమ నిర్మాణాలు ఎంత తొందరగా ఐక్యమైతే ఆ రకంగా ఉద్యమాన్ని ధైర్యంగా ముందుకు తీసుకొనిపోతాం. ఐక్యత కోసం రాష్ట్ర నాయకులు కృషి చేస్తారని ఆశిస్తున్నాను. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) మహాసభలు విజయవంతం కావాలని కోరుకుంటూ ముగిస్తున్నాను. •

కామ్రేడ్ కె. కృష్ణమూర్తి, అధ్యక్షులు,

వ్యవసాయ కార్మిక సంఘం (ఆం.ప్ర.)



అధ్యక్షా, వేదికపై ఉన్న నాయకులు, సౌహార్ద్ర ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులు, సందేశకర్తలు, ఈ మహాసభకు తీవ్రమైన ఎండల మధ్య ఏమాత్రం లెక్కచేయకుండా ఎంతో పట్టుదలతో మహాసభను జయప్రదం చేయడానికి వచ్చిన సోదరులు, సోదరీమణులు, ప్రతినిధులు, కార్యకర్తలు- ఈ మహాసభలను జయప్రదం చేయడానికి మీరు ప్రదర్శించిన పట్టుదలకు మొట్టమొదట నా ధన్యవాదాలు. వాస్తవికంగా మనకున్న కష్టాలను గురించి చాలా వివరాలను చెప్పారు. మనం పోరాడకుండా మన సమస్యలు పరిష్కారం కావు. ఇది బండ మీద రాత, దీన్నెవరు చెరపలేరు. దీన్ని తారుమారు కూడా చేయలేరు. ఎవడన్నా తారుమారుచేసే ప్రయత్నం చేస్తే వాడొట్టి మూర్ఖుడవుతాడన్నమాట. ఆ పోరాటం ప్రజల ద్వారా జరగాలి. ప్రజలు చేయాలి. ప్రజాశక్తిని పెంచాలి, ప్రజల పోరాటశక్తిని పెంచాలి. ఏ ఒక్కళ్ళమో పెంచితే పెరిగే పరిస్థితుల్లో ఇవాళ దేశం లేదు. అందరమూ దేశం యొక్క మంచి భవిష్యత్తును కోరేవాళ్ళం. మార్క్సిజం- లెనినిజం బాటలో దేశాన్ని మంచి భవిష్యత్తుకు తీసుకువెళ్ళాలనుకొనేవాళ్ళం. విప్లవకారులు, విప్లవ

దృష్టికలవాళ్ళు, తప్పుడు భావాలను పక్కన పెట్టుకొని, నెమరువేసుకొని పాఠాల్ని నేర్చుకొని ఒక మహోద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం వుంది. ఒక ఉప్పెనను సృష్టించవలసిన అవసరం ఉన్నది. అదే ఇవాళ దేశానికి సరైన పరిష్కారమార్గం. ఇవాళ దేశంలో వచ్చే పార్ల మెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా మార్పు వస్తుందని ఎవరన్నా ఆశిస్తే అది భ్రమ తప్ప వాస్తవం కాదు. ఇది బూర్జువా పాలకవర్గాల యొక్క పరిస్థితి. వాళ్ళు తమ యొక్క వర్గాలకు, తమ యొక్క తైనాతీలుగా వున్న సామ్రాజ్య వాదులకు ఊడిగం చేసే స్వభావం కలవాళ్ళు. బానిస బుద్ధి గలవాళ్ళు. మనదేశం యొక్క స్వతంత్ర ప్రతిపత్తిని నాశనం చేయదలుచు కున్నవాళ్ళు. ఎర్రజెండా పట్టుకున్న ప్రతివాడూ ఇవాళ ప్రతినబూని ఈ దేశంలో వామపక్ష శక్తులన్నింటినీ ఏకంచేసుకొని, ప్రజల పోరాడే శక్తిని పెంచడానికి అంకితమవుతున్నాం. అది మండ్ల సుబ్బారెడ్డిగారి లాంటి అమరయోధులు, నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు మొదలైన మా సహచరులెవరైతే వున్నారో వాళ్ళందరూ ఎర్రజెండా పట్టుకుని చేసిన మార్గం. తమ యొక్క రక్తాన్ని ధారపోసిన మార్గం అది. ఆ మార్గాన మనమంతా సాగవలసిన అవసర మున్నది. అదే సందర్భంలో వీర తెలంగాణా విప్లవ రైతాంగపోరాటానికి సంబంధించి రెండు విషయాలు నేను మనవి జేస్తా. మేము చిన్న నాడు నైజాం రాచరిక రాజ్యంలో బానిసలుగా మగ్గే కాలంలో కాస్తో కూస్తో విద్యాభ్యాసం చేసిన మేము ఆ బానిసత్వానికి వ్యతిరేకంగా మహోద్యమాన్ని కూడగట్టటంలో మా శక్తినంతా ధారపోశాం. మా బాల్యదశలోనే, మన కోటయ్య గారి తండ్రి మా సహచరుడుగా ఉన్నాడు. కోటయ్య గారు పిల్లవాడుగా బాల సంఘంలో తనయొక్క పాత్రను నిర్వహించాడు యోధుడుగా. ఇవన్నీ చూసుకొంటే మాకు అనుబంధాలున్నాయి. అనేక రోజులుగా ఈ ఉద్యమాలతో పెనవేసుకొన్న ఒక సంబంధం వుంది. ముందు భవిష్యత్తులో మన ఉద్యమా లన్నింటినీ ఏకం చేసుకొని, ప్రోదిచేసుకొని నడిపించడానికి మార్గం ఉంది. తెలంగాణా పోరాటాన్ని అనేక రకాలుగా వంకర మార్గాలు పట్టించడానికి అనేక శక్తులు ప్రయత్నం చేసినాయి. మిలటరీ యాక్షన్ అవటంతోనే ఆ పోరాటాన్ని విరమించాలనే వాళ్ళు బయల్దేరారు కమ్యూనిస్ట్ ఉద్యమంలోనే పచ్చి సంస్కరణవాదులు. దున్నేవానిదే భూమి కాకుండా, జమీందారుని తరిమికొట్టి భూమిని పంచుకోకుండా, జాగీర్దార్లను నాశనం చేయ కుండా, ప్రజారాజ్యాలను నిలబెట్టుకోకుండా పోరాటాన్ని ఆపగూడదని 3 సంవత్సరాలు సాగించాం. 50వేల మిలటరీని ఢీకొని నిల బడ్డాం. 4వేల ప్రాణాలు అర్పించాం. చివరకు వెన్నుపోటు పొడుస్తూ అదేపార్టీలో కొంతమంది మితవాదులు "ఇది శుద్ధ అవివేకమైన తప్పు. ఇది శుద్ధ హింసావాదం శుద్ధ వ్యక్తిగత హింసావాదం. ఇది ప్రజాపోరాటం కాదు" అని వెన్నుపోటు పొడిచిన దశలో ప్రభుత్వం కూడా దిగివచ్చి, కొన్ని హక్కులు ఒప్పుకుంటే, అప్పుడు పోరాట విరమణ చేయాల్సివచ్చింది 1951లో. అది తప్ప ఉద్యమాలను నీరుగార్చే దుర్బుద్ధితో ఎవరూ ప్రయత్నం చేయలేదు. ఈనాటికి కూడా అలాంటి ఉద్యమాలను నిర్మించడానికి మాశక్తినంతా ధారపోయడానికి, చివరి ఊపిరి కూడా దానికి దత్తం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇది నిజమైన విప్లవమార్గం. ఆ విప్లవమార్గాన మనమంతా కలిసినడుద్దాం. వాస్తవికంగా రెండు తప్పుడు ధోరణులు ఉన్నాయి యివాళ మన ఉద్యమాల్లో. సంస్కర వాదం ఒకటి; తర్వాత పచ్చి పిడివాదం. ఈ రెండురకాల తప్పుడు వాదాలకు వ్యతిరేకంగా విప్లవ శక్తులను కూడగట్టి ప్రజా ఉద్యమాలను ప్రేరేపించవలసిన అవసరమున్నది. ఇవాళ పార్లమెంటులో అనేకమార్పులు వచ్చినయి. ఈ వచ్చిన మార్పులను ఉపయోగించుకోవాలి. అవి ఉపయోగపడ్తాయి తప్ప వాటితోటి మార్పు వస్తుందనుకోవటం శుద్ధ అవివేకమన్న మాట. ఉపయోగపడ్తాయి అంతే. వాటికి చాలా పరిమితులున్నాయి. మన బలం సరిపోదు అక్కడ. తర్వాత వచ్చిన ఆకొద్దిపాటి బలం కూడా కాంగ్రెస్ వ్యతిరేకంగా పోరాడితే వచ్చిన బలమే. కాగ్రెస్‌తో లాలూచీపడి సంపాదించు కున్న బలంలేదు. ఇవన్నీ కూడా గమనంలో పెట్టుకోవాలి. తరువాత నిజాయితీగా ప్రతి విషయాన్ని మననం చేసుకోవాలి. మనమంతా కలిసి నడిచే మార్గాన మనమంతా కలిసి నడవాలి. కా॥ మండ్ల సుబ్బారెడ్డి నా సహచరుడు. మేమంతా జైల్లో కలసివున్నాం. వీళ్లంతా మాతో కలసివున్నారు. ఇవాళ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శింప బడ్డ ప్రముఖులంతా మాతోపాటు కలసి ఉన్నారు. మా సహచరులు, భుజం భుజం కలిపి పోరాడిన వాళ్ళం మేం. అందుకని సోదరులారా! విప్లవశక్తి, విప్లవ చైతన్యం మొక్కవోలేదు. విప్లవచైతన్యం ఇంకిపోదు, నాశనంకాదు. ఎవడూ నాశనం చేయలేడు. దాన్ని ఆధారం చేసుకొనే మనమంతా మార్క్సిజం, లెనినిజం వెలుగు బాటలో, సృజనాత్మకమైన పోరాటబాటల్లో మనమంతా కలిసి నడుద్దామని అందర్నీ కోరుతూ మండ్ల సుబ్బారెడ్డి గార్కి మరొక్కసారి జోహార్లు అర్పిస్తూ ఈ మహాసభ ఫలప్రదం కావాలని కోరుకుంటూ శెలవు తీసుకుంటున్నాను. •

కామ్రేడ్ ప్రభాకర్

ఎ.ఐ.కె.యం.యస్. రాష్ట్ర కార్యదర్శి



రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలకు మారుమూల ప్రాంతాల నుండి, అటవీ ప్రాంతాలనుండి వచ్చిన ప్రతినిధులకు, వేదికపైన ఉన్న నాయకులకు, మేధావులకు, విప్లవాభినందనలు. ప్రభుత్వాలు మారినా వాటి విధానాలు మారలేదు. గత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచబ్యాంక్ ఆదేశాలను, సూత్రాలను మోసుకొచ్చే ఏజంట్లుగా, జీత గాళ్ళుగా రాష్ట్రాన్ని పరిపాలించారు. దాని పర్యవసానమే వ్యవసాయరంగమంతా సంక్షోభంలో పడి, కార్పోరేట్ వ్యవసాయం అమలు జరిగి- రైతాంగం కిడ్నీలు అమ్ముకొనే పరిస్థితి, పిల్లలను అమ్ముకొనే పరిస్థితి, రైతులు ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి ఏర్పడింది.

రాష్ట్రంలో 12 సంఘాలు గల్లీ నుండి గ్రామము నుండి ఢిల్లీవరకు ఉద్యమాలు చేశాయి. రైతాంగ సంక్షోభానికి కారణాలు తెలుసుకోవటానికి మేధావులతో కూడిన కమిటీ వేయటం జరిగింది. రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాలను కమీషన్ వేయమని కోరితే

వేయనందునే ఈ కమీషన్‌వేయటం జరిగింది. ఈ కమీషన్ మారుమూల ప్రాంతాల్లోను, కరువు ప్రాంతాల్లోను పర్యటించి ఆత్మహత్యలు చేసుకొన్న రైతు కుటుంబాలను, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తే ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం చూడనైనా చూడలేదు. ఆనాడు ప్రతిపక్షంగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి ఇదంతా ప్రపంచబ్యాంక్ విధానాల ఫలితమని; మమ్ములను అధికారం లోకి తెస్తే రైతాంగా నికి, వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచింది. చేసింది ఏమిటంటే పల్లెబాట- నగరబాట, రేపు బడి బాట అంటాడు; చివరికి ప్రపంచబ్యాంకు బాట తీసుకొని వెళ్తాడు. ఈ విధంగా రైతులకు ఇచ్చిన హామీలను పాతర వేస్తున్నాడు. ఫలితంగా రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. రాజశేఖర్‌రెడ్డిగారు తన విధానాలను మార్చుకోకపోతే చంద్రబాబు నాయుడుకి పట్టిన గతే పడుతుంది.

ఈ రోజు అటవీ ప్రాంతంలో అడవిని నమ్ముకొని, భూమిని నమ్ముకొని గిరిజనులు జీవిస్తున్నారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇస్తామని చెప్పారు. కాని ఇంతవరకు ఎలాంటి పట్టాలు ఇవ్వలేదు.

అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయరంగానికి గల కారణాల్ని పరిశీలించటానికి జయతీఘోష్ అధ్యక్షులుగా కమీషన్ వేశారు. ఆ కమీషన్‌లో ఇంతకుముందు 12 సంఘాలు మేధావులతో వేసిన కమీషన్ సిఫార్సులను దాదాపు ప్రభుత్వానికి అంద జేసిందని చెప్పారు. గిరిజనులను అడవి నుండి గెంటివేయాలనే ఉద్దేశ్యంతో కొత్తపాలసీ తీసుకొచ్చింది.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) మహాసభల సందర్భంగా మరోసారి ఈ రంగంలో వున్న సంఘాలన్నీ కూడా చిత్తశుద్ధితో కలిసిచేసే కార్యక్రమాలు, ఐక్యఉద్యమాలు - ప్రపంచ బ్యాంక్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పగలుగుతాయి. ఏదో ఒక సంఘంగా మాది పెద్ద సంఘం, మీది చిన్న సంఘం అని ఫోజులకు పోయి పనిచేస్తే మాత్రం ప్రభుత్వానికి బుద్ధిచెప్పలేరు. అమరులైన కామ్రేడ్స్ మండ్ల సుబ్బారెడ్డి, చంద్రపుల్లారెడ్డి, సత్యనారాయణ సింగ్, దేవులపల్లి వెంకటేశ్వరరావులు 'దున్నే వానికే భూమి' నినాదంతో వ్యవసాయ విప్లవోద్యమాన్ని నిర్మించారు. గతంలో విద్యుత్ పోరాటం, పత్తిరైతుల సమస్యలపై ఏ విధంగా ఐక్య ఉద్యమాలు నిర్మించామో అదేవిధంగా ఐక్య ఉద్యమాలలో, మేధావులను కలుపుకొని ఉద్యమాలు నిర్మించగలమనే నమ్మకం వుంది.•

కామ్రేడ్ శివయ్య, అధ్యక్షులు
వ్యవసాయ కార్మిక సంఘం (ఆం.ప్ర)



అధ్యక్షులు, వేదికనలంకరించిన పెద్దలకు, వివిధ జిల్లాల నుండి వచ్చిన రైతు సోదరులకూ ముందుగా విప్లవ జేజేలు తెలియ జేస్తున్నాను. మన వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయింది. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వ్యవసాయ కార్మికులు బ్రతకలేని పరిస్థితి వచ్చింది. 1991లో గాట్ ఒప్పందం మీద భారత ప్రభుత్వం సంతకం పెట్టిన తర్వాతే ఈ పరిణామాలు వేగవంతమయ్యాయి. భారతదేశంలో ఉన్న పెట్టుబడిదారీ వర్గం భూస్వామ్యవర్గంతో రాజీపడి, ఫ్యూడల్ వ్యవస్థను నిర్మూలించకుండా, పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మాణం చేయటానికి ఎప్పుడైతే పాలకులు పూనుకొన్నారో, గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థిక సంబంధాల్లో తీవ్రమైన మార్పులు వచ్చి చేతి వృత్తులు కూడా నాశనం అయ్యాయి. వీరంతా పట్టణాలకు వలసలు వెళ్ళారు. ఆసియా ఖండంలో చైనా, దక్షిణ కొరియా తైవాన్, జపాన్ దేశాల్లో 30 నుండి 40శాతం భూములు పంచారు. చైనా తప్ప అన్నీపెట్టుబడిదారీ దేశాలే. ఈ దేశాల్లో పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేయటాన్కి ఫ్యూడల్ విధానాన్ని రద్దుచేసి భూసంస్కరణలు అమలు జరిపారు.

భారతదేశంలో ఉన్న పాలకవర్గాలు భూస్వామ్యవర్గంతో రాజీపడి పెట్టుబడిదారీ భూస్వామ్యవర్గంగా వారిని పరిణామం చెందించడానికి కావాల్సిన సహాయాన్ని అందించారు. 1991 నుండి నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైనవి అనుకుంటే 81-91 సం॥ మధ్య కాలంలో బొంబాయి జనాభా 13శాతం పెరిగింది. 1991 నుండి 2001 కి ముంబాయి జనాభా 39శాతం పెరిగింది. ముంబాయే కాదు మన రాష్ట్రంలో హైద్రాబాద్, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం జనాభా రెట్టింపు అయ్యింది. ఈ పెరుగుదల అంతా గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చినవారే. వీరంతా పొలాలు కోల్పోయిన చిన్న-సన్నకారు రైతులు. పట్టణాలకు వచ్చి రిక్షాకార్మికులుగాను, మిల్లుల్లోను పనిచేసి బ్రతుకుతున్నారు.

భారత పాలకవర్గాలు ఫ్యూడల్ భూస్వాములను, పెట్టుబడిదారీ భూస్వాములుగా మార్చారు. మనం భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా "దున్నేవానికి భూమి"- "భూస్వామ్య విధానం నశించాలి" అంటున్నాం. నాకు తెలిసినంతవరకు చాలా గ్రామాల్లో ఇవాళ భూస్వాములు లేరు. కాని ఫ్యూడల్ వ్యవస్థ-దాని పెత్తనం ఉంది. ఉత్పత్తి పరికరాలు వాళ్ళ చేతుల్లో ఉన్నాయి. రైతులకు అప్పులతో పాటు వ్యాపారం కూడా వాళ్ళే చేస్తారు. సర్పంచ్‌లు, ఎం.పి.టి.సి, జెడ్.పి.టి. సి.లపై గ్రామంలో పెత్తనం వారిదే. కానీ వాళ్ళు భూస్వాములు కాదు. భూస్వామి ఏ రకంగా పెత్తనం చేస్తాడో ఇవాళ పెట్టుబడిదారీ భూస్వాములు పెత్తనం చేస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని సవరించుకోవడం ద్వారా ఫ్యూడల్ వ్యవస్థను నిర్మూలించటం; అంటే భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించడంతోపాటు కులవ్యవస్థను కూడా నిర్మూలించాలి. స్త్రీలపై అత్యాచారాలు నిర్మూలించాలి. స్త్రీ, పురుషుల సమానత్వం సాధించాలి. ఇవి వ్యవసాయ విప్లవ కార్యక్రమములో భాగంగా ఉంటాయి.

గాట్ ఒప్పందం తర్వాత సామ్రాజ్యవాద సంస్థలను, బహుళజాతి కంపెనీలను వ్యవసాయరంగంలోకి తీసుకొనివచ్చి విత్తన రంగంలోకి చొరబాటుకి అవకాశం కల్పించి, రైతులకు ఇచ్చే సబ్సిడీలను ఎత్తివేసి, రైతుల నడుములు విరగ్గొట్టి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారు.


దేశ చరిత్రను పరిశీలిస్తే తెలంగాణా సాయుధ పోరాటం తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో కొంతమార్పు, బానిసత్వ నిర్మూలన జరిగింది. నక్సల్‌బరీ, శ్రీకాకుళం పోరాటాల తర్వాత

భూమి సమస్య ఎంతో కొంత పరిష్కారం అయ్యింది. పోరాటాల ద్వారానే ఈ సమస్య పరిష్కారం తప్ప మరోమార్గం లేదు.

మనం రెండు ప్రధాన సమస్యలను ఎదుర్కొంటున్నాం. చంద్రబాబు నాయుడు కోటి ఎకరాలు పంచుతానని ప్రచారం చేశాడు. ఇప్పుడు రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం లక్ష ఎకరాలు పంచిందని, రేపు లక్షా యాభై వేల ఎకరాలు పంచుతామంటున్నాడని, వాటిని పంచమని మనం డిమాండ్ చేయటమంటే పాలకవర్గాల భూపంపిణీ ఎడల భ్రమలు కల్పించటమే! ఇది సంస్కరణవాద ధోరణి. ఇక రెండోది ఈ పాలకులు, ప్రభుత్వాలు, రాజ్యాంగం– భూస్వాముల, పెత్తందార్ల దోపిడీని కాపాడుతున్నాయి. భూస్వామి, పెత్తందారు ప్రజలకు, ఉద్యమానికి శత్రువు. కాబట్టి వాళ్ళను ఖతం చేయటం పరిష్కారం అని చేప్పేది వ్యక్తిగత హింసావాదం. ఈ రెండు ధోరణులు తప్పే. ఈ హింసావాదానికి మా నాయకులు బలి అయ్యారు. వ్యక్తిగత హింసావాదం– సంస్కరణ వాదం బూర్జువా తత్త్వశాస్త్రానికి విషఫలాలు. ఈ ధోరణులు రావటానికి సమాజంలో అవకాశం ఉంది. వీటిపై సైద్ధాంతిక పోరాటం జరపాలి. వ్యవసాయక విప్లవాన్ని – నూతన ప్రజాతంత్ర విప్లవాన్ని జయప్రదంచేసే క్రమంలో అనేకమంది కామ్రేడ్స్ ప్రాణాలు త్యాగం చేశారు. వీరి ఆశయాల్ని ముందుకు తీసుకొని వెళ్ళటానికి మనం ఐక్య ఉద్యమాలు నిర్మిద్దాం. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఐక్య ఉద్యమాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందని, ఆ విధంగా ఈ మహాసభ జయప్రదం కావాలని రాష్ట్ర వ్యవసాయ కార్మికసంఘం తరపున విజ్ఞప్తి చేస్తున్నాను. •

కామ్రేడ్ యం.సి. వెంకటేశ్వర్లు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం



అధ్యక్షత వహించిన కా॥ఝాన్సీ గారికి, సోదర సంఘాలకు, ముఖ్య అతిథులకు ధన్యవాదాలు. ఈనాడు మనముందు ప్రధానమైన సమస్యలున్నాయి. డా॥ బి.డి. శర్మగారు ఒక విషయం చెప్పారు. రాజకీయ కారణాలు ఏమైనా గత దశాబ్ది కాలం తర్వాత వ్యవసాయరంగ సమస్యలు ముందుకువచ్చాయి. ఆ సమస్యల పరిష్కారానికి కేంద్రంలో వున్న యు.పి.ఎ. ప్రభుత్వంకాని, రాష్ట్రంలో ఉన్న రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంగాని పరిష్కార చర్యలు తీసుకుంటారని మా వ్యవసాయ కార్మిక సంఘానికి, రైతుసంఘానికి, భ్రమలు లేవు. చౌదరిగారు చెప్పినట్లు లక్షన్నర భూముల పంపిణీలో 20 వేలు తప్ప, మిగతావన్నీ సాగు భూములే. తెలంగాణ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టు ఉద్యమం, రైతుసంఘాలు, ఆంధ్రమహాసభ నాయకత్వాన 4000 మంది కామ్రేడ్స్ ప్రాణాలు అర్పించి, 10లక్షల ఎకరాల భూములు పంపిణీ చేశారు. నేడు భూస్వామ్య వ్యతిరేక పోరాటం ఒక భాగమే తప్ప, ప్రభుత్వం మీదనే పోరాడవలసిన సమయం వచ్చింది. కేంద్ర, రాష్ట్ర పాలకులు ఏ నినాదాలు చెప్పినా, వాటి అమలు వారి చేతుల్లో లేవు. ప్రపంచ బ్యాంకు, ప్రపంచవాణిజ్య సంస్థ వారిని నడుపుతున్నాయి. గతంలో చంద్రబాబు నాయుడు ఇదేవిధంగా నడిచాడు. భూసంస్కరణ చట్టం, కనీస వేతన చట్టం అమలు జరగడం లేదు. ఆ చట్టాల్ని అమలు జరిపించు కోవటానికి పోరాటాలు చేయాల్సి వస్తోంది.

మాకు యు.పి.ఏ, రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వాల మీద ఎలాంటి భ్రమలు లేవు, సంస్కరణవాదులకు ఉండవచ్చు. సంస్కరణ వాదమా? అతివాదమా? అనేది కాలక్రమంలో తేలవలసిన సమస్య. మనం ఆత్మవిమర్శనా పూర్వకంగా ఆలోచించాలి.

ఇదే సోదరసంస్థలకు కూడా మనవి చేస్తున్నాను. మనం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలను బలహీనంగా నడుపుతున్నాము. ఈ విషయం మేం అంగీకరిస్తున్నాం. అందువల్ల రాజకీయ విభేదాలను పక్కనబెట్టి ప్రజా సంఘాలు అన్నీ కలసి భూసమస్యలు, గిరిజన సమస్యలు, వేతన సమస్యలు, దళిత సమస్యల పైన ఐక్య ఉద్యమాలు కొనసాగిద్దాం. ఆవైపుగా ఈ మహాసభ నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాను. •

కామ్రేడ్ తులసీదాస్, అధ్యక్షులు,

ఆం.ప్ర. రైతుసంఘం



రైతుకూలీ సంఘం ఆం.ప్ర. రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. గతంలో ఉన్న ప్రభుత్వం వ్యవసాయరంగం దండగమారి వృత్తి అని చెప్పింది. ఆ ప్రభుత్వం పోయి "రైతు సంక్షేమమే నా ధ్యేయం" అని చెప్పి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న చర్యలు గానీ, చేస్తున్న మార్పులు గాని చూస్తే మాటల్లో రైతు సంక్షేమ ప్రభుత్వమేగాని, ఆచరణలో రైతుకూలీలకు నష్టం కలిగించే చర్యలతో కాలం గడుపుతున్నారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా కుదిపివేసిన సమస్య నిర్వాసితుల సమస్య. జలయజ్ఞం చేస్తానంటున్నాడు ఆయన. సంతోషమే. ప్రాజెక్టులు కట్టమనండి, కానీ జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టుల నిర్మాణం కోసం తమ భూమిని, ఇండ్లను సర్వం కోల్పోతున్న నిర్వాసితుల కోర్కెలను ఏమాత్రం పట్టించుకోకుండా, వారి సమాధులపై ప్రాజెక్టుల పునాదులు కట్టాలని రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం పూనుకుంటున్నది. దీన్ని గమనించిన వామపక్షాలు అందరికంటే ముందే నిర్వాసితులను సమీకరించి ఆందోళన సాగిస్తున్నాయి. అది జంఝావతిలో రైతుకూలీ సంఘం కావచ్చు, తోటపల్లిలో అన్ని సంఘాలం కావచ్చు. పోలవరంలో నిర్వాసితుల సమస్యపై రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) చేస్తున్నది, ఏఐకెఎంఎస్ చేస్తున్నది. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు చేస్తున్నాయి. అందరం కోరుతున్న కోరిక మాత్రం ఒక్కటే. నిర్వాసితుల సమస్య పరిష్కారం కాకుండా ప్రాజెక్టులు కట్టవద్దని. ఈరోజు ప్రభుత్వం దృష్టి చూస్తే నిర్వాసితులను నిర్లక్ష్యం చేస్తున్నది. అడ్వాన్స్‌ల పేరుతో క్రాంటాక్టర్లకు వందలకోట్లు కట్టబెడుతున్నది. 900 కోట్లు కాంట్రాక్టర్లకిచ్చి, 360 కోట్లు మాత్రమే ప్రాజెక్టులపై ఇప్పటివరకు ఖర్చు పెట్టింది.

గత 6 సంవత్సరాలుగా కరువును ఎదొర్కుంటున్న ప్రాంతాల్లో రైతులు ఇబ్బంది పడుతుంటే, బ్యాంకర్లు వచ్చి చెంబు, తపేళా బయటపడేసి జప్తులు చేయడానికి పూనుకుంటుంటే ఆ దుర్మార్గాన్ని వ్యతిరేకించాలా? అక్కరలేదా? మనలాంటి సంఘాలు వాటిని వ్యతిరేకించాలి, ప్రతిఘటించాలి. రైతులను రుణవిముక్తుల్ని చేయటమన్నది రాష్ట్ర ప్రభుత్వ మొట్టమొదటి కర్తవ్యం. 1937లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో చేసిందాన్ని ఈ స్వతంత్ర ప్రభుత్వం అమలు చేయటం లేదు. కౌలుదారుల కు భూమిమీద హక్కులేక ఇబ్బందిపడుతున్నారు. వారికి బ్యాంకుల నుండి అప్పు దొరకడం లేదు. వీరి హక్కులకోసం పోరాడటం రైతు, రైతుకూలీ సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల కర్తవ్యం. ప్రభుత్వం ఊదరగొడుతున్న మరో అంశం లక్షలాదిమంది రైతులకు రుణాలు ఇస్తున్నామన్నది. వాస్తవానికి ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారమే కోటి 15 లక్షల కమతాలు ఉంటే ప్రభుత్వం అప్పులిస్తున్నది 67 లక్షల కమతాలకే. అంటే 50 లక్షల మంది రైతులకు బ్యాంకు అప్పులు అందటం లేదు. వీరికి బ్యాంకు అప్పులు అందజేయాలని పోరాడాల్సిన బాధ్యత మనమీద ఉంది.

మనందరం రైతుకూలీల కోసం పని చేస్తున్నాం. మన మధ్య భేదాభిప్రాయాలున్నాయి. అందుకే వేరు వేరు సంఘాలు పెట్టుకున్నాం. ఈరోజు అభిప్రాయభేదాల్ని పట్టుకొనే ఉందామా? లేక ఐక్యతకు అవకాశ మున్నటు వంటి అంశాలపై కలసిపని చేద్దామా? అన్నది మనముందున్న ప్రశ్న. బిల్‌క్లింటన్ వచ్చి ఈ సమస్యను కూడా పరిష్కరించాడు. ఆయన రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా రాష్ట్రంలోని వామపక్షాలన్నీ ఒకే వేదికమీదకు వచ్చి నిరసన ఉద్యమం చేశాం. ప్రపంచ బ్యాంకుకు వ్యతిరేకంగా సాగినటు వంటి విద్యుత్ ఉద్యమంలో అందరం కలసి ప్రజలను కదిలించాం. ప్రభుత్వాన్ని కూలగొట్టడంలో ఇది ముఖ్యపాత్ర పోషించింది. మన వేదికలపైన మన అభిప్రాయాలను చెప్పుకుందాం. పేద ప్రజల సమస్యలు వచ్చినపుడు ప్రభుత్వాన్ని ప్రతిఘటించడానికి ప్రజలను సమీకరించడానికి, మనమందరం ఒకటౌదాం. ఐక్యతకి, ఐక్యకార్యాచరణకి అందరం పూనుకోవాలి. అందుకు ఆం.ప్ర. రైతుసంఘం తప్పక చొరవ తీసుకుంటుందని, ఈ రైతుకూలీ సంఘం రాష్ట్రమహాసభలు కూడా అటువంటి నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిస్తున్నాను. •

కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు

ఆం.ప్ర. రైతుసంఘం



అధ్యక్ష, మిత్రులారా! ఈ దేశంలో వేణుగోపాల్‌గారి లాంటి వాళ్లు మా జిల్లా కలెక్టరుగా ఉండగా సమిష్టి వ్యవసాయాలు చేయటం ప్రారంభించారు. ఆనాడు సమిష్టి వ్యవసాయ క్షేత్రం ప్రారంభించడం అంటే ఒకవైపు రష్యా ప్రభావం, మరోవైపు ఒకటిగా కలసివున్న కమ్యూనిస్ట్ ఉద్యమం యొక్క ప్రభావంతో ప్రభుత్వరంగం కొంత అమలు పరచడానికి అవకాశముండేది. ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానంలో పేదవాడు పేదవాడుగానే ఉంటాడు. ధనవంతులు మరింత ధనవంతులు అవుతారు. వెనుకబడ్డ ప్రాంతాలు వెనుకబడే వుంటాయి. అభివృద్ధి చెందిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతూ ఉంటాయి. ఇప్పుడు సోవియట్ రష్యా దెబ్బతినడం, అమెరికా విజృభించి ప్రపంచబ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థలతో కలసి భారతదేశాన్ని, ప్రపంచంలోని మానవాళిని మొత్తాన్ని దోచుకోవడం కోసం; దేశాల స్వాతంత్ర్యాలను హరించివేయడం కోసం; మనదేశంలో ఉన్న కార్మికులు, కర్షకులు, గిరిజనులు, హరిజనులు, ఎస్సీ, ఎస్టీ, బిసి వగైరా అందరినీ దోచుకోవడం కోసం వాళ్ళు పథకం రూపొందించారు. ఆ పథకంలో భాగంగానే గత పాలకులేమో రైతాంగ వ్యతిరేక, వ్యవసాయ వ్యతిరేక విధానాలు అమలు జరిపారు. దాని ఫలితమే 1997 డిసెంబరు నుండి ప్రారంభమైన రైతుల ఆత్మహత్యలు ఇవాళ కూడా ఆగకుండా జరుగుతున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వారు వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ప్రాజెక్టుల నిర్మాణం, ఆత్మహత్యలు చేసుకున్న వారికి లక్షన్నర నష్టపరిహారం ప్రకటించినా ఆత్మహత్యలు పెరిగాయి తప్ప తగ్గలేదు. ఆత్మహత్యలు తగ్గాలంటే పేదరైతుల యొక్క రుణాలు రద్దుచేయాలి. ఆ పైవర్గాల యొక్క వడ్డీలు రద్దు చేయాలి. మొత్తం రైతులందరికి కొత్త పంట రుణాలివ్వాలి. రెండో పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. రైతుకు వ్యవసాయ ఖర్చులు పెరిగిపోయాయి. కరువు, తుఫానులు, తెగుళ్ళ వలన రైతు పంట నష్టపోతే, నష్ట పరిహారం కింద ఎకరానికి వంద రూపాయలు, లేక రెండువందల రూపాయలు ఇస్తున్నారు. ఇది రైతుకు ఉపయోగం లేనిది. అందువలన ఈ వ్యవస్థలో ఈ ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించడం లేదు. పేద రైతులకు రుణాలు ఇవ్వవలసిన 2500 సహకార సంస్థలని రద్దు చేశారు. అందుకని ఇవాళ ప్రజాపోరాటాల ద్వారా, రైతుకూలీ పోరాటాల ద్వారానే రైతాంగాన్ని బ్రతికించు కోగలం. పోరాటం లేకపోతే రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి. అందుకే, పోరాటమే ఏకైక మార్గం. అలాంటి పోరాటాలు వామ పక్షాలు ఐక్యంగా, రైతుకూలీ సంఘాలు ఐక్యంగా సాగించడం ద్వారానే ముందుకు పోగలుగుతాం. ఈ మహాసభ అలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని, మహాసభ జయప్రదం కావాలని కోరుతున్నాను. •

కామ్రేడ్ రమేష్ పట్నాయక్, SUCI



కామ్రేడ్స్! రైతుకూలీ సంఘం ఆంధ్ర ప్రదేశ్ మహాసభలకి విచ్చేసిన సోదర సంస్థల ప్రతినిధులు, పెద్దలు, మేధావులకి హాజరైన అందరికీ అభినందనలు తెలియ జేస్తున్నాను. దేశంలో పాలకులు నయా ఉదారవాద విధానాల అమలును వేగవంతం చేసి ఇప్పటికి 15 సంవత్సరాలు గడిచాయి. ఈకాలం అంతా రైతులు, కార్మికులు, సమస్త కష్టజీవులు తీవ్ర సంక్షోభంలోకి, వలసలకి, ఆకలిచావులకి, ఆత్మహత్యలకి గురైనారు. మరోపక్క సామ్రాజ్య వాదులు, బహుళజాతి కంపెనీలు తమ దోపిడీని మరింత తీవ్రతరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటిస్థితిలో మరిన్ని రైతాంగ ఉద్యమాలు అవసరం ఉన్న స్థితిలో, మరింత ఐక్యకార్యాచరణ అవసరమైన స్థితిలో మనం ఉన్నాము. దీనికి అనుగుణంగా ఈ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. •

కామ్రేడ్ మానసయ్య
కర్నాటక రైతుసంఘం (కె.ఆర్.ఎస్)



రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలో పాల్గొంటున్న వివిధ జిల్లాల రైతు కూలీ సహోదరులకు, మహాసభ అధ్యక్షులకు, మరియు ఈ మహాసభలో అతిథులు గానూ, ఉపన్యాసకులు గానూ పాల్గొన్న సహచర మిత్రు లందరికి కర్నాటక రైతు సంఘం మరియు కర్నాటక ఉద్యమకారుల తరుపున విప్లవ శుభాభివందనములు తెలుపుతున్నాను.

భారత రైతాంగానికి సుదీర్ఘమైన విప్లవ పోరాటచరిత్ర ఉంది. ఇందులో ఆంధ్ర రైతాంగం ఎన్నో పోరాట సాంప్రదాయాలు కలిగివుంది. ఇక్కడి రైతుకూలీలు తమ విమోచన కోసం పెద్ద భూస్వామి వర్గానికి ప్రతినిధి అయిన నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకం గా రాజీలేని పోరాటం చేసారు. ఈ పోరాటం ద్వారా విప్లవ రైతాంగ ఉద్యమ సందేశాన్ని భారతావనికంతటికీ వ్యాపింప చేసారు. భూమికోసం, నిజమైన స్వాతంత్ర్యం కోసం సాగిన తెలంగాణా సాయుధ పోరాటం సామ్రాజ్యవాద నేతృత్వంలో భారత పాలకవర్గం జరిపిన భారీ సైనిక దమనకాండ, సంస్కరణ వాద నాయకత్వం సృష్టించిన అస్థిరత్వం వల్ల తాత్కాలికంగా వెనకడుగు వేసింది.

భారతదేశ రైతాంగ పోరాట చరిత్రలో శిఖరాగ్ర భాగాన ఉన్న తెలంగాణా రైతాంగ విప్లవ సాయుధపోరాటమూ, శ్రీకాకుళం తదితర ప్రాంతాలలో జరిగిన వీరోచిత పోరాటాల వలననూ ఆంధ్ర రైతాంగం ఈ దేశం యొక్క రాజకీయ, ఆర్థిక, మరియు సాంస్కృతిక రంగాలపై సాటిలేని ప్రభావాన్ని పడవేసింది. రైతాంగ ఉద్యమం విద్యార్థి, యువజన, ఆదివాసీ తదితర పీడిత జన సమూహాలను ప్రగతి దిశలో పయనింపచేసింది. అంతేగాక వందలాది,వేలాది విప్లవ యోధులకు, బుద్ధి జీవులకు జన్మనిచ్చింది.

అధికార మార్పిడి తర్వత అధికారంలోకి వచ్చిన దళారీ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలకి చెందిన కాంగ్రెస్ నిజమైన స్వాతంత్ర్యా భిలాషులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. 1960, 70 మరియు 80 దశకంలలో ఇక్కడి పాలకవర్గం అమలుచేసిన గొప్ప గొప్ప పేర్లు గల భూసంస్కరణలు, వ్యవసాయ సంస్కరణలు సామ్రాజ్యవాదుల లూటీకి, భారత వ్యవసాయ రంగాన్ని క్షీణింపచేయడానికే తోడ్పడ్డాయి. భూసంస్కరణ వలన కర్నాటకలో కూడా భూమి లేనివారికి, పేదరైతులకి భూమి దక్కలేదు.

అలాంటి పరిస్థితులలో కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వంలో నక్సల్‌బరి ఉద్యమం సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాలకి కొత్తశక్తి నిచ్చింది. నూతన ప్రజాతంత్ర విప్లవ కార్యభారాన్ని కార్మిక, పీడిత జన సమూహాల ముందుకుతెచ్చింది. ఈ నక్సల్‌బరి ఉద్యమం "వ్యవసాయక విప్లవమే ప్రజాతంత్ర విప్లవానికి ఇరుసు" అని, "దున్నే వానిదే భూమి" అని దేశమంతా నినదించింది. అదే సమయంలో ఈ ఉద్యమంలో పై చేయి అయిన అతివాద దుస్సాహసం వల్ల మొత్తం ఉద్యమం తీవ్రమైన అణచివేతను ఎదుర్కొంది. వ్యవసాయ విప్లవకార్యభారాన్ని ముందుకు తీసుకొని పోలేకపోయింది.

1970ల తర్వాత సామ్రాజ్యవాదం తను సృష్టించిన ఆర్థిక మాంద్యాల వల్ల తీవ్ర సంక్షోభానికి గురై ఈ సంక్షోభాన్ని ప్రజల మీద నెట్టేందుకు అంతవరకూ చెపుతున్న కినీషియనిజం (1917 రష్యా విప్లవం తర్వాత సోషలిస్టు రాజ్యాలు ఏర్పడి పురోగమించడం, మరోవైపు పెట్టుబడిదారి దేశాలు నిరంతరం ఆర్థికమాంద్యాలలో చిక్కుకొంటున్న కాలంలో అదనపు విలువను కొల్లగొట్టి శ్రమ దోపిడీని కొనసాగిస్తూన్నే కొన్ని సంక్షేమ చర్యలు పెట్టుబడి దారీ రాజ్యం చేపట్టాలనే భావనను ముందుకు తెచ్చిన పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలలో కీన్సు అనే అతను ప్రముఖుడు. ఇతని భావాలనే కినీషియనిజం అని అంటారు.) స్థానంలో నయా ఉదారవాదం (అక్టోబరు విప్లవం ముందు పెట్టుబడిదారీ విధానం సాగించే దోపిడీలో, మార్కెట్టు చర్యల్లో దేనిలోనూ ప్రభుత్వం జోక్యం చేసుకోరాదనే వాదాన్ని ఉదారవాదం - పెట్టుబడిదారీ దోపిడీ పట్ల ఉదారవాదం అని అంటారు. 1980ల తర్వాత సోషలిజంపై పెట్టుబడిదారీ విధానం "విజయం" సాధించిందని, ఇక పెట్టుబడి వ్యవహారాలలో రాజ్యం జోక్యం చేసుకోరాదని; సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ చేపట్టాలనే సామ్రాజ్యవాద వాదనలను నయా ఉదారవాదం అని అంటారు) ముందుకు వచ్చింది. ఫలితంగా ఐ.యం.యఫ్., ప్రపంచ బ్యాంకు, ప్రపంచవాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.వో) రూపాలలో సామ్రాజ్యవాద ఆర్థిక సంక్షోభాలను మూడవ ప్రపంచదేశాలపై రుద్దాయి. దీనివల్ల పీడిత దేశాల పీడిత ప్రజలు మరింత ఇక్కట్లు పాలవుతున్నారు.

1991లో భారతదేశంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పై రూపాలలో తీవ్రం అయింది. ఇతర రంగాలతో పాటు వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభానికి గురైంది. తర్వాత వచ్చిన ఎగుమతి - దిగుమతి విధానం సామ్రాజ్యవాద పెట్టుబడులను నిరాటంకంగా ప్రవహింప చేసింది. ఇది గ్రామీణ ప్రాంత వైరుధ్యాలను మరింత తీవ్రతరం చేసింది. మెజార్టీ ప్రజలైన భూమిలేని పేద రైతుల నుంచి మధ్యతరగతి, ధనిక రైతులలో ఒక భాగం ఉకావికలైనారు. వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చు ఎక్కువై, పంటలకి రేట్లు లేక, అప్పుల విధానం, ప్రభుత్వ ధోరణుల వల్ల రైతుల హత్యల పరంపర ప్రారంభమైంది. ఇవి పాలకవర్గాల హత్యలే కానీ రైతుల ఆత్మహత్యలుగా చిత్రిస్తున్నారు.

"దున్నేవానికి భూమి" స్థానంలో "భూమిపై పెట్టుబడి పెట్టే వాడికే భూమి" అన్న దుర్నీతిని ముందుకు తెచ్చారు. సామ్రాజ్య వాదుల కనుసన్నలలో మన వ్యవసాయాన్ని తమ చేతుల్లో కేంద్రీకరించుకునేందుకు అగ్రికల్చర్, ఫ్లోరోకల్చర్, సిరికల్చర్, ఫిస్సికల్చర్, అక్వాకల్చర్ అని విభజించి వ్యవసాయరంగాన్ని దోచుకుంటున్నారు. దీనికి వివిధ కార్పోరేట్ సంస్థల, ధార్మికసంస్థల, సామ్రాజ్యవాదుల చెప్పు చేతలలోని యన్.జి.వో.లు ఈ పనిలో ఉన్నారు. సంప్రదాయ వ్యవసాయరంగాన్ని అంతర్జాతీయ మార్కెట్లు దోపిడీకి కట్టి

వేస్తున్నారు. వ్యవసాయయోగ్యమైన భూమి, అభివృద్ధి పేరుతో, పార్క్‌ల పేరుతో రియల్‌ఎస్టేట్ పేరుతో వేల ఎకరాలు ఆక్రమణలకి గురౌతున్నది. కర్నాటక రాష్ట్రంలో బి.యం.ఐ.సి కి 29000 ఎకరాలు, రిలయన్స్‌కి 12000 ఎకరాలు; 16 ఆగ్రోటెక్నాలజీ పార్కులు, 8 బయోటెక్నాలజీ పార్కులకు 87,000 ఎకరాలు; బి.పి.యల్., ఐ.బి.సి.ఐ కంపెనీలకి 'కొడుగు' జిల్లాలో 23,000 ఎకరాలు కట్టబెట్టారు. కాఫీ తోటలు, చేతివృత్తుల అభివృద్ధి పేరుతో లక్షలాది ఎకరాల భూమి వ్యవసాయేతర కార్యక్రమాల పాలవుతున్నది. నాబార్డు ద్వారా ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు, ప్రపంచబ్యాంకులు రాష్ట్రంలోని 19 తాలూకాల భూమిని వాణిజ్య పంటలు పండించుటకు పెట్టుబడులు పెట్టి రైతులను రైతు కూలీలుగా మార్చింది. పెద్ద పెద్ద జమీందారులు ఈ సామ్రాజ్యవాద వ్యవసాయం, వ్యాపారంలో భాగస్తులైనారు.

ఈ మొత్తం దుష్పరిణామాల వల్ల భూమి సమస్య కీలకమైంది కాగా; సంస్కరణవాద సి.పి.ఐ, సి.పి.యం అనుబంధ రైతు సంఘాలు, యన్.జీ.వోలు "మేధోనిధులు" (థింక్ ట్యాంకర్లు) కేవలం మద్దతుధర, పంటల భీమా సౌకర్యం, వ్యవసాయ పరపతి సౌకర్యాల కోసం చేసే పోరాటాలే ముఖ్యమని భావిస్తున్నారు.

సామ్రాజ్యవాద కొత్తరూపాల దోపిడీకి వ్యతిరేకంగానూ, రైతాంగ సమస్యలపైన కర్నాటక రైతుసంఘం కృషిచేస్తున్నది. అఖిల భారతస్థాయిలో బలమైన రైతు ఉద్యమ నిర్మాణంలో కర్నాటక రైతు సంఘం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని తెలియ చేస్తున్నాను. గొప్ప విప్లవ సంప్రదాయం గల్గిన ఆంధ్ర రైతాంగం, రైతుకూలీ సంఘం మరింత పురోగమించాలని కర్నాటక రైతు సంఘం కోరుతున్నదని మీకు తెలియచేస్తూ మరోసారి అభినందనలు తెలియచేస్తున్నాను.

వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలి.


కార్మిక-కర్షక ఐక్యత వర్ధిల్లాలి.

సామ్రాజ్యవాదం-భూస్వామ్య విధానం నశించాలి.

నూతన ప్రజాతంత్ర విప్లవం వర్ధిల్లాలి. •

కామ్రేడ్ జి.విజయకుమార్

రాష్ట్ర కన్వీనర్, ఎపిఎఫ్‌టియు



సభాధ్యక్షులకు, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కార్యవర్గ సభ్యులకు, సోదర సంఘాల నాయకులకు, పెద్దలకు, ప్రతినిధులకు, ముందుగా అభినందనలు, జేజేలు. గతకాలపు కార్యక్రమాలని సమీక్షించుకొని, భవిష్యత్తు కార్యక్రమాన్ని గుణపాఠాలతో తీసుకోవటంలో ఈ మహాసభ జయప్రదం అవుతుందని ఎపిఎఫ్‌టియు ఆశిస్తున్నది.

భారతదేశ పరిస్థితి నేడు బహు విచిత్రంగా ఉన్నది. సంవత్సర కాలం క్రితం అధికారంలో ఉన్నవారు 'ఫీల్‌గుడ్' నినాదంతో ప్రజల దగ్గరకు వచ్చి ఓట్లువేయమని అడిగారు. కానీ వారికి వేయలేదు. కారణం ప్రజలు వారి విధానాలతో విసిగిపోయారు. ప్రజలపై ఎక్కుపెట్టిన దాడి, నిర్బంధం, హింసలే ఇందుకు కారణం. ఫలితంగా అధికారంలో వున్న ప్రభుత్వం మారింది. కేంద్రంలో అధికారం పుచ్చుకున్న సంకీర్ణ ప్రభుత్వంలోని వివిధ పార్టీలవారు మౌలికమైన వాగ్దానాలు చేయలేదు కాని, "దున్నేవానికే భూమి, చేసేవాడికి పని, వందరోజుల పని గ్యారంటీ, పారిశ్రామిక ప్రగతి" అని వాగ్దానాలు చేశారు. ఈ సంవత్సర కాలంలో ఆ వాగ్దానాలేవీ నెరవేరలేదు. ఇప్పుడున్న పాలకులు, గతంలో పాలకుల విధానాలనే అనుసరిస్తున్నారు. 1991లో పాలకులు ఎటువంటి విధానాలు అనుసరించారో గత ఎన్డీఏ పాలకులు కూడా అదే విధానాల్ని అనుసరించారు. ఇప్పుడున్న యుపిఏ పాలకులు అదేబాటలో పయనిస్తున్నారు. 1996లో చంద్రబాబు రాష్ట్రంలో ఏ సంస్కరణల బాటనైతే మొదలుపెట్టాడో, రాజశేఖర్‌రెడ్డి అదేబాటలో నడుస్తున్నాడు. ప్రజావ్యతిరేకత అదే విధంగా ఉంది. కొత్త పరిశ్రమలు లేకపోగా ఉన్న పరిశ్రమలు మూతపడుతున్నాయి. విశాఖపట్నానికి ఓక్స్‌వ్యాగన్ పరిశ్రమ గురించి మాట్లాడుతున్నాడు. దీనికోసం తమ పార్టీ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడుతున్నాయి. ఈ సంవత్సర కాలంలో రైతుల ఆత్మహత్యలు ఎక్కడా ఆగలేదు. లక్షన్నర ఎకరాలు పంచానన్నాడు. కొత్తగా ఏ భూమిలేని రైతుకు, వ్యవసాయ కూలీకి భూమి పంచలేదు. అంతకుముందు సాగుచేసుకుంటున్న వారికే పట్టాలు ఇచ్చారు.

అధికారంలోకి రాకముందు రాజశేఖర్ రెడ్డి, ఎల్‌పిజికి (లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) వ్యతిరేకంగా పెద్ద క్యాంపెయిన్ చేశారు. ఇప్పుడు వాటికి వ్యతిరేకంగా ఏ ఒక్కచర్యా తలపెట్టలేదు. వాటికి అనుగుణమైన పరిపాలన సాగిస్తున్నాడు. అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ అయినా ఈ వ్యవస్థను కాపాడటానికి సామ్రాజ్యవాదానికి దళారీ పాత్రను పోషించడానికి సిద్ధపడాలి.

భారత ప్రజల ఏకైక కర్తవ్యం ప్రజాస్వామిక విప్లవం. అంటే వ్యవసాయ విప్లవం. అంటే దున్నేవానికే భూమి. దీనిపై ఆధారపడే భారతదేశ వ్యవస్థ పరివర్తన ఉన్నది. దీన్ని సాధించకుండా ఏ ప్రజల సమస్యలు పరిష్కారం కావు. ఈ ప్రజాస్వామిక విప్లవం సాధించుకోవడానికి కార్మికులు, కర్షకులు ఏకం కావాలి. తాత్కాలికమైన ఉపశమనం కోసం, పరిష్కారం కోసం పోరాడుతూనే ప్రజాస్వామిక విప్లవం కోసం కలిసికట్టుగా నడవాలి. ఇందుకు మీరు దీర్ఘకాలిక కార్యక్రమం రూపొందించుకుంటూ; రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడే కార్యక్రమాన్ని, ఐక్య ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని నిర్ణయించుకుంటారని; మీ మహాసభ జయప్రదం కావాలని ఆశిస్తున్నాను. •

కామ్రేడ్ సౌరవ్‌యాదవ్

ఛత్తీస్‌ఘడ్, ఆదివాసీ కిసాన్‌నాయకుడు



కామ్రేడ్స్! రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన రైతాంగానికి, గిరిజనులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పెద్దలకు ఛత్తీస్‌ఘడ్

గిరిజన సంఘం తరపున అభినందనలు తెలియ జేస్తున్నాను. నేను చాలా సంక్షిప్తంగా మీ ముందు రెండు విషయాలు చెప్పదలుచు కున్నాను. 1947 తర్వాత ఈ రోజు సామ్రాజ్య వాదులు మన వ్యవసాయానికి సంబంధించిన దాంట్లో, మన వనరులు, నీరు అన్నింటిమీద వాళ్ళు పెత్తనం చేయటంకోసం, దోపిడీ చేయడం కోసం సమాయత్తమౌతున్నారు. ఈరోజు మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఉన్నటువంటి అనేక ప్రాంతాల్లోని భూములు అన్నింటినీ కూడా ఈ సామ్రాజ్యవాదులు ఎక్కడెక్కడి నుండో వచ్చి కబ్జా చేస్తున్నారు. వాళ్ళ మల్టీనేషనల్ కంపెనీలు అన్నీ కూడా వందల వేల ఎకరాల భూములు ఆక్రమి స్తున్నాయి. మన సహజ సంపదలైన గనులు, నీరు మీద వారు ఆధిపత్యాన్ని చలాయించడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక ప్రక్కన రెండెకరాలు, మూడెకరాలు, నాలుగెకరాలు కూడా పంచలేని పాలకులు మరొక ప్రక్కన బహుళజాతి కంపెనీలకు వాళ్ళ ఫ్యాక్టరీలు పెట్టుకోవడానికి కావలసిన వందల, వేల ఎకరాలు ఒకేచోట వాళ్ళకి ఏర్పాటుచేస్తున్న పరిస్థితి వుంది. చాలా సంవత్సరాల నుండి భూమిని నమ్ముకొని, అడవిని నమ్ముకొని బతుకుతున్న గిరిజనుల నుండి భూమిని పాలకులు లాక్కొని, దాన్ని బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేయడానికి సమాయత్తం అవుతున్నారు. ఈ పరిస్థితి ఆంధ్రదేశంలో ఎంతవరకు వుందో నాకు తెలీదు కానీ, మా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో చాలా గ్రామాల్లో, జిల్లాల్లో, చాలాప్రాంతాల్లో ఆదివాసీలు అనుభవిస్తున్న భూములన్నింటిని కూడా ఈ బహుళజాతి సంస్థలు స్వంతం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. వీటికి వ్యతిరేకంగా ప్రతి జిల్లాలోనూ, ప్రతి ప్రాంతంలోనూ ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ రోజు రైతాంగాన్ని వ్యవసాయం చేయాల్సిన అవసరం లేదంటూ, వ్యవసాయం నుండి దూరం చేస్తూ బహుళజాతి సంస్థలకు కట్టబెడుతున్నారు. అదే విధంగా వ్యవసాయ రంగాన్నంతటిని కార్పోరేట్ రంగంలోకి మార్చడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. వాళ్ళు మన దేశంలో ఉన్న గిరిజనుల్ని, అందర్ని పక్కకి నెట్టేసి, ఈ నీటి ద్వారా వ్యవసాయంచేసి, వాళ్ళే బతికేస్తారని చెప్తున్నారు. మరోప్రక్కన కోట్లాది రూపాయల్ని, మన నుండి తరలించుకుపోవటం కోసం వాళ్ళు కుట్రలు పన్నుతున్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థలో భాగంగా విత్తనాలకు సంబంధించిన పేటెంట్ రైట్‌ను చట్టంగా చేశారు. తరతరాలుగా మన ప్రజలకీ, రైతాంగానికి విత్తనాలపై ఉన్న హక్కును కూడా లేకుండా చేయడానికి చట్టం చేశారు. మరొక ప్రక్కన సాగునీరు కోసం, తాగునీరు కోసం ప్రజలు ఆందోళనచేస్తుంటే, ప్రజలు కష్టాలుపడుతుంటే దేశంలో ఉన్న నదుల్ని, నదిలో నీటిని, ఇసుకనీ, అన్నింటినీ బహుళజాతి సంస్థలకి ఒక్కొక్కటి అమ్మివేయటం ప్రారంభించారు. మనం మాత్రం వర్షం మీద ఆధారపడి, వర్షం వస్తేనే వ్యవసాయం చేసు కోవాలి. కానీ బహుళజాతి సంస్థలకు మాత్రం వాళ్ళకి కావలసిన నీటిని భూగర్భజలాల్లోనూ, నదుల్లోనూ, నీరంతటినీ వాళ్ళకి అప్పజేప్పే స్తున్నారు. వారికి అందజేస్తున్నారు. ఈ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని మనం ఇంకా ఉధృతం చేయాల్సిన అవసరం ఉంది. ఆంధ్ర దేశంలోనూ, భారతదేశంలోనూ ఈ రోజు బహుళజాతి సంస్థలు చేస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్మిం చాల్సిన బాధ్యత రైతుకూలీ సంఘం మీద వుందని చెప్తున్నాను. అదేవిధంగా ఈ మహాసభ విజయవంతం కావాలని ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను. •

కామ్రేడ్ సుందరం


తమిళనాడు పీడిత ప్రజాఉద్యమ నాయకులు



రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) మహా సభలకి హాజరైన కామ్రేడ్స్‌కి, మేధావులకి తమిళనాడు రైతాంగ ఉద్యమం తరపున విప్లవాభినందనలు తెలియజేస్తున్నాను. ఆంధ్ర ప్రదేశ్ ఎన్నో వీరోచిత పోరాటాలకి పుట్టిల్లు. తెలంగాణ, శ్రీకాకుళ పోరాటాలు దేశంలోని పీడిత ప్రజలకి ఒక ఉత్తేజాన్ని అందించాయి. మితవాద, అతివాద పెడధోరణులకు ఉద్యమాలు గురైనా ఆ పోరాట స్ఫూర్తి మిగిలి ఉంది. గత ఉద్యమాల చరిత్ర అందించే ఎన్నో విలువైన అనుభవాలను పరిరక్షించుకొంటూ సరైన గుణపాఠాలను అందుకొంటూ, మరింత శక్తివంతమైన రైతాంగ ఉద్యమాలను నిర్మించాల్సి ఉంది. తమిళనాడులో గతంలో ను, నేడు రైతు-కూలీలు అనేక సమస్యలపై పోరాడుతున్నారు. దళితుల ఆత్మగౌరవం కోసం పోరాడుతున్నారు. పోరాడుతున్న ప్రజల మధ్య మరింత సంఘీభావం పెరగాల్సివుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఇప్పుడు జరుగుతున్న రైతాంగ పోరాటాలకి పూర్తిగా మద్దతునిస్తున్నాం. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) మహాసభలు విజయవంతం అవుతాయన్న ప్రగాఢమైన విశ్వాసంతో సెలవు తీసుకుంటున్నాను. •

కామ్రేడ్ శ్రీకాంత్

ఒరిస్సా, చషీమూలియా సంఘం



కామ్రేడ్స్, ఒరిస్సా రాష్ట్రంలో అటవీ ప్రాంతంలోని సహజవనరులన్నింటిని సామ్రాజ్యవాదులు, బహుళజాతి సంస్థలు కొల్లగొట్టుకుపోతున్నారు. గిరిజనులు అడవికి, భూమికి దూరం అవుతున్నారు. గిరిజన భూములన్నీ కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి పోతున్నాయి. గిరిజనులు తమ భూముల్లోనే కూలీలుగా బ్రతకవలసిన పరిస్థితి ఏర్పడు తున్నది. రాయగడ ప్రాంతంలో బాక్సైట్ త్రవ్వకాల వలన మన వాతావరణం కాలుష్యం అవటమే కాకుండా, నీరు అంతా కలుషితమై నీటికోసం గిరిజనులు అలమటించ వలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. వీటికి వ్యతిరేకంగా ఒరిస్సాలోని గిరిజనులు ఆందోళన ప్రారం భించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బహుళజాతి సంస్థలకు వ్యతిరేకంగా; అటవీప్రాంత సహజ వనరుల రక్షణకోసం, భూముల రక్షణకోసం, నీటికోసం మీరు కూడా ఉద్యమం చేపడ తారని; ఒకరికొకరం సంఘీభావంగా ఉద్యమాలు సాగిద్దామని కోరుతూ మహాసభలు విజయవంతం కావాలని కాంక్షిస్తున్నాను. •

కామ్రేడ్ టి.ఎల్. నారాయణ

ఓపిడిఆర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు



అధ్యక్షా, మిత్రులారా! వాకిట్లో ఉల్లిపాయలు, కూరగాయలు, చేపలతో సహా ప్రతిదీ అమ్మేవారు. ఈరోజున డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ వచ్చాయి. చిన్న చిన్న తోపుడుబళ్ళమీద అమ్ముకునే వాళ్ళకి వ్యాపారం లేకుండా పోయిన పరిస్థితి విశాఖపట్నంలో ఉన్నది. అంటే కార్పొరేట్ రంగం అనేది ఉత్పత్తి స్థాయితో పాటు పంపిణీ స్థాయిలో కూడా చొచ్చుకు పోయింది. మామూలు వ్యాపారస్థుల పొట్టలు కొట్టే స్థాయికి కార్పొరేట్ వ్యాపారం పెరిగింది. ఇవన్నీ మన కళ్ళముందు కనిపించేటటువంటి అమెరికా సామ్రాజ్యవాదం యొక్క ప్రత్యక్ష, పరోక్ష దోపిడీ విధానాలు. మన దేశ ప్రభుత్వాలు కూడా వాటిని తప్పకుండా అమలుపరచడానికే సిద్ధపడిన ప్రభుత్వాలు. వీరి దోపిడీ రక్షణ కోసం పోలీసుల్ని, అన్ని రకాలైన వాటిని అండగా వాడుకొని, మననోళ్ళు కొడుతున్నారు. కనుక వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాలి. అలా ఉద్యమించినపుడు అమెరికన్ సామ్రాజ్య వాదుల తరపున మన ప్రభుత్వాలు నిర్బంధాలు ప్రయోగిస్తున్నాయి. అలాంటపుడు అన్ని రంగాల ప్రజలు ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా ఉద్యమించడానికి సమాయత్తం కావాలి. ప్రజలు హక్కుల కోసం పోరాడుతున్నపుడు, ఆ హక్కుల పరిరక్షణ కోసం ఓ.పి.డి.ఆర్ లాంటి సంఘాలు వారి తరపున నిలబడి, ఖచ్చితంగా ఉద్యమానికి చేయూతనిస్తాయి. ప్రజలయొక్క అన్ని హక్కుల్ని కాపాడటానికి ఉద్యమం నిర్వహిస్తాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో కూడా భాగస్వామ్యం అవుతాయి. మన ప్రజల హక్కుల్ని, ప్రపంచంలో ఉన్న పీడిత ప్రజల హక్కుల్ని కాపాడటానికి సిద్ధంగా ఉంటాయని; ముందుకు తీసుకువెళ్తాయని తెలుపుతూ రైతుకూలీ సంఘం యొక్క ఉద్యమాలకు, తమహక్కుల రక్షణ కోసం రైతుకూలీ సంఘాలు సాగిస్తున్న ఉద్యమాలకు ఓపిడిఆర్ అండగా వుంటుందని చెబుతూ సెలవు తీసుకుంటున్నాను. •

కామ్రేడ్ అప్పల్నాయుడు

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జనసాహితి




వేదికపై వున్న పెద్దలకు, రైతుకూలీ మిత్రులకు! నేను కొట్టు దగ్గరకు వెళ్లినపుడు అనకాపల్లి ప్రజలు మాట్లాడుకుంటున్న విషయాలు విన్నాను. "మహాసభలకి కొండల నుంచి, గ్రామాల నుంచి, పట్టణాల నుంచి, లక్షలాదిమంది వచ్చారని; వారు పాడినపాటలు, మాట్లాడిన మాటలు అనకాపల్లితో సహా అనేక ప్రాంతాలలో నీరు లేకపోవడానికి కారణాలు- పంటలు పండకపోవడానికి, పంటలకు ధర లేకపోవడానికి, మనలాంటి పేదోళ్ళ బాధలకి కారణాలు, మనం ఏంచేయాలో కూడా చెబుతు న్నారురా" అని మాట్లాడుకుంటున్నారు. "ఇలా మీటింగుపెట్టి వెళ్లిపోవడమేనా? వీళ్ళు ఎన్నికల్లో నిలబడితే బాగుండునురా" అని ఒకరన్నారు. "వీళ్లు నక్సలైట్లురా! ఎన్నికల్లో నిలబడరు" అని మరొకరు అన్నారు. "వాళ్ళయితేనే ఇంత గట్టిగా మాట్లాడగలర"ని మరొకరు అన్నారు. దీని అర్థం ప్రజలు వారి పక్షాన పోరాడే వారి కోసం చూస్తున్నారు. దేశంలో, రాష్ట్రంలో అనేక సమస్యలున్నాయి. వాటి పరిష్కారాల దగ్గరే వేరువేరు మార్గాలు చెబుతున్నారు. అధికారం పోయిన తర్వాత చంద్రబాబు స్పష్టమైన మార్గాలు చెబుతుంటే, అధికారంలోకి రాక ముందు రాజశేఖర్‌రెడ్డి ఈ విధంగానే చెప్పాడు. ఎవరైతే సమస్త సంపదలు సృష్టిస్తున్నారో వారికి సంపదపై అధికారం లేదు. దోపిడీకి వ్యతిరే కంగా రైతాంగం ఎంత ఉవ్వెత్తున లేస్తే అంత త్వరగా దేశసమస్యలు పరిష్కారమౌతాయి.

మీ రైతాంగ పోరాటాల్ని కథనం చేస్తున్న జనసాహితి, మీ పోరాటాల్ని కథనం చేయటమే అంతిమలక్ష్యంగా భావిస్తూ, మీ పోరాటాలు విజయవంతం కావాలని కాంక్షిస్తూ సెలవు తీసుకుంటున్నాను. •

కామ్రేడ్ విజయానంద్


ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎ.పి.టి.ఎఫ్)



ప్రపంచీకరణ- సరళీకరణ విధానాలు- సామ్రాజ్యవాద దేశాలు పేదవారిని దోపిడీ చేస్తున్నటువంటి అనాగరికమైన దోపిడీ, మన దేశంలోని పరిస్థితుల గురించి ఇంతకు ముందు వక్తలు విపులంగా మాట్లాడారు. ఆరేసి రోడ్లున్న పెద్ద హైవే ఫ్లైఓవర్‌లు, హైటెక్ సిటీలు చూపించి ఇదంతా అభివృద్ధికాదా? అని అడుగుతున్నారు. కాని ఈ అభివృద్ధి ఎవరి కోసం జరిగింది? సంపన్న వర్గాలు, బహుళ జాతి కంపెనీల రవాణా కోసం జరిగింది. ఇది పేదవాళ్ళ అభివృద్ధి, దేశాభివృద్ధి కాదు, కాంగ్రెస్-తెలుగుదేశం ప్రభుత్వాల పాలనలో రైతుల పరిస్థితి దుర్భరంగా తయారయింది. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రైతుకూలీ ఉద్యమాలకు ఎప్పుడూ కూడా బాసటగా ఉంటుందని, ప్రజాతంత్ర ఉద్యమాలతో మమేకమై ఉంటామని, ఈ మహాసభలు జయప్రదం కావాలని ఆశిస్తున్నాను. •

కామ్రేడ్ ఆడారి అప్పారావు

నవకార్మిక శక్తి, ఎడిటర్



మహాసభలకి హాజరైన రైతుకూలీ, గిరిజన సోదరీసోదరులకు, పెద్దలకి ఉద్యమాభి వందనములు తెలుపుతున్నాను.

ఈనాడు ఉత్తరాంధ్ర రహదారి పొడవునా పారిశ్రామిక అభివృద్ధి పేరుతో విషాన్ని, కాలుష్యాన్ని వెదజల్లే మందుల పరిశ్రమలు వచ్చి, పనిచేసే కార్మికులను చుట్టుపక్కల

రైతులను నాశనం చేస్తున్నాయి. రైతాంగ ఉద్యమాల ఫలితంగా ఏర్పడిన సహకార చక్కెర కర్మాగారాలు మూసివేయబడి కారుచౌకగా అమ్మివేస్తున్నారు. జూట్ పరిశ్రమ సంక్షోభంలో ఉంది. ఈ విధంగా రైతాంగం, కార్మికవర్గం సమైక్యంగా పనులకోసం, పంటలకి రేట్లకోసం, కాలుష్యం లేని వాతావరణం కోసం పోరాడాల్సిన పరిస్థితిలో సమైక్య ఆందోళనల అవసరాన్ని గుర్తుచేస్తూ ముగిస్తున్నాను. •

కామ్రేడ్ వెలగా వీరభద్రరావు

విశాఖ జిల్లా దేవాదాయ ధర్మాదాయ కౌలుదార్ల సంఘం

ఎర్రజెండా పార్టీలన్నీ ఐక్య ఉద్యమాలు సాగించాలని, వామపక్ష పార్టీలన్నీ ఐక్యం కావాలని కాంక్షిస్తున్నాను. రైతాంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలు నిర్మించాలని కోరుతున్నాను.

మహాసభలకు విచ్చేసిన ప్రతినిధులకు అధ్యక్ష- కార్యదర్శులైన ఝాన్సీగారికి, కోటయ్య గారికి మీ సంఘనాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలియజేస్తున్నాను. •

కామ్రేడ్ శ్రీదేవి, రాష్ట్ర కన్వీనర్


స్త్రీవిముక్తి సంఘటన



రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభలకు విప్లవాభినందనలు. రాష్ట్రవ్యాపితంగా, దేశ వ్యాపితంగా పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ప్రజల జీవితాలు నానాటికీ సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ఈ సంక్షోభం ఫలితంగా రైతులు తమ శరీరభాగాల్ని అమ్ముకొంటూ అప్పులు తీర్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పటికీ అప్పులు తీరక ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి మన కళ్ళముందు కన్పిస్తోంది. రైతుల ఆత్మహత్యల వలన కుటుంబభారం స్త్రీలమీద పడుతుంది. వ్యవసాయకూలీలు, పేదరైతులు పనులు లేక పొట్టచేతబట్టుకొని వలసలు పోతున్నారు. స్త్రీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. స్త్రీలకు ఎటువంటి భద్రత లేదు. వారిపై అణచివేత, వేధింపులు, అత్యాచారాలు పెరుగు తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక వాగ్దానాలు చేసింది. వాటిల్లో మద్యరహిత సమాజలక్ష్యంగా చెప్పుకొని, కోట్లాది రూపాయల ఆదాయం మద్యం ద్వారా పొందాలని చూడడం సిగ్గుచేటు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని, ఈ మహాసభలో రైతాంగ పోరాట కార్యక్రమాన్ని తీసుకొంటారని ఆశిస్తున్నాను. •

కామ్రేడ్ శ్రీహరి

ప్రధాన కార్యదర్శి, నవయువసమాఖ్య



అధ్యక్షా! వేదిక మీద పెద్దలారా! మేము మహాసభల ప్రచారానికి వచ్చినపుడు అనకాపల్లిలో రైతుకూలీ సభలు ఎందుకు పెడుతున్నారని చాలామంది అడిగారు. అనకాపల్లి సామ్రాజ్య వాదులకు కేంద్రంగా మారబోతుందని మేము వివరించాము. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయటం ఈ మహాసభల లక్ష్యం అని చెప్పాము. దేశంలో, రాష్ట్రంలో దోపిడీ వర్గాలు, దోపిడీకి గురౌతున్న వర్గాలు స్పష్టంగా నేడు విభజించబడివున్నాయి. ఈ రెండు వర్గాల మధ్య పోరాటం తీవ్రమౌతున్నది. ప్రజా పోరాటాలను ప్రక్కదారి పట్టించడానికి పాలక వర్గాలు కుట్రపన్నుతున్నాయి. గ్రామాలు-పట్టణాల మధ్య, తెలంగాణా-కోస్తా ప్రాంతాల మధ్య, వివిధ మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. పనులు లేక ఉపాధి కరువై పట్టణాలకు వచ్చిన గ్రామీణ పేదలు అతి నికృష్టమైన జీవితాలు గడుపుతున్నారు. పరిశ్రమల్లో పనిచేస్తూ కాంట్రాక్టు కార్మికులుగా అనేక ప్రమాదాలకులోనౌతున్నారు. నిత్యం చావులు, ప్రమాదాల మధ్య వాళ్ళ జీవితం గడుస్తున్నది.

టి.వి.లు, సినిమాలు అన్ని వర్గాల ప్రజలపైన కుళ్ళు సంస్కృతిని రుద్ది వారి మనస్సును ప్రక్కదారి పట్టిస్తున్నాయి. ఈ కుళ్ళు సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడి బయట పడాలి. మీ పిల్లలను సరిఅయిన మార్గంలో పెట్టాలి. ఇక్కడ సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన బాలకళాకారులులాగా తయారుచేయాలి. ప్రజా సంస్కృతిని నేర్పాలి. దేశవనరులను కొల్లగొట్టు కుపోయే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి. ఆ దిశలో ఈ మహాసభలు విజయవంతం కావాలని కాంక్షిస్తున్నాను. •

కామ్రేడ్ బాషా

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పి.డి.యస్.ఓ.



వ్యవసాయరంగం ఏ విధంగా సంక్షోభం లో చిక్కుకుందో, విద్యార్థిరంగం కూడా సంక్షోభం లో కూరుకుపోతున్నది. మాటల్లో చెప్పుకునే దానికన్నా విద్యార్థుల దగ్గరకు వెళ్తే ఈ పరిస్థితి యొక్క తీవ్రత అర్థమౌతుంది. అనేక కష్టాలుపడి చదివిస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలు సుఖంగా బ్రతకాలని కోరుకుంటూంటే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అప్పుల ఊబిలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే; చదువుకొనటానికి డబ్బులేక, చదువుకున్నా ఉపాధిలేక విద్యార్థులు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. విద్యార్థి రంగాన్ని శాసిస్తున్న సామ్రాజ్యవాదుల, ప్రపంచ బ్యాంక్, ప్రపంచవాణిజ్య సంస్థల ఆంక్షల మూలంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు హాస్టల్ వసతికి దూరమౌతూ, వారికి చదవటమే సమస్యగా మారుతున్నది. ప్రజలకు ఉపయోగపడే విద్య కాకుండా బహుళజాతి కంపెనీలకు కావాల్సిన గుమాస్తాలను తయారుచేసేందుకు విద్యాబోధన జరుగుతున్నది. డబ్బులున్నవాడికే విద్య అన్న విధంగా మారింది. రైతుకూలీలు-విద్యార్థులు సామ్రాజ్యవాద-బహుళజాతి కంపెనీలకు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా చేయికలిపి పోరాడుదాం. •

కామ్రేడ్ టి. శ్రీరామమూర్తి,

ఎపిసిఎల్‌సి

కొన్ని అనివార్యకారణాల వలన నేను రైతుకూలీ సంఘం మహాసభలకు హాజరు కాలేకపోతున్నారు. మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. •

ప్రతినిధుల సభ

మహాసభ 3వ రోజు అనగా 8వ తేదీన ప్రతినిధుల సభ 'కా॥అంగడి చెన్నయ్య' హాలులో రాష్ట్రం నలుమూలల నుండి వివిధ జిల్లా మహాసభలలో ఎంపిక అయిన ప్రతినిధులతో జరిగింది. రాష్ట్రవ్యాపితంగా వివిధ ప్రాంతాలలో వివిధ రూపాలలో సాగుతున్న రైతుకూలీ ఉద్యమం ఎదుర్కొంటున్న అనేక సమస్యల మధ్య మరింత దృఢమైన నిర్మాణ కృషి కోసం, మరింత శక్తివంత మైన ఉద్యమ కార్యాచరణ కోసం ప్రతినిధుల సభ దృష్టి సారించింది. కామ్రేడ్స్ లలిత, సి.నాగరాజు, శీలం స్వామి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.కామ్రేడ్స్ ఝాన్సీ, కోటయ్య, కిశోర్, ప్రకాష్, సోని, వర్మ, కుంజం రామారావు, రఘు, నర్సయ్యలు స్టీరింగ్ కమిటీగా వ్యవహరించారు.



ప్రతినిధుల సభకి అధ్యక్షవర్గంగా వ్యవహరించిన కామ్రేడ్స్ సి.నాగరాజు, లలిత, స్వామి, మరియు స్టీరింగ్ కమిటీ సభ్యులు

సంఘ ఆశయాలు, లక్ష్య ప్రకటనలకు కా॥ కిషోర్ మరింత మెరుగుదల కోసం కొన్ని సవరణలు ప్రతిపాదించి వివరించారు. చర్చ అనంతరం సంఘ ఆశయాలు, లక్ష్య ప్రకటనను, నిబంధనావళిని సభ ఆమోదించింది.

అనంతరం గత మహాసభల నుంచి నేటివరకూ అనేక ఆటుపోట్ల మధ్య సాగిన ఉద్యమ, నిర్మాణ కృషిని కార్యకలాపాల నివేదికలో కా॥ఝాన్సీ వివరించారు. నిర్భంధం-సవాళ్ళ మధ్య పురోగమిస్తున్న, నిలకడతనాన్ని సంతరించుకుంటున్న కృషిని, ఎదురౌతున్న సరికొత్త సమస్యలను నివేదిక గుర్తించింది. మరింత లోతైన దృక్పథం, ఆచరణలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని ఆ నివేదిక వివరించింది. చర్చ తరువాత కార్యకలాపాల నివేదికను మహాసభ ఆమోదించింది.

నూతన కార్యవర్గం : గత మహాసభల నుంచి వివిధ ప్రాంతాలలో సాగుతున్న ఉద్యమ కృషిని సంఘటితపరచి పునాదిస్థాయిలో సంఘ నిర్మాణాన్ని పటిష్టపరచి, రాష్ట్రస్థాయిలో నాయకత్వాన్ని శక్తివంతం చేయడం అన్న దిశానిర్దేశాన్ని మహాసభ అందించింది. దీన్ని ముందుకు కొనిపోవడానికి తగిన సామర్థ్యం గల నాయకత్వ పటిమను అభివృద్ధి చేసుకునే క్రమంలో నూతన కార్యవర్గంను సీనియర్ నాయకులు కా॥ముత్తిరెడ్డి శ్రీరాములు గారు ప్రతిపాదించారు.

22మందితో కూడిన నూతన కార్య వర్గాన్ని మహాసభ ఎన్నుకొంది. వివిధ వర్గ ప్రజాఉద్యమాల నిర్మాణక్రమంలో 10-15 సం॥ల కనీస అనుభవంతో మొదలై 50 సంవత్సరాల రాజకీయ అనుభవం గల కామ్రేడ్స్‌తో కూడిన నూతన కార్యవర్గం మహాసభలో ఎన్నికైంది. కార్యవర్గ సభ్యులంతా మరలా నూతన కార్యదర్శివర్గాన్ని ఎన్ను కొన్నారు. కార్యవర్గ సభ్యులందరి చేత సీనియర్ నాయకులు కా॥ముత్తిరెడ్డి శ్రీరాములు గారు ప్రమాణం చేయించారు.

అనంతరం వివిధ ఉద్యమ, రాజకీయ ప్రాధాన్యతా అంశాలను తీర్మానాలుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతిపాదించారు. మహాసభ వీటన్నింటిని ఆమోదించింది.

చివరగా రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఝాన్సీ మాట్లాడుతూ రైతుకూలీ సంఘం సాగించిన కృషిని, ప్రాధాన్యత అంశాలను గుర్తు చేస్తూ మరింత నిబద్ధత, నిమగ్నతలతో ముందుకు సాగాలని; రైతుకూలీ, గిరిజన, విస్తృత గ్రామీణ ప్రజానీకపు ఆకాంక్షలకి అనుగుణ్యమైన పోరాట క్రమాన్ని కొన సాగించాలని; భూముల పంపిణీ కొరకు వ్యవసాయక విప్లవాన్ని ముందుకు తీసుకొనిపోవడం; సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో తలెత్తుతున్న వ్యవసాయ సంక్షోభంపై స్వతంత్ర, ఐక్య కార్యాచరణ రంగాలలో కృషి సాగించటం; జయతీఘోష్ కమీషన్ ముఖ్య సిఫార్సుల అమలుకై ఆందోళన; పునాది స్థాయి సంఘ నిర్మాణాన్ని పటిష్ట పరుస్తూనే శక్తివంతమైన నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకోవడం అన్న కర్తవ్యాలను సాధించడమన్న మహాసభ నిర్దేశాన్ని ముందుకు కొనిపోవాలని పిలుపు నిస్తూ; అమరులను స్మరిస్తూ ముగించారు. పట్టణ ప్రజలకు, వలంటీర్లకు, కళా బృందాలకు, కళాకారులకు, పత్రికావిలేకర్లకు ధన్యవాదాలు, ఉద్యమాభివందనలు తెలిపారు.

బరువైన ఆలోచనలతో మహాసభల ఉత్తేజాన్ని జత చేర్చుకొని ప్రతినిధులు తరలివెళ్లారు. ☆

ఇక్కడిప్పుడు చావంటే బతకడానికి తెగించడమే!
శాసనాల ఉక్కు పాదాల కింద శ్వాసించడమంటే
సంఘటిత పోరాటమే! **- పి.ఎస్.నాగరాజు**

కార్యకలాపాల నివేదిక

2001 ఏప్రిల్ నుంచి 2005 జూన్ వరకు

(2005 జూన్ 6,7,8 తేదీలలో అనకాపల్లిలో జరిగిన రైతుకూలీ సంఘం (ఆంధ్ర ప్రదేశ్) రాష్ట్ర మహాసభల సందర్భంగా 8-6-2005న ప్రతినిధుల సభ (కా॥ అంగడి చెన్నయ్య ప్రాంగణంలో) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఝాన్సీ ప్రవేశపెట్టిన కార్యకలాపాల నివేదిక సంక్షిప్తపాఠం)

కా॥ ఝాన్సీ, అధ్యక్షులు
రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.)



కామ్రేడ్స్,

తీవ్రమమవుతున్న వ్యవసాయ సంక్షోభం మధ్య మనం మన రాష్ట్ర మహాసభలు జరుపుకుంటున్నాం. ఈ వ్యవసాయక సంక్షోభం మొత్తం భారత ఆర్థిక రాజకీయ సంక్షోభంలో భాగమే. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే సామ్రాజ్యవాదులు ప్రపంచంపై రుద్దిన సంక్షోభమే ఇది. ఈ సంక్షోభం ఫలితంగా రైతుల, రైతుకూలీల, ఆదివాసీల జీవితాలు కల్లోలభరితం అవుతున్నాయి. కరువు, వలసలు, రుణబాధల వేదనలు, ఆవేదనలతో పీడిత ప్రజల జీవితాలు అట్టుడికిపోతున్నాయి.

సోషలిజం అంతరించిందని, శ్రమ జీవులకిస్తున్న సాంఘిక రక్షణలన్నీ వృధాఅని; రైతులకి సబ్సిడీలు, పేదలకి బియ్యం, కార్మికులకి ప్రావిడెంట్ ఫండ్,రిటైరైన ఉద్యోగులకు పింఛన్లు వంటివన్నీ దండగ అని; సామ్రాజ్యవాదులు, వారి తొత్తులైన పాలకులు చెప్తున్నారు. పెట్టుబడి అన్నది లాభాలు సంపాదించడానికేనని, మార్కెట్ శక్తుల లాభాలపై ఆటంకాలేవీ వుండరాదని; వీటికి అడ్డంగా వున్న 1/70 చట్టం, భూ సంస్కరణల చట్టం వంటి చట్టాలను రద్దు చేయాలని దోపిడీదారులు ప్రచారం చేస్తున్నారు. దీనినే సరళీకరణ అని, ప్రైవేటీకరణ అని, ప్రపంచీకరణ అని చెబుతున్నారు. వీరి విధానాల అమలు ఫలితంగా వేలాదిమంది కార్మికులు పనులు కోల్పోతున్నారు. వందలాది చిన్న పరిశ్రమలు మూతపడుతున్నాయి. వేలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. దేశవ్యాపితంగా, ప్రపంచ వ్యాపితంగా శ్రమజీవుల బ్రతుకులు భారంగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితి నుండి పీడిత ప్రజలు, దేశాలు,జాతులు క్రమంగా సంఘటిత పడుతున్నాయి. అమెరికా సామ్రాజ్య వాద దోపిడీ, దురాక్రమణలకు వ్యతిరేకంగా ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, లాటిన్, అమెరికా దేశాలలో ప్రజలు పోరాటాలతో ముందుకు వస్తున్నారు. మన దేశంలో కూడా ప్రపంచీకరణ విధానాలను అమలుపరుస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, పేద, మధ్య తరగతి రైతాంగం, గిరిజనులు, దళితులు, మేధావులు సంఘటిత పడుతున్నారు.

మన రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంకు ప్రయోగ శాలగా మార్చి, కార్మికుల తీసివేతలకు, ఫ్యాక్టరీల మూసివేతలకు, రైతుల-చేతివృత్తుల వారి ఆత్మహత్యలకు, రైతుకూలీల వలసలకు కారణమైన పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు నిరసనలు తెలియజేస్తూ ఆందోళనలకు దిగుతున్నారు. ఏజెన్సీ వనరుల రక్షణకై, జీవించే హక్కుకై ఆదివాసులు; ఆర్టీసి, సింగరేణి పరిరక్షణకై కార్మికులు; ఉద్యోగ భద్రతకై ఉద్యోగులు కదులుతున్నారు. ఒకరికొకరు సంఘీభావాన్ని అందించుకొంటున్నారు. ఈ సంఘీభావాన్ని, పోరాటశీలతను వమ్ముచేసి, తమ దోపిడీ విధానాలను కొనసాగించి తీరాలని పాలకులు ఒకవైపు; జీవించే హక్కు కోసం, జీవన భద్రత కోసం, లౌకిక ప్రజాస్వామిక విలువకోసం పోరాడుతున్న కష్టజీవులు, మేధావులు మరొక వైపు వున్న స్థితిలో మనం వున్నాం.

ప్రజల కదలిక కొనసాగుతున్న స్థితిలో గత రాష్ట్ర మహాసభల తర్వాత ఈ 4సం॥రాలు గా ఎన్నో ఉద్యమాలలో, పోరాటాలలోమన కామ్రేడ్స్ నిమగ్నమై వున్నారు. మన సంస్థకు గుర్తింపు, గౌరవం, సమస్యలపట్ల మన నిబద్ధత ఇనుమడించేలా జిల్లా, ప్రాంతీయ కమిటీలు, కార్యకర్తలు కృషి సాగిస్తున్నారు. వివిధ జిల్లాలలో ఎక్కడికక్కడే మహాసభలు జరుపుకుని, తమ తమ ప్రాంతాల కృషిని మదింపు చేసుకొని నివేదికలు రూపొందించుకుని ఇప్పుడు ఈ మహాసభకు హాజరైన కామ్రేడ్స్ అందరికీ రాష్ట్ర కార్యవర్గం తరపున విప్లవాభివందనలు తెలియజేస్తున్నాను.

మన కార్యకలాపాలు జరిగిన తీరును, ముఖ్యమైన, ప్రాధాన్యతగల కార్యక్రమాలను; మనం ఏర్పరుచుకొన్న రాజకీయ విధానానికి అనుగుణంగా మన ప్రయాణం ఎలా సాగుతున్నదో స్థూలంగా పరిశీలించుకొందాం. రోజు రోజుకూ తీవ్రమవుతున్న సంక్షోభంలోమన గమ్యం - గమనాలను నిర్దేశించుకోవడానికి, మనల్ని మనం సంఘటిత పర్చుకొనేందుకు మనకార్యకలాపాలు అందిస్తున్న అనుభవాలను విశ్లేషించుకోవడమే ఈ నివేదిక ఉద్దేశ్యం.

2001 ఏప్రియల్ 7,8,9 తేదీలలో గుంటూరులో మన రాష్ట్ర మహాసభల్ని విజయ వంతంగా జరుపుకున్నాం. రైతుకూలీ ఉద్యమా లకు, నిర్మాణాలకు చెందిన అన్ని శక్తులను ప్రారంభసభలో వారి అభిప్రాయాలను తెలియ పర్చాలని, వారి వారి సందేశలను కోరుతూ ఆహ్వానించటం మన మహాసభ ప్రత్యేకత. ముంచుకొస్తున్న వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు నిజమైన విప్లవ ప్రజాతంత్ర శక్తులు దగ్గర కావాలన్న సందేశాన్ని కా॥కాను సన్యాల్ ప్రారంభోపన్యాసకులుగా ఇచ్చారు. ఆనాడు తెలంగాణా పోరాటంలోనూ, ఇతర ఉద్యమాలలోనూ అనుభవజ్ఞులైన సీనియర్ కామ్రేడ్స్ ఓంకారుగారు, బి.ఎన్. గారు, కొల్లి నాగేశ్వరరావు గారు, కొల్లిపర వెంకటేశ్వరరావు గారు, ప్రజాతంత్ర వాదులైన బి.డి.శర్మ, కె.ఆర్.చౌదరి, అబ్దుల్ నూర్‌భాషా గారలు కూడా వచ్చి తమ అమూల్యమైన సందేశాల నిచ్చారు. ప్రముఖులు కా॥కానూసన్యాల్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ మహాసభ దేశవ్యాపిత రైతాంగ ఉద్యమాల ఐక్యత యొక్క ప్రాధాన్యతను ముందుకు తెచ్చింది.

మహాసభల అనంతరం కా॥ అంగడి చెన్నయ్య నాయకత్వాన గల ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సమాఖ్య, మనం ఒకే నిర్మాణంగా

ఐక్యం అయ్యాం. అనేక ఇతర నిర్మాణాలతో మరింత చేరువ కాగలిగాం.

కామ్రేడ్ ఎం.ఎస్. అమరత్వం

ఈ ఉత్సాహంతో గ్రామాలకు తిరిగి వెళ్ళిన కార్యకర్తలకు వెనువెంటనే కా॥ఎమ్మెస్‌కు గుండెపోటు వచ్చిందన్న పిడుగులాంటి వార్త మనసులను కలచి వేసింది. మహాసభల్లో కార్య కలాపాల నివేదికను ప్రవేశపెడుతూ రేపు రాత్రి శ్రీకాకుళం కేసుపై వెళ్ళవలసి వుంటుందని చెప్పిన విధంగానే ఆయనపై పోలీసులు పెట్టిన అన్యాయపు కేసు మీద శ్రీకాకుళం వెళ్తూ గుండెపోటుకు గురైనారు. ఆయన్ను కాపాడుకు నేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమై కా॥ఎమ్మెస్ అమరులయ్యారు. కా॥ఎమ్మెస్ అంతిమయాత్రకి రాష్ట్రవ్యాపితంగా మన కార్యకర్తలు, ప్రజలు, విప్లవాభిమానులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు హాజరైనారు. రైతుకూలీ, గిరిజనోద్యమంతో ఆయనకు గల అనుబంధంతో వందలాది మంది గిరిజనులు, రైతు, కూలీ, కార్మిక, మేధావులు ఆయన మరణవార్త వినగానే తరలివచ్చి కామ్రేడ్ ఎం.ఎస్ కు ఘనంగా నివాళులర్పించారు. విశాఖ నుంచి కర్నూలు జిల్లా వెలుగోడు వరకు ఆయన అంతిమయాత్ర ప్రతి ముఖ్యమైన కేంద్రాలలో మన సంస్థ కార్యకర్తలు, ప్రజలు, ఇతర నాయకులు, ప్రజాతంత్రవాదుల నివాళుల మధ్య సాగింది.

రాష్ట్ర జనరల్ కౌన్సిల్

2001 జులై 18న రాష్ట్ర జనరల్ కౌన్సిల్ హైదరాబాదులో జరిగింది. కా॥ ఎం.ఎస్. మరణంతో తీవ్రమైన లోటును ఎదుర్కొంటున్న సమయంలో వివిధ ప్రాంతాల్లోని మన ఉద్యమాలు తీవ్ర నిర్భంధాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. ముఖ్యంగా పశ్చిమగోదావరి గిరిజన ఉద్యమం తీవ్ర నిర్భంధాన్ని ఎదుర్కొంది. కార్యకర్తల చిత్రహింసలు, సాధారణ ప్రజల అరెస్టువంటి చర్యలతో భయోత్పాతం సృష్టించేందుకు పోలీస్ యంత్రాంగం ప్రయత్నించింది. ఇలాంటి స్థితిలో జనరల్ కౌన్సిల్ నిర్భంధాన్ని ఖండిస్తూ, ఆదివాసీ భూపోరాటాలను ముందుకు తీసుకొని పోవాలని పిలుపునిచ్చింది. అప్పటికి రాష్ట్ర వ్యాపితంగా నెలకొని వున్న కరువు సమస్యలపై, పెండింగ్ ప్రాజెక్టులపై, వలసలు, కూలీరేట్ల సమస్యపై ఆందోళన కార్యక్రమాలకి పిలుపునిచ్చింది. కామ్రేడ్ ఎమ్మెస్ స్థానంలో నూతన అధ్యక్షులుగా కామ్రేడ్ ఝాన్సీ ఎన్నికైనారు. మహాసభలు ఇచ్చిన కర్తవ్యాల అమలులో భాగస్వాములు కమ్మని జనరల్ కౌన్సిల్ పిలుపునిచ్చింది.

ఆ వెంటనే 15 రోజుల లోపే రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కి అధ్యక్షత వహించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ కనమతరెడ్డి అంజిరెడ్డి గారిని ఆగస్టు 1న కోల్పోయాం. కా॥అంజిరెడ్డి గారు ఆరు దశాబ్దాల సుదీర్ఘ ప్రజాజీవితం, పీడిత ప్రజల విముక్తి కోసం నిరంతరం తపించి నిరాడంబరంగా జీవించి, శ్రమించి, బాధ్యతా యుతమైన పాత్ర నిర్వహించిన కామ్రేడ్. ఆయన అంతిమ యాత్ర పశ్చిమ గోదావరి జిల్లా ప్రగడవరంలో జరిగినపుడు ప్రతి దళిత, శ్రమజీవుల కుటుంబం, తమ కుటుంబ సభ్యుల తో ఆయనకు అంతిమ వీడ్కోలు పలికారు. 2001 సెప్టెంబర్ 2న కామ్రేడ్ అంజిరెడ్డి గారి సంస్మరణ సభను ప్రగడవరంలో వందలాది మంది ప్రజలమధ్య నిర్వహించాం.

కామ్రేడ్ అంగడి చెన్నయ్య అమరత్వం

కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి, అంజిరెడ్డి గార్లను కోల్పోయిన కొద్దికాలంలోనే మనం కామ్రేడ్ అంగడి చెన్నయ్యను కోల్పోయాం. శ్రమనుంచి, అట్టడుగు జనం నుంచి ఎదుగుతూ పీడిత ప్రజల అభిమాన పాత్రుడైన నాయకుడిగా ఆయన మరింత నిర్మాణాత్మకంగా ముందుకు వస్తున్న క్రమంలో సోదర విప్లవ సంస్థల హత్యారాజకీయాలకు బలి అయినారు. కామ్రేడ్ అంగడి చెన్నయ్యగారి అంతిమయాత్ర పోలీసు నిర్భంధం మధ్య సాగింది. దళిత, పీడిత విప్లవాభిమానులైన ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఆయన్ను అక్కున చేర్చుకుంటే; పాలక, సంపన్నులు, అగ్రకుల దురహంకారులు ఆయన మరణానికి, ఆయన విప్లవకర జీవితానికి మచ్చ తేవాలని దుష్ప్రచారం చేశారు. కామ్రేడ్ చెన్నయ్యగారి నెత్తుటితడి ఆరకముందే అదే హత్యారాజకీయ విధానం గుంటూరు జిల్లా నాయకులు కామ్రేడ్ దూపాటి అప్పారావును కూడా బలిగొంది. ఆ ప్రాంతంలో అగ్రకుల పెత్తందార్లను సవాలు చేసిన నాయకుడాయన. కామ్రేడ్ అప్పారావు అంతిమయాత్ర ఆయన స్వగ్రామంలో జరిగింది. 2002 మార్చి 19న పొత్తూరులో సంస్మరణ సభ జరిగింది.

ఉద్యమాలపై నిర్భంధం

తూర్పు, పశ్చిమ గోదావరి, విజయ నగరం జిల్లాల్లో భూమి సమస్య గిరిజనుల సమస్య అత్యంత తీవ్ర సమస్యగా ముందు కొచ్చింది. ఈరోజు పోలీసులు వందలాది మంది గిరిజనులపై కేసులు పెట్టి సంతలకు కూడా వెళ్ళనీయండా అడ్డుకోవడం, కార్యకర్త లను అరెస్టుచేసి చిత్రహింసలు కరెంటుషాకులకి గురిచేయడం వంటి నిర్భంధ పరిస్థితి ఎదురైంది. మనం ఈ నిర్భంధానికి వ్యతిరేకంగా ప్రజాతంత్రవాదులను, మేధావులను సమీకరించాం. అదే విధంగా ఈ వాస్తవాలను బయట ప్రంచానికి వెల్లడిచేయడం కోసం, ప్రజాతంత్ర నాయకుల, మేధావుల సహకారం తో వాస్తవ సేకరణ కమిటీలు వేసి, భూమి కోసం నిలబడుతూ, తమ భూమి ఏమైందని ప్రశ్నిస్తూ పోరాడుతున్న గిరిజనులకు మేధావులు, ప్రజాతంత్రవాదులు సహాయ సహకారాలను అందించాల్సిన బాధ్యత ఉందని వారి దృష్టికి తెచ్చి సమీకరించాం. ఆ విధంగా పాలకవర్గాలు ప్రజలపై పెడుతున్న ఒత్తిడిని, నిర్భంధాన్ని ఎదుర్కోగలిగాం. అధికారుల దృష్టిని ఈ సమస్యల వైపు మరల్చ గలిగాం. గుంటూరు జిల్లాలో పిడుగురాళ్ళ ఏరియాలో పోలీసు అధికారుల, పెత్తందారీ వర్గాల నిత్య నిర్భంధాన్ని ఎదుర్కొంటూనే మన కామ్రేడ్స్ మన కార్యక్రమాలను సాగించారు. నెల్లూరు, ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో కూడా భూమి కోసం పోరాడుతున్న ప్రజలు వత్తిళ్ళను ఎదుర్కొంటూ తమ పోరాటాలు సాగించాల్సి వచ్చింది.

పశ్చిమగోదావరి జిల్లాలో గిరిజన ఉద్యమం భూమికోసం, భుక్తికోసం 1990 నుండి సాగుతున్నది. ఈ ఉద్యమం 1969లో ప్రారంభమై కొనసాగుతున్న కొండమొదలు ఉద్యమ ప్రేరణతో సాగుతున్నది. పోలీసులు గిరిజన ఉద్యమాలపై దాడికి పథకాలు వేశారు. గుంటూరు సభల నుండి కార్యకర్తలు గ్రామాల కు వెళ్ళిన వెంటనే, నాయకుల అరెస్టులు

ప్రారంభమైనాయి. కార్యకర్తలను కొట్టడం, కరెంటుషాకులివ్వడం, చిత్రహింసలు పెట్టడం, మరోవైపు ఆదివాసుల స్వాధీనంలోని మామిడి తోటలపై ఒకే రోజు 3,4 గ్రామాలపై దాడులు చేయడం సాగించారు. నాయకుల అరెస్టుతో గ్రామాలపై అన్ని వైపుల దాడులతో ప్రజలను భయభ్రాంతులను చేయ ప్రయత్నించారు.

1/70 చట్టాన్ని పక్కకు పెట్టి గిరిజనుల మౌలిక హక్కైన భూమిని లాక్కోవడం, అమాయకులైన గిరిజనులని "ఈ భూమి మీదేనని మీరే నిరూపించుకోవాలని, మీరే పట్టా తీసుకురావాలని" ఎం.ఆర్.ఓ., డి.ఎస్.పి. అందరూ కూడా ఒక కుట్రపన్నారు. "1700 ఎకరాల భూములకి మీరు పట్టాలు తీసుకువచ్చి నిరూపించుకొంటేనే మీకు భూములు ఇస్తాం. ఇందులో ఎవరు పట్టా తీసుకువస్తే వారికి అంటే అవతలి పార్టీలోని భూస్వామి పట్టా తీసుకువచ్చి చూపించినా, వాళ్ళకే ఈ భూమి ఇస్తామని" చెప్పి బహిరంగంగా ఒక ప్రకటన చేసి, పెద్ద ఎత్తున దాడి చేయడానికి పూనుకున్నారు. మొత్తం మూడుసార్లు వాళ్ళు పంచాయితీ జరిపారు. రైతుకూలీ సంఘంగా మనం దాన్ని వ్యతిరేకించాము. పొడుగొట్టి మోడు తీసిన గిరిజనులకు లేని పట్టాలు భూస్వాములకెక్కడివని గిరిజనులు ప్రశ్నించారు.

ఈ పంచాయితీలో అధికారుల, ప్రజాతంత్రవాదుల సమక్షంలో గిరిజనపెద్దలు, మహిళలు హుకుంవేట మాజీ జమీందారు కుటుంబాన్ని నిలదీసారు. వారు భూములు లాకున్న తీరును బట్టబయలుచేస్తూ నిజమా? కాదా? చెప్పమని సవాలు చేసారు. మార్చి30, 2002 న జరిగిన ఈ బహిరంగచర్చలో మాజీ జమీందారుల వందల ఎకరాల భూమి హక్కులను పరిశీలించేందుకు పి.ఓ. కన్వీనర్‌గా గిరిజనుల తరుపున కొందరు ప్రజాతంత్ర వాదులైన న్యాయవాదులు, గిరిజనులు; భూస్వాముల నుంచి కొందరితో, ఒక కమిటీ ఏర్పరచాలని ప్రతిపాదించాము. తప్పనిసరై దీన్ని అంగీకరించిన భూస్వాములు సమావేశం కాగానే ఆ కమిటీని కలెక్టరు గుర్తించకుండా అడ్డుపడ్డారు. పి.ఓ.ను బదిలీ చేయించారు. తర్వాత కలెక్టరును బదిలీచేసారు. ఈనాటికీ వారి 'భూమి హక్కు'లను నిరూపించేందుకు ఏ ప్రయత్నం చేయకుండా పోయారు. గిరిజనులు తమ స్వాధీనంలోని భూములను నిలుపుకొన్నారు. సంఘర్షణ పడుతున్నారు. మార్చి 30 సమావేశంలోనే గిరిజనేతర పేదలను రెచ్చగొట్టాలని భూస్వాములు చేసిన ప్రయత్నాలని మన వైఖరిని వివరించడం ద్వారా తిప్పికొట్టాం. ఈ సంఘటనల క్రమం పోరాడుతున్న ఆదివాసుల ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింప చేసింది. ప్రజాతంత్రవాదులకి ప్రభుత్వ భూస్వామ్య పక్షపాతంను ఎత్తి చూపింది. భూములు నిలుపుకోవాలంటే మరింత సంఘటితపడాలని తేటతెల్లం చేసింది.

"మన పోరాటం న్యాయమైనదే. ఈ భూమి ప్రజలకే" అని మరొక్కసారి ప్రజలకు చెప్పటం జరిగింది. మనం పోరాటం ఈ విధంగా సాగిస్తూ వుండగా అక్కడ మరలా పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ భూములకు సంబంధించిన ఒక కుంభకోణం బయట పడింది. అదేమిటంటే ఈరోజు ఏ జడ్జిమెంట్లు నయితే చూపించి భూస్వామి భూములు మావని వివిధ ప్రాంతాలలో గిరిజనులను చంపి, అరెస్టులు చేసారో అవన్నీ కూడా నకిలీవని బయటపడ్డాయి. సుమారు 20-30 వేల ఎకరాలకు సంబంధించిన నకిలీ జడ్జిమెంట్లు పుట్టించి, వాటి మీద ఆధారపడి ఆ భూములు మావని చెప్తున్నారు. మోసాన్ని ప్రశ్నిస్తూ, అక్కడున్న ప్రజాసంఘాలను, పార్టీలను కలుపుకొని ఐక్య ఉద్యమాన్ని నిర్మించి; "దీనికి మీరు సమాధానం చెప్పండి - ఆ నకిలీ జడ్జిమెంట్లు ఎవరిచ్చారో వారిని శిక్షించండి. గిరిజనుల భూములు గిరిజనుల కివ్వాలి" అని చెప్పి వరుసగా మూడు, నాలుగు నెలలు అనేక రకాలుగా రైతుకూలీ సంఘంగా, గిరిజన సంఘంగా ఇంకా ఇతర సంఘాల తోటి, హక్కుల సంఘాలతోటి కలిసి మనం అక్కడ పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్మించాం.

పశ్చిమ గోదావరి జిల్లాలో గిరిజనోద్యమంపై జరుగుతున్న దాడిని ఆ జిల్లాలో ఎదుర్కొంటూనే మరొక ప్రక్క ఈ ఉద్యమానికి మద్దతు తెలియజేస్తూ, నిర్భంధాన్ని ఖండిస్తూ, గిరిజనుల భూమి గిరిజనులకే దక్కాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర కేంద్రం నుండి పిలుపునిచ్చింది. విజయనగరం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం తదితర జిల్లాలో ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాం.

పంచాయితీరాజ్ ఎన్నికలు

ఆరోజు అధికారంలో ఉన్న చంద్రబాబు తన అధికారాన్ని కిందిస్థాయి వరకు పాతుకొని పోవడానికి అనేక రకాలైన పథకాలు పెట్టి,ఇదే సందర్భమనుకొని ఎం.పి.టి.సి. , జడ్.పి.టి.సి. ఎన్నికలు, పంచాయితీ ఎన్నికలు నిర్వహించి; రకరకాలుగా ప్రజలను, తన ప్రభుత్వంలో వుండే ఒక వర్గాన్ని శాశ్వతంగా గ్రామాల్లో పాతుకొని పోయేటట్లు చేయటం కోసం పెద్ద ఎత్తున చేసే ప్రయత్నంలో భాగంగానే ఎన్నికలను నిర్వహించాడు. మనం కూడా ఆ ఎన్నికల్లో రైతుకూలీ సంఘంగా విజయనగరంలో, శ్రీకాకుళంలో, గుంటూరులో, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో, ఇంకా అనేక చోట్ల మన రైతుకూలీ సంఘం విధానాల్ని ప్రచారం చేసుకొంటూ " పేదప్రజలను ఐక్యంగా వుంచాలి. చీల్చడం అనేది పాలకవర్గాల కుట్ర కనుక ఈ పంచాయితీల్లో సీట్లు వచ్చినా, పోయినా మనకు సమస్యకాదు. పేద ప్రజల ఐక్యత ప్రధానం" అన్న విధానం తీసుకొని ప్రచారం చేశాం.

వ్యవసాయరంగ సంక్షోభంపై రాష్ట్ర సదస్సు తదితర కార్యక్రమాలు

వ్యవసాయరంగ సంక్షోభం రోజురోజుకీ తీవ్రమవుతుంది. మరి ఈసంక్షోభానికి పరిష్కార మేమిటి? చంద్రబాబు విజన్ 2020 ద్వారా రైతాంగానికి స్వర్గాన్ని సృష్టిస్తానన్నాడు. భూ సంస్కరణల చట్టాన్ని ఎత్తివేయడం, భూములన్నింటినీ బడా కంపెనీలకి కట్టబెట్టడం, విత్తన రంగాన్ని ,ఎరువుల రంగాన్ని బహుళ జాతి సంస్థల లాభాలకు వదిలివేయటం అనేవే 2020 విధానాలు. ఈ విధానాలు అమలవడంతో కరీంనగర్, అనంతపురం, వరంగల్, గుంటూరు జిల్లాల్లో రైతాంగం పెద్దసంఖ్యలో ఆత్మహత్యలు చేసుకొన్నారు. అటు అనంతపురం నుండి ఇటు శ్రీకాకుళం వరకు లక్షలాదిమంది వ్యవసాయకూలీలు పొట్టచేత పట్టుకొని వలసలు వెళ్తున్నారు. ఈ వ్యవసాయరంగ సంక్షోభం అనేది సర్వవ్యాపిత సంక్షోభం

ఈనాడు పాలకవర్గాలు చేస్తున్నదేమంటే పేదరికాన్ని, కరువునూ-రెంటినీ కలిపి మాట్లాడుతున్నారు. ప్రజల పేదరికానికి కారణం కరువు కాబోలు అని అనుకొనే విధంగా పాలకవర్గాలు మోసం చేస్తున్న పరిస్థితుల్లో మనం "కరువువేరు, పేదరికం వేరు. పాలకవర్గాలు గత 58 సం॥రాలుగా కొన్ని ప్రాంతాలను శాశ్వత కరువు ప్రాంతాలు గా వుంచాయి. ఈ ప్రాంతాల నుండి వలస వెళ్తున్న కూలీల శ్రమ దారుణంగా దోపిడీ చేయబడ్తోంది. శ్రమజీవులకు చౌకగా కూలి ఇచ్చి దోచుకొనేందుకు కరువు పీడిత ప్రాంతాలుగా శాశ్వతంగా ఉండచమే పాలకుల ఉద్దేశ్యం" అని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాం.

2002 ఏప్రిల్‌లో విశాఖపట్నంలో కరువుకి వ్యతిరేకంగా రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించాం. ఈ సదస్సుకి మేధావుల్ని ఆహ్వానించాం. రాష్ట్ర నలుమూలల నుండి మన ఉద్యమాల్లో భాగస్వాములైన ప్రజలు సదస్సుకు హాజరయ్యారు. 2001 జులైలో జరిగిన రైతు కూలీ సంఘం జనరల్ కౌన్సిల్‌లో రాష్ట్రస్థాయిలో కరువుకి వ్యతిరేకంగా తీసుకోవలసిన కార్య క్రమాలకు కూడా పిలుపు నివ్వడం జరిగింది. అనంతపురం నుండి శ్రీకాకుళం వరకూ అన్ని జిల్లాల్లోనూ ఈ కార్యక్రమాన్ని రైతుకూలీ సంఘంగా నిర్వహిస్తూ, కలిసి వచ్చే శక్తులను, సంస్థలను కూడా కలుపుకొని సదస్సులు నిర్వహించాం. ఆపదల్లో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాలని కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాం. అనంతపురం జిల్లాలో నకిలీ విత్తనాలకు వ్యతిరేకంగా 72 గంటల రాస్తారోఖోలో పాల్గొని చురుకైన పాత్ర నిర్వహించాం. రీజినల్ స్థాయిల్లో కూడా సదస్సులు నిర్వహించాం. ఉత్తరాంధ్ర సదస్సు విజయనగరంలోనూ, రెండు జిల్లాల సదస్సు శ్రీకాకుళంలోనూ; కర్నూలు, అనంతపురం జిల్లాలు కలిపి అనంతపురం జిల్లా రాయదుర్గం లోనూ; తెలంగాణా ప్రాంతంలో నిజామాబాద్, అదిలాబాద్‌లలో సదస్సులు నిర్వహించాం. కృష్ణా జిల్లాలో జరిగిన కరువు వ్యతిరేక సదస్సులో కరువుపైన అవగాహనని వివరిస్తూ నోట్‌నికూడా ప్రవేశపెట్టాం. ఈ పాలకవర్గాలు నీటిని ప్రకృతి ప్రజలకు ఇచ్చిన హక్కుగా చూడకుండా, బహుళజాతి సంస్థలకు వేలకోట్ల రూ॥లు ఆదాయం తెచ్చి పెట్టే వనరుగా చేసిపెట్టారు. దీనిమీద పెద్ద ఎత్తున ఉద్యమించటం తప్ప మరోమార్గం లేదని చెప్పి రైతుకూలీ సంఘంగా స్పష్టమైన అవగాహనతో ఎంతోకాలంగా మనం పనిచేస్తూ వున్నాం.

ఈ క్రమంలోనే 2003 అక్టోబర్‌లో హైదరాబాద్‌లో "సాగునీరు-తాగునీరు, రైతాంగ రుణభారం, విత్తనాల సమస్య, గిరిజనుల భూపరాయీకరణ సమస్య"లపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించాం. గ్రామస్థాయిలో రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన రైతాంగ కార్యకర్తలకు ఆయా సమస్యలపై ఈ సదస్సు ద్వారా ఒక స్పష్టతను కల్పించగలిగాం. రెండు వేల మందికి పైగా కార్యకర్తలతో జరిగిన సదస్సు, ముగింపుగా జరిగిన ఊరేగింపు జంట నగరాలపై మంచి ప్రభావాన్ని పడవేసింది.

పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లభించక ఆర్థికంగా బలైపోతున్న రైతాంగం సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోందన్న విషయం మనందరికీ తెలిసిందే. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కావాలంటూ మండల, జిల్లా స్థాయిల్లో ఆందోళనలు నిర్వహించాం. వ్యాపారపంటలైన ప్రత్తి, పొగాకు, మిర్చిలకు గిట్టుబాటు ధర కావాలని గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉద్యమించాం. మార్కెట్ శక్తుల యొక్క దోపిడీని, ప్రభుత్వం యొక్క నిర్లక్ష్య వైఖరిని బట్టబయలు చేశాం. పొగాకు పంటకు సంబంధించి ఐటిసి, ప్రభుత్వం కలిసి కుట్రపన్ని 'క్రాప్‌హాలిడే' ప్రకటించారు. 'క్రాప్ హాలిడే'తో ఈ పంటపై ఆధారపడే కూలీలం దరికీ జీవనభృతి పోతుంది. వచ్చే సం॥రానికి ధర వస్తుందని, ఏవిధమైన గ్యారంటీ లేదు అని వివరిస్తూ; పొగాకు బోర్డు రైతుల దగ్గర పంటను కొనుగోలు చేయాలని; ప్రభుత్వం సమాఖ్యకు 30కోట్ల నిధులు కేటాయించి పొగాకు కొనుగోలు చేయించాలని ఆందోళన చేశాం, కరపత్రాలు వేసి ప్రచారం చేశాం.

నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, తదితర సమస్యలపై అనంతపురం, నిజామాబాద్‌లలో ఆందోళనలు నిర్వహిస్తూనే; నిత్యకరువుపీడిత ప్రాంతమైన ఉత్తరాంధ్ర జిల్లా లలో చిన్నతరహా నీటిపారుదల ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, పెండింగు ప్రాజెక్టులను పూర్తి చేయడం వల్ల కరువును ఏ విధంగా నివారించవచ్చో వివరిస్తూ, నీటిపట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ, రైతాంగంలో విస్తృతమైన ప్రచారం, ఆందో ళనలు నిర్వహించాం.

రాష్ట్ర ప్రభుత్వ సహకార సంస్థలను, సహకార కర్మాగారాలను మూసివేయడానికి చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా స్వతంత్రం గానూ, ఆయా సంస్థల ఉద్యోగుల ఆందోళన లోనూ పాల్గొన్నాం. ఆయా ప్రాంతాల్లో, ఆయా సందర్భాలలో రైతాంగాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల మీద నిత్యం పోరాటం సాగిస్తూ వచ్చాం.

రైతాంగ రుణభారం మీద ఒక శాస్త్రీయ మైన అవగాహనని కలిగి వున్నాం. రైతాంగ ఆత్మహత్యలకు కారణంగా వున్న రుణభారంపై కృష్ణా, అనంతపురం, గుంటూరు జిల్లాల్లో శాంపిల్ సర్వేలు నిర్వహించాం. 2003లో ఈ సమస్యలపై మనం నిర్వహించిన సింపోజి యంలో డా॥ బి.డి.శర్మ గారు పాల్గొన్నారు.

ఆసియా సోషల్‌ఫోరమ్ - రైతుకూలీ సంఘం వైఖరి

ఈ రోజు చాలా మంది "సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకిస్తున్నాం, ప్రపంచీకరణను వ్యతిరేకిస్తున్నాం" అంటూ ముందుకు వస్తున్నారు. వీరు ప్రపంచీకరణకు, భారతదేశపు గ్రామీణ ప్రాంతంలో వున్న ఫ్యూడల్ శక్తులకు మధ్య వున్న అంతర్ సంబంధాన్ని గుర్తించ నిరాకరిస్తున్నారు. ఈ రోజు ఆర్థిక విధానానికి రెండు కాళ్ళు. ఒకటి-వ్యవసాయరంగం, మరొకటి-పారిశ్రామిక రంగం.

ఈ రెండు రంగాల సంక్షోభాన్ని పరిష్క రించడానికి వాటి మూలాల్లోకి వెళ్ళకుండా కేవలం ప్రపంచీకరణను వ్యతిరేకించాలి అని అంటున్న కొన్ని శక్తులు ముందుకొస్తున్నాయి. రైతుకూలీ సంఘంగా మనం ప్రపంచీకరణని వ్యతిరేకించే వ్యక్తులూ, శక్తులూ, గ్రామీణ ప్రాంతాల్లోని ఫ్యూడల్ శక్తుల తోటి, పెత్తందారీ శక్తులతోటి ప్రపంచీకరణకు సంబంధించిన అనేక మౌలిక అంశాలు మిలాఖత్ అయి వున్నాయి గనుక ఆ గ్రామాల్లోకి వెళ్ళి భూమి

సమస్యలని ప్రధానంగా తీసుకొని ప్రపంచీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి. అప్పుడే పరిష్కారం దొరుకుతుందనే అవగాహనతో మనం ఆసియా సోషల్ ఫోరమ్‌లో పాల్గొన్నాం. ప్రపంచీకరణను వ్యతిరేకిస్తున్నాం అని ప్రకటించిన పెద్ద వేదికలో రైతుకూలీ సంఘంగా పైన వివరించుకొన్న స్పష్టమైన అవగాహనతో 'భూ పరాయీకరణ-భూసంస్కరణలపై ప్రపంచీకరణ ప్రభావాలు; వ్యవసాయ రంగంపై ప్రపంచీకరణ ప్రభావాలు; గిరిజన సమస్యలు-గిరిజన ప్రాంతాల పరాయీకరణ" ఈ మూడు ముఖ్యమైన సమస్యలపైన ఆసియా సోషల్ ఫోరమ్‌లో రైతుకూలీ సంఘం తరపున, గిరిజన - గిరిజనేతర పేదల హక్కుల పరిరక్షణ కమిటీ తరపున, ఆదివాసీ హక్కుల వేదిక తరపున మన అవగాహనను రాత పూర్వకంగా పెట్టాం. ఈ పేపర్లను పుస్తక రూపంలోకి తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ తీసుకువచ్చాం. మేధావులకు, ఉద్యమంలో సన్నిహితంగా వుండేవాళ్ళకు, ఉద్యమాన్ని దగ్గరినుండీ పరిశీలించే వాళ్ళందరికీ మన సాహిత్యాన్ని అందజేశాం. గ్రామీణ ప్రాంతాల్లో వున్న మన ప్రజల కళారూపాలను కూడా ఇక్కడ ప్రదర్శించాం. సామ్రాజ్యవాదాన్ని ఎండగడుతూ మనం ప్రదర్శించిన కళారూపం ఎంతో మందిని ఆకట్టుకొంది. అప్పుల భారం వల్ల కిడ్నీలు అమ్ముకొన్న రెంటచింతల గ్రామం (గుంటూరు జిల్లా) లోని కుటుంబాలను, కృష్ణా జిల్లాలోని పల్లగిరి గ్రామంలో ఆత్మహత్యలు చేసుకొన్న రైతుల కుటుంబాలను ఆసియా సోషల్‌ఫోరమ్‌కు తీసుకొని వచ్చి పబ్లిక్ హియరింగ్‌లో చెప్పించాం. ఆత్మహత్యలకు, కిడ్నీలు అమ్ముకోవడానికి గల కారణాలు స్వయంగా కుటుంబసభ్యులే వివరించడం వల్ల హియరింగ్‌లో పాల్గొన్న మేధావుల్ని కంటతడి పెట్టించింది. 2004 జనవరిలో జరిగిన ప్రపంచ సామాజిక వేదిక (డబ్ల్యు ఎస్ఎఫ్)లో మనం మొదటి రోజు పాల్గొన్నాం.

వ్యవసాయరంగ పరిరక్షణ కమీషన్

రైతాంగంలోని సంక్షోభం, పరిష్కారాల గురించి చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వుండి, వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు లోబరుస్తున్న సందర్భంలో ఈ కమీషన్ ఏర్పడింది. వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యల పరిశీలనకు మేధావుల కమీషన్‌ను ఏర్పాటు చేయాలన్న సూచనను చంద్రబాబు ప్రభుత్వం తిరస్కరించడంతో మనం 12 సంఘాలు కలిసి జస్టిస్ పి.ఎ.చౌదరి నాయకత్వాన ఈ కమీషన్‌ను వేశాం. ఈ కమీషన్ వివిధ జిల్లాలలో పర్యటించినపుడు మన బాధ్యతగా అనంతపురం జిల్లాలోనూ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కూడా ఆ కమీషన్‌తో పాటు మనం కూడా పర్యటించి గ్రామాల్లో సాగునీరు, తాగునీరు సమస్య, దళిత సమస్య, రైతుల ఆత్మహత్యల సమస్య, రైతాంగసమస్య-వీటన్నింటినీ కూడా అధ్యయనం చేయటంలో మనం కూడా ఆ కమీషన్‌లో భాగస్వాములమయ్యాం; ప్రచారం చేశాం. ఆ కమీషన్ సిఫార్సులను తెలుగులో మనం ప్రింట్ చేసి పెద్ద ఎత్తున ప్రచారం చేశాం.

సావనీరు - వార్షిక సంచికలు

గ్రామాల్లో వుండే మన రైతుకూలీలకు చాలామందికి చదువుకోవటం కష్టం కనుక గుంటూరు జిల్లాలో జరిగిన మన మహాసభల్ని వివరిస్తూ ఉద్యమ ఫోటోలతోటి, అమరులైన కామ్రేడ్స్ ఫోటోల తోటి రైతుకూలీ సంఘు మహాసభల సావనీరు తెచ్చాం. చాలా ఎక్కువ మందిలోకి వివిధ సంఘాల్లో ఉండేవారి అందరికి కూడా మనం ఈ పుస్తకాన్ని విస్తృతంగా తీసుకువెళ్ళాం. అదే విధంగా 2002లో ఒక వార్షిక సంచికను, 2003లో ఒక వార్షిక సంచికను తీసుకువచ్చాం. ఈ వార్షిక సంచిక అంటే ఒక సంవత్సర కాలంగా రైతుకూలీ సంఘం అటు అనంతపురం నుండి ఇటు శ్రీకాకుళం వరకు, నల్గొండ, అదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం - ఈ ప్రాంతాల్లో మనం చేసిన కార్యక్రమాలు పోరాటాలు, రిపోర్టులు, విశేషాలు, గతంలో చేసిన పోరాటాలు, రైతుకూలీ ఉద్యమ దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోడానికి ప్రముఖుల వ్యాసాలు; ఆదివాసీ, రైతాంగ ఉద్యమంలో, సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాల్లో అమరులైన త్యాగమూర్తుల ఫోటోలు - వారి వ్యాసాలు; ప్రసంగాలు ఈ వార్షిక సంచికల ద్వారా అందిస్తున్నాం ఈ విధంగా ఈ మూడు సంచికలు ఆకర్షణీయంగా, బరువుగా తేగలిగాం. జయతీఘోష్ లాంటి మేధావుల్లోకి తీసుకు వెళ్ళగలిగాం. ఈ రోజుకి గ్రామాల్లో ఉండే ప్రజలకి, గ్రామస్థాయి కార్యకర్తలకి భూసంస్కరణల గురించి, 1/70 చట్టాన్ని గురించి, దళిత సమస్యల గురించి, సాగునీరు, తాగునీరు గురించి మన సంఘం వైఖరిని బుక్‌లెట్స్ ద్వారా స్పష్టంగా చెప్పగలుగుతున్నాం.

ఎన్నికలు - మన వైఖరి

ఆనాడు అధికారంలో ఉన్నటువంటి చంద్రబాబునాయుడు 2020 నాటికి గ్రామాల్లోని పరిస్థితిని మార్చివేస్తాను, వ్యవసాయ రంగానికి మరొక రూపం తీసుకు వస్తానని చెప్పి, పూర్తిగా వ్యవసాయరంగాన్ని ఎత్తి వేయడానికి కావలసిన పద్ధతుల్ని చేపడుతుండగా; ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న రాజశేఖర రెడ్డి గారు తాను అధికారంలోకి వస్తే భూమి పంపకం చేస్తానని, పెండింగుప్రాజెక్టులు పూర్తి చేస్తానని ప్రచారం మొదలు పెట్టాడు. ఇద్దరూ కూడా స్రామాజ్యవాదులు, ప్రపంచ బ్యాంకు మన దేశాన్ని దోచుకొంటున్న విధానం-విధించిన షరతుల గురించి నోరు విప్పకుండా దేశ ప్రజలను, రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారు. అధికారాన్ని కాపాడుకోవటం కోసం ఒకరు, అధికారంలోకి రావటం కోసం మరొకరు, ఇద్దరూ కూడా ఈ రైతాంగ సమస్యల్ని వాడుకో ప్రయత్నించారు. రైతుకూలీ సంఘంగా మనం స్పష్టమైన అవగాహనతో ముందుగా ప్రజలకి బ్రతకడానికి కావలసిన భూముల్ని పంచండి,తాగడానికి నీరు ఇవ్వండి అని అడిగాం. ప్రజల్ని బిచ్చగాళ్ళుగా మార్చ వద్దని కోరాం. ఈనేపధ్యంలో ఎన్నికల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ చంద్రబాబు ప్రభుత్వం భయానకమైన వాతావరణాన్ని సృష్టించింది.. అందులో భాగంగా విజయనగరం జిల్లా దుగ్గేరులో రైతుకూలీ సంఘం సాధారణ సభ్యుడైన తాడంగి కస్సుని అక్రమంగా నిర్భంధించి, విపరీతంగా కొట్టి, చంపివేశారు. ఒక భయానకమైన వాతావరణాన్ని గ్రామీణ ప్రాంతాల్లో తీసుకుని రావటంలో భాగమే తాడంగికస్సు ఘటన. అయితే రైతుకూలీ సంఘం ఉద్యమాలు ఉన్నచోట; రైతుకూలీ సంఘం నిర్మాణాత్మకంగా, సంఘటితంగా పని చేస్తున్న చోట "మేం బెదిరింపులకు లొంగేది లేదు, చావనైనా చస్తాం కాని" అని ప్రజలు నిలబడ్డారు. పార్వతీపురంలో పెద్ద ఎత్తున వాళ్ళు

కల్పించిన భయానక వాతావరణం నుండి ప్రజల్ని బయటపడేసి, ఒక విశ్వాసాన్ని కలిగించటం కోసం మనం రైతుకూలీ సంఘంగా పార్వతీపురంలో ప్రచారం, ఆందోళన చేశాం, నిలబడ్డాం. ఎక్కడ, ఏ రోజు, ఎప్పుడు, ఎలా? దాడి జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో మన కార్యకర్తలందరూ ఆ ఏరియాలో పనిచేశారు. ప్రజలు చైతన్యంతో వేసే ఒక ఓటు అంటే సంఘటిత శక్తికి గుర్తు. కాశ్మీర్‌ని తలపించే విధంగా పోలీస్‌ఫోర్స్, రాపిడ్‌యాక్షన్ ఫోర్స్, మిలటరీని దించి; చెట్టుమీద, కొండ మీద, ప్రతి ఒక్కచోట నిలబెట్టినా కూడా ప్రజలు భయపడకుండా రైతుకూలీ సంఘం ఇచ్చిన చైతన్యం తోటి, ధైర్యంతోటి ఎన్నికల్లో ప్రచారం చేశారు. వ్యవసాయరంగ సంక్షోభానికి ప్రధాన కారణాలైన ప్రపంచబ్యాంకు ఒప్పందాలు, ప్రపంచవాణిజ్య సంస్థ సంస్కరణల నుండి వ్యవసాయరంగాన్ని బయటపడవేయటం; భూ సంస్కరణలను, 1/70 చట్టాన్ని అమలు చేయటం; పెండింగు ప్రాజెక్టులను పూర్తి చేయాలని రైతుకూలీ సంఘంగా విస్తృతంగా ప్రచారం చేశాం. వీటిల్లో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో దళితుల సమస్యలు, మహిళల సమస్యల్ని ప్రధానంగా తీసుకొని పెద్దఎత్తున ప్రచారానికి పూనుకున్నాం. అంతటి నిర్భంధం లో మౌళిక పరిష్కారాలను సూచిస్తూ ప్రచారం చేశాం. ఎన్నికల అనంతరం భూ సంస్కరణలు అమలు చేయాలని; పేద రైతు-కూలీల సమస్యలు, దేవాలయ భూముల సమస్యలు, 1/70 చట్టం అమలు; దళితుల, మహిళల సమస్యలు; చేనేత కార్మికుల సమస్యలు - వీటన్నింటిపై వివరమైన మెమోరాండంను కొత్తగా అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డికి ఇచ్చాం.

రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన కొంతకాలానికి జయతీఘోష్ అధ్యక్షులుగా 13 మంది సభ్యులతో రైతు సంక్షేమ కమీషన్‌ను ఏర్పాటు చేశారు. కమీషన్ రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా రైతాంగ సమస్యలపై - ప్రత్యేకించి గిరిజన, మహిళల సమస్యలపై నిర్దిష్టమైన రాతపూర్వకమైన సూచనల్ని అందించాం. ఈ రైతు సంక్షేమకమీషన్ తన రిపోర్టును సకాలంలో పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేసింది. కాని ఈ కమీషన్ సిఫార్సులు వేటినీ కూడా పాలకులు చిత్తశుద్ధితో అమలు చేయడానికి సిద్ధంగా లేరు. రైతుకూలీ సంఘంగా జయతీఘోష్ కమీషన్ సిఫార్సులను వెల్లడి చేస్తూ, పుస్తకరూపంలో ప్రచురించాం. ఈ సిఫార్సుల అమలుకోసం సంస్థగాను, ఐక్యంగాను ఉద్యమించాలని పిలుపునిచ్చాం.

ప్రాజెక్టులు - పునరావాసం

మనరాష్ట్రంలో సాగునీటి కోసమని 26 ప్రాజెక్టులు కట్టడానికి 46 వేలకోట్ల రూ॥లు కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రాజెక్టులన్నింటిలో పెద్దది పోలవరం ప్రాజెక్టు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం అసలు ఏ ప్రయోజనం కోసం? అనేది ప్రభుత్వం స్పష్టపరచాలి. సాగునీటి కోసమా? లేక విద్యుత్ ఉత్పాదన కోసమా? లేక జలరవాణా సౌకర్యం కోసమా? అన్నదాన్ని మొట్టమొదట స్పష్ట పరచాలి. ఈ పోలవరం ప్రాజెక్టు గనుక నిర్మాణం జరిగితే 276 గిరిజన గ్రామాలు ముంపుకు గురవుతాయి. ముంపుకు గురయ్యే గ్రామాల్లో, ప్రధానంగా ఏజెన్సీ గ్రామాల్లో అడవికి అడవి, భూమికి భూమి, ఇంటికి ఇల్లు ఇవ్వాలని; పునరావాసం పొందే వారిలో వీరు ప్రథములుగా వుండాలని, పునరావాసం తర్వాతే నిర్మాణం చేపట్టాలని; రైతుకూలీ సంఘంగా డిమాండ్‌చేస్తూ; ప్రచార ఆందోళనా కార్యక్రమాల్లో మన కార్యకర్తలు నిమగ్నమై వున్నారు. ఉత్తరాంధ్రకి సంబంధించి తోటపల్లి ప్రాజెక్టు ముంపుగ్రామాలకు ఈనాటికీ సరైన నష్టపరిహారం చెల్లించలేదు. నష్టపరిహారం కావాలంటూ ఆందోళనచేస్తున్న ప్రజానీకంపై రాజశేఖరరెడ్డి ప్రభుత్వం లాఠీలు, తూటాలు ప్రయోగించిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే.

తోటపల్లి రిజర్వాయరు రైతుల పునరావాసానికి ఇవ్వవలసింది కేవలం లక్షల రూ॥లు మాత్రమే. కాని కాంట్రాక్టర్లకు మొబలైజేషన్ ఫండ్ కింద ఇస్తున్నది చాలా ఎక్కువ మొత్తం. గత 30 సం॥రాల నుండి పెండింగ్‌లో వున్న జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం మధ్యలో ఆపివేయబడింది. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్తున్నా రాజశేఖర రెడ్డిగారు ఆయకట్టును 25 వేల ఎకరాల నుండి ఏవో సాకులు చెప్పి 9 వేల ఎకరాలకు కుదించి వేశారు. నిత్యం కరువుతో సతమతమవుతున్న ఉత్తరాంధ్ర ప్రాంతానికి జంఝావతి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేయటం అనేది రైతాంగానికి ఎంతో ఊరటను కలిగించేదిగా వుంటుంది. కానీ దీనికి భిన్నంగా ఈ ప్రాజెక్టును తాగునీరు కోసం, పట్టణాల్లో పరిశ్రమల కోసం కేటాయించడానికి పాలకులు రంగం సిద్ధం చేశారు. దీనికి వ్యతిరేకంగా ఇక్కడి రైతాంగాన్ని కలుపుకొంటూ పెద్ద ఎత్తునఆందోళనలను నిర్వహిస్తున్నాం. అదే విధంగా పునరావాసం సమస్య కూడా ఈ నాటికీ పరిష్కరింపబడలేదు. తగిన పునరావాసానికి నోచుకొని కొన్ని గిరిజన గ్రామాలకి తక్షణం పునరావాసం కల్పించాలంటూ ఆందోళన నిర్వహిస్తున్నాం. ఈ రాష్ట్రంలో పేదప్రజలకు సాగునీరు, తాగునీరు అందించటం కోసం కంటే కూడా సామ్రాజ్యవాదుల బడా పరిశ్రమలకు కావలసిన ముడిసరుకును, విద్యుత్‌ను అందించే లక్ష్యంతోటే ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నారన్నది అర్థమవుతుంది.

రైతుకూలీ సంఘంగా మనం రాష్ట్రంలోని దేవాదాయ భూముల సమస్యపై నిరంతరం ఆందోళన సాగిస్తున్నాం. మన సంఘం పని చేస్తున్న దగ్గర అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, పల్నాడు ఏరియాలో, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం ఈ అన్ని ప్రాంతాల్లో కూడా దేవాదాయ భూముల సమస్య వుంది. దేవాదాయ భూములు లక్షలాది ఎకరాలు ఎవరెవరి హస్తగతమవుతున్నాయో మనకి తెలిసిందే. అధికారంలో ఉన్న "దేవుళ్ళంతా" ఈ భూముల్ని ఆక్రమించుకొంటున్న క్రమంలోనే దేవాదాయ శాఖా మంత్రి రాజీనామా చేశారు. దేవాదాయ భూముల్ని గిరిజనులకు, దళితులకు, భూమిలేని పేదలకు ఇవ్వాలని ప్రచారం, ఆందోళన సాగిస్తున్నాం. మనకి అధికార మార్పిడి జరిగి 57 సం॥రాలు గడిచిన ఈనాటికీ కులవివక్షత సమాజాన్ని పట్టి పీడిస్తున్నది. గ్రామాల్లో దళితులపై సాంఘిక అణచివేత తీవ్రంగా వుంది. ఎంతో అభివృద్ధి చెందినవని చెప్పుకొంటున్న కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో ఈ అణచివేత అనేక రూపాలలో నేటికీ సాగుతున్నది. ఉత్తరాంధ్ర జిల్లాలో నేటికీ రెండు గ్లాసుల

పద్ధతి అమలవుతున్నది. వీటికి వ్యతిరేకంగా రైతుకూలీ సంఘంగా మనం నిరంతరం ఆందోళనలు చేస్తున్నాం. అలాగే కష్టజీవి మహిళల సమస్యలు, మహిళలపై అణచివేత, కూలీరేట్లలో వ్యత్యాసం సమస్యలపై, రై.కూ.సం.గా స్పందించి, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నాం. ప్రత్యేక దృష్టితో రైతుకూలీ మహిళల్ని సంఘటితపరుస్తున్నాం. అలాగే పట్టణ, గ్రామీణ పేదల ఇళ్ళ స్థలాల సమస్య తీసుకొని పనిచేస్తున్నాం. గుంటూరు, ఉభయగోదావరి, శ్రీకాకుళం, నిజామాబాద్ జిల్లాల్లో పని చేస్తున్నాం. వీటిన్నింటితో పాటు రైతుకూలీ సంఘంగా మనం తూర్పు, పశ్చిమ గోదావరి, విజయగనరం, ఏజెన్సీ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. వైద్యం ఎంతో ఖరీదైనదిగా మారిపోయిన ఈ రోజుల్లో మనం నిర్వహిస్తున్న ఈ మెడికల్ క్యాంపుల ద్వారా గిరిజన ప్రజానీకానికి ఒక మేరకు సహాయపడ గలుగుతున్నాం.

రాష్ట్ర పిలుపులు

1. కరువుకి వ్యతిరేకంగా మూడు సం॥రాలు వరుసగా పిలుపునిచ్చాం.
2. ఆర్‌టిసి సమ్మెకు మద్దతు పలుకుతూ ఆ సమ్మెలో క్రియాశీలకంగా పాల్గొనాలని, మద్దతుగా ర్యాలీలు జరపాలని పిలుపునిచ్చాం.
3. రైతుల ఆత్మహత్యలకు,కిడ్నీలు అమ్ముకొనే స్థితికి కారణమైన రుణభారానికి వ్యతిరేకంగా; నష్టపోయిన, మరణించిన రైతు కుటుంబాలకు ఆర్థిక సహకారాన్ని అందించాలని డిమాండ్ చేస్తూ పిలుపునిచ్చాం.
4. అమెరికా సామ్రాజ్యవాదం మనదేశంపై 'ప్రపంచీకరణ' అస్త్రంతో దాడిచేస్తూ, దోపిడీ చేస్తూ; మరోవైపు ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై దాడి చేసి సద్దాం హుస్సేన్‌ను బంధించడాన్ని ఖండిస్తూ ఆందోళన చేయాలని పిలుపునిచ్చాం.
5. పశ్చిమ గోదావరి జిల్లాలో గిరిజనోద్యమాలపై నిర్భంధాన్ని ఖండిస్తూ –
6. రాజశేఖరరెడ్డి బూటకపు భూపంపకాన్ని వ్యతిరేకిస్తూ, విప్లవ భూసంస్కరణల్ని అమలుచేయాలని.
7. జయతీఘోష్ కమీషన్ సిఫార్సులను అమలుచేయాలని.
8. తోటపల్లి, పోలవరం ప్రాజెక్టుల ముంపు ప్రాంతాల ప్రజల పునరావాసం సమస్యల మీద – మొ॥లగు సమస్యలమీద.
9. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గ్రామగ్రామాన జరపాలని; రాష్ట్ర పిలుపులుగా వీటిని అమలుచేస్తూనే; రాష్ట్ర కేంద్రం నుండి, మరియు ఆయా జిల్లాల్లోనూ వివిధ సమస్యలపై ఐక్య ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చాం. ఆరకంగా జిల్లాల్లో పనిచేస్తున్నాం.

నిర్భంధం

రైతుకూలీసంఘం గ్రామాలలో ఫ్యూడల్ పెత్తందారీ వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న క్రమంలో గ్రామస్థాయి కార్యకర్తల నుండి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి కార్యకర్తలు నిర్భంధాలను ఎదుర్కొంటున్నారు. అనేక తప్పుడుకేసులు మన కార్యకర్తలపై బనాయించారు. పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలో వెయ్యి మంది పైన 50 కేసులున్నాయి. విజయనగరం జిల్లా గిరిజన ప్రజానీకంతో పాటు రైతుకూలీ సంఘ నాయకులపై అనేక తప్పుడు కేసులు బనాయించారు. నిన్నటి తోటపల్లి పునరావాసం పై పెట్టిన కేసులలో మన కామ్రేడ్స్ కూడా ముద్దాయిలుగా వున్నారు. గుంటూరు జిల్లాలో ప్రత్యేకించి పల్నాడు ఏరియాలో ఈనాటికీ మన సంఘ కార్యకర్తలను పోలీసులు నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారు. తప్పుడు కేసులలో ఇరికించబడ్డారు. రైతుకూలీ సంఘ రాష్ట్ర కార్యవర్గం సభ్యుడైన కా॥ నాగేశ్వరరావు, మరో ఇద్దరు కామ్రేడ్స్ శివ, ముసలయ్యలు తోటి విప్లవ సంస్థ అన్యాయంగా పెట్టిన హత్యాకేసులో యావజ్జీవ కారాగార శిక్షనుఅనుభవిస్తూ రాజమండ్రి సెంట్రల్ జైల్లో వున్నారు. ఇంకా నెల్లూరు జిల్లాలో కూడా అటు పెత్తందార్లకు ఇటు జిల్లా పోలీసు అధికారులకు మనం నిత్యం కన్నెర్రగానే వుంటున్నాం. అందుకే అనేక తప్పుడు కేసులు పెట్టడం, జనశక్తినగర్‌లో మన కామ్రేడ్స్ ఇళ్ళపై దాడి చేయటం నిత్యకృత్యంగా మారింది. గ్రామీణ పేదలపై, గిరిజన, దళిత, మహిళా, వ్యవసాయ కూలీలపై అనునిత్యం ఎంతో పీడన, హింస అమలు జరుగుతుంది. వ్యవస్థీకృత హింసను ప్రశ్నిస్తూ, పీడితులను కదిలిస్తున్న క్రమంలో మనం కూడా అనివార్యంగా హింసను ఎదుర్కొనవలసి వస్తున్నది. ఎదుర్కొంటున్నాము. ప్రభుత్వం మనపై ప్రయోగిస్తున్న నిర్భధం మొత్తం సమాజ అసమానత్వాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజలపై ఉన్న నిర్భంధంలో భాగమే. ప్రజాతంత్ర ఉద్యమ అండతో దాన్ని తిప్పికొట్టేందుకు కృషి చేస్తున్నాం.

రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, అమరుడు కా॥మండ్ల సుబ్బారెడ్డి శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేటలో అమరుడు కా॥అప్పలసూరి వర్ధంతి సభలో మాట్లాడి నందుకే ఆ జిల్లా పోలీసు అధికారులు తప్పుడు కేసులు పెట్టారు. ఆ కేసుకు అటెండ్ అవుతున్న సందర్భంలోనే దారిలో గుండెనొప్పి వచ్చి అమరుడైనారన్న విషయం మనం ఎప్పటికీ మరువలేము. ఆ కేసులో వున్న మరో 5 గురు కామ్రేడ్స్ ఇంకా ఈనాటికీ కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

పునాది సంఘంగా గ్రామ సంఘం వుండాలి

2001 ఏప్రిల్,మే లో రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభలు గుంటూరులో నిర్వహించుకున్న తరువాత ప్రతిసంవత్సరం రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జరుపుకుంటున్నాం. జిల్లా సంఘ నిర్మాణాన్ని పటిష్టపరచుకుంటూ గ్రామ సంఘాలను కూడా పటిష్ట పరచుకోవాలని నిర్ణయించుకున్నాం. ప్రతి గ్రామంలోను గ్రామ సంఘాన్ని ఏర్పరచుకుని పేద, మధ్య తరగతి రైతాంగం సమస్యలను పరిశీలించాలి. ఈ రోజు గ్రామాల్లో వస్తున్న మార్పు లేమిటి? గ్రామాలలో వివిధ వర్గాల వారితో ఏ విధంగా వ్యవహరించాలి. అన్నది నిర్ణయించుకొని వ్యవహరించాలి. పాలకవర్గపార్టీలు గ్రామాలలో వున్న కొంతమంది అమాయక యువకులను చేరదీసి త్రాగబోసి వారిని దళారులుగానూ, ప్రజా వ్యతిరేకులుగాను తయారు చేస్తున్నారో పరిశీలించి, వీరి ఆగడాలను అరికట్టి, సరిచేసి మన వైపుకు త్రిప్పుకోవాలి. ఈకర్తవ్యాలను గ్రామస్థాయి సంఘాలు చేపట్టటానికి కావలసిన రాజకీయ, సిద్ధాంత తర్పీదు ఇచ్చి అభివృద్ధి చెయ్యటానికి రాష్ట్ర కేంద్రం నిర్మాణపరంగా కొన్ని చర్యలు తీసుకుంది. సంఘ నిర్మాణం వున్న అన్ని జిల్లాల్లోను ఈ కర్తవ్యాన్ని పూర్తి చేశాము. ప్రతి సంవత్సరం మన కార్యకర్తలు

గ్రామాల్లో తిరిగి ప్రతి సభ్యుడి దగ్గరకు వెళ్ళి రైతుకూలీ సంఘం లక్ష్యాన్ని వివరిస్తూ సభ్యత్వాన్నిస్తున్నారు. జిల్లా కమీటీలతోపాటు గ్రామ కమీటీలు, అవసరమైన సందర్భంగా ఏరియాకమిటీలుగా ఏర్పడి పనిచేస్తున్నారు.

రాష్ట్ర మహాసభలకు ముందు జిల్లా మహాసభలను నిర్వహించుకోవాలని ఇచ్చిన పిలుపులో భాగంగా అన్ని జిల్లాలలోను మహా సభలు నిర్వహించుకున్నాం. కార్యక్రమాలను సమీక్షించుకున్నాం. కొత్త కమిటీలను ఎన్ను కున్నాం. మనం ముందుకే పోతున్నాం. మరింత ముందుకు పోవడానికి ప్రయత్నిస్తున్నాం.

కామ్రేడ్స్,

రాష్ట్ర మహాసభల ముందుంచిన కార్య కలాపాల నివేదికకిది సంక్షిప్త రూపం. ఈ నాలుగేళ్ళ కాలంలో వివిధజిల్లాలో రైతుకూలీలు, ఇతర ప్రజల సమస్యలపైన మనం స్పందించి కృషి చేశాం. వివిధ స్థాయిల్లో రాజకీయ, ఆందోళన, ప్రచార కృషి సాగించాం.

గ్రామీణ సంక్షోభం యొక్క ఎన్నో సమస్యలపై, ఇతర ప్రజాతంత్ర ఉద్యమాల పట్ల స్పందించాం. జిల్లాస్థాయిల్లో చాలా కార్యక్రమాలు జరిగాయి. వాటినన్నింటినీ ఇక్కడ పేర్కొనడం లేదు. మన కార్యకలాపాల బహుముఖ రేఖాచిత్రాన్ని మాత్రమే మీముందు వుంచాము. దున్నేవానికే భూమి కేంద్ర నినాదంగా ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక కర్తవ్యాలను జోడించి ఆందోళనా పోరాటాలు సాగించిన సంస్థమనది. భూ సంస్కరణలు, ఆదివాసీ ప్రాంతాల భూపరాయి కరణ, గ్రామీణ పేదలపై సాంఘిక దౌర్జన్యాలు- పెత్తనం, వ్యవసాయ కూలీల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా కార్యక్రమాలను మన సంస్థ చేపట్టింది. గిట్టుబాటు ధరలు, అప్పులు, కల్తీ ఎరువులు, కల్తీ పురుగు మందులు, తదితర సమస్యలు; మార్కెట్ శక్తులు; సామ్రాజ్యవాద ఏజెన్సీలు; గ్రామాలలోని సంపన్న భూస్వాము లు, ధనిక రైతులు కుమ్మక్కై కల్పిస్తున్న సంక్షోభం; దాని మూలకారణాలను వెల్లడిచేస్తూ ప్రచార, ఆందోళనలు సాగిస్తున్న సంస్థమనది.

నీటి మీద రైతాంగపు హక్కులను స్థిరపరచాలని పోరాడుతున్నది. సామ్రాజ్య వాదుల, దళారీల ప్రయోజనాల కనుగుణంగా ప్రభుత్వ లొంగుబాటు విధానాలను ప్రతిఘటి స్తున్నది మన సంస్థ.

జలవనరుల సాధనకై నిర్దిష్ట డిమాండు లతో పాటు సమగ్ర శాస్త్రీయ పునరావాసం కోసం, సమగ్ర జలవనరుల సాధనకు క్రియాశీలకంగా కృషి చేస్తున్నది.

ఆక్వా, ఉప్పు, డెయిరీ, పౌల్ట్రీ తదితర రంగాల సంక్షోభం- దోపిడీ; పర్యావరణ విధ్వంసం- వీటన్నింటి వెనుక దాగివున్న సామ్రాజ్యవాదుల, ప్రభుత్వ ఏజెన్సీల కుట్రను శక్తివంతంగా బహిర్గతపరుస్తూన్నది.

గిరిజనులకి వైద్యం, విద్య, సదుపాయాల సమస్య; గ్రామీణ, పట్టణ పేదల నివాస సౌకర్యాల కోసం -ఇళ్ళ స్థలాలు, ఇళ్ల నిర్మాణం కోసం సాగిన పోరాటాలకు అండదండగా వుంది. కార్మికవర్గం, ఉద్యోగ వర్గాలు సాగించిన పోరాటాలకు సంఘీభావంగా నిలబడింది. ప్రకృతి వైపరీత్యాలు, తుఫానులు, సునామీ బాధితుల బాధలకు స్పందించింది.

ఎన్నో ఆటంకాలు, నిర్బంధాల మధ్య కొరతలు, అనుకూలతల మధ్య కామ్రేడ్స్ చైతన్య యుతంగా కృషి చేస్తున్నారు. ప్రజలకు రాజకీయాలు అందించడం, గ్రామాలలో ప్రజా రాజకీయ అధికారాన్ని సాధించడం అన్న జటిలమైన దీర్ఘకాలిక కర్తవ్య నిర్వహణలో కామ్రేడ్స్ నిగమ్మమైన సంస్థ మనది.

సంక్షోభం తీవ్రత రాజకీయ చదరంగం లో పార్టీల బలాబలాలను తారుమారు చేస్తున్నది. శక్తివంతులమని విర్రవీగిన తెలుగు దేశం పార్టీ సంక్షోభం తాకిడికి గురయి వెనక్కు నెట్టబడింది. రైతుల వెతలు తీరుస్తామని వచ్చిన కాంగ్రెసు ఆ పరిస్థితిని చవి చూడక తప్పదు.

ఏ బూర్జువా పార్టీ అధికారంలో వున్నా ఆత్మహత్యలు, వలసలు, కరువులు, వరదల మధ్య రైతులు; కష్టాలు, కన్నీళ్ళు, నిట్టూర్పుల మధ్య శ్రమజీవులు కాలం గడపవలసి వస్తోంది. ☆ రైతాంగ సమస్యల పరిష్కారంకై మరింత నిర్మాణయుతంగా, మరింత శక్తివంతంగా మన పోరాటం సాగాల్సి వుంది.

గ్రామస్థాయి ప్రాథమిక నిర్మాణ రూప మిచ్చి పటిష్టపరచాలి. గ్రామస్థాయి నాయ కత్వాన్ని అభివృద్ధి పరచడం; ప్రాంత, జిల్లా స్థాయి నాయకత్వపు స్థాయి, శక్తిని మరింతగా పెంపొందించుకోవాలి. ఈ కర్తవ్యాలను పరిపూర్తి చేయడానికి కృత నిశ్చయంతో పూనుకోవాలని రాష్ట్ర కార్యవర్గం కోరుతున్నది. విశ్వాసంతో దృఢమైన నిర్ణయంతో మరింత చురుకుగా నిర్మాణయుతంగా కదలాలని కోరుతున్నది.

అందరికీ రెడ్‌శాల్యూట్స్

వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలి !
అమరవీరులకి జోహార్లు !! ☆

వాళ్ళు బీళ్ళును దున్నుతారు-
ప్రభుత్వాలు వాళ్ళ జీవితాల్ని బీళ్ళు చేస్తాయి
అవి బీళ్ళే - వాళ్ళు రైతులే
అక్కడేమీ విత్తలేరు ప్రాణాల్ని తప్ప
అక్కడేమీ మొలవ్వు భూపోరాటాలు తప్ప
పాలాలు బీళ్ళయితే జీవితాలు ఎడారౌతాయి
జనాలు తిరగబడితే, దేశాలు ఎర్రబడతాయి
మట్టి మనుషులు మహావ్యవస్థల్ని కూలుస్తారు
మొరటు చేతులు మహా సౌందర్యాల్ని సృజిస్తాయి.

- ఎం. శ్రీనివాస్

ఓ నా యుద్ధమా!
తూరుపు జేవురించింది
నిద్రాణమై ఉన్న గిరిజనుల్ని
దుగ్గేరు ఉద్దీపనం చేసింది
రైతుకూలీల్ని
కట్టుబాటు చేసింది
అడవి సాయుధమయ్యింది
జండా ఆయుధమయ్యింది.

- అల

మహాసభ తీర్మానాలు

1. 1/70 చట్టాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలి, అమలు పరచాలి.

గిరిజన రక్షణ చట్టాలు అనేవి ఏవైనా ఆదివాసుల రక్తతర్పణ అనంతరమే ఉనికిలోకి వచ్చాయి. పోరాటాలు వెనుకపట్టు పట్టినాక పాలకులకి వీటికి తూట్లు పొడవడం, అమలును నిరాకరించడం, అంతిమంగా ఆ చట్టాలను ఎత్తివేయడం అలవాటుగాను, అసలు ఉద్దేశ్యంగాను ఉంది. 1870ల నుంచి రెగ్యులేషన్లు, చట్టాలు ఉన్నాయి. అయినా గిరిజన భూపరాయీకరణ కొనసాగింది. భూముల రీత్యా, జనాభారీత్యా గిరిజనులు తమ ప్రాంతాలలోనే తాము మైనారిటీలు అవుతున్నారు. నకిలీ కుల సర్టిఫికేట్‌లతో గిరిజనేతరులే ఏలుబడి సాగిస్తున్నారు.

1/70 రెగ్యులేషన్ అనంతరం వచ్చిన పంచాయితీరాజ్ సవరణచట్టం 7/98 ప్రకారం గ్రామసభలే భూ వివాదాల పరిష్కారంకి అధికారం కలిగియున్నవి. అయితే 98 నుండి నేటివరకు భూరియా కమీషన్ సూచనలలో కొన్నింటితో మాత్రమే చేయబడిన పంచాయితీ రాజ్ సవరణచట్టం 7/98 కి ప్రభుత్వం రూల్స్ రూపొందించలేదు. ప్రభుత్వం భూరియా కమిటీ సిఫార్సులన్నింటినీ చట్టబద్ధం చేయాలని, చేసిన 7/98కి రూల్స్‌ని రూపొందించాలని; 1/70ని సమగ్రంగా అభివృద్ధిపరచి అమలుపర్చాలని మహాసభ డిమాండ్ చేస్తున్నది.

భూమికోసం, జాతి మనుగడ కోసం పోరాడటం ఆదివాసుల జన్మహక్కు అని; దాన్ని నిలబెట్టుకొనేందుకు పోరాడుతూనే ఉండాలని; పోరాడుతుంటేనే చట్టాలు నామమాత్రంగానైనా అమలవుతాయని మహాసభ పిలుపునిస్తున్నది.

2. సమగ్ర భూసంస్కరణలు కోసం పోరాడండి!

రాష్ట్ర ప్రభుత్వ భూపంపిణీ కార్యక్రమం ఒక తంతుగా మారిపోయింది. 1973 నాటి భూసంస్కరణల చట్టం ప్రకారం 14.15 లక్షల ఎకరాల మిగులు భూమి, 3 లక్షలకు పైబడిన దేవాదాయ భూమి, సాగుకి లాయకైన లక్షల ఎకరాల బంజరు, పోరంబోకు భూములు, షెడ్యూల్డ్ ప్రాంతంలో అన్యాక్రాంతమైన నాలుగు లక్షల ఎకరాల భూములు రాష్ట్రంలోని భూమిలేని పేద, గిరిజన, దళిత, వ్యసాయ కూలీలకు పంపకం జరగవలసినవి. వీటిని స్వాధీనపర్చుకొని పంపకం చేయకుండా భూస్వాముల వద్ద భూమిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పూనుకోవడం భూస్వామ్యవర్గాలను రక్షించేందుకే. మరోప్రక్క 1991 సుప్రీంకోర్టు తీర్పు స్పష్టంగా ఉన్నా 3వ పార్టీ వద్ద సాగు భూమి ఉంటే స్వాధీనం చేసుకోరాదన్న రాష్ట్ర హైకోర్టు తీర్పుని సాకుగా చేసి రాష్ట్రంలో లక్షలాది ఎకరాల భూములను భూస్వాముల వద్దనే ప్రభుత్వం అట్టిపెడుతున్నది. మరోప్రక్క తెలంగాణా సాయుధ పోరాటాన్ని ప్రక్కదారి పట్టించేందుకు వినోబాబావేకి భూస్వాములు దానం చేసిన లక్షల ఎకరాల భూములు కూడా నేటికీ భూస్వాముల వద్దనే ఉన్నాయి. భూస్వాముల చేతుల్లోని భూములన్నింటిపై కష్టజీవులైన పేదలదే హక్కు అని; వీటికోసం పెద్ద పోరాటానికి సిద్ధపడాలని రైతు కూలీలకు మహాసభ పిలుపునిస్తోంది. ప్రభుత్వం వెంటనే పై భూములన్నింటినీ పంపకం చేయాలనీ, భూసంస్కరణల చట్టంపై సుప్రీం తీర్పుకి ఆటంకంగా ఉన్న అన్ని కుంటి వాదనలను, చట్టపర అడ్డంకులను తొలగించి 10ఎకరాల గరిష్ట పరిమితిని విధించి; భూసంస్కరణల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని మహాసభ డిమాండ్ చేస్తున్నది.

3. భారతదేశం ప్రపంచ వాణిజ్యసంస్థ నుండి బయటకి రావాలి.

1992లో భారతప్రజల అనుమతి లేకుండానే ప్రజల నిరసనల మధ్య కాంగ్రెస్ పి.వి. నరసింహారావు ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థలో భాగస్వామ్యమైంది. నాటినుండి రైతాంగం కష్టాలు, కడగండ్లు మరింత పెరిగిపోయాయి. చిన్న, సన్నకారు, పేద, మధ్య తరగతుల రైతులను, చేతివృత్తులను తుడిచిపెట్టి గ్రామీణ సామాజిక వర్గాల రూపురేఖలనే మార్చి; విదేశీ, దేశీయ బడా గుత్త సంస్థల ప్రయోజనాలకనుగుణంగా కాంట్రాక్టు, కార్పొరేట్ వ్యవసాయంగా దేశాన్ని మార్చటమే సామ్రాజ్యవాదుల లక్ష్యం. దాన్ని కాపాడే పాలక వర్గాలు అనుసరిస్తున్న విధానం ఫలితంగా దేశ వ్యవసాయక, ఉత్పాదక రంగాలు సంక్షోభంలో పడ్డాయి. లక్షలాది మంది శ్రమజీవులు వీధినపడ్డారు. వేలాది మంది రైతాంగం ఆత్మహత్యలకు గురైనారు. వీటన్నిటికీ మూలకారణమైన ప్రపంచ బ్యాంక్‌త్రయం అనగా ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్యసంస్థలకి వ్యతిరేకంగా; సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా; దేశ ప్రజలందరితో కలసి రైతాంగం పోరాడాలని మహాసభ పిలుపు నిస్తున్నది. ప్రభుత్వం డబ్ల్యు.టి.ఓ నుండి వెంటనే బయటకు రావాలని డిమాండ్ చేస్తున్నది. బ్యాంక్‌త్రయం పెట్టే షరతులను, ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలను అమలు పరచరాదని మహాసభ డిమాండ్ చేస్తున్నది.

4. చింతపల్లి బాక్సైట్ మైనింగ్ కోసం ఏజెన్సీ భూములు కేటాయించే ప్రతిపాదనను ఉపసంహరించాలి.

ప్రస్తుత ప్రభుత్వం మరలా చింతపల్లి బాక్సైట్ మైనింగ్ సమస్యను ముందుకు తెచ్చింది. గత ప్రభుత్వం దుబాయికి చెందిన కంపెనీతో ఒప్పందం చేసుకొని గిరిజనుల, ప్రజాతంత్ర వాదుల నిరసన ఫలితంగా వెనక్కి తగ్గిన విషయాన్ని మరలా ఈ ప్రభుత్వం ముందుకు తేబోతున్నది. నాడు గిరిజనులు, ప్రజాతంత్రవాదులు చింతపల్లి బాక్సైట్ మైనింగ్‌ను వ్యతిరేకించారు. ప్రవేటు యాజమాన్యంలో మైనింగ్ చర్యలు చేపడుతున్నందుకు మాత్రమే కాదు; అసలు బాక్సైట్ మైనింగ్ వల్ల అనేక గిరిజన గ్రామాల నిర్వాసిత సమస్యతో పాటు; తాండవ, వరహా, శారద, మేఘాద్రిగెడ్డ వంటి నదులు, అనేక గెడ్డలు కలుషితం అవుతాయని;

ఈ నదులపై ఆధారపడిన భూములు దెబ్బతింటాయని; బాక్సైట్ మైనింగ్‌కు కావాల్సిన అపారమైన నీరు కోసం జలవనరులన్నీ దుర్వినియోగమౌతాయని; అందువల్లనే బాక్సైట్ మైనింగ్‌ని ప్రజలు వ్యతిరేకించారన్నది స్పష్టం.

బహుళజాతి కంపెనీల ప్రయోజనం కోసం ప్రభుత్వరంగ సంస్థల చేత మైనింగ్ చేయించి ప్రజలను, పర్యావరణాన్ని ధ్వంసం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను మహాసభ ఖండిస్తున్నది. ఆదివాసులు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు తమ పోరాటాన్ని పునఃప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిస్తున్నది.

5. వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలి.

రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కోరుతున్నారు. ప్రభుత్వం మార్కెట్ రేటుల సరాసరిననుసరించి మద్దతు ధర అంటున్నది. చివరకు మద్దతు ధరలేని పంటలకు అప్పులివ్వవద్దని అంటున్నది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా అనేక పంటలకు దక్కకుండా మార్కెట్ దోపిడీ శక్తులు నిలువునా దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. ప్రవేట్ వ్యాపారుల మార్కెట్ దోపిడీ నుండి రైతాంగాన్ని రక్షించేందుకంటూ ఏర్పరచిన మార్క్‌ఫెడ్, నాఫెడ్, సిసిఐ, పొగాకు బోర్డు వంటి సంస్థలు ఎన్నికల సందర్భాల్లో తప్ప పంటలు కొనుగోలు చేయకుండా నామమాత్రంగా మిగిలాయి. ఇలాంటి స్థితిలో పంటవేసే కాలంలోనే వాటికి గిట్టుబాటు ధరను వ్యవసాయానికి అవుతున్న ఖర్చుల ప్రాతిపదికగా నిర్ణయించి ప్రకటించాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది. అదే సమయంలో గిట్టుబాటు ధరల సాధన కోసం ఉద్యమించాలని రైతాంగానికి మహాసభ పిలుపునిస్తున్నది.

6. ప్రాజెక్టుల కింద నష్టపోతున్న ప్రజలకు సమగ్ర శాస్త్రీయ పునరావాసం కల్పించాలి.

రాష్ట్రవ్యాపితంగా ప్రాజెక్టు నిర్వాసితుల ఆందోళనలు ముందుకు వస్తున్నాయి. ప్రభుత్వ పునరావాస విధానం రైతాంగ, ప్రజల నష్టాన్ని రిజిస్ట్రేషన్ రేటు, మార్కెట్ రేటు పేరుతో డబ్బులతో లెక్కించుతున్నది. రెవెన్యూ రికార్డుల ప్రకారం భూమి పట్టాలు నష్టపరిహారానికి అర్హతని పేర్కొంటున్నది. ప్రజలను బిచ్చగాళ్ళుగా పరిగణిస్తున్న పునరావాస విధానాన్ని మహాసభ ఖండిస్తున్నది. ఎవరైతే ప్రాజెక్టుల వలన నష్టపోతున్నారో వారే ప్రాజెక్టుల వల్ల ప్రయోజనం పొందేవారిలో మొదటివారుగా ఉండాలని; భూమికి భూమి, అడవికి అడవి, సమగ్ర పునరావాస విధానం అమలు కావాలని; రెవిన్యూ రికార్డులను బట్టి గాక నిజసాగుదారులకు- బంజరు, పోరంబోకు భూములలో సాగులో ఉన్నవారందర్నిరైతులుగా పరిగణించి పునరావాస విధానం అమలు చేయాలని; వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల ప్రజలకి నష్టపరిహారం; పునరావాసం కల్పించాలని మహాసభ డిమాండ్ చేస్తున్నది. నిర్వాసితులపై ప్రభుత్వం అమలు జరుపుతున్న నిర్భంధ పద్ధతులను మహాసభ తీవ్రంగా ఖండిస్తున్నది. పునరావాసం హక్కు అని; దానికోసం ఉద్యమించాలని; ప్రాజెక్టు బాధితులందరికీ మహాసభ పిలుపునిస్తున్నది. తోటపల్లి నిర్వాసితులపై బనాయించిన అక్రమ కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నది.

7. నీరు వ్యాపార సరుకు కాదు-నదీ జలాలతో ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీర్చాలి.

నూతన ఆర్థిక విధానాల అమలు అనంతరం పాలకుల ప్రాధాన్యతలు మారిపోయాయి. నీటిపారుదల ప్రాజెక్టుల జలాలు రైతుల కోసం కాక విద్యుత్, పారిశ్రామిక, వాణిజ్య అవసరాల కోసం వినియోగించడం మొదటి ప్రాధాన్యంగా పాలకులు ఎంచుకున్నారు. ప్రకాశం బ్యారేజ్ దెబ్బతింటున్నా థర్మల్ పవర్ ప్రాజెక్టుల కోసం నీటిని నిల్వ చేయడం; ప్రకాశం బ్యారేజ్ నుంచి వందల శతకోటి ఘనపుటడుగుల నీరు సముద్రంలో కలుస్తున్నా కృష్ణా డెల్టాకి ఖరీఫ్, రబీలకు నీరు ఇవ్వకపోవడం; రాజోలిబండ మళ్లింపు పథకం; స్వర్ణ విద్యుత్ కేంద్ర నిర్మాణం; జంఝావతి నీటిని విశాఖకు తరలించే ప్రయత్నం; విశాఖ స్టీల్ ప్లాంట్ చుట్టూగల గ్రీన్‌బెల్ట్ పెంపకం కోసం ఏలేరు కాలువగట్లపై పోలీసులు కాపాలాతో రైతులను దొంగలుగా చూడడం– ఇవన్నీ ఏ పార్టీ అయినా పాలకుల విధానపర నిర్ణయం ఒక్కటేనని తెలియజేస్తున్నది.

జలయజ్ఞం పేర ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం ప్రపంచబ్యాంకు షరతుల మేరకే పారిశ్రామిక వాణిజ్య మహానగరాలకు నీరు, రేవు, పట్టణ, జలరవాణా సౌకర్యం, తరువాత పాత ఆయకట్టు స్థిరీకరణ అన్న విధానానికి లోబడి ఉన్నదని మహాసభ ప్రకటిస్తున్నది.నదీ జలాలపై హక్కు రైతాంగానిదే, ప్రజలదేనని; నీటి ప్రాజెక్టులు ప్రజల ఆస్థులని, వీటిని ప్రయివేట్ దోపిడీ శక్తుల వ్యాపార ప్రయోజనాలకు అప్పగించకుండా ప్రజలు అప్రమత్తతతో పోరాడాలని మహాసభ పిలుపునిస్తున్నది.

తెలంగాణ, రాయలసీమ, కోస్తా జిల్లా మెట్ట ప్రాంతాలకు సాగునీరందించడానికి ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువులు, రిజర్వాయర్లు నిర్మించి అందించాలి. అదేవిధంగా వాటికోసం ఉచితంగా గ్యాస్ ఆధారంగా, నీటి ఆధారంగా, బొగ్గు ఆధారంగా నిర్మించే విద్యుత్ ప్లాంట్ల నుండి 4 మాసాలు సరఫరా ఉచితంగా అందించాలని డిమాండ్ చేస్తున్నది.

8. పేదలకే దేవాదాయ భూములు పంచాలి.

రాష్ట్ర వ్యాపితంగా 3 లక్షల ఎకరాల దేవస్థానం భూములున్నాయి. వీటిలో అత్యధిక భూములు భూస్వాముల, పెత్తందార్ల ఆక్రమణలోనే నామమాత్ర కౌలుకి ఉన్నాయి. ఈ భూములను దళిత, పేద జనం డిమాండ్ చేస్తున్న పరిస్థితిలో ప్రభుత్వం వేలంపాటల పేరుతో తిరిగి భూస్వామ్య, పెత్తందార్లకే కట్టబెట్టాలని చూస్తున్నది. యస్.సి. కార్పోరేషన్ దళితుల తరపున పాటలోకి వస్తున్న కొన్ని చోట్ల పెత్తందార్లు పాటలనే వాయిదా వేయిస్తున్నారు. ఏ రకంగానైనా భూస్వామ్య, పెత్తందార్లకి కట్టబెట్టాలని ఉన్నతాధికారుల నుంచి క్రిందిస్థాయి ఉద్యోగుల వరకు శక్తివంతంగా చట్టంలోని అన్ని లొసుగులను వినియోగించి పనిచేస్తున్నారు. ఈ దేవస్థానం భూములలో అత్యధికం గతంలో లక్షలాది ప్రజలు వెట్టిచాకిరితో పోడుగొట్టి సాగులోకితెచ్చిన భూములే. ఈ భూములన్నింటిపైనా కష్టజీవులైన దళిత, పేద ప్రజలకే హక్కు అని మహాసభ ప్రకటిస్తున్నది.

ఈ భూముల సాగులో ఉన్న నిజసాగుదారులలో పేదలకి, భూస్వాముల చెరలోని భూములను దళిత పేదలకి ప్రభుత్వం పంపకం చేయాలని మహాసభ తీర్మానిస్తున్నది.

9. ప్రభుత్వం జయతీఘోష్ సిఫార్సులను అమలు పరచాలి.

రైతాంగ ఆత్మహత్యలు, పత్రికలలో వార్తలు, రైతు–రైతుకూలీ సంఘాల ఉద్యమాలు సాగించిన కృషి – వీటన్నింటి ఫలితంగా అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ రాష్ట్రప్రభుత్వం జయతీఘోష్ కమీషన్‌ను నియమించింది. రైతుల ఆత్మహత్యలు–రైతాంగ సంక్షోభంలో ప్రభుత్వాల బాధ్యత ఏవిధంగా ఉందో కమీషన్ తెలియజేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ కమీషన్ చేసిన కీలకమైన సూచనలను పక్కన పెట్టింది. కాలయాపన చేసే ఎత్తుగడలు అనుసరిస్తోంది. కమీషన్ చేసిన సూచనలలో రైతులకి తక్షణ, దీర్ఘకాలంలో ఉపయోగపడగల సూచనలన్నింటినీ అమలు పర్చాలని ప్రభుత్వాన్ని మహాసభ డిమాండ్ చేస్తోంది. కమీషన్ సూచనలను పకడ్బందీగా అమలు పర్చాలన్న డిమాండ్ కోసం బలమైన రైతాంగ ఉద్యమనిర్మాణం సాగించాలని మహాసభ రైతాంగానికి పిలుపునిస్తోంది.

10. కౌలు రైతులకు రక్షణ కల్పించాలి

రాష్ట్రవ్యాపితంగా కౌలురైతాంగం తీవ్ర దోపిడీకి గురౌతున్నారు. ముఖ్యంగా డెల్టా ప్రాంతాలలో, మెట్ట ప్రాంతాలలో భూకేంద్రీకరణ తీవ్రతను, భూదాహ పరిస్థితిని కౌలు రైతాంగ వత్తిడిరూపంలో చూడవచ్చు. కౌలు రైతాంగ ఆత్మహత్యలు ప్రతిరోజు పత్రికలలో కనిపిస్తున్నాయి.

కౌలు రైతాంగాన్ని రిజిష్టర్ చేయాలని, కౌలు రైతులకి రుణసౌకర్యం కల్పించాలని, కౌలురేట్లను సమంజస స్థాయికి తగ్గించేందుకు ప్రభుత్వం పూనుకోవాలని, మహాసభ డిమాండ్ చేస్తోంది. కౌలు రైతుల మధ్య పోటీ అనేది పేద రైతాంగానికి నష్టం కలుగచేస్తుందని గుర్తించి, పేద రైతాంగం ఐక్యం కాగలిగినప్పుడే తన మనుగడ అని గుర్తించాలనీ, కౌలు దోపిడీకి వ్యతిరేకంగా నిలవాలనీ మహాసభ కౌలురైతులకు పిలుపునిస్తోంది.

11. కేంద్ర ప్రభుత్వ ఆదివాసీ ముసాయిదా బిల్లులు– భూమి, నీరు అడవిపై గిరిజనుల హక్కును గుర్తించాలి.

కేంద్ర ప్రభుత్వ ఆదివాసీబిల్లు ముసాయిదాలను విడుదల చేసింది. గిరిజనులకి చారిత్రక అన్యాయం జరిగిందని చెపుతూనే ఆదివాసుల సహజ, న్యాయమైన హక్కులకు పరిమితులు విధిస్తూ ఆదివాసులను వారి ప్రాంతంలోనే పరాయివారిగా ఉంచే వలసపాలకుల కుట్రలను తొలగించలేదు. అడవితల్లి బిడ్డలను బయటనుంచి వెళ్లిన ప్రభుత్వం ఆక్రమణదారులంటున్నది. అసలు ఆక్రమణదారు ప్రభుత్వమే. అడవిలోని కలప, అటవీ సారవంతమైన భూములు, భూముల అడుగున గల అపార ఖనిజాలు, అందమైన దృశ్యాలు అన్నీ మార్కెట్ శక్తుల దృష్టిలో సరుకులే. వీటిని సరుకులుగా, లాభాలుగా మార్చేందుకు పాలకులు నిరంతరం సాగిస్తున్న కుట్రల ఫలితాలే. 1853 అటవీ విధానం నుండి 2005 విధాన పత్రాల వరకూ పాలకుల మాటలకీ, ఆచరణకీ సంబంధంలేదని; ఆచరణ మాత్రం ఆదివాసులను వారి భూమి నుంచి, అడవి నుంచి గెంటివేయడమేనని; ఇప్పటికే నిరాశ్రయులైన లక్షలాది ఆదివాసులే దీనికి రుజువు అని మహాసభ అభిప్రాయపడుతున్నది.

భూమి, నీరు, అడవి, సహజవనరులపై ఆదివాసీ సమాజాలకు గల హక్కులు తిరుగులేనివని; ఈ హక్కుల పరిరక్షణకై పోరాడాలని ఆదివాసీ ప్రజలకు మహాసభ పిలుపునిస్తున్నది. 1980 ఆఖరి గడువును తొలగించాలని, గిరిజనులపై ఫారెస్టు అధికారుల అధిపత్యం తొలగించాలని, అడవులలో నివసిస్తున్న గిరిజనులందర్ని వారి జీవించే హక్కును గుర్తించి గౌరవించాలని మహాసభ డిమాండ్ చేస్తున్నది.

12. రైతాంగాన్ని రుణభారం నుండి విముక్తి చేయాలి.

రైతాంగ ఆత్మహత్యలకి రుణభారం ప్రధాన కారణమని ప్రభుత్వం అంగీకరించింది. అదే సమయంలో బ్యాంకులు, సొసైటీల అప్పుల మీద మారిటోరియం ప్రకటించకుండా ప్రైవేటు రుణాలపై మారిటోరియం ప్రకటించింది. ఇది ప్రదర్మనాత్మక చర్య తంతు తప్ప మరేమీ కాదు. బడా పెట్టుబడిదారులు బాకీపడ్డ 46వేల కోట్ల రూపాయల అప్పును పారుబాకీ కింద రద్దు చేయడానికి సిద్ధపడిన ప్రభుత్వం, యూనిట్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా వంటి సంస్థల ప్రజాధనాన్ని ప్రైవేటు వడ్డీ వ్యాపారంలో తిప్పి నష్టపోతే యు.టి.ఐ.కి 13 వేల కోట్లు ఇచ్చిన ప్రభుత్వం; రైతుల అప్పుల రద్దుకి మాత్రం సిద్ధం కావడం లేదు. పేద, మధ్యతరగతి రైతులపైన, కౌలుదారులపైన ఉన్న అన్ని పబ్లిక్ ప్రైవేటు రుణాలను రద్దు చేయాలని; ప్రభుత్వ బ్యాంకులు ఇచ్చే రుణాల్లో 25 శాతం వ్యవసాయరంగానికి కేటాయించి, 4 శాతం సామాన్య వడ్డీ రేటును అమలుపరచాలని; 1938 రైతాంగ రుణ విమోచన చట్ట పరిధిలోకి ప్రభుత్వరంగ బ్యాంకులను, సొసైటీలను మినహాయిస్తూ 1984లో చేసిన కేంద్రప్రభుత్వ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నది.

13. జీవన వేతన చట్టాన్ని అమలు చెయ్యాలి.


రాష్ట్రంలో భూమిలేని వ్యవసాయ కూలీల సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. 1 కోటి 50 లక్షల మంది రాష్ట్రంలో వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. ప్రతి 5గురిలో ఒకరు వ్యవసాయకూలి. వ్యవసాయకూలీలకు కనీసవేతనాలు అమలుకావడం లేదు. కనీస వేతనాలకి ప్రభుత్వం ప్రతి 6 నెలలకి సవరణ చేయాల్సి ఉండగా 5 సం॥లుగా సవరణ జరపలేదు. ప్రకటించిన కనీస వేతనాలు ఒకే సీజనులో ఒకే పద్ధతిలో అమలు జరగడం లేదు. భూస్వాముల, మార్కెట్ శక్తుల దోపిడీనుండి పేద, మధ్యతరగతి రైతుల దృష్టిని మళ్ళించేందుకు కూలిరేట్ల సమస్యను వినియోగిస్తున్నారు. మరోప్రక్క భూస్వాములే ఇతర రైతులకంటే కూలీరేట్లు తక్కువ ఇవ్వడం, యంత్రాలను తెచ్చి అసలు పనులు లేకుండా చేయడం వంటి పనులు చేస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలను ఐక్యపరచుకొంటూ; భూస్వాముల తక్కువ కూలీ, మోసాలు, యంత్రాల వినియోగంలను ఎదుర్కోవాలని వ్యవసాయ కూలీలకు పిలుపునిస్తున్నాం.

అదే విధంగా కనీస వేతనాల చట్టంను సవరించి అమలు చేయాలని, అమలు చేసే యంత్రాంగంను అభివృద్ధి చేయాలని; యంత్రాల వాడకంను నిలుపు చేయాలని; కనీస వేతనం స్థానంలో జీవన వేతనం చట్టం కావాలని మహాసభ డిమాండ్ చేస్తున్నది. కూలీ పనులలో స్త్రీ, పురుష వివక్షత తొలగాలని; సమానపనికి సమాన వేతనం కావాలని మహాసభ డిమాండ్ చేస్తున్నది. ☆

మహాసభలో కళా ప్రదర్శనలు

6,7,8 జూన్ 2005న అనకాపల్లి పట్టణంలో విజయవంతంగా జరిగిన రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర మహాసభలో ప్రదర్శించిన వివిధ కళారూపాలు రాష్ట్రంలోని పలుప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రతి నిధులను, స్థానిక ప్రజానీకాన్ని ఉత్తేజ పూరితంగా ఆకర్షించాయి.

ముందుగా చిత్రకళాప్రదర్శనలో ప్రపంచ దేశీయ ప్రాముఖ్యం గల రేఖాచిత్రాలూ, ఫోటోలు ప్రదర్శించారు. రష్యా, చైనా విప్లవాలు; రెండవ ప్రపంచయుద్ధంలో కా॥స్టాలిన్ నాయకత్వాన హిట్లర్ ఫాసిజంపై త్యాగపూరిత వీరోచిత యుద్ధ విజయం; తెలంగాణ రైతాంగ పోరాటం సందర్భంగా కా॥ చిత్తప్రసాద్ గీసిన చిత్రాలూ; కా॥ సునీల్ జానీ అనే బొంబాయికి చెందిన ఫోటోగ్రాఫర్ తీసిన అరుదైన ఫోటోలు ప్రదర్శించారు. కా॥ మోహన్ సాంస్కృతిక సామ్రాజ్యవాదంపై గీసిన చిత్రాలు; సమకాలీన రాజకీయ, పీడిత ప్రజల జీవితాల్ని తెలియపర్చే చిత్రాలు కూడా ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. "ఎత్తిన జెండా దించకోయి" (నిశ్చలన దృశ్యరూపక ప్రదర్శన) లోని ఫోటోలు పీడిత ప్రజాఉద్యమ చరిత్ర ముఖ్య ఘట్టాలను పేర్చినట్టుగా వున్నాయి. ఈ చిత్ర కళా ప్రదర్శనను ప్రారంభించవలసిన పాడేరు నియోజకవర్గ గిరిజన ఎం.ఎల్.ఎ అనివార్య కారణాల వల్ల రాలేకపోయినందున ప్రజా సాహితి మాసపత్రిక సంపాదకవర్గ సభ్యుడు, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు అయిన దివికుమార్‌చే 6వ తేది ఉదయం 9-30 కు ఆవిష్కరించారు. "ప్రజా కళాకారులు ప్రజల జీవన సంక్షోభాల బాధల గాధలనే కాక; ఉద్యమాలను, పోరాటాలను కూడా ప్రతిబింబించి, స్ఫూర్తిదాయికంగా నిలవాలని; పీడిత ప్రజా ఉద్యమాభివృద్ధిలో అంతర్భాగంగా నిరంతరం ప్రజాజీవిత వికాసానికి, ఉద్యమా లకు నిబద్ధులై వుండాలని" దివికుమార్ తన ప్రారంభ సందేశంలో పేర్కొన్నారు.



కిందిరి నృత్యం

దీని వెంటనే "జనం పాటలు" క్యాసెట్‌ను కొండమొదలు పోరాటంలో కాకలు తీరిన 80 ఏళ్ళ వృద్ధ కామ్రేడ్ కుండ్ల రామిరెడ్డి ఆవిష్కరించారు. ప్రజాకళాకారులు అద్భుతంగా పాడిన జనసాహితి పాటల క్యాసెట్టుని మహాసభల ప్రాంగణంలో హాజరయిన వేలాది మంది ప్రతినిధులకు తొలిసారిగా వినిపించారు.

ఆ తర్వాత జరిగిన కళాప్రదర్శనలు నాల్గు విధాలుగా జరిగాయి. 1.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రజా కళా బృందాల ప్రదర్శనలు 2. ప్రజా కళాకారులచే ఉద్యమ గీతాలాపనలు 3. ప్రజా కళాకారులచే నృత్యరూపక ప్రదర్శనలు 4. ఔత్సాహిక కళాకారులచే ప్రదర్శన.

విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కళాకారులు జనం పాటలు మేళవించిన తగు విధమైన నాట్యవిన్యాసాలతో, తప్పెట గుళ్ళు కళారూపాన్ని ఉత్సాహమూ, ఉత్తేజమూ ఏకకాలంలో కలిగించే వేగవంతమైన చాతుర్యంతో ప్రదర్శించారు. ప్రేక్షకుల్ని విశేషంగా, సంభ్రమాశ్చర్యచకితుల్ని గావిస్తూ ఆకట్టుకున్నాయి.

విజయనగరం జిల్లా మక్కువ మండల ప్రాంత గిరిజన మహిళలు తమ సాంప్రదాయిక వేషధారణలతో తమదైన సవరభాషలో ఉద్యమ గీతాలనాలపిస్తూ కలిసికట్టుగా స్టేజి అంతా చలిస్తూ నర్తిస్తూ ప్రదర్శనలు యిచ్చారు.

ప్రజాకళారులు తమ డప్పు విన్యాసాల కనుగుణంగా పద విన్యాసాలు ఒకటి తర్వాత మరొకటి మార్చుకుంటూ ప్రదర్శించారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుండి విచ్చేసిన గిరిజన యువతీ యువకులు రేల పాటలను ప్రజాఉద్యమ గీతాలుగా వినిపిస్తూ తమ సాంప్రదాయిక నృత్య ప్రదర్శనలిచ్చారు.



జనసాహితి పాటల క్యాసెట్టును ఆవిష్కరిస్తున్న కామ్రేడ్ కుండ్ల రామిరెడ్డి, ప్రసంగిస్తున్న దివి కుమార్



మూడు జతలకాళ్ళూ- వేసే అడుగు ఒక్కటై
ఎన్నెన్నో మువ్వల అలజడి- ముక్తకంఠ నినాదమై
అశ్రువై, స్వేదమై, ఆగ్రహమై, ఆవేశమై, ఆలోచనై
పీడిత ప్రజా ఉద్యమాల సమైక్య కార్యాచరణకు
మార్గదర్శక సూత్రమై
రూపుకట్టిస్తున్న కళారూప దృశ్యోద్యమమిది!

- పి.ఎస్. నాగరాజు

పై ప్రదర్శనలన్నీ మహాసభ ప్రారంభసభ కంటే ఒక గంట ముందుగానే నిర్వహించారు. జెండా ఆవిష్కరణ సందర్భంగా "ఓ అరుణ పతాకమా", అమరవీరుల స్థూపావిష్కరణా నంతరం "అరుణారుణ బాటలో" ఆలపించారు. పీడిత ప్రజలకోసం, రైతుకూలీల కోసం ప్రాణ త్యాగం చేస్తూ ఉద్యమించిన అమరులకు జోహార్లు పలికారు. రైతుకూలీ సంఘం అధ్యక్షులుగా ఉంటూ, ఆఖరిశ్వాస దాకా ప్రజాఉద్యమ నిర్మాణానికొరకు మొక్కవోని పట్టుదలతో నిలిచిన కా॥మండ్ల సుబ్బారెడ్డి గారికి జోహార్లర్పిస్తూ కళాకారులు పాడిన పాటతో మహాసభ ప్రారంభోపన్యాసం కొనసాగింది.


మహాసభ జరిగిన మూడు రోజుల పాటు రాష్ట్ర పాటల బృందం, బాల కళాకారులు, వివిధ జిల్లాల బృందాలూ పీడిత ప్రజల రైతు, కూలీల నిత్య జీవన సమస్యలపై, ఉద్యమాలపై; ప్రజల కోసం అమరులైన వీరులపై; భూస్వామ్య దోపిడీకి, సామ్రాజ్యవాదుల కుట్రలకు వ్యతిరేకంగా; పాలకవర్గాల మోసపూరిత వాగ్దానాలను, అణచివేత విధానాలను బహిర్గత పరుస్తూ అనేక పాటల్ని వేదికల మీద నుండి సందర్భోచితంగా పాడి ఆడారు. చత్తీస్‌గడ్, ఒరిస్సా, కర్నాటక, తదితర రాష్ట్రాల నుండి వచ్చిన కళాకారులు తమ తమ భాషలో కొన్ని పాటలు వినిపించారు.

మొదటి రోజు మధ్యాహ్నం 2గం॥ల నుండి 2.45 దాకా సాగిన "ఎర్రజెండా" నృత్యరూపక ప్రదర్శన ప్రేక్షకుల్ని ఆకట్టు కోవటమే కాక ఉత్తేజితుల్ని చేసింది. చికాగో నగరంలో పుట్టిన ఎర్రజెండా - మన పల్లెల కొచ్చి పీడిత ప్రజలను నిద్రలేపి ఉద్యమింపజేసి, ఎనలేని త్యాగాల కోర్చి, మరింత ఎరుపవుతూ వస్తున్న కథను వివిధ పాటలు, వ్యాఖ్యానం, నృత్యాభినయం మేళవిస్తూ కమ్మికగా సాగిన ప్రదర్శన ప్రేక్షకులపై చెరగని ముద్రవేసింది.

మొదటి రోజు సాయంత్రం సాగిన ఊరేగింపులో ఉత్తేజితపూరిత ఆకర్షణగా కళా రూపాల ప్రదర్శనలు నిలిచాయి. ఊరేగింపుకి ముందుభాగాన డప్పు కళాకారులు, తప్పెట గుళ్లు, కిందిరి నృత్యం కళాబృందాలు సాగాయి. వర్షం విపరీతంగా కురిసి, రోడ్లన్నీ జలమయమైపోయినా, వర్షాన్ని లెక్కపెట్ట కుండా చెక్కుచెదరని విధంగా సాగిన కళాకారుల పట్టుదల ప్రజల్ని ఆకట్టుకుంది.

2వరోజు (రావుగోపాలరావు కళా మందిరం)న ఉపన్యాసాల నడుమ కళాకారులు జనం పాటలతో ఉత్తేజితుల్ని చేశారు. సాయంత్రం అనంతపురం, గుంటూరు, నెల్లూరు బాలకళాకారులు పాడిన పాటలు (ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో) ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. తదనంతరం 7.30కు పార్వతీపురం కళాకారులు వంగ పండు రాసిన "భూ భాగోతం" ప్రదర్శించారు. వాసు మాష్టారు దర్శకత్వం వహించి, స్వయంగా నటించి మెప్పించిన ప్రదర్శన- నృత్య, తాళ, గాన వ్యాఖ్యానాలతో కళాత్మకం గా ప్రదర్శించారు. "వర్గ రాజ్యం" పేదల పట్ల, రైతు కూలీల పట్ల-దోపిడీ, మోసకారితనం, అణచివేతలతో ఎలా వ్యవహరిస్తుందో ప్రదర్శన బహిర్గతపరిచింది. (భూ భాగోతం) కళా కారులు ప్రేక్షకుల అభినందనల్ని విశేషంగా చూరగొన్నారు.

3వ రోజు రాష్ట్రవ్యాపిత రైతుకూలీ ఉద్యమ నిర్మాణ పరిస్థితులను చర్చించిన సభలో జిల్లాల నుండి వచ్చిన కళాకారులు తమ తమ ప్రాంతాలలో ప్రత్యేకంగా పాడుకొను పాటలతో సహా సాధారణ గేయాల్ని కూడా గానం చేశారు. మూడు రోజుల పాటు సాగిన బాలకళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతినిధులు అందరూ ఉచ్చైస్వరంతో ఎత్తుకున్న "ఆకలిమంటలు మలమలలాడే....." అంతర్జాతీయ శ్రామికగీతం బరువుగాను, ఉత్తేజకరంగానూ సాగిన మహాసభలకు ఉత్తేజపూరిత ముగింపునిచ్చినట్లయింది. ☆



శ్రీ పి.వి. రమణ, మాజీ ఎం.ఎల్.ఎ., ఆహ్వాన సంఘ అధ్యక్షులు ఉపన్యాసం

రైతుకూలీ సంఘ మహా సభల కోసం ఈ అనకాపల్లి పట్టణానికి వచ్చిన వేలాది రైతుకూలీ గిరిజన సోదరులకు, మేధావులకి, మిత్రులందరికీ ఆహ్వానసంఘం తరపున స్వాగతం పలుకుతున్నాను. అనారోగ్యంగా ఉన్నప్పటికీ మీ అందరితో కలిసి ఈ మహాసభలలో పాల్గొనేందుకు సంతోషంగా ఉంది. ఎన్నో ఉద్యమాలు సాగిన ప్రాంతం ఇది. విద్య, గ్రంథాలయాలు, ఉన్నతమైన విలువల కోసం ఎంతో కృషి సల్పిన చరిత్ర కల ప్రాంతం ఇది. కష్టజీవులైన రైతాంగం, శ్రమజీవులు నేడు ఎన్నో సమస్యల్ని ఎదుర్కొంటున్నారు.పాలకుల విధానాల ఫలితంగా సాగునీరు లేక తీవ్ర కరవు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధరలేక, పెట్టుబడిరాక అప్పలపాలై రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడు. రైతు సమస్యల పరిష్కారానికి పోరాటం తప్ప మరోమార్గం లేదని, అందుకు రైతాంగం ఉద్యమించాలని కోరుతున్నాను.☆

2005 జూన్ 6,7,8 తేదీల్లో అనకాపల్లిలో జరిగే రైతు కూలీ సంఘం (ఎ.పి) రాష్ట్ర మహాసభలకు సహాయ సహకారాలు అందించండి !

ఆహ్వాన సంఘం విజ్ఞప్తి !

సోదర ! సోదరీమణులారా !

దేశమంటే మట్టికాదని/ దేశమంటే మనుషులని / సొంతలాభం కొంత మానుకుని/పొరుగువాడికి తోడ్పడమనే సమతాభావాల్ని, ప్రజాస్వామిక లౌకిక చింతనను వెదజల్లిన నవయుగ వైతాళికుడు, మహోన్నత మానవతావాది గురజాడ అప్పారావు గారికి జన్మనిచ్చింది ఈ జిల్లానే.

"పొలాలనన్నీ హలాల దున్ని / ఇలా తలంపై హేమం పిండగ/ జగానికంతా సౌఖ్యం నిండగ/బలం ధరిత్రికి బలికావించే/ కర్షక వీరుల కాయం నిండా/ కాలువ కట్టే ఘర్మ జలానికి, ధర్మ జలానికి/ ఖరీదు కట్టే షరాబులేడని" శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహాకవి శ్రీ శ్రీ పుట్టిన గడ్డ ఇది.

తెల్లవాడి గుండెల్లో నిదిరించి, తెలుగుజాతిలో పౌరుషాగ్ని రగిల్చి, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్యోద్యమ మహా యజ్ఞాన్ని ప్రారంభించింది మన జిల్లా నుండే.

ఇంకా మరెందరో నిష్కళంక దేశభక్తుల్ని, ప్రజాతంత్ర జాతీయవాదుల్ని, రైతాంగ, కార్మికోద్యమ నాయకుల్ని, ప్రజా కవుల్ని, కళాకారుల్ని సృజియించిన జిల్లా మనది. నిష్కళంక దేశభక్తులు, రైతాంగ ఉద్యమ నాయకులు కొమ్మారెడ్డి సత్యన్నారాయణమూర్తి గారు 'రైతు రక్షణయాత్ర' ను 1937 చివర్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుండే ప్రారంభించి మద్రాసు వరకు సాగించారు. శిస్తుల పేరుతో, లెవీ ధాన్యం పేరుతో రైతుల మూలుగుల్ని పీల్చి పిప్పి చేస్తున్న జమీందారీ, జాగీర్దారీ, మోఖాసాదార్లు, వారికి వత్తాసునిచ్చే తెల్లదొరల విధానాలకు వ్యతిరేకంగా కౌలుదార్ల రక్షణ కోసం, రుణభారానికి వ్యతిరేకంగా సాగిన ఈ రైతు రక్షణ యాత్ర యావత్ దేశ రైతాంగాన్ని ఉత్తేజపరిచింది. రాష్ట్ర వ్యాపితంగా రైతాంగ ఉద్యమాలు పెల్లుబికాయి. ఈ ప్రేరణతో మన ప్రాంతంలో చెఱకు రైతాంగం ఉద్యమించారు. చక్కెర ఫ్యాక్టరీ యజమానుల డిమాండ్ మేరకు బెల్లం ఉత్పత్తిని నిషేధించడానికి నాటి బ్రిటీష్ పాలకులు చేసిన ప్రయత్నాలను అనకాపల్లి మునగపాక ఏరియా రైతాంగం తీవ్రంగా ప్రతిఘటించారు. సంఘటితంగా ఉద్యమించి త్రిప్పికొట్టారు. ఇటువంటి రైతాంగ ఉద్యమాల ఫలితంగానే అసలు మించి వడ్డీని, చక్రవడ్డీని వసూలు చేయరాదని; ఆంధ్రప్రాత వ్యవసాయదారుల సహాయక చట్టం (1938) ని బ్రిటీష్ పాలకులు చేయాల్సి వచ్చింది.

58 ఏళ్ళ స్వతంత్ర పాలనలో మన వ్యవసాయరంగం ఏవిధంగా వుంది?

మన జిల్లా పరిస్థితినే చూద్దాం. బెల్లం ఉత్పత్తిలో దేశంలోనే ద్వితీయ స్థానంలో ఉన్నామని గర్వించాలా? లేక నేటికీ చోళ్ళు, గంటెలు లాంటి మెట్ట పంటల్నే ఎక్కువ భాగం భూముల్లో మన రైతాంగం ఎందుకు సాగుచేయాల్సి వస్తుందో ఆలోచించాలా ? చెరకు పంట కూడ వర్షాధార పంటగానే మన జిల్లాలోకొచ్చిందనే నిజాన్ని కాదనగలమా? నేటికి మెజారిటీ మండలాల్లో సాగునీరు – త్రాగునీరు తీవ్రమైన సమస్యగానే ఉంది. మెజారిటీ మండలాలు కరువు పీడిత మండలాలుగానే ఉన్నాయి. కాశ్మీర్ మొదలుకొని కన్యాకుమారి దాకా, అండమాన్ మొదలుకొని ఆసియా దేశాలన్నింటికీ పొట్టచేత బట్టుకొని వలసలు పోతున్న పరిస్థితి నేటికీ ఉత్తరాంధ్రలో నడుస్తున్న చరిత్రే.

ఇన్ని సమస్యలతో ఏటికి ఎదురీదుతూ మన రైతు వ్యవసాయం చేస్తూ, నానాటికీ ఋణభారంతో లోతుగా మరింత లోతుగా కూరుకున్నాడే తప్ప రుణవిమోచన కాలేకపోతున్నాడు. బ్రిటీష్‌వాడి కాలంలో శిస్తులు కట్టలేక పంట రాబడికి మించి పన్నుభారం పెరుగుతుంటే భరించలేక కొండలు, గుట్టలు పట్టి పారిపోయి పొరుగురాష్ట్రాల్లో తలదాచుకున్న పరిస్థితులు ఆనాడు ఉంటే; నేడు పంట పెట్టుబడులే తడిసి మోపెడై, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతుని నిలువునా కుంగదీస్తున్నాయి. విత్తనం, ఎరువులు, పురుగుమందులు ఇదొక విష వలయంగా మారి ఉరితాళ్ళుగా తయారై రైతు మెడను బిగుసుకుంటున్నాయి. ఉసురు తీస్తున్నాయి. పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నా మన జిల్లాలోని పేద, సన్నకారు రైతులు

గుడ్డిలో మెల్లగానైనా బ్రతుకుతున్నారంటే దానికి ప్రధాన కారణం పాడి పరిశ్రమే. ఇపుడు దానికి మంగళం పాడుతున్నారు. ప్రపంచ వాణిజ్యసంస్థ ఒప్పందాలకు మన పాలకులు తలవంచిన ఫలితంగా పాలు, వెన్న పాలపొడి చౌకగా విదేశాల నుండి వెల్లువగా వచ్చి పడడం మొదలైంది. ఈ విదేశీ కంపెనీల దెబ్బకు మన పాడి పరిశ్రమ సర్వనాశనం అయ్యే ప్రమాదం ఉందని మనదేశ వ్యవసాయరంగ శాస్త్రవేత్తలు తీవ్రంగా హెచ్చరిస్తున్నా మన పాలకులు నిమ్మకు నీరెత్తిన విధంగా ఉండడం ఆందోళన కలిగిస్తుంది.

అధికారంలో ఉన్న ఏ పాలకపార్టీలైనా, ఏ కూటమి ఐనా వ్యవసాయ కూలీల, పేద, మధ్య తరగతి రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను అనుసరిస్తే మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థే సంక్షోభపు సుడిగుండంలోకి చిక్కుకుంటుంది. ప్రపంచవాణిజ్య సంస్థ విధించిన షరతులపై మన పాలకులు పదేళ్ళ క్రితమే సంతకాలు పెట్టారు. ఆ షరతులు ఈ సంవత్సరం ఏప్రియల్ నెల నుండి మరింత ఉధృతంగా అమలు జరుగుతున్నాయి. దీనివల్ల మన రైతాంగం పెనం నుండి పొయ్యిలోకి నెట్టివేయబడుతున్నారు.

జయతీఘోష్ చైర్మన్‌గా నియమించిన రైతు సంక్షేమ కమీషన్ సూచనల్ని అమలుచేయమని రైతు-కూలీల సంక్షేమం కోసం పనిచేసే సంఘాలు ఐక్యంగా ఆందోళన చేయాలి.

నూటికి 70% మంది ప్రత్యక్షంగా ఆధారపడి బ్రతుకుతున్న వ్యవసాయరంగం ఇంత దారుణమైన నిర్లక్ష్యానికి గురై, మరణశయ్యపై చేరిన పరిస్థితి దాపురించిన తర్వాత కూడ చూస్తూ ఊరుకుందామా?

అధికారంలోకి రాకముందు రైతుల ఆత్మహత్యల్ని, వలసల్ని చూసి చలించిపోయిన నేటి మన ముఖ్యమంత్రి గారు "మేము అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయ రంగ సంక్షోభాన్ని సమగ్రంగా పరిశీలించడానికి వ్యవసాయరంగ నిపుణులతో ఒక కమీషన్ వేస్తాం. ఆ కమీషన్ ఇచ్చే సూచనల్ని తు.చ. తప్పకుండా అమలుచేస్తామ"ని పాదయాత్రలో పదే పదే ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ జయతీఘోష్ గారు చైర్మన్‌గా రైతు సంక్షేమ కమీషన్‌ను మన ప్రభుత్వం నియమించింది. ఆ కమీషన్ రాష్ట్ర నలుదిక్కులా తిరిగి వ్యవసాయ రంగ సంక్షోభాన్ని, రైతాంగ సమస్యల్ని కూలంకుషంగా పరిశీలించి, 174 సూచనలతో ఒక రిపోర్టును తయారుచేసింది. ఆ కమీషన్ తన నివేదికలో ఈ విధంగా పేర్కొంది. "కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రెంటి స్థాయిల్లోనూ గత దశాబ్దంలో అనుసరించిన ఆర్థికవ్యూహం, రైతులకు కల్పించిన రక్షణలను పద్ధతి ప్రకారం తగ్గించి వేసి ఎలాంటి నియంత్రణలూ లేకుండా మార్కెట్టులో ఎగుడుదిగుళ్ళకూ, ప్రయివేటు లాభార్జనకూ గురిచేసింది. ప్రభుత్వ వ్యయంలో కీలక అంశాలను తగ్గించి వేసింది. ముఖ్యమైన ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేసింది" అని. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సంక్షోభానికి గల మూలకారణాలను కుండబద్దలు కొట్టినట్లు స్పష్టంగా పేర్కొంది. రైతాంగాన్ని ఆదుకోవడానికి తక్షణ, దీర్ఘకాలికంగా చేపట్టాల్సిన 174 సూచనల్ని ప్రభుత్వం ముందు ఉంచింది. ఈ కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యత ఈ రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్న అన్ని సంఘాలపై ఉంది. రైతుసంఘాలు తమ మధ్య ఎన్ని అభిప్రాయ బేధాలు, భిన్నాభిప్రాయాలు ఉన్నా వాటినన్నింటిని ప్రక్కనబెట్టి "రైతు సంక్షేమ కమీషన్" చేసిన సూచనల్ని అమలుచేయమని మన ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి. రైతాంగాన్ని ఐక్యంచేసి ఐక్య ఆందోళనా కార్యక్రమాలను రూపొందించుకొని రైతాంగ శ్రేయస్సు కోసం, వ్యవసాయరంగ పరిరక్షణ కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

ఈ పరిస్థితుల్లో మన విశాఖ జిల్లా అనకాపల్లిలో జరుగుతున్న రైతుకూలీ సంఘం (ఎ.పి) రాష్ట్ర మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుండి రైతులు, కూలీలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు హాజరవుతున్నారు. బస్తర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన డా॥ బి.డి శర్మగారు, ప్రొఫెసర్ కె. ఆర్. చౌదరి గారు తదితరులు హాజరవుతున్నారు. మహాసభలకు హాజరయ్యే ప్రతినిధులకు, ప్రజలకు ఆతిథ్యం ఇవ్వడానికి వివిధ రంగాలకు చెందిన మేము ఆహ్వానసంఘంగా ఏర్పడి ఆర్థిక - పాదార్థిక సహాయ సహకారాల కోసం మీముందుకు వస్తున్నాం. మహాసభల విజయవంతానికి మీవంతు సహకారం అందించగలరు.

అభినందనలతో

ఆహ్వానసంఘం, ఉత్తరాంధ్ర జిల్లాలు

అనకాపల్లి,
2-5-05

ఆహ్వాన సంఘం

అధ్యక్షులు: **శ్రీ.పి.వి.రమణగారు,** మాజీ శాసనసభ్యులు, రైతు ఉద్యమనాయకులు,
కార్యదర్శి: **ఆదారి అప్పారావు,** ఎ.పి. కార్మికసంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నవకార్మికశక్తి పత్రికా ఎడిటర్
కోశాధికారి: **పి.కోటిరెడ్డి,** ఎ.పి.ఎఫ్.టి.యు.నాయకులు

1. **మళ్ళసాంబశివరావుగారు,** మాజీ మున్సిపల్ ఛైర్మన్
2. **వాడపల్లి సుబ్బరాజు,** మాజీ సర్పంచ్, తుమ్మపాల
3. **ఎ.వి.యస్. అప్పారావు,** కార్యదర్శి, దినవేతన కార్మికసంఘం, తుమ్మపాల
4. **మాదేటి అప్పారావునాయుడు,** నీటిసంఘం అధ్యక్షులు, తుమ్మపాల
5. **భీశెట్టి చంటిబాబు,** అధ్యక్షులు, తాపీ కార్మికసంఘం, తుమ్మపాల
6. **పీలా మురళీమోహనరావు,** నెహ్రూ యువకకేంద్రం, తుమ్మపాల
7. **నల్లా ప్రేమ్‌కుమార్,** జనతాదళ్ (ఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అనకాపల్లి
8. **హుస్సేన్,** అడ్వకేట్, మసీదు సంఘం ప్రెసిడెంట్
9. **పావాడ కామరాజు,** జిల్లా ప్రధాన కార్యదర్శి, దళిత బహుజన శ్రామిక యూనియన్
10. **మాటూరి అప్పారావు** , కోట్నివీధి, అనకాపల్లి
11. **టి. హయగ్రీవరావు,** సీనియర్ జర్నలిస్టు, కళింగవేదిక కన్వీనర్
12. **ఎస్.ఎ. దావూద్ అలీ,** ఆర్.ఇ.సి. ఎక్స్.ఎం.డి. మరియు మదీన మసీదు సంఘం అధ్యక్షులు
13. **ఎ.కొండలరావు,** అధ్యక్షులు, అనకాపల్లి దర్జీల సంఘం
14. **శివయ్యగారు,** అడ్వకేట్, అనకాపల్లి
15. **బుద్ధ త్రినాధరావు,** అడ్వకేట్, అనకాపల్లి
16. **దాడి రవి,** లారీ ఓనర్, అనకాపల్లి

17. **సూరిశెట్టి సన్యాశిరావు**, ప్రెసిడెంట్, కొలగార్ల సంఘం, ఎన్.టి.ఆర్. మార్కెట్ యార్డు.
18. **బుద్ద నూకరాజు**, ప్రెసిడెంట్, అనకాపల్లి గాంధీమార్కెట్ కార్మికసంఘం
19. **పెంటకోట సోములమ్మ**, ప్రెసిడెంట్, మహిళా కార్మికసంఘం, గాంధీమార్కెట్
20. **పైడమ్మ**, ప్రెసిడెంట్, దుర్గామహిళా కార్మికసంఘం, గాంధీమార్కెట్
21. **చుక్కల రాజారావు**, జిల్లా మాజీ గౌరవాధ్యక్షులు, వ్యవసాయకార్మికసంఘం, నర్సీపట్నం.
22. **రాపర్తి వెంకట్రావు**, విలేఖరి
23. **ఆళ్ళ కాశీ విశ్వనాధం**, మార్కెటింగ్ మేనేజర్, ప్రజాప్రతినిధి మాసపత్రిక
24. **యం.యస్.వి. కుమార్**, బి.కె.యస్. జిల్లా ప్రధానకార్యదర్శి
25. **ఎ. సర్వేశ్వరరావు**, ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల సంక్షేమ సంఘం నాయకులు, సబ్బవరం
26. **రామసూరి**, ప్రెసిడెంట్, కల్లుగీత కార్మికసంఘం, నాగులాపల్లి
27. **ఆదారి సాంబమూర్తి**, గణపర్తి
28. **జగన్నాధరాజు**, అడ్వకేట్, అనకాపల్లి
29. **బుద్దపెంటారావు**, ప్రెసిడెంట్, నూకాంబిక ఆటోవర్కర్స్ యూనియన్.
30. **డా॥ కె. విష్ణుమూర్తి**, ఎమ్.యస్.చైర్మన్, వివేకానంద చారిటబుల్ ట్రస్టు మాజీ అధ్యక్షులు, ఐ.ఎమ్.ఎ., అనకాపల్లి బ్రాంచ్
31. **డా॥ కె. నాగేశ్వరరావు**, ఎమ్.డి. అనకాపల్లి
32. **పొలమరశెట్టి గణేష్**, ఎమ్.పి.టి.సి., మాజీ అధ్యక్షులు, రైతుసంఘం.
33. **సింహాద్రప్పడు**, జిల్లా గౌరవాధక్షులు, ఎ.పి.టి.ఎఫ్.
34. **కె.వి.రమణ**, ఎ.పి.టి.ఎఫ్. జిల్లా అధ్యక్షులు
35. **బి. వెంకటపతిరాజు**, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎ.పి.టి.ఎఫ్.
36. **కె.రామారావు**, బి.హెచ్.పి.వి. ఎ.పి.ఎఫ్.టి.యు.
37. **సి.హెచ్.జగదీశ్వరి**, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా కన్వీనర్
38. **దంతులూరి వర్మ**, విజయనగరం జిల్లా కార్యదర్శి, రైతుకూలీసంఘం
39. **సి.హెచ్. నారాయణరావు**, ఓ.పి.డి.ఆర్. ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్
40. **వి.యస్. కృష్ణ**, మానవహక్కుల వేదిక, విశాఖపట్నం
41. **టి. శ్రీరామమూర్తి**, ఎ.పి.సి.ఎల్.సి., జిల్లా అధ్యక్షులు
42. **ముప్పన మల్లేశ్వరరావు**, (నిర్మలానంద) వర్కింగ్ ఎడిటర్, ప్రజాసాహితి, ఎస్.కోట.
43. **అట్టాడ అప్పల్నాయుడు**, కథా రచయిత, జనసాహితి.
44. **గొర్లెపాపారావు**, క్వారీ వర్కర్స్ యూనియన్
45. **కోడ్రోతు అప్పలనాయుడు**, క్వారీ కార్మిక సంఘం కార్యదర్శి
46. **ఒ.వి.వి.యస్. రామకృష్ణ**, జనసాహితి, చోడవరం
47. **సవరాల గణేష్**, నవయువ సమాఖ్య, చోడవరం
48. **తాండ్ర ప్రకాష్**, రాష్ట్ర సహాయ కార్యదర్శి, రైతుకూలీసంఘం, ఎ.పి. శ్రీకాకుళం
49. **ఇల్లా రామిరెడ్డి**, రాష్ట్ర కన్వీనర్, గిరిజన-గిరిజనేతర పేదల హక్కుల పరిరక్షణ కమిటి
50. **విజయానంద్**, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఒ.పి.డి.ఆర్) చోడవరం
51. **సి.హెచ్. ప్రభాకరరావు**, రాష్ట్రకార్యదర్శి, ఎ.పి.టి.ఎఫ్, శ్రీకాకుళం
52. **ఎస్. నూకాచారి**, సామాజిక చైతన్యవేదిక,చోడవరం
53. **టి.అరుణ**, స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, శ్రీకాకుళం
54. **పి. కాత్యాయిని**, అడ్వకేట్, అనకాపల్లి
55. **మాధురి**, అడ్వకేట్, అనకాపల్లి
56. **కడలి రామచంద్రరావు**, అడ్వకేట్, ఎలమంచిలి
57. **డా॥ మానేపల్లి**, అవగాహన, యలమంచిలి
58. **నునబర్తి నాగేశ్వరరావు**, అధ్యక్షులు, ఆది ఆంధ్రసంఘం, భీమునిగుమ్మం
59. **ఐ.టి.ఆర్.వి. శివాజీరావు**, కథా రచయిత, అనకాపల్లి
60. **డా॥ బాబీవర్ధన్**, జర్నలిజం డిపార్టుమెంట్, ఆంధ్రా యూనివర్శిటి, విశాఖపట్నం
61. **డా॥ కె.ఎస్.చలం**, ఆంధ్రాయూనివర్సిటి,విశాఖపట్నం
62. **కాంద్రేగుల రామునాయుడు**, రైతునాయకులు, సోమినాయుడుపాలెం, పరవాడ మండలం
63. **మళ్ళ లక్ష్మీనాయుడు**, మాజీ సర్పంచ్, ఆర్.ఇ.సి. మాజీ చైర్మన్, గొబ్బూరు
64. **వెలగ వీరభద్రరావు**, జిల్లా దేవాదాయ, ధర్మాదాయ, రైతుసంఘం అధ్యక్షులు, చిన్నదొడ్డిగల్లు, నక్కపల్లి మండలం
65. **బొలిశెట్టి లోకనాధ ఈశ్వర ప్రసాద్**, ప్రెసిడెంట్ హనుమ వినాయక మినీ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్సు అసోషియేషన్, అనకాపల్లి
66. **రాంబాబు**, సర్పంచ్, సి.హెచ్.యన్. అగ్రహారం
67. **ఈర్లదేవుడు**, ప్రెసిడెంట్, కళాసీసంఘం, చోడవరం
68. **శ్రీశైలం రాజారావు**, స్వర్ణకారుల సంఘం, చోడవరం
69. **పెమ్మ బాబ్జీ**, అధ్యక్షులు, బాలగణపతి భవన నిర్మాణ కార్మికసంఘం, చోడవరం
70. **కరణం రాము, గూనూరు నాయుడు**, అధ్యక్ష-కార్యదర్శులు, సంపత్ వినాయక ఆటోడ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, చోడవరం
71. **నౌడు దేవుడు, కొల్లసోమినాడు**, అధ్యక్ష-కార్యదర్శులు, శ్రీ వెంకటేశ్వర లేబర్ సంక్షేమ సంఘం, చోడవరం
72. **గూనూరు ప్రభాకరరావు**, కార్యదర్శి, పాన్‌షాపు వర్తకుల సంక్షేమ సంఘం, చోడవరం
73. **టి.వి. రమణ**, కార్యదర్శి, వినియోగదారుల సంక్షేమ సంఘం, చోడవరం
74. **ముత్యం రాంమూర్తి**, సాహితీవేత్త, సీనియర్ పాత్రికేయులు, చోడవరం
75. **ముమ్మిడివాసు, ఆకులదేవుడు**, అధ్యక్ష-కార్యదర్శులు, బాలగణపతి భవన నిర్మాణ కార్మికసంఘం, నరసయ్యపేట.
76. **బి.వెంకటరమణ**, ఉత్తరాంధ్ర కన్వీనర్, ప్రగతిశీల వ్యవసాయ కూలీసంఘం
77. **టి.లలిత**, రీజనల్ కార్యదర్శి ఆర్.టి.సి. ఎంప్లాయీస్ యూనియన్, శ్రీకాకుళం
78. **టి. సంజీవ్**. పి.డి.ఎస్.ఒ. రాష్ట్ర అధ్యక్షులు
79. **ఎస్.కె. పీర్‌సాహెబ్**, ఎ.పి.ఎఫ్.టి.యు, విశాఖపట్నం
80. **నాగులాపల్లి సత్యనారాయణ**, వ్యవసాయకూలీసంఘం, విశాఖజిల్లా కార్యదర్శి
81. **మామిడి క్రాంతి**, అడ్వకేట్, జూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, శ్రీకాకుళం
82. **దూసి బాబూరావు, మన్నే నాగరాజు** అధ్యక్ష-కార్యదర్శులు, అరబిందో ఫార్మావర్కర్స్ యూనియన్
83. **జి. శ్రీనివాసరావు**, జోనల్ కార్యదర్శి, విద్యావలంటీర్ల సంఘం, చోడవరం
84. **పి.యస్. అజయ్‌కుమార్**, వ్యవసాయ వృత్తిదారులయూనియన్ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి
85. **కె. ఫల్గుణరావు**, అడ్వకేట్, విజయనగరం
86. **డి. వెంకటేశ్వరరావు**, క్లాత్ మర్చంట్, చోడవరం
87. **దూది సోమేశ్వరరావు, దూదిరామారావు**, అధ్యక్ష- కార్యదర్శులు, అఖిల గాండ్ల తెలుకల సంఘం, చోడవరం
88. **మళ్ళ జయరామ్**, ప్రెసిడెంట్, బార్ అసోసియేషన్, అనకాపల్లి
89. **జి. ఉష**, స్త్రీవిముక్తి సంఘటన - అనకాపల్లి ☆

కార్మిక కర్షక ఐక్యత వర్ధిల్లాలి! *సంఘటిత ఉద్యమాలే శరణ్యం !!*

జూన్ 6.7 తేదీల్లో అనకాపల్లిలో రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.)

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి!

వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నది. వ్యవసాయకూలీలు, రైతాంగం, చేతివృత్తులవారు సంక్షోభవలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. విత్తనాలు, పురుగుమందుల ధరలు రోజురోజుకీ పెరిగిపోవటంతో పంట ఖర్చులు ఎక్కువై అప్పులు తెచ్చి సాగుచేయ వలసిన దుస్థితి రైతాంగానికి ఏర్పడింది. రైతుకి కావాల్సిన పెట్టుబడిలో 20 శాతం కూడా ప్రభుత్వ బ్యాంకులు అందించటం లేదు. కౌలురైతుకి ఇది కూడా అందటంలేదు. దీని వలన ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గరకు వెళ్ళక తప్పటం లేదు. ప్రభుత్వ సరఫరా,నియంత్రణ తగ్గిపోవటంతో కల్తీ ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు మార్కెట్‌ని ఆక్రమించి రైతులను నిలువునా ముంచుతున్నాయి. నకిలీ విత్తనాలతో పాటు, సాగునీరు అందక పంట నష్టపోయి, అప్పుల ఊబిలో చిక్కుకొని పేద – మధ్య తరగతి రైతులు తమ స్థిరాస్థులు అమ్ముకొన్నా అప్పులుతీరే మార్గం కన్పించలేదు. చేతి వృత్తులు మూలబడ్డాయి.

ప్రభుత్వ విధానాల ఫలితంగా వచ్చిన సంక్షోభంతో ఆహారపంటల విస్తీర్ణం తగ్గిపోతూ వస్తున్నది. భూమి పట్టణ ధనాఢ్య వర్గాల చేతుల్లోకి మారి తోటల పెంపకం పెరిగింది. దీనికితోడు సాగునీరు లభ్యం కాకపోవటంతో పనిదినాలు తగ్గిపోయాయి. ఫలితంగా పనులులేక వ్యవసాయ కూలీలు గ్రామాలు వదలి పట్టణ ప్రాంతాలకు వలసలు పోతున్నారు. ఈ లోతైన సంక్షోభపు తీవ్రమైన పరిస్థితే రైతాంగ ఆత్మహత్యలు.

ఈ పరిస్థితి 1980లో ప్రారంభమై 1990లో ఊపు అందుకున్న ప్రపంచీకరణ సంస్కరణల విధానాల ఫలితమే. వ్యవసాయరంగం సంక్షోభం నుండి రైతాంగానికి రక్షణ కల్పించే చర్యలుచేపట్టమని ఎన్ని విజ్ఞప్తులు, ప్రదర్శనలు, ఆందోళనలు చేసినా ప్రభుత్వం అందుకు చర్యలు తీసుకోకపోగా, తన విధానాలను ఏ మాత్రం మార్చుకోలేదు. దీనిని వ్యతిరేకించి సాగునీటి కోసం, కరెంటు ఛార్జీల తగ్గింపు కోసం ఆందోళన చేసిన రైతులపై నిర్భంధాన్ని ప్రయోగించి కేసులు పెడుతున్నది. నూతన వ్యవసాయక విధానాన్ని ప్రకటించి దేశ ప్రజల, రైతుల అవసరాన్ని బట్టి కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌ని అనుసరించి పంటలు సాగుచేయాలని, ఇది చేతకాక పోతే కాంట్రాక్టు ఫార్మింగ్‌తో బూర్జువాలకు బానిసలు కానుంది. రైతులకు చివరి ఆశగా ఉన్న ప్రభుత్వ కొనుగోలు సంస్థలను రంగం నుండి తప్పించి, రైతులను దళారుల కబంధ హస్తాల్లోకి నెట్టింది. మార్కెట్ యార్డుల ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టింది. రైతాంగాన్ని మభ్యపెట్టడానికి రైతుబంధు పథకాలను ప్రవేశపెట్టి ఆచరణలో వాటిని వ్యాపార వర్గాలకు డబ్బును సమకూర్చిపెట్టే విధంగా అమలుచేసింది. పనికి ఆహారపథకం గ్రామీణ పేదలకు ఆశలు కల్పించింది తప్ప, ఆచరణలో పేదలకు ఉపయోగపడలేదు.

గత ప్రభుత్వ విధానాలను దుయ్యబడుతూ రైతుల రుణాల మాఫీ, ఉచిత విద్యుత్, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి వాగ్దానాలతో ఎన్నికల బరిలోకి దిగి కాంగ్రెస్ గెలిచింది. రైతుల విద్యుత్ రుణాల మాఫీ, ఉచిత విద్యుత్‌పై సంతకాలు చేసింది. ఆచరణలో ఉచిత విద్యుత్‌ని నీరుకారుస్తున్నది. అనేక రైతు వ్యతిరేక విధానాలతో ముందుకు వస్తున్నది. 46వేల కోట్లతో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తానని టెండర్లు పిలిచి పనులు చేపట్టింది. ముంపు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడంలో, భూములకు నష్టపరిహారం చెల్లించడంలో గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తున్నది.

ఇలాంటి సంక్షిష్ట సంక్షోభ పరిస్థితుల్లో రైతు – కూలీల సమస్యలపై రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) అనేక ఆందోళన, పోరాట కార్యక్రమాలు చేపట్టింది.

ప్రాజెక్టుల నిర్మాణం వలన ముంపుకి గురయ్యే గ్రామాల ప్రజలకు సరైన పునరావాసం, ముందుగానే నష్టపరిహారం చెల్లించాలని ఆందోళన చేపట్టింది. తోటపల్లి, జంఝావతి, వంశధార, పోలవరం ప్రాజెక్టుల ముంపుకు గురైన ప్రజలను ఆర్గనైజ్ చేసి పోరాటాలు నిర్వహిస్తున్నది. అరెస్టులు, లాఠీఛార్జీ, కేసులను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నది. గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టం అమలు జరిపి గిరిజనులకు భూములు యివ్వాలనే డిమాండ్‌తోపాటు, గిరిజనులను భూముల ఆక్రమణకు సిద్ధం చేసింది. బంజరు, దేవాలయ భూములు, అటవీబంజర్లు, శోత్రియ భూములు, మిగులు భూములు పేదలకు పంచాలని పోరాటాలు చేసి కొన్ని విజయాలు సాధించింది. పర్యావరణ సమస్యలపై ఆందోళన చేసింది. పంటలకు గిట్టుబాటు ధరలు, మార్కెట్ సౌకర్యం కల్పించాలని; ఎరువులు, పురుగుమందు ధరలు తగ్గించాలని; రైతులకు సబ్సిడీలు పెంచాలని; కరువు నివారణకు, వలస నివారణకు చర్యలు తీసుకోవాలని పోరాటాలు జరిపింది. ఎరువులు-విత్తనాలు ప్రభుత్వమే సరఫరా చేయాలని; నకిలీ విత్తనాలు, పురుగుమందులను అరికట్టాలని, ప్రాజెక్టులు పూర్తిచేసి సాగునీరు – త్రాగునీరు అందించాలని; కరువు ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించాలని; ఆత్మహత్యలు చేసుకొన్న రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని ఆందోళనా – పోరాటాలు చేసింది. రాష్ట్ర వ్యాపితంగా ఇంకా అనేక పోరాటాలు చేపట్టి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నది. వ్యవసాయరంగ సంక్షోభం పరిష్కార మార్గాలను వివరించే సాహిత్యాన్ని ప్రజలకు అందించే కృషి రైతుకూలీ సంఘం చేపట్టింది.

ఇలాంటి ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) 2001లో గుంటూరులో ఏప్రిల్‌లో మూడు రోజులపాటు రాష్ట్ర మహాసభలు జరపుకొని, అనేక సమస్యలు చర్చించి కార్యక్రమాలను రూపొందించుకొంది. నాటి నుండి వాటిని అమలు జరిపింది. ఇప్పటి వరకు సాగించిన కార్యక్రమాలను సమీక్షించుకొని, మరింత సంఘటితంగా ఉద్యమాలు చేపట్టడానికి, భవిష్యత్తు కర్తవ్యాలు రూపొందించుకోవటానికి 2005 జూన్ 6,7,8 తేదీల్లో అనకాపల్లిలో రాష్ట్ర మహాసభలను జరుపుకొంటున్నది. ఈ మహాసభల్లో వ్యవసాయరంగ మేధావులు, రైతు ఉద్యమ నాయకులు పాల్గొంటారు. ఈ మహాసభలు విజయంతం కావటానికి ఆర్థిక సహకారంతో పాటు అన్ని విధాల సహకారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

14-5-2005,అనకాపల్లి.

రైతుకూలీ సంఘం, ఆంధ్రప్రదేశ్

బి.వి.సుబ్బయ్య రెసిడెన్షియల్ స్కూల్ & కాలేజ్

స్థాపితం:1963

పేర్నమిట్ట పోస్టు, యస్.యన్.పాడు మండలం, ప్రకాశంజిల్లా, ఫోన్ : (08592)256232,256295

తల్లిదండ్రులకు ముఖ్య విజ్ఞప్తి

సమాజ శ్రేయస్సే వ్యక్తి శ్రేయస్సు అను సూక్తి విద్యాబోధనలో మార్గదర్శక సూత్రము. విజ్ఞానము మానవులకు ప్రాణము. విద్యాసంస్థలు ఈ విజ్ఞానమును ప్రజలందరకును రేపటి పౌరులైన బాలబాలికలకునూ, యువతీ యువకులకునూ అందజేయుటకు ఏర్పడినవి.

మానవుడు భూమిపై జీవించుట ప్రారంభము నుండి తన జీవన అవసరములను ప్రకృతి నుండి తీర్చుకొనెడివాడు. ఈ ప్రయాణములో కలుగు అనుభవ సారాంశమునే విజ్ఞానమందురు. జీవిత ప్రయాణములో వ్రాయుట, చదువుట అభివృద్ధి చెందినవి. తనకు కలుగు అనుభవాలలో వచ్చు విజ్ఞానమును ఈ అక్షర జ్ఞానముతో గ్రంథ రూపంలో ఇతరులకు అందునట్లు చేసినాడు. ఈ విజ్ఞానము భావిపౌరులైన బాలబాలికలకు, యువతీయువకులకు అందజేయుటకు పాఠశాలలను ఏర్పాటుచేసినారు.

ఈ పాఠశాలలను ప్రభుత్వము ఏర్పాటుచేసి తానే సుదీర్ఘకాలము నిర్వహించినది. ఆ దశలో పాఠశాలలు అమూల్యమైన విజ్ఞానమును ఎల్లరకు సమగ్రముగా అందించుచుండినది. ఆ దశలో విద్యార్థులకు సమగ్ర జ్ఞానమందించగల విశిష్ట బోధనా పద్ధతులను అమలు జరుపుచుండెడిది. అందువలన ఆదశలో అందరకును సంపూర్ణ జ్ఞానము అందుచుండెను. ఈ కర్తవ్య నిర్వహణలో బోధనా పద్ధతుల ప్రాధాన్యత అపారమైనది.

ఈ పద్ధతిలో ప్రతి విద్యార్థికి అర్థమగునట్లు బోధించుట ప్రధానమైన పునాది. ప్రతి విద్యార్థికి అర్థమగునట్లు బోధించుటకు ఒక్కొక్క సెక్షన్‌లో స్థాయిని బట్టి పరిమిత సంఖ్యలో ఉంచెడివారు. ఆ విధానము కొనసాగినంత కాలము అమూల్యమైన విజ్ఞానము విద్యార్థులందరుకు లభించేది. ప్రతి విద్యార్థి తన స్థాయిని బట్టి సమగ్ర జ్ఞానముతో నైతిక విలువలతో తన బాధ్యతలు నిర్వహించేవాడు. సమాజ జీవితంలో ప్రజల నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చెడివాడు. పరీక్షలలో ద్రోహపూరిత, నీతిబాహ్యమైన కాపీలు చేయు చర్యలకు స్థానముండెడిదికాదు. మోసపు పద్ధతులలో మార్కులు వేసి తల్లిదండ్రుల మెప్పును పొందుటకు ప్రయత్నము చేసెడివాడుకాదు. సమగ్రమైన విజ్ఞాన సంపన్నునిగా ఉన్నతస్థాయిలో నైతిక విలువలు కలవానిగా సమాజ శ్రేయస్సే తన శ్రేయస్సు అను సత్యమును జీర్ణించుకొని నవానిగా జీవితరంగములో ప్రవేశించి తన బాధ్యతను ఆదర్శప్రాయముగా నిర్వహించెడివాడు. సంపూర్ణ విజ్ఞానము నిచ్చు ఈ బోధనా పద్ధతిని స్వయంగా జవాబులు వ్రాయు పద్ధతి అందురు.

ఇప్పటికి కొన్ని దశాబ్దాల ముందునాటి వరకు ఇటువంటి విశిష్ట స్థితి కొనసాగినది. దాదాపు 5-6 దశాబ్దాల క్రితము పాఠశాల నిర్వహణపై ప్రభుత్వ శ్రద్ధ తగ్గుట ప్రారంభమైనది. అందువలన ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాము తగ్గి ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడుట ఎక్కువైనది. ఆ ప్రైవేటు వ్యక్తులే పాఠశాలలను నిర్వహించుట మొదలుపెట్టినారు. ప్రైవేటు నిర్వాహకులు వారికి లాభము సంపాదించిపెట్టు వ్యాపార కేంద్రములుగా విద్యాసంస్థలను ఉపయోగించుకొనుచున్నారు. ఈ స్థితి ప్రాథమికదశ నుండి అత్యున్నత దశ వరకు కొనసాగుచున్నది.

విద్యార్థులకు విజ్ఞానము అందించకుండానే మోసపు పద్ధతిలో మార్కులు తెప్పించు పద్ధతిని బట్టీ బోధనా విధానము అందురు. అమూల్యమైన విజ్ఞానమును ప్రజలకు అందకుండా చేయు ఈ దుష్టశక్తిని విద్యారంగమునుండి క్రుంగటేళ్ళతో పీకి వేయుట ప్రజలందరి తక్షణ కర్తవ్యము.

ఈ విధానము విద్యారంగములో అన్ని దశలలోనూ విజ్ఞానాభివృద్ధికి తీవ్రమైన హాని కలిగించుచున్నది. ఈ పరిస్థితి సర్వ ప్రజల శ్రేయస్సును హాని కలిగించు ఘోరమైన విషయము. ఈ ఘోరమైన విషయానికి బాధ్యులు ఎవరైనా, దశాబ్దములుగా నష్టపడుచున్నది ప్రజలు కనుక తల్లిదండ్రులు మేల్కొని తీవ్రముగా పోరాడి ఈ దుష్టశక్తి అయిన బట్టీ బోధనా విధానమును విద్యారంగము నుండి పీకి భూస్థాపితము చేయవలయును.

మా మాట

మా సంస్థలో గత రెండు దశాబ్దాలుగా బట్టీ చదువుకు స్థానమే లేకుండా తరిమివేసి ఘనమైన ఫలితములు సాధించుట సాధ్యపడుచున్నదని తల్లిదండ్రులందరకు తెలియజేయుచున్నాము. ఈ విషయము మా సంస్థలో చదివిన, చదువుతున్న వేలాది విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలిసిన విషయమే.

- **వ్యక్తిగత లాభమునకు స్థానము లేనందున బట్టీ చదువును తరిమి వేయగలిగినాము.**
- **తల్లిదండ్రులు ఐకమత్యముతో పోరాడి సమాజ శ్రేయస్సు కొరకు విద్యారంగము నుండి బట్టీబోధనా విధానమును తరిమివేయుట అతి ప్రధానమైన తక్షణ కర్తవ్యమని గుర్తించ గోరుచున్నాము.**
- **బిడ్డల యొక్క ఏ మంచి కొరకు తల్లిదండ్రులు కష్టార్జితమైన డబ్బును, విలువైన కాలమును ఉపయోగించి పాఠశాలలో చదివించుచున్నారో ఆ మంచి బిడ్డలకు అందకుండా చేయు అతి దుర్మార్గమైన బట్టీ పెట్టు బోధనా పద్ధతిని తెగించి, పోరాడి విద్యాసంస్థల నుండి పీకివేయ వలెను. ఏ మాత్రము అశ్రద్ధ చేయక ఐకమత్యంతో పోరాడి ఆ దుష్ట శక్తిని నాశనము చేసినప్పుడే మనము కోరు మంచి బిడ్డలకు జరుగగలదు.**
- **తల్లిదండ్రులు ఐక్యతతో నిలిచి పట్టుబడినప్పుడు వారిని ఎదిరించే శక్తి దేనికిని లేదు.**

ఇట్లు

సమాజ శ్రేయోభిలాషి

బి.వి.సుబ్బయ్య

అమరులకు జోహార్లు



కామ్రేడ్స్ విశ్వమోహనరెడ్డి, మరియమ్మ



కామ్రేడ్ అంగడి చెన్నయ్య,



కామ్రేడ్ కారం పార్వతి

అసామాన్యులైన సామాన్యులు



కామ్రేడ్ కాళహస్తి శేషయ్య

నెల్లూరు జిల్లా వెంకటగిరిలో నిరుపేద కుటుంబంలో పుట్టారు. పాఠశాలలో చదువుకోలేదు. కానీ ఎందరో మేధావులను తీర్చిదిద్దిన వ్యక్తిత్వం ఆయనది. శ్రమ సంస్కృతిని, శ్రామికవర్గ సిద్ధాంతాన్ని అనుసరించడం; దోపిడీ, పరాన్నబుక్కుతనాన్ని ద్వేషించడం ఆయన నైజం. అసమానతలన్నింటిపై నిరంతరం పోరాడటం ఆయన స్వభావం. నిబద్ధత, నిమగ్నతలకి ప్రతిరూపం. అట్టడుగు గిరిజనులు ఆయనను రచ్చబుడ్డడు అనిపిలిస్తే, బడుగు చేనేత కార్మికులకి, రైతు, ఉపాధ్యాయ, విద్యార్థి రంగాల వారికి ఆయన ప్రియతముడు. 60 సంవత్సరాల వయసులో 1990లో పక్షవాతంకి గురై కోలుకున్నారు. ఎవరికీ భారం కారాదని అనుకున్న ఆ కామ్రేడు కనుమరుగైపోయారు. ఆయనకు మా జోహార్లు.



కామ్రేడ్ భయ్యాలాల్ రాజ్‌గోండ్

పశ్చిమబెంగాల్ రాష్ట్రం లోని డార్జిలింగ్ జిల్లాలో ఎన్నో మహత్తర రైతాంగ, కార్మిక పోరాటాల క్రమంలో వికసించిన పోరాట యోధులలో భయ్యాలాల్ రాజ్‌గోండ్ ఒకరు. కరుడుగట్టిన భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడుతూ భూములను స్వాధీనం చేసుకునే ఉద్యమంలోను, వీరోచిత నక్సల్‌బరీ ఉద్యమంలోనూ, టీ ఎస్టేట్ యజమానుల భూ దురాక్రమణ, కార్మికహక్కుల ఉల్లంఘనలకి వ్యతిరేకంగానూ జరిగిన పోరాటాలన్నింటిలో వీరోచితమైన పాత్ర వహించారు. 1953 నుంచి 2004 అక్టోబర్‌లో 84వ యేట మరణించేంత వరకూ కష్టజీవుల కోసం పోరాటంలో మడమ తిప్పని యోధునిగా నిలిచిన కా॥భయ్యాలాల్ రాజ్‌గోండ్‌కి జోహార్లు.

జిల్లా మహాసభలు



శ్రీకాకుళం జిల్లా మహాసభల సందర్భంగా పతాకావిష్కరణ
చేస్తున్న కా॥ టి. ప్రకాష్,




బహిరంగసభలో ప్రసంగిస్తున్న కా॥ ఝాన్సీ,
వేదికపై కామ్రేడ్స్ టి.ప్రకాష్, అరుణ, బి.అప్పయ్యగారు





విజయనగరం జిల్లా మహాసభలకి హాజరైన రైతుకూలీ, గిరిజన ప్రజానీకం,
ప్రారంభసభలో ప్రసంగిస్తున్న ప్రా॥ అబ్దుల్ నూర్‌భాషా, వేదిక పై కామ్రేడ్స్ ప్రకాశ్, కోటయ్య, వర్మ, ఝాన్సీ, అరుణ





30.5.05 తూర్పుగోదావరి జిల్లా మహాసభలకి హాజరైన ప్రతినిధులు
మహాసభలలో ప్రారంభోపన్యాసం చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్య, వేదికపై కామ్రేడ్స్ ఇల్లా రామిరెడ్డి, నాగరాజు తదితరులు

జిల్లా మహాసభలు





పశ్చిమ గోదావరి జిల్లా మహాసభల సందర్భంగా ఊరేగింపు కామ్రేడ్ కారం పార్వతి స్థూపావిష్కరణ చేస్తున్న కా॥ ఝాన్సీ, రత్నమాల, కోటయ్య





కృష్ణాజిల్లా మహాసభల సందర్భంగా జరిగిన ఊరేగింపు, మహాసభలో ప్రసంగిస్తున్న కా॥ ఝాన్సీ
వేదికపై శ్రీ డి. సత్యనారాయణరెడ్డి, కామ్రేడ్స్ వై.సోనీ, బార్గవశ్రీ, చంద్ర శివయ్య, ముత్తిరెడ్డి శ్రీరాములు





గుంటూరుజిల్లా మహాసభలో ప్రసంగిస్తున్న కామ్రేడ్స్ కోటయ్య, వేదికపై ముత్తిరెడ్డి శ్రీరాములు, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, రఘు, సభకు హాజరైన ప్రతినిధులు

జిల్లా మహాసభలు



ప్రకాశం జిల్లా మహాసభలో ప్రసంగిస్తున్న కా॥ ఝాన్సీ వేదికపై
కామ్రేడ్స్ వెంకారెడ్డి, లలిత, పింజల సుబ్బారావు, కోటయ్య, భాషా తదితరులు



మహాసభల సందర్భంగా జరిగిన ఊరేగింపు



అనంతపురం జిల్లా మహాసభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య.
వేదికపై నాగరాజు, కిషోర్‌బాబు, మరుట్ల ఇమామ్ తదితరులు



మహాసభల సందర్భంగా జరిగిన ఊరేగింపు



నెల్లూరు జిల్లా మహాసభల సందర్భంగా జరిగిన బహిరంగసభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు
కా॥ ఝాన్సీ, వేదికపై కామ్రేడ్స్ కోటయ్య, ఎన్.వి. కృష్ణయ్య, రమణయ్య, సునీత, సుబ్బరాయుడు



కామ్రేడ్ కాళహస్తి శేషయ్య స్మారక భవనం ఆవిష్కరణ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగిస్తున్న కామ్రేడ్ కిషోర్‌బాబు
వేదికపై డా.కళాధర్, శ్రీసత్యనారాయణ జెట్టి, కా॥ ఎన్.వి. కృష్ణయ్య, డా. సూర్యసాగర్, డా. కాళప్ప తదితరులు


ప్రాజెక్టులు - పునరావాసం ఇతర సమస్యలపై కార్యక్రమాలు



పోలవరంలో 8.11.04న భూమికి భూమి, అడవికి అడవి కావాలని ముఖ్యమంత్రి ముందు డిమాండ్ చేస్తున్న గిరిజనులు, ప్రజలు



పునరావాసం కల్పించకుండా చేపట్టే ప్రాజెక్టు పనులు ఆపాలని పోలవరం స్పిల్‌వే వద్ద పనులు ఆపివేసి 13.7.05న సభ నిర్వహిస్తున్న గిరిజన, గిరిజనేతర పేదలు.



19.3.05న పార్వతీపురంలో జంఝావతి ప్రాజెక్టు సాధనపై జరిగిన రైతాంగ సదస్సులో ప్రసంగిస్తున్న కళింగ వేదిక కన్వీనర్ టి. హయగ్రీవరావు



తోటపల్లి నిర్వాసితులపై దమనకాండకు నిరసనగా పార్వతీపురంలో బంద్



గండేరుపై చెక్‌డ్యాం కోసం 4.7.05న బందర్‌లో ఆందోళన చేస్తున్న ప్రజలు



22.12.03న మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద తుఫాను బాధితులకు సహాయం కోసం జరిగిన ధర్నా

A 3706

జిల్లాలో వివిధ సమస్యలపై కార్యక్రమాలు



పోలీసుల చేతిలో మరణించిన తాడంగి కస్సుకి
జోహార్లు చెబుతున్న గిరిజనులు



రాజమండ్రిలో రైతుకూలీ సంఘం వార్షిక సంచిక 2003 ఆవిష్కరణ సభలో
కొండు కృష్ణయ్య, భూపతి నారాయణమూర్తి, ఝాన్సీ, కోటయ్య, తదితరులు



నిజామాబాద్‌లో ఇళ్లస్థలాల కోసం జరిగిన ఊరేగింపు



పార్వతీపురం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ప్రజలు



అనకాపల్లి కో-ఆపరేటివ్ షుగర్స్, ఇతర చక్కెర కర్మాగారాలను
అమ్మివేయవద్దంటూ జరిగిన బహిరంగసభ, సైకిల్ ర్యాలీ



ఆర్.టి.సి. కార్మికుల సమ్మెకు మద్ధతుగా శ్రీకాకుళంలో జరిగిన ఊరేగింపు

భారతపాలకులు గాట్ ఒప్పందాలపై సంతకం చేసిన నాటి రైతుకూలీ ఉద్యమ ప్రచార, ఆందోళన-ఆచరణ



పుస్తక ముఖచిత్రం

గాట్ ఒప్పందాల పేరుతో ప్రపంచీకరణ రథచక్రానికి భారత ప్రజల్ని కట్టివేసిన ఈ 15 సం॥కాలంలో ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆనాడు రైతుకూలీ ఉద్యమం ప్రకటించిన అంచనాలు ఈనాటి పరిస్థితిని ధృవపరుస్తున్నాయి. డంకెల్ ప్రతిపాదనల పై సంతకాలు చేయడం అంతకుముందు పాలకులు అనుసరించిన దోపిడీ, దళారీ విధానాల కొనసాగింపేనని ఆనాడు చెప్పాము.

నాటి నుండి నేటి వరకు అన్ని రంగాలలో సంక్షోభం పెరుగుతూనే ఉంది. వ్యవసాయరంగానికి ఉరి మరింత బిగించి, మరణశాసనం రాస్తున్నారు. అప్పటి ప్రధాని పి.వి.నర్సింహారావు, ఆర్థికమంత్రి మన్‌మోహన్‌సింగ్‌లు అభివృద్ధి, ప్రపంచీకరణ గురించి చెప్పింది వంచన అని బట్టబయలైంది. సామ్రాజ్యవాద దోపిడీకి సహాయకులుగా, చిన్న భాగస్తులుగా, దళారీలుగా తమ వర్గ ప్రయోజనాల రీత్యా ప్రజలకు మోసగింపు మాటలు చెప్పారని తేలిపోయింది. ఆనాటి నుంచి ఈనాటి వరకు సామ్రాజ్యవాద, ప్రపంచీకరణ వ్యతిరేక ఐక్య ఆందోళనలు వివిధ రూపాలలో సాగుతున్నాయి. సామ్రాజ్యవాదానికి పునాదిగా వున్న భూస్వామ్య పెత్తందారీ, దళారీ దోపిడీపైన, దాని అన్ని రూపాలపైన మరింత లోతుగా పోరాటం సాగాల్సి ఉంది.



1993 సెప్టెంబర్ 10 -25 వరకు ర్యాలీలు, మీటింగులు, 25న జిల్లా కలెక్టరాఫీసుల ముందు ధర్నాలు జరపమని పిలుపునిస్తూ విడుదల చేసిన పోస్టర్.

APSFC

Make Your Dream Project A Reality

APSFC, a development Financial Institution offers Term Loans upto Rs.500 lakhs in case of new units and upto Rs.2000 lakhs in extremely deserving cases for Private, Public Limited Companies/Co-operative Societies and upto Rs.200 lakhs in case of new units and upto Rs.800 lakhs in extremely deserving cases in case of other concerns. All the projects satisfying the definition of SME sector are eligible for loans irrespective of the project cost. The Corporation also extends Working Capital Term Loans upto Rs.500 lakhs to meet the short term requirements of the units.

- Operating through 25 Computerized, Networked Branches spread across Andhra Pradesh.
- Market leader with a share of around 70% in term lending to SSIs in the state of Andhra Pradesh with a sharp focus on First Generation Entrepreneurs.
- Funded over 85,234 units with an amount of about Rs 5513 Cores during last 49 years.
- Ranking No.l in Key Result Areas ,of Sanctions, Disbursements and in percentage Recoveries among SFCs in the country.
- Operating more than 33 different schemes to suit various markets segments and also offers special schemes for Good Entrepreneurs.
- Operating tailor made schemes for setting up Hotels, Hospitals, Tourism related activities, Commercial Complexes, Bio-Technology & Information Technology units, Super Markets/Retail outlets, Food Processing and Export Oriented Industries.
- Accepts Fixed Deposits at attractive interest rates (from Individuals, Firms, Companies, Societies and Govt. Departments/Govt. Corporations).
- Involved also in Non-Fund based activities including distribution of Insurance Products, Sale of Government of India Relief Bonds, dealing in Government Securities, Advisory Services, and Valuations etc.

In APSFC the customer is most important. The Corporation ensures customer satisfaction through professional management and teamwork. Come, meet the friendly financier who has turned many a dream into reality.

Andhra Pradesh State Financial Corporation

HO: 5-9-194, Chirag Ali Lane, P.B.No:165 HYDERABAD - 500 001

040 - 23201398, 23201646, 23202547, 23202550 - 53 Fax:(040)-23202972

e-mail: hyd apsfcho@sancharnet.in URL: www.apsfc.com

ISO 9001-2000 CERTIFIED CORPORATION

Powering Growth Empowering Enterprise

50 H

| నల్లగొండ ప్రజల వీరోచిత పోరాటం |

కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు



నల్లగొండ ప్రజల వీరోచిత పోరాటం అన్న ఈ బుక్‌లెట్‌ను తెలంగాణా ప్రజాపోరాటానికి బీజాలు వేసి, నిర్మించి, నాయకత్వం వహించిన ప్రముఖ నాయకులలో ఒకరైన కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు గారు రచించినది.

తేది. 11-4-1947న ప్రజాశక్తి ప్రెస్ బెజవాడ (విజయవాడ) వారిచే 2000 కాపీలు ముద్రించబడ్డాయి. ప్రచురణ నెంబరు 210, వెల పావలా. ఈ బుక్‌లెట్ ప్రజా ఉద్యమ రంగం నుంచి ప్రజల భాషలో సరళ వాక్యాలలో రాయబడింది.

ఆనాటి తెలంగాణా ప్రజల బానిసత్వానికి కారకులు ఎవరు? ప్రజానుకూలులెవరు? ప్రజావ్యతిరేకులెవరు? నిరంకుశులెవరు? ప్రజాస్వామికవాదులెవరు? అభివృద్ధి కాముకులెవరు? అభివృద్ధి నిరోధకులు ఎవరు? అన్న విషయాలను నల్లగొండ జిల్లా ప్రజల వీరోచిత పోరాటాలు తేల్చివేసాయి. పాలను, నీళ్లను వేరుచేసి చూడడం ప్రజాపోరాటాల ద్వారా, వాటి అభివృద్ధి క్రమంలోనే సాధ్యమైంది. నల్లగొండ ప్రజాపోరాటం ఆ పనిచేసింది.

వర్గ దృక్పథం, ఐక్య సంఘటనా దృక్పథం- సంఘటిత నిర్మాణ దృక్పథం- ప్రజాప్రతిఘటనా దృక్పథాలను నాటి కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వం నేర్పుతో అన్వయించి ప్రజాపోరాటాలను అభివృద్ధి చేసింది. దీర్ఘకాల మిత్రులను వెదుక్కొంటూ, తాత్కాలిక మిత్రుల సహకారాన్ని పొందగలిగింది. మేధావులు, వ్యాపారులు, ధనిక రైతులు, స్త్రీలు, బాలలు, విద్యార్థులు, ఉద్యోగులు ఈ పోరాటంలో తమ తమ పాత్రలను పోషించారు.

ఈ బుక్‌లెట్ రచయిత కామ్రేడ్ దేవులపల్లి జాతీయోద్యమకారుడుగా, తెలుగుభాషా సాంస్కృతికోద్యమ కారుడుగా బయలుదేరి కమ్యూనిస్టుగా, రైతాంగ విప్లవ పోరాట సారధిగా మారవలసివచ్చింది. దొరలబడ్డే దొరల పీచమణిచే ప్రజా ఉద్యమాన్ని నిర్మించుకోవలసి వచ్చింది. ఆంధ్ర, తెలంగాణా రెండు ప్రాంతాలు దోపిడీ పాలకుల కింద అణచివేయబడుతున్న తెలుగు ప్రజలందరి ఉద్యమంగా అభివృద్ధి చేసి - అన్నదమ్ముల పరస్పర సహకారం, వెన్నుదన్నులతోనే తెలంగాణా ప్రజల బానిసత్వ వ్యతిరేక, నిరంకుశ వ్యతిరేక ప్రజా ప్రతిఘటనా ఉద్యమాన్ని నిర్మించారు. దీన్ని చదవడం మొదలుపెడితే పాఠకులకే అర్థం అవుతుంది.

- సంపాదకులు

జమీందారీ దోపిడి కింద ప్రజల నికృష్టజీవనం

నేడు తెలంగాణా ప్రజలను దోచుకునే వారు ఒకరు కాదు, ఇద్దరు కాదు. దీనికై జమీందారీ విధానం సృష్టించిన ప్రతివ్యక్తి, ప్రతివర్గమూ ప్రజలను దోచుకొని తింటూ వుంది.

ప్రతి జమీందారు దగ్గర ఒక బలమైన రౌడీ ముఠా వున్నది. దీని ద్వారానే అతడు ప్రజలను భయపెట్టి దోచుకోగల్గుతున్నాడు.

గ్రామంలో వుండే పటేలు, పట్వారీలు, దేశముఖ్‌లు, జాగీరు మక్తాదారులు, ప్రజలను దోచుకొనే జమీందారీ ముఠా-ఈ ముఠా రౌడీల ముఠా సహాయంతో దోపిడీ సాగించుతున్నారు. నిర్భంధ వ్యాపారం, ఆస్తులు లాగడం, నాశనం చేయడం, దౌర్జన్యం, హత్యలు, స్త్రీలను చెరచడం వరకు సాగుతూనే వున్నది. అధికారవర్గం వీరికి చోదోడువాదోడుగా వుంది. ఈ దోపిడీలో భాగస్వాములైనారు.

యుద్ధకాలంలో ఆహారసమస్య తీవ్రతను ఉపయోగించుకొని ప్రజా వినాశకరమగు చట్టాల ద్వారా ప్రభుత్వం ఈ జమీందారీ దోపిడీ ముఠాను, ఆర్థికంగా బలపరిచింది. పరిపాలనలో ప్రధాన భాగస్వాములను చేసింది. ఈ విధంగా వారిని ఒకచోటకు చేర్చి, నిర్మాణ యుతంగా బలపరచివేసింది.

దీని ఫలితంగా ప్రజలు అనుదినము క్షీణించిపోయినారు. నూటికి 75మందికి దున్నుకోడానికి భూమిలేదు. తినడానికి తిండి లేదు. కట్టడానికి గుడ్డలు లేవు. చదువు, పౌర సత్వాలు మాట ఎత్తనవసరమే లేదు. ఆత్మ గౌరవాన్ని కూడా చంపుకొని, మధ్యయుగాల నాటి బానిస జీవితాన్ని అంగీకరిస్తే తప్ప, ప్రజలు నిజాంరాజ్యంలో వుండటానికి వీలులేదు.

నిరంకుశ నిజాం ప్రభుత్వం ప్రజల యీ దుస్థితిని నిన్నటిదాకా భారత ప్రజానీకానికే గాక, సోదర ఆంధ్ర ప్రజానీకానికి గూడా తెలియనీయకుండా దాచిపెట్ట గలగడానికి కారణాలు లేకపోలేదు.

ఇక్కడి జమీందారీ, పెట్టబడిదారీ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే మితవాద రాజకీయ నాయకత్వం ప్రజాఉద్యమాన్ని నిరోధించడమే గాక, ప్రజల దుస్థితిని బయటిప్రపంచానికి తెలియనీయలేదు. ఈనాటికీ, మితవాదులచే నిర్వహించబడే పత్రికలు ఏవీ ఇక్కడి పరిస్థితులను చిత్రించవు. ఏ ఒకటో అరో సాహసించి చిత్రించాలనుకున్నా ప్రభుత్వం సహించదని మౌనం వహిస్తున్నాయి.

కాంగ్రెస్ నాయకత్వం సంస్థానాధీశులతో రాజీబేరాలాడుతూ వచ్చింది. అందుచే ఇక్కడి ప్రజాపోరాటాలను బలపరచుతూ, నాయకత్వం వహించలేదు. అంచేత మతతత్వవాదులు

ముందుకువచ్చి, ప్రజా ఉద్యమాన్ని హిందూ-ముస్లిం సమస్యగా బయటికితెచ్చి, నిరుపేదలైన రైతుకూలీ సమస్యలను కప్పిపుచ్చినారు.

కాంగ్రెస్ నాయకత్వాన ముందుకు నడుస్తున్న ఆంధ్ర ప్రజానీకం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రానికై మాత్రమే ఆందోళన చేస్తూవచ్చినారు. 90 లక్షల తెలంగాణా ఆంధ్రులతో భాషా సంస్కృతి రీత్యా సంబంధాలు నెలకొల్పడం వరకే కృషి చేశారు. రాజకీయంగా వేరువేరుగా వుండ వలసిందేనని భావించారు. కాని, బ్రిటీష్ సామ్రాజ్యవాదం, జమీందారీ విధానం నుండి విముక్తిపొంది, మూడుకోట్ల ఆంధ్రుల ప్రజారాజ్యాన్ని స్థాపించడమే ఆశయంగా వున్న విశాలాంధ్ర ఉద్యమానికి పునాదులు వేయలేదు. అంచేత, తెలంగాణా సమస్యలు, ఆంధ్రుల సమస్యలుగా ముందుకు రాలేదు.

మన స్వాతంత్ర్య ఉద్యమంలోని ఈ బలహీనతలను, నిజాం నిరంకుశ ప్రభుత్వం బాగా ఉపయోగించుకొని ఇక్కడి ప్రజలను ఈ స్థితిలో ఉంచగలిగింది.

ఐక్య ప్రజాపోరాటం-ప్రభుత్వ దమననీతి

యుద్ధకాలంలో ప్రజల్లో వచ్చిన సంచలనం సంఘటిత ప్రజాఉద్యమానికి పునాది అయింది.

వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున పోరాడినారు. దీనిలో జనగామ ఉద్యమం ముఖ్యమైంది.

ధాన్యసేకరణ సందర్భంలో జరిగిన దౌర్జన్యాలు, లంచాలకు వ్యతిరేకంగాను, తిండి కరువును పోగొట్టుకోడానికి, ప్రజలు తీవ్రంగా పోరాడినారు. ప్రదర్శనలు, ఆకలియాత్రలు, వీరికి ముఖ్యసాధనాలు అయినవి.

కౌలుదారులు భూస్వాధీనపు హక్కులకై ఆందోళన చేశారు.

జాగీరుదార్ల దోపిడీనుంచి విముక్తి పొందడానికి కృషిచేశారు. వరంగల్లు జిల్లాలో గార్ల, తెల్దారు పల్లి జాగీరు; నల్లగొండ జిల్లాలో భోనగిరి తాలూకా జాగీరు పోరాటాలు ముఖ్యమైనవి.

ఇవన్నీ ఆంధ్రమహాసభ నాయకత్వాన్నే జరిగినవి. ప్రభుత్వం ప్రజలను, ప్రజా నాయకులను జైళ్లలో పెట్టి, ఈ ప్రజా పోరాటాలను మొగ్గలోనే త్రుంచివేయడానికి కృషి చేసింది. అయినా సఫలం కాలేదు. ప్రజలు ఈ పోరాటాలలో కొంత అనుభవం గడించి రానున్న యుద్ధానంతర విప్లవ వెల్లువలో తమ పాత్రను నిర్వహించడానికి సిద్ధపడినారు.

అయితే నిజాం ప్రభుత్వం కూడా తన ప్రయత్నాలు తాను చేసుకున్నది. నిజాం జమీందారీ దోపిడీ చలవ వలన తెలంగాణా ప్రజలు చాలా వెనుకబడి వున్నారనీ, అంచేత జమీందారీ వర్గానికి కొద్ది రోజుల్లో బ్రిటీషు భారతదేశాన్ని వదలి, తమ కౌగిలిలోకి వస్తున్న తమ యజమానులైన బ్రిటీష్ సామ్రాజ్య వాదులకు స్థావరంగా ఉండటానికి ఈ ప్రదేశమే ఉచితంగా వుంటుందనీ, అభిప్రాయపడ్డారు. ఇప్పుడిప్పుడే మొలకెత్తుతున్న ప్రజా ఉద్యమాన్ని మిలటరీ బలంద్వారానైనాసరే అణచివేసి, శాశ్వతకేంద్రంగా జేసుకోడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇంకా చేస్తున్నారు గూడా.

నిజాం ప్రభుత్వం సంస్థానప్రజల, ఆంధ్రప్రజల, భారత ప్రజల స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా చేస్తున్న ఈ కుట్రను మరుగు పరచాలని చూస్తున్నది. ప్రజలకుండే ఏవోకొద్ది కష్టాలను ఉపయోగించుకొని, ప్రజలను, కమ్యూనిస్టులు రెచ్చగొడుతున్నారనీ; అంచేత 'శాంతి భద్రత'లను కాపాడటానికి కొంత బలాన్ని ఉపయోగించుతున్నామని ప్రచారం చేసుకుంటున్నది. కాంగ్రెస్‌వాదులు ఈ కుట్రను బయటపెట్టడం లేదు. మిలటరీ దాడులను ఖండించినా, ప్రజలు పోలీసులను ప్రతిఘటించడం మూలాననే మిలటరీ దాడులు చేయించిందని అంగీకరిస్తున్నారు. అయితే ఇది ప్రభుత్వం చూపించే కారణాలను పరోక్షంగా బలపర్చడం తప్ప మరేమిటి?

ఆయుధాలకు ఆయుధాలతో జవాబు

కడివెండి పోరాటం వరకు ప్రభుత్వం జైళ్ళలో నిర్బంధించుతూ; ప్రజలపైన, ప్రజా సేవకులపైన దొమ్మీలు సాగిస్తూ, ఉద్యమాన్ని అణచివేసి జమీందారీ నియంతృత్వాన్ని స్థాపించడానికి ప్రయత్నించింది. కాని ప్రజలు ప్రతిఘటించడం చేత ఆ ప్రయత్నం విఫలమయింది.

అటుతర్వాత, జమీందారీ ముఠాకు వారి రక్తబంధువులైన రౌడీదళాలకు ప్రభుత్వం ఆయుధాలిచ్చింది. గ్రామాలలో గ్రామ ముఖ్యులను హత్య చేయించి ప్రజా ఉద్యమాన్ని అణచివేయాలనీ, తానుమాత్రం ఏమీ తెలియ నట్లు వుండాలనీ ప్రయత్నించింది.

ఈ కుట్ర యొక్క ఫలితమే కడివెండిలో విసునూరు రౌడీలచే కొమరయ్య పైన తుపాకి కాల్పులు, అతని వీరమరణమున్నూ.

కొమరయ్య కష్టజీవి. పేద రైతు యువకుడు. అతడు నిరాయుధుడుగా వున్న సమయంలో తుపాకిగుండ్లు అతనిని ఎదుర్కొన్నవి. కిందబడి పోయినాడు. అట్టి అవసాన దశలో ఆ తుపాకిగుండ్లకు దేనితో జవాబు చెప్పగలడు? ఇంతవరకు జమీందారీ దోపిడీ విధానం నుంచి విముక్తి పొందడానికి అతడు ఏ ఆయుధాన్నైతే ప్రయోగించాడో దానితో, జవాబు చెప్పాడు. **'ఆంధ్ర మహాసభకు జై' అనే అమరవాక్కు అతని ఆయుధం.**

చుట్టుప్రక్క గల గ్రామ ప్రజలు, కొమరయ్య ఇచ్చిన ఈ పిలుపును అందుకొని 2 వేలమంది సమరరంగమైన కడివెండిని చేరుకున్నారు. తమ స్వతంత్ర్యాన్ని హరించడానికి జమీందారీ వర్గం పంపిన 200మంది రౌడీలు కత్తులు, తుపాకులతో ప్రజలపై దాడికి తలపడ్డారు. దీనికి జవాబుగా తమ ఆయుధాలైన కర్రలు, వడిసెలతోనే ప్రజలు దాడిని ఎదుర్కొన్నారు. 'ఆంధ్ర మహాసభకు జై' అనేదానిని సమర నినాదాన్ని చేసినారు. సాయుధ జమీందారీ బలగాన్ని చావచితక గొట్టారు. దీనితో జమీందారీ రౌడీదళాల పాత్ర శాశ్వతంగా రంగం నుంచి పోయింది. ప్రజలపై జమీందారీ ముఠా స్వయంగా చేసిన ఆఖరుదాడి విఫలమైంది. ప్రజలు కర్రలు, వడిసెలతో సాయుధులై రంగము మీదకి వచ్చినారు.

నిజాం ప్రభుత్వం ఎంతోకాలం మేక వన్నెతో ప్రజలముందు నిలువలేక పోయింది. కడివెండి పోరాటంలో వీరోచిత పాత్రను నిర్వహించిన ధర్మాపురం పేద రైతు పొలాల్లో రిజర్వు పోలీసుతో ప్రత్యక్షమైంది. ఆ పొలాలను అక్కడి భూస్వామికి ఒప్పగించి పేదరైతులను ఆకలిమంటల పాలుచేయడమే ప్రభుత్వోద్దేశ్యం.

వీరిని భయపెట్టి వెళ్ళగొట్టడానికి పోలీసులు తుపాకులు బారులు పెట్టి పెరేడు చేశారు. తమ నోటిముందరి అన్నాన్ని లాక్కొని వెళ్ళే భూస్వాములను రక్షించి, తమ పంట భూములను, ఇండ్లు వాకిండ్లను, తిండి ధాన్యాన్నీ లాక్కొని, భూస్వాములకు ఇచ్చి వెళ్ళడానికి ఈ పోలీసులు వస్తే వీటిని

రక్షించుకోవడం ఎట్లు అనే సమస్యను ఆ పేద రైతులు అప్పటికప్పటికే పరిష్కరించారు. అంతా వరుసలో నిలుచున్నారు. కర్రలు భుజాలపైన పెట్టినారు. ఎడమ, కుడి అంటూ వారు పెరేడు చేశారు. పోలీసులు ఇరవైమంది వుంటే వీరు యాభైమంది. పోలీసులు తోక ముడిచారు. అప్పటికి నిన్నటిమాటే ఈ పోలీసు పశువులే ఆకునూరులో 40 మంది కష్టజీవుల స్త్రీలను చెరచి ఇంకెందరినో హింసించారు. మాచిరెడ్డిపల్లిలో జరిగిన ఘోరాలు వారి కండ్ల ఎదుట వున్నవి.

పోలీసులు గ్రామంలోకి రావడంతోనే కొట్లు, తిట్లు, వెట్టి, లంచాలు, దొమ్మీలు ప్రారంభమవుతున్నవి. జమీందారీముఠా వారి రౌడీబలగం విచ్చలవిడిగా సంచరించుచున్నది.

ప్రభుత్వం ప్రజా ఉద్యమాన్ని అణచి వేయడానికి ఈ చర్యలను బాహాటంగా బలపరచుతున్నది.

ఆ సమయంలో ధర్మాపురం ప్రజలు తమ కర్తవ్యాన్ని నిర్వహించడమేగాక ఆ రాక్షసులచే బాధలనుభవించుతున్న ప్రజలందరికీ మార్గదర్శకులైనారు తమ ఆస్తిపాస్తులను రక్షించుకోడానికి, స్త్రీల మానాన్ని కాపాడుకోడానికీ, జమీందారీ, పోలీసుదోపిడీ దౌర్జన్యాల నుండి విముక్తులు అవడానికి ప్రజలంతా సైనికులు కావాలని ఆచరణలో చూపించారు. దీన్నే తర్వాత ప్రజలు అనుసరించారు.

కొమరయ్య వీరమరణం తర్వాత నల్లగొండ జిల్లా అంతటా ఇలాంటి ఆత్మరక్షణ దళాలు ఏర్పడినవి. వీటిని ఈ జిల్లాలో వలంటీరు దళాలనీ, ప్రజారక్షణ దళాలనీ ప్రజలు పిలుస్తారు.

ఐక్య ప్రజాపోరాటాలలో ప్రజలదే విజయం

రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం జమీందారీ దోపిడీ విధానం నుండి విముక్తి పొందడానికై పోరాడుతున్న రైతుకూలీ జనసామాన్యం, నిర్భంధ విధానఫలితంగా అణచిపెట్టబడియున్న ప్రజానీకం కడివెండి-ధర్మాపురం ప్రజల వీరోచిత పోరాటాల తర్వాత ఒక్కపెట్టున విజృంభించారు.

ప్రజలే గ్రామ సంఘాలను నిర్మించుకున్నారు

వెట్టిచాకిరి, లంచాలు, దౌర్జన్యాలు అధికారులు, జమీందారీ ముఠా సాగించారు. ఎక్కువగా బాధింపబడుతూ తినడానికి తిండి లేక, దున్నుకోడానికి భూమిలేక, నికృష్టపు జీవితాన్ని గడుపుతున్న పేదరైతు కూలీలు, గ్రామ సంఘ నిర్మాణానికి ముందుకు వచ్చినారు. మధ్య తరగతి, ధనిక రైతులతో సంప్రదించి, గ్రామ ప్రజలందరినీ ఐక్యపరిచినారు. ప్రజాస్వామిక పద్ధతులపై తమ నాయకులను ఎన్నుకొన్నారు. ఆంధ్ర మహాసభ అంగీకారాన్ని పొందినారు. వెట్టిపనులు చేయడానికి, లంచాలివ్వడానికి, దౌర్జన్యాలకు లొంగడానికి నిరాకరించారు. దీనితో సంవత్సరాల తరబడి సాగుతున్న జమీందారీ దోపిడీ మాయమై పోయింది. **గ్రామంలో సంఘమేర్పడడమంటే, దోపిడీ విధానానికి స్వస్తిచెప్పడమే.**

ప్రజలు ఇంతటితో ఆగలేదు. తమ తమ సమస్యలను గ్రామ సంఘాల ద్వారా పరిష్కరించుకుంటూ, అప్పటివరకు జమీందారులు తమ నుంచి తీసుకున్న లంచాలు, భూములు తిరగి రాబట్టుకోడానికి ఆలోచించసాగినారు.

ప్రతిదినము బహిరంగ సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, జాతీయ గేయాలు పాడడం ప్రజల నిత్యజీవితంలో ఒక భాగమైంది.

ముసలివారిలో నిరాశా నిస్పృహలు పోయినవి. యువకులలో అమాయకత్వం పోయింది. పిల్లల కునికిపాట్లు తేలిపోయినవి. ప్రతి ఇంటా, తమ సమస్యలను, తమ భవిష్యత్తునే చర్చించుకుంటున్నారు. భవిష్యత్తు గూర్చి ఆలోచించుకుంటున్నారు. ఈ జీవితం కండ్లకుగట్టినట్లు వుండే. కోటమర్తి, (భోనగిరి తాలూకా)లో ఒకనాడు సాయంత్రం కాగానే బాలబాలికల ఊరేగింపు ఒకటి సాగింది. నలుగురైదుగురు యువకులు మారు వేషాలతో ఊరేగింపు వెంటవున్నారు. శత్రువులు ఈ పిల్లలకు ఏమీ నష్టం చేయకుండా వారిని కాపాడటానికే వీరి ఊరేగింపు గ్రామమంతా తిరిగి ఆంధ్రమహాసభ కార్యాలయానికి చేరుకున్నది. అప్పటికే గ్రామ ప్రజలంతా సమావేశమైనారు. ఊరేగింపు రాగానే సభ ప్రారంభమైంది. ఉపన్యాసాలు, తీర్మానాలు అన్నీ ముగించుకొని అంతా ఇండ్లకు వెళ్లినారు. ఇది నిత్య కార్యక్రమం.

ప్రభుత్వం సంవత్సరాల తరబడి వెట్టి చాకిరీని నిషేధించమని ప్రజలు చేస్తున్న నిరంతరాందోళనను పెడచెవినిబెట్టింది. కాని ప్రజలే తుదకు ముందుకువచ్చి, వెట్టిచాకిరిని రద్దు చేసినారు. ప్రజలపైన జమీందారీ ముఠా సాగించే దౌర్జన్యాలను ప్రభుత్వం విచారణ చేసి, వారిని శిక్షించ నిరాకరించింది. ప్రజలు తమ శక్తిని ప్రదర్శించి, దౌర్జన్యపరుల గుండెను నీరుగా చేశారు. విచారణ చేసి శిక్షిస్తున్నారు.

ప్రభుత్వం లంచగొండులను శిక్షించి, ప్రజల సొమ్మును ప్రజలకు ఇప్పించ నిరాకరించితే, ప్రజలే తమ సొమ్మును తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వం బహిరంగ సభలను, ఊరేగింపులను, ప్రదర్శనలను నిషేధించింది. ప్రజలు వీటిని నిరాటంకంగా కొనసాగించుకుంటున్నారు.

ప్రజలీవిధంగా, తమ హక్కులను తామే సంపాదించుకున్నారు. ఐక్యబలంతో వాటిని నిలబెట్టుకోవడానికి పోరాడుతున్నారు.

దోపిడీ నుంచి గ్రామాలను విముక్తి చేయడం

గ్రామాలలోని రైతుకూలీలు తమకు తామే దోపిడీ నుండి విముక్తి పొందుతూ, బలహీనంగావున్న తోడి గ్రామ ప్రజలను గూడా విముక్తులను చేశారు.

కందగట్ల (సూర్యాపేట)లో బలమైన జమీందారీముఠా ప్రజలను అణచిపెట్టి సంఘం ఏర్పాటు చేసుకోనివ్వలేదు. గ్రామానికి రెండువైపులా వున్న ఇతర గ్రామ ప్రజలు ఊరేగింపులతో ఒకరోజు నాలుగు సార్లు ప్రదర్శనలు జరిపినారు. ప్రజలకు జమీందారీ ముఠా భయం తీరిపోయింది. నిశ్చింతగా అంతా సంఘంలో చేరి, దోపిడీ విధానానికి స్వస్తి చెప్పినారు.

కొమరయ్య దినోత్సవం

ప్రభుత్వం అరెస్టులు, నిర్భంధాలు, హత్యల ద్వారా, ప్రజలపైన సాగించుతున్న హింసాకాండకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ, కార్మికసంఘాలు, అసమ్మతి ప్రదర్శనలు చేయడానికి పిలుపు యిచ్చాయి. దీనినే కొమరయ్య దినోత్సవం అనిగూడా అంటారు.

జమీందారీ ముఠా, అధికారవర్గం, ఆ రోజున సాయుధ పోలీసులు వచ్చి, ప్రజలపై కాల్పులు సాగిస్తారని వదంతులు లేపారు. అయినా ప్రజలు వేలసంఖ్యలో పాల్గొన్నారు.

సూర్యాపేటలో హైస్కూలు విద్యార్థులు, హమాలీలు, గుమాస్తాలు, ఇతర వృత్తులవారు, మధ్య తరగతి ప్రజలంతా "పోలీసుల జులుం నశించాలి", "కొమరయ్య జిందాబాద్" అనే నినాదాలతో వేయిమంది ప్రజలు అసమ్మతి ప్రదర్శనలు జరిపారు. పోలీసుల కాల్పులకు కష్టజీవులు ఎలా చచ్చిపోతారో చూసి, ఆనందించడానికి వచ్చిన గ్రామ జమీందారీ ముఠా పోలీసులు ఒక మూల కూర్చొనడాన్ని చూసి, నిరాశపడి వెళ్లిపోయినారు. హుజూరు నగరులో రౌడీలు మతకల్లోలాలు రెచ్చగొడతామని బెదిరించుతూ వుంటే, వేయిమంది ప్రజలు నిర్భయంగా అసమ్మతి ప్రదర్శనలు జరిపారు.

వరంగల్లు జిల్లా, ఇతర జిల్లాల ముఖ్య పట్టణాలలో ఇదే విధంగా జరిగినవి.

ఇక గ్రామాలలో ప్రజల ఉత్సాహం, ఉద్రేకం చెప్పనలవిగాదు. వందల, వేల సంఖ్యలో పాల్గొని ప్రభుత్వం ఎడల నిరసన ప్రదర్శించారు. "కొమరయ్య ఎంతటి అదృష్ట వంతుడు, చస్తే అటువంటి చావు చావాలి"– ఇవీ అనాడు పిన్న, పెద్దలు అన్న మాటలు.

"అమరజీవి నీవు కొమరయ్యా, అందుకో జోహార్లు కొమరయ్యా" అని వచ్చీరానీ మాటలతో, ముద్దుబిడ్డలు మొదలుకొని అంతా పాడి, ఆ అమరజీవిని అభినందించారు.

జమీందారీ రాక్షస విధానాన్ని తుద ముట్టించిందాకా పోరాడుతూ కొమరయ్య అడుగుజాడల్లో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు ఆ వేల ప్రజానీకం. నిజాం జమీందారీ ప్రభుత్వం ఆయుధ బలంతో ప్రజా పోరాటాలను అణచి వేస్తామని చేసిన సవాలును తెలంగాణా ప్రజలు అందుకొన్నారు.

కొమరయ్య జిందాబాద్!
విప్లవ ప్రజానీకానికి జోహారులు!!

పసికందులు తమనెత్తురుతో అక్షరాలు వ్రాసి ప్రతిజ్ఞ చేశారు

కరీంనగర్ విద్యార్థులను స్కూలు అధికారులు తొలగించినందుకు సూర్యాపేట విద్యార్థులు సెప్టెంబరు నెలలో సమ్మె చేశారు. నాలుగుసార్లు పట్టణమంతా ఊరేగింపు చేసి అసమ్మతి ప్రదర్శించారు. ఈ వీరోచిత ప్రదర్శన పట్టణ ప్రజలు విద్యార్థులను అభినందించారు.

హిందూ–ముస్లిం విద్యార్థుల ఈ ఐక్య ప్రదర్శనకి స్కూలు అధికారులు మండిపడి విద్యార్థి నాయకులను తొలగించి వేశారు. విద్యార్థులు సమ్మెను కొనసాగించారు. అధికారులు లొంగలేదు. పట్టణ కష్టజీవులు, గుమాస్తా హమాలీలు, ఇతర వృత్తులవారు ఒక రోజు సమ్మెచేసి స్కూలు ముందు సానుభూతి ప్రదర్శన చేశారు. సమ్మె చేస్తున్న విద్యార్థులు తమకై వచ్చిన కష్టజీవులతో చేయి చేయి కలపడానికి ముందుకువచ్చినారు. తల్లీ బిడ్డలను గూడా విడదీసిపాలించే ఈ నిరంకుశ ప్రభుత్వానికి ఇది గిట్టలేదు. కర్రలు, తుపాకులు తీసుకొని పోలీసులు తయారు. తినడానికి తిండి కూడా లేని మామీద కాలుస్తారా? అని విద్యార్థులు పోలీసులను సంభోదించారు. కొందరు పోలీసులు వెళ్లిపోయారు. మరి కొందరు రాక్షసులు స్కూలు గేటువద్దనున్న 12, 13 సంవత్సరాల విద్యార్థులను లాఠీలతో చావబాదినారు. కాని వారు భయపడలేదు. దగ్గరలోవున్న రాళ్లతో, కర్రలతో జవాబు చెప్పినారు. తుపాకులు బారులుపెట్టారు పోలీసులు. మరికొన్ని రాళ్లతో వర్షం పెద్దదిగా జేశారు విద్యార్థులు. పోలీసులు తోకముడిచారు. విద్యార్థులు బయటికి వచ్చినారు. తలపగిలి నెత్తురు కారుతున్న విద్యార్థిని సమూహంలోని ఒకరు ఎత్తుకున్నారు. పట్టణమంతా కదిలింది. స్త్రీలు, పురుషులు అంతా 3 వేల మంది ఆ విద్యార్థుల వెంట నడిచారు. బహిరంగ సభ, ఉపన్యాసాలు జరిగినవి. నిరంకుశ విధానం నశించిందాకా పోరాడుతామని కారుతున్న నెత్తురుతో వ్రాసి ప్రతిజ్ఞ చేశారు విద్యార్థులు. "మేము మీతోడనే" అని ఆ ఎనిమిదివేల ప్రజలు ప్రత్యుత్తరమిచ్చారు.

తిమ్మాపురం ప్రదర్శనలు

సూర్యాపేట సమ్మెతో ప్రారంభమైన అరెస్టులు, నిర్భంధాలు, కేసులు రోజురోజూ విషమరూపం దాల్చాయి. జిల్లా అంతటా గ్రామాలలో, అసమ్మతి ప్రదర్శనలు సాగినాయి. ఒకరోజు ఆపకుండా ప్రజలు ప్రతిరోజూ సాగిస్తూ వచ్చినారు.

ఒకనాడు ఆకస్మాత్తుగా ఒక రిజర్వు పోలీసుదళం తిమ్మాపురం గ్రామానికివచ్చి స్థానిక కార్యకర్తలను అరెస్టు చేసింది. అంతటితో ఆగక వెట్టిచాకిరీని వీరోచితంగా ప్రతిఘటించిన హరిజనులను, ఇతర పేదలను అమానుషంగా హింసించ సాగినారు. ఆ హింసాకాండకు తట్టుకోలేక గ్రామమంతా తలక్రిందులైంది. ఈ స్థితిలో చుట్టుపట్టు 10 గ్రామాల ప్రజలు కర్రలు, వడిసెలు తీసుకొని వరుసగా ఊరేగింపుతో వచ్చారు. ఆ గ్రామానికి, ప్రజలకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది. కష్టజీవులు గ్రామం వెలుపలనే వారిని ఎదుర్కొని కలిసి గ్రామంలోకి వెళ్ళినారు. దూరం నుంచి వచ్చినవారికి స్త్రీలు కుండలతో, ముంతలతో నీళ్ళందిచ్చినారు. కొంత దూరం వచ్చేసరికి పోలీసులు తుపాకులతో తయారు. ప్రజలు భయపడలేదు. వెనుకకు జంకలేదు. అంతకు ముందు ప్రజల మధ్యనుంచి వస్తున్న నినాదాల ధ్వని తీవ్రమైంది. "ఆంధ్ర మహా సభకు జై", "కమ్యూనిస్టు పార్టీకి జై" అని గ్రామగ్రామమంతా ప్రతిధ్వనించుతూ వున్నాయి. పోలీసులు తుపాకులు బారులుపెట్టారు. ప్రజలు తుపాకులను క్రిందపెట్టమని హెచ్చరించారు. వారు వినలేదు. "ఆంధ్ర మహాసభకు జై" అని ఒకసారి అంతా తమ కర్రలను లేవనెత్తినారు. కొందరు వడిసెలు తీసుకొని గోడ లెక్కినారు. స్త్రీలు రాళ్ళు ఏరుకొని అందివ్వడానికి ముందుకు వచ్చినారు. రిజర్వు పోలీసు హడలిపోయింది. అంతా ఒక సలాం చేసి వెనుకకు తగ్గినారు. ప్రజలు జై జై నినాదాలతో వెళ్ళిపోయారు. సమావేశం, ఉపన్యాసాలు జరిగినవి.

బాలేంల, పాత సూర్యాపేట రైతుకూలీలు ఈ పోరాటానికి నాయకత్వం వహించారు.

తెల్లవారే రిజర్వుపోలీసు దారిబట్టింది. ప్రజలు వారి బాధల నుండి విముక్తులైనారు. ఐక్య ప్రజాబలం, సాయుధ పోలీసులను ఎదిరించింది.

కొమరయ్యకు తెలంగాణా వీరాంగనల జోహార్లు

ఇంతవరకు పురుషులే పోరాటాలలో ప్రధాన పాత్ర వహించారు. ఇకనుంచీ రైతుకూలీ స్త్రీలు ముందుకు రాసాగినారు. ప్రతి గ్రామంలో వేల స్త్రీ సమూహంలో మహిళా కార్యకర్తలు

ఉపన్యసించసాగారు. జమీందారీ వ్యతిరేక పోరాటంలో పురుషులకు అండగా నిలిచి తమ బాధ్యతను నిర్వహించడమే వీరి ఉద్దేశ్యం.

కొమరయ్య పేద రైతుకూలీ జనాని కొరకు చేసిన త్యాగాన్ని చూసి స్త్రీలు కూడా ఉత్తేజితులైనారు. తమ విప్లవ హృదయాలతో ఆ అమరజీవికి జోహార్లు ఇవ్వడానికి సిద్ధమైనారు.

కామ్రేడ్ స్వరాజ్యం కొమరయ్య జీవితాన్ని, ఆయన పాల్గొన్న పోరాటాన్ని వర్ణిస్తూ ఉయ్యాలపాట వ్రాసింది. దానిని అందుకున్నారు రైతుకూలీ స్త్రీలు.

వీరమట్టారెడ్డి ఉయ్యాలో
ధీర అనంతారెడ్డి ఉయ్యాలో
మీ వీర మరణమును ఉయ్యాలో
మరువమెన్నటికైన ఉయ్యాలో
మీవంటి వీరులు ఉయ్యాలో
మా మధ్య నిలబడి ఉయ్యాలో
సాగవని సర్కారు ఉయ్యాలో
ఆంధ్ర మహాసభ తనను ఉయ్యాలో
అంతమొందించునని ఉయ్యాలో
హడలెత్తి సంఘాన్ని ఉయ్యాలో
అణచజూస్తున్నారు ఉయ్యాలో
పాత సూర్యాపేట ఉయ్యాలో
పోరాటమును జూడు ఉయ్యాలో
పురుషులు లేనపుడు ఉయ్యాలో
పల్లెల్లో స్త్రీలంతా ఉయ్యాలో
పరువు కాపాడుకొన ఉయ్యాలో
బయలుదేరినారు ఉయ్యాలో
శీలరక్షణ కొరకు ఉయ్యాలో
స్త్రీలంత కూడారు ఉయ్యాలో
లారీల చుట్టేసి ఉయ్యాలో
లడాయి జేశారు ఉయ్యాలో
ప్రజల బలమూ జూసి ఉయ్యాలో
పారిపోయిరి వాళ్ళు ఉయ్యాలో
పౌరహక్కుల కొరకు ఉయ్యాలో
పోరాటమిదియమ్మ ఉయ్యాలో
ఝాన్సీ లక్ష్మి చరిత్ర ఉయ్యాలో
చాటి చూపాలమ్మ ఉయ్యాలో
మనప్రజల రాజ్యమును ఉయ్యాలో
పొంది తీరాలమ్మ ఉయ్యాలో

– బి. స్వరాజ్యం

అన్ని గ్రామాలలోనూ స్త్రీలు ఊరేగింపులలో నడచి సమావేశాలు వేశారు. కొమరయ్య పాటను కోలాటంతో పాడి ఆడి, ఆయన జీవితాన్ని అభినందించారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తామని శపథం చేశారు.

ఇండ్ల నుంచి బయటకు వెళ్ళని స్త్రీలు గూడ ఈ సమావేశాల్లో పాల్గొనకుండా ఉండలేక పోయారు. ముసలివారు కూడా ఆశీర్వదించక తప్పలేదు. భర్తలు వ్యతిరేకించారు. కొందరు అత్తలు కోడండ్లను వారించారు. జమీందారీ విధానం తెచ్చిపెట్టిన మూఢాచారాలను వారి నెత్తిన రుద్ది ఆపివేయజూసినారు. కానీ స్త్రీలు మాత్రం ఈ జమీందారీ వ్యతిరేక పోరాటంలోనే ఈ విధంగా ముందుకువచ్చినారు.

ఈ ఊరేగింపులకు మొదటిసారిగా నాయకత్వం వహించినది బాలెముల వీరాంగనలు.

ఇంతటితో ఆగలేదు. ఆకునూరు మాచిరెడ్డిపల్లి దృశ్యాలు అప్పటికే తెలంగాణా స్త్రీల ముందు కన్పించుతునే వున్నవి. స్త్రీలు పోలీసు అరాచకాన్నుండి తమ్ము రక్షించుకోడానికి కృతనిశ్చయులైనారు.

అయితే వీరికి ఆయుధాలు ఏవి?

జమీందారీ విధానం వీరికి తెచ్చిపెట్టిన ఆయుధాలనే వారికి వ్యతిరేకంగా ప్రయోగించడానికి పూనుకున్నారు. కారం, రోకలి బండలు, కొడవళ్ళు.

ఈ పరిస్థితులలో బాలెముల దాడులు ప్రారంభమైనవి.

బాలెముల పేద రైతుకూలీ యువకులు భూమికొరకు, తిండికొరకు తుదిదాకా పోరాడుతూ మరణించారు.

సూర్యాపేట తాలూకా పోరాట కేంద్రమైన బాలెములపై సాయుధ దాడికై ప్రభుత్వం రిజర్వు దళాలను పంపింది. దళాలు తెల్లవారు జామున గ్రామాలపై దాడిచేసి పొలాలకు కాలకృత్యాలకై వెళ్ళిన వారిపైనా, సోదాల పేరుతో ఇండ్లలో జొరబడి స్త్రీ పురుషులపైనా దెబ్బల వర్షం కురిపించారు. ఒక్కక్షణంలో రాక్షసత్వాన్ని నగ్నంగా ప్రదర్శించారు.

అప్పటికప్పుడు బయటికివచ్చిన 5-6 గురు రైతుకూలీ యువకులు వీరిని ప్రతిఘటించారు. గార్లపాటి అనంతరెడ్డి, పటేలు మట్టారెడ్డి తమకు దొరికిన కర్రలతో, మొద్దులతో, చెక్కలతో పోలీసుల దౌర్జన్యాలను ఎదుర్కొనడానికి తలపడినారు.

ఈ తుపాకిగుండ్లతోనే పటేలు మట్టారెడ్డి కిందపడినాడు. ముస్లిం పేదరైతు జమాలు సాహెబు, మరికొందరు గూడా గాయపడినారు.

ఒక నిముషంలో గ్రామ ప్రజలంతా తమకు దొరికిన ఆయుధాలను తీసుకొని రంగానికి చేరుకున్నారు. ఆయుధాలు వెంట వున్నప్పటికీ, పోరాడలేని పిరికిపందలు పోలీసులు పిక్కబలం చూపారు.

ఒక పోలీసు చెప్పినట్లు "5 నిమిషాలు ఆలస్యమైతే మేము మా భార్య పిల్లలను చూసుకోలేకపోయేవారము" అనే స్థితిలో ఆ పోలీసు హంతకులు ఉండిరి.

ప్రజల న్యాయమైన కోర్కెలు – భూమి, తిండి కొరకు చావుకైనా వెరువ కుండా పోరాడి వాటిని సాధించి తీరుతామని కొమరయ్య చేసిన ప్రతిజ్ఞను ధృవపరిచారు అనంతరెడ్డి, మట్టారెడ్డిగారలు.

తమ భర్తలు స్వాతంత్ర పోరాటంలో మరణించినందుకు వారి వీరపత్నులు భాష్పాంజలులు అర్పించారు. తుదిదాకా పోరాటంలో పాల్గొంటూ వారి ఆశయాలకై పాటుపడుతామని ప్రతిజ్ఞచేసి, 80 లక్షల తెలంగాణా ప్రజలకు ఆదర్శప్రాయులయ్యారు.

ముక్కోటి ఆంధ్ర ప్రజానీకం, వారి వీర మరణాన్ని అభినందించింది. వారి కుటుంబాలకు సానుభూతి ప్రకటించింది.

సాయుధ పోలీసులతో పోరాడుతూ ప్రాణాలర్పించిన యోధులకు జోహారులు. క్షణంలో పోలీసు హంతకులను తరిమివేసిన బాలేముల ప్రజలకు అభినందనాలు.

పోలీసు రాక్షసత్వాన్నుండి కాపాడుకోడానికై ప్రజల దీక్ష

అరెస్టుల సాకుతో పోలీసులు జరిపే అత్యాచారాల వలన స్త్రీల మానాలకు, ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుటను చూచి ఒక క్షణమైనా ఆలస్యం చేయక ఆత్మరక్షణకు సిద్ధమైనారు.

ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో వలంటీర్లు గ్రామరక్షణకు పూనుకున్నారు. వంతుల ప్రకారం గ్రామాన్ని కాపాడుకోసాగినారు. రాత్రింబవళ్ళు కాపలావేసి పోలీసుల రాకపోకలను కనిపెట్టినారు.

రిజర్వు కాల్పులకు గూడా లొంగని ప్రజానీకాన్ని చూచి జమీందారీ వర్గానికి గంగవెర్రులెత్తినవి. ఎటూ తోచక మిలటరీని ఉపయోగించడానికి పూనుకున్నది కొత్తగా వచ్చిన ఇస్మాయిల్ ప్రభుత్వం.

ప్రజలు కాంగ్రెసు బురఖాలను చించి వేశారు

ప్రజల్లో కాంగ్రెసు యెడ వున్న అభిమానాన్ని ఉపయోగించుకొని, వారిని చీలదీసి సులభంగా అణచివేయడము ప్రభుత్వ ప్లాను. దీనికై మీర్జా యిస్మాయిల్ నుంచి గ్రామ జమీందారీ, రౌడీముఠాల వరకు కాంగ్రెస్ బురఖాలు వేశారు. ఈ బురఖా సహాయంతో తాను చేసే ప్రజా మారణహోమానికి కమ్యూనిస్టు తిరుగుబాటునణచడమని పేరు పెట్టినంత మాత్రాన కాంగ్రెసువాదుల సహకారాన్ని సంపాదించవచ్చుననుకున్నాడు మీర్జా. కాంగ్రెసులో చేరండి, కమ్యూనిస్టుపార్టీలో చేరవద్దని అన్నంతమాత్రాన, ప్రజలు పోరాటాన్ని మానుకుంటారని అధికారులు ఆశపడ్డారు. కొత్త ఖద్దరు ధరించి, ఇంటిపైన కాంగ్రెస్ జండా ఎగుర వేసి అందరినీ కాంగ్రెస్ లో చేరమనీ, లేకుంటే మిలటరీ వస్తుందనీ భయపెడితే అంతా పోరాటాన్ని మానుకుంటారని జమీందారీ ముఠా అనుకున్నది.

పాత సూర్యాపేట కాల్పుల వరకు జమీందారీవర్గం కొంగజపం చేస్తూ కాంగ్రెస్ ప్రచారం తీవ్రంగా సాగించింది. కానీ ప్రజలు మోసాన్ని గుర్తించి కప్పపిల్లలై వారినోట పడటానికి నిరాకరించారు.

ప్రజా శత్రువుల నుండి ఆయుధాలు లాక్కున్నారు.

కొమరయ్య ప్రాణాలను తీసింది జమీందారీ ఆయుధాలని ప్రజలకు బాగా తెలుసు. ఈ ఆయుధాల రక్షణతో ప్రజా వ్యతిరేకులు గ్రామాలలో వుంటూ, పోలీసులకు ప్రజల రహస్యాలను చెప్పుతూ, వారితో మారణ హోమం, స్త్రీల మానభంగం చేయించుతున్నారని గూడా తెలుసు. ఈ స్థితిలో వీరు గ్రామాల్లో సాయుధులై వుండటమంటే – ప్రతి గ్రామాన్ని– ఆకునూరు, మాచిరెడ్డిపల్లె, బాలేముల కానివ్వడమే అనిగూడా తెలుసుకున్నారు. అంచేత జనగామ, భువనగిరి, సూర్యాపేట తాలూకాలలో ప్రజలు కొందరు జమీందారు ఇండ్లపైన దాడిచేసి, వారి ఆయుధాలను లాగివేశారు.

జమీందారుల పలాయన మంత్రం

ఇక జమీందారులకు గ్రామాలలో నిలువ నీడలేదు. వీరిముందు రెండే గత్యంతరాలు. సాగితే రాక్షసరాజ్యం. లేకుంటే అజ్ఞాతవాసం.

నిన్నటిదాక జమీందారుల పేరు చెప్పుకొని, పిల్లికూనలు గూడా ప్రజలపై రాజ్యం చేసినవి. నేడో ఆయుధాలు కూడా వారిని రక్షించలేకపోయినవి.

"నీవే నాతోడు నీడ, నిజముగ సఖుడవు" అని బస్తీలలో ఉండే అధికారుల దగ్గరికి ఇండ్లు, వాకిండ్లు, భార్యాపిల్లలు, ఉంపుడుగత్తెలను వదలి ఆ జమీందారులు పరుగులెత్తారు.

రైతుకూలీల నెత్తురు త్రాగుతూ, వారి స్త్రీల మానాలతో చెరలాటలాడుతూ, కేళీ విలాసాలతో గ్రామాలలో కాలం వెళ్ళబుచ్చుతున్న ఈ జమీందారీ ముఠాను, కంటికి కనపడకుండా తరిమివేసిన ప్రజలకు జోహారులు.

ఈ రాక్షసుల నామరూపాలను శాశ్వతంగా లేకుండా చేయగలిగేది కష్టజీవులయిన ఈ ప్రజానీకమే.

ప్రజలకు ప్రజలే ఆప్తులు

జమీందారీవర్గం తమ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ తీవ్రంగా జరుపుతున్న సాయుధ దాడులనుండి రక్షించుకోడానికి ప్రజాబలమే ప్రధానమైనదని వారు గ్రహించి, ఎర్రజెండాలతో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి ఊరేగింపులతో నడిచారు. సంఘాలు స్థాపించారు. సంఘబలాన్ని పెంచారు. కొమరయ్య, అనంతరెడ్డి, మట్టారెడ్డి శరీరాల నుంచి ప్రవహించిన యువ రక్తం నుండి ప్రజాప్రవాహం బయలుదేరింది.

జన్నారెడ్డి ఇనుపకోటకు గండి

పేదరైతుల లక్ష ఎకరాల భూమినంతా కొల్లగొట్టి, వారిని దుర్భరమైన దోపిడీ విధానానికి గురిచేస్తూ, ప్రక్కనవున్న ప్రపంచాన్నుంచి గూడా వేరుచేసిన జన్నారెడ్డి గ్రామాలు ఈ ప్రవాహంలో కలసినాయి. లక్ష ఎకరాలకు సరిహద్దులుగా వుంటూ, ఇనుపకోటలుగా వున్న చిలువకుంట్ల, నూతనకుల్లు, ఎడవెల్లి గ్రామాలలో ప్రజలు సంఘాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇనుప కోటకు గండిపడింది.

భూమాత ఒడిలోకి ఎర్రజెండాలతో ప్రయాణం

పేద రైతులు తమ తల్లితో సమానంగా చూచుకొని కాపాడుకుంటున్న పంట పొలాలను కొన్ని ఏండ్లకుపూర్వమే ఈ జమీందారులు కాజేసారు. ప్రజలు సంఘాలుగా ఏర్పడి సామాన్య దోపిడీ నుంచి మాత్రమే విముక్తి పొందదలచలేదు. తమ పంటభూముల నుంచి ఎడబాసి, ఏండ్ల తరబడి తిండిలేక, గుడ్డలేక బాధపడ్డారు. ఈ బాధలను పోగొట్టుకోడానికి గూడా నిశ్చయించుకున్నారు.

కొన్ని గ్రామాలలో (సూర్యాపేట) ప్రజల నుంచే భూమిపంపక కమిటీలు ఏర్పడినవి. పేద రైతు కూలీలు ఎర్రజెండాలు తీసుకొని తమ పంట భూములను తిరిగి స్వాధీనం చేసుకోడానికి ప్రయాణమైనారు.

పాత సూర్యాపేట

ఈ పరిస్థితులలో నవంబరు 15వ తేదీన నిజాం జమీందారీ ప్రభుత్వం జమీందారీ దోపిడీనుంచి విముక్తి పొందాలని పోరాడుతున్న తెలంగాణా ప్రజలపైన యుద్ధం ప్రకటించింది.

పాత సూర్యాపేటలో రైతుకూలీ సంఘటిత శక్తితో సూర్యాపేట దేశముఖు దోపిడీని ఎదిరించడం మాత్రమే గాక ఈప్రాంతాల ఉద్యమానికి నాయకత్వం వహించారు. అందుచేతనే ఈ గ్రామంపైకి మొదటిసారి నిజాం మిలటరీ వచ్చి దాడి చేసింది. కారణం స్పష్టమే. ప్రజలు పోలీసు కాల్పులకు కూడా భయపడి జమీందారులకు లొంగిపోలేదు. అంచేత వారు మిలటరీని తెచ్చుకున్నారు.

ఒక్క గ్రామాన్ని లొంగదీయడానికి 500 మిలటరీ వాళ్లు

పాతసూర్యాపేట రెండు మూడు వందల ఇండ్లున్న చిన్న పల్లె. దీనిపైన దాడి చేయడానికి 500 మంది మిలటరీని ప్రయోగించారు సర్కారువారు.

తెల్లవారేసరికి గ్రామాన్ని చుట్టివేసింది మిలటరీ. గ్రామంలోని స్త్రీ పురుషులు ఖాళీ చేసి బయటికి వెళ్ళిపోవడానికి ప్రయత్నించారు గానీ వారిని వెళ్ళనీయకుండా సైన్యం చుట్టుముట్టింది.

పాపం మిలటరీ వాళ్ళు వెంటవచ్చిన అధికారులు, జమీందారులు, మిలటరీ తుపాకులు, మొదలగు వాటిని చూచి భయపడి ప్రజలు కుయ్యో మొర్రో అని తమ పాదాక్రాంతులవుతారని ఆశించారు. ఎప్పుడా అని మీసాలు ఎక్కుపెట్టుకొని, ముసిముసి నవ్వులు నవ్వుతూ, చూస్తున్నారు జమీందారులు. కాని కొద్ది సేపటిలో వారు చూచింది మరో దృశ్యం. ప్రజలంతా గుంపులు గుంపులుగా, దూరంగా

ఉండటం సాగించారు. మరి కొంతసేపటికి వందలు వేలసంఖ్యలో ఇతర గ్రామాలనుండి ప్రజలు తయారు. అందరిచేతా లాఠీలు, వడిసెలలు ఉన్నాయి. నిముష నిముషానికి పెరుగుతున్న వారి సంఖ్యను చూచి అధికారుల గుండెలవిసిపోయినాయి. వచ్చిన ప్రజలు ఏదో అల్లరిచేస్తే, పెద్ద ఎత్తున కాల్పులు సాగించుదా మనుకున్నారు అధికారులు. కాని అదేమీ జరగలేదు. స్థానిక ప్రజా నాయకుడు సరసాని నర్సయ్య వచ్చినవారినందరినీ చిన్న చిన్న గుంపులుగా సర్దివేస్తున్నాడు. **ప్రజలు శాంతంగా, గంభీరంగా నిలుచున్నారు.** అధికారులకు ప్రజలను రెచ్చగొట్టడం తప్ప గత్యంతరం లేక పోయింది. కొంతసేపు చూచి ఒకవైపున ప్రజలను సర్దడానికి వస్తున్న సరసాని నర్సయ్యను అక్కడి జమీందారుల కనుసన్నతో కాల్చివేశారు. మరోవైపు స్త్రీ పురుషులను చుట్టివేసిన సాయుధ దళాలు పురుషులను దెబ్బలు కొడుతూ హింసించ సాగినాయి.

ఈ హింసా కాండను సహించలేని స్త్రీలు, పురుషుల రక్షణకు పూనుకున్నారు. ప్రజలు ఒకవైపున, మరోవైపున పోలీసు మిలటరీ హోరాహోరీగా పోరాడినారు.

గుంపులు గుంపులుగా వున్న ప్రజలు రెచ్చగొట్టే విధానాన్ని సహించలేకపోయారు. ఒక్కుమ్మడిగా అంతా ముందుకు సాగినారు. తిరిగి కాల్పులు, టియర్‌గ్యాస్, మరి కొంత మందికి గాయాలు.

కొంతమంది ప్రజలు కాల్పుల తర్వాత వెనుకకు తగ్గినా, మరికొంతమంది సుమారు 1000 మంది అదేవిధంగా తుపాకిగుండ్ల ఎదుట నిలుచున్నారు. కాని ఇక ముందు కాల్పులు సాగించడానికి గుండెలు లేక పోయినవి.

ఈ విధంగా ఒక గంటసేపు ఘర్షణ జరిగిన తర్వాత జమీందారులు చూపించిన వారిని మొత్తం 150 మందిని అరెస్ట్ చేసికొని తీసుకువెళ్లినారు. సరసాని నర్సయ్యను ప్రజలకు, అతని బంధువులకు ఇవ్వ నిరాక రించారు. జమీందారుల పూజలను విడిచిన ప్రజలు వీరపూజ చేస్తారన్న భయం ప్రభుత్వానికి పట్టింది.

ప్రజలంతా (సుమారు 3, 4 వేలు) సమావేశమైనారు. ఈ ఆయుధాలకు ఎదురుగా మనమెక్కడ నిలుస్తామని ఎవ్వరూ అనలేదు. "వీళ్ళను ఎదిరించడానికి ఆయుధాలు కావాలి" ఇది ప్రతివాని నోటనుంచి వచ్చిన మాట.

"ఔను, మన ఆస్తిపాస్తులను రక్షించు కోవాలంటే, మన స్త్రీల మానాలను రక్షించు కోవాలంటే, జమీందారీ నిరంకుశత్వం నుండి కాపాడుకోవాలంటే మనకు ఆయుధాలు కావాలి" అన్నారు.

సరసాని నరసయ్య జిందాబాద్ !

మిలటరీ దాడులకు అసమ్మతిగా 5 వేల ప్రజల 'పేరేడ్'

మరుసటి రోజే తిరిగి కందగట్ల (సమీ పాన వున్న గ్రామం) కు మిలటరీ వస్తుందని తెలిసి, 5 వేల మంది ప్రజలు సాయుధులై ఆ గ్రామం చేరారు. మిలటరీ లారీలు వచ్చినవి. స్థానిక దేశముఖు, ప్రజానాయకులను పట్టించడానికి గుండెలు లేకపోయినవి. అయినా ప్రజలు ఊరుకోలేదు. దేశముఖు ఇంటికి వెళ్ళారు. తనపని కాస్తా అయిపో తున్నదని గ్రహించిన అతడు తన బిడ్డలను ప్రజలముందు పెట్టి, చంపినా బ్రతికించినా మీరేనని, నమస్కరించారు. మిలటరీకీ సహకారము చేయకుండా కట్టుదిట్టాలుచేసి, ప్రజలంతా గ్రామం వెలుపలికి వచ్చినారు. వీరందరినీ కూర్చోపెట్టడానికి ఒక చేను అంతా కావలసి వచ్చింది. ఒక రైతు ముందుకు వచ్చి తన పంటచేనును చెడగొట్టి దానిలో అందరిని కూర్చోమన్నాడు. కాని ప్రజలు కూర్చోలేదు. లారీల నుంచి మిలటరీ వారు చూస్తుండగానే ప్రజలు వరుసలో నించున్నారు. 5 నిముషాలు ఎడమ, కుడి అనే ధ్వనులు ప్రారంభమైనాయి. అదేమిటి? ప్రజలు పేరేడు, ప్రజాసైన్య విన్యాసం!

తెలంగాణా ప్రజలను మిలటరీ దాడులు కూడా భయపెట్టి జమీందారులకు లొంగ దీయలేవు.

అర్ధరాత్రి దాడులను గూడా ఎదిరించిన కడివెండి ధర్మాపురం ప్రజల వీరోచిత చర్యలు

కాల్పులతో ప్రాణాలను బలిగొన్నా, వేలకు వేలు ఎదురుగా నిలచి పోరాడుతున్న ప్రజానీకాన్ని చూచి మిలటరీ కూడా నిరుత్సాహ పడే స్థితి వచ్చింది. అధికారులు ఈ దుర్గతి నుంచి కాపాడుకోడానికి దేవరుప్పలపై (జనగామ) సుమారు 3 గంటల రాత్రివేళ దాడిచేశారు. గ్రామంలోని పురుషులందరినీ అరెస్ట్ చేశారు.

అమరజీవి కొమరయ్య జన్మ స్థానంలో అరెస్ట్ కాగా మిగిలిన 30 మంది రైతుకూలీ యువకుల దళం దేవరుప్పల ప్రజలకు సాయం చేయడానికి ఆ రాత్రే వచ్చి చేరింది. కాని మిలటరీ వాళ్లు ఆ దళం గ్రామంలోనికి చేరకముందే దేశనాయకులలో ముఖ్యులైన మందడి సోమిరెడ్డిని రౌడీలు, స్థానిక జమీందారీ ముఠా కనుసైగతో కాల్చి చంపినారు. తక్కిన వారిని అరెస్ట్ చేశారు.

ధర్మాపురం ప్రజలు లంబాడీలు, గొల్లలు వడిసెలలతో గ్రామానికి చేరుకున్నారు. మిలటరీ వాళ్ళ నుంచి ఒక దళం వారిని కాల్చడానికి వెంటపడింది. కాని లంబాడీలు వెనుకను తగ్గుతూ వెళ్ళినారు. కొంత దూరం వరకూ మిలటరీ దళం రాగానే దూరం నుంచి రాళ్ళవానను కురిపించారు. తిరిగి గ్రామం చేరుకున్నదాకా మిలటరీని తరిమివేసినారు.

వలంటీరు దళాలకు నాయకత్వం వహిస్తూ దేవరుప్పలలో మిలటరీచే హింసింప బడుతున్న స్త్రీలను రక్షించడానికి వెళుతూన్న గోలి పాపిరెడ్డిని గ్రామంలోనికి ప్రవేశింపక మునుపే కాల్చిచంపినారు.

ప్రక్కనేవున్న కామారెడ్డిగూడెం స్త్రీలు కారపుముంతలు తీసుకొని గ్రామాన్ని చుట్టి వేశారు. మిలటరీ లారీలు గ్రామంలో జొరబడ డానికి ధైర్యం చేయలేకపోయాయి.

హత్యాకాండ పూర్తి అయిన తర్వాత ఒకే గ్రామం నుంచి 300 మందిని అరెస్ట్ చేసుకొని తీసుకొనివెళ్ళుతున్న లారీలు కదిలినవి. లారీలు, అవి నడుస్తున్న దారులు – "ఆంధ్ర మహాసభకు జై", "కమ్యూనిస్ట్ పార్టీకి జై" అనే నినాదాలతో గింగురుమంటున్నాయి. మిలటరీ, అధికారుల చెవులు చిల్లులుపడి తలలు నొప్పిపెడుతున్నాయి.

ఎక్కడివీ మాటలు?

అమరజీవి కొమరయ్య ప్రాణం విడుస్తూ పలికిన అమరవాక్కులు.

జనగామ, భువనగిరి తాలూకాల నుంచి సుమారు 3000 మంది ప్రజలు ఊరేగింపుతో వచ్చి గ్రామంలో అసమ్మతి ప్రదర్శన చేశారు.

అరెస్ట్ అయిన కుటుంబాలకు అవసరమైన సాయం కొరకు ఏర్పాట్లు జరిగినవి.

దేవరుప్పల స్త్రీలు సుమారు రెండుపూట్ల బియ్యం వండి వచ్చిన ప్రజానీకానికి అన్నం పెట్టినారు.

గ్రామంలోని జమీందారీ రౌడీమూకలు పలాయనం చిత్తగించాయి. ఒకవైపు గ్రామాలను స్మశానాలుచేసే కాల్పులు, అరెస్ట్‌లు– మరొక వైపు వేల ప్రజాసమీకరణం సంరంభం.

మీర్జా! నీ స్థానం ఎక్కడ ?

మల్లారెడ్డిగూడెం చిట్టడివిలో మూడు గంటలసేపు మిలటరీతో ఘర్షణ

సూర్యాపేట దేశముఖు కొరకు పాత సూర్యాపేటపైన, విసునూరు దేశముఖు కోసం దేవరుప్పలపైన దాడిచేసి ప్రజలను కాల్చి చంపారు మిలటరీ వాళ్ళు. అయితే జిల్లాలో ఒక మూలన కృష్ణానది సమీపాన వున్న మల్లారెడ్డిగూడెంపైన ఏ దేశముఖులకొరకు దాడి జరిగింది?

నిజాం రాజ్యమంటే జమీందారుల రాజ్యమేగాదు– వారి సంస్థానంలో చేరిన లంచ గొండి ఉద్యోగస్థుల రాజ్యం కూడా.

లంచాలివ్వ నిరాకరించడం గూడా ఈ రోజుల్లో జమీందారీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటే.

అంచేతనే 1వ డిసెంబరు నాడు తెల్లవారే వరకు మల్లారెడ్డిగూడెం గ్రామాన్ని చుట్టివేశారు. హుజూరునగరు తాలూకాలో ఇది ఉద్యమానికి కేంద్రంగా వుండడం, దగ్గరగా వుండే బక్క వంతుల గూడెం భూస్వామి బోగాల వీరారెడ్డి దోపిడీకి ఆటంకంగా వుండటంవలననే ఈ దాడి జరిగింది.

రిజర్వు దాడులను ఎదిరించడానికి సిద్ధం చేసిన వడిసెలతో మిలటరీని గ్రామంలోనికి రాకుండా నిరోధించ బూనుకున్నారు. ఇండ్లల్లో నుంచి, గోడలపై నుంచి సాధ్యమైనంత వరకు రాళ్ళు రువ్వారు.

స్త్రీలు రాళ్ళు అందించడం, పురుషులు రువ్వడం, కొందరు స్త్రీలు తామే వడిసెలలు తీసుకొని రాళ్ళు రువ్వ ప్రారంభించారు. కొందరు మిలటరీ వాళ్ళు తలపైని బొచ్చెలు (ఇనుప టోపీలు) ఎగిరిపోతున్నవి. మరి కొందరికి శరీరంపైన దెబ్బలు తగులుచున్నవి. కొందరు తాళలేక వెనుకకు తగ్గుతున్నారు.

రాళ్ళ కుప్పలు దగ్గరపడినవి. 3 గంటల పోరాటంలో ప్రజలు సొక్కి పోయినారు. అయినా తుది క్షణం దాకా పోరాడుతూనే వున్నారు.

మిలటరీ వాళ్ళు తుపాకులు కింద వేసేసరికి ప్రజలుకూడా రాళ్ళు రువ్వడం మానివేసారు.

మోసంతో కొందరు మరొకవైపు నుంచి వచ్చి గుంపుగా వున్న స్త్రీ, పురుషులపైన కాల్చారు. గ్రామ నాయకులను పిలిచి మాట్లాడు తామనే నెపంతో కాల్చివేశారు.

ధనికరైతు యువకుడు ఎరబోలు అప్పిరెడ్డి, ముంగి వీరయ్య (యాదవుడు) ప్రాణం విడిచారు.

హరిజన యువతులు తోటికోడండ్ర గురవమ్మ, తొండమ్మలు, మరొక కష్టజీవి ఆంకాళమ్మ నేలకొరిగారు.

నిజాం జమీందారీ విధానానికి వ్యతిరేకంగా ప్రజలు సాగించుతున్న పోరాటంలో రైతుకూలీల రక్తం కలిసి ప్రవహించింది.

యుద్ధరంగంలో స్త్రీలు నవ్వుతూ పోరాడుతూ ప్రాణాలిచ్చారు.

తెలంగాణా ఝాన్సీలు వీరే! చాందు బీబీలు వీరే !

తెలంగాణా వీరవనితలైన గురువమ్మ, తొండమ్మ, అంకాళమ్మలకు జోహారులు.

రైతుకూలీ యువకులైన అప్పిరెడ్డి, ముంగి వీరయ్యలకు జోహారులు.

తుపాకులతో బెదిరించుదామని మీర్జా అనుకుంటే, ఎదిరించడానికి స్త్రీలు కూడా తయారైనారు ఈసారి. నిజాం ప్రభుత్వానికి, మీర్జాగారికి మరో పరాజయం జరిగింది మల్లారెడ్డిగూడెంలో.

పులిగిల్లలో నెత్తురు ప్రవాహం ప్రజల ప్రతీకారం

పులిగిల్ల, భోనగిరి తాలూకాలో జాగీరు గ్రామం, ప్రజలు, జాగీరుదారులకు వ్యతిరేకంగా పోరాడి అనేక విజయాలు సాధించారు.

జిల్లాలో మిలటరీ వుండగానే ప్రజలను పూర్వం మాదిరిగా దోచుకోడానికి వీలయ్యే కట్టుబాట్లు చేసుకుంటున్నాడు. అందరివలెనే ఈ జాగిర్దారుగూడా. మొదటి ప్రయత్నం కేసులు పెట్టి గ్రామ నాయకులను అరెస్ట్ చేయించడం, ఈసారి లంచాలు పెట్టి రిజర్వు పోలీసు దాడి చేయించాడు.

జేబులు నింపుకొని, తూటాలు నింపిన తుపాకులతో, ఒక పోలీసు దళం 28-11-46 ఉదయం గ్రామాన్ని చేరుకున్నది. స్థానిక జమీందారీ ముఠా చెప్పినవారిని అరెస్ట్ చేసుకొని తీసుకుపోసాగింది. ప్రజలు తమ నాయకులను విడిపించుకోడానికి బయలుదేరినారు. ఒక క్షణంలో పోలీసులను చుట్టివేశారు. తమ నాయకుల చేతులు, కాళ్ళకు తగిలించిన సంకెళ్ళను తీసివేసి విడిచిపెట్టమన్నారు. లక్షలాదిగా సంపాదనకవకాశమున్న ఈ సమయంలో సంకెళ్ళను తీసివేసేదానికన్నా, కొందరి ప్రాణం తీసి మరొక జేబు నింపు కుందామనుకున్నారు పోలీసులు.

తుపాకులు పేల్చారు. వెంటనే ముగ్గురు (కొమ్మిరెడ్డి బుచ్చిరెడ్డి, బొబ్బు నర్సిరెడ్డి, బండారి నర్సిరెడ్డి) మరణించారు. కొందరు అపాయకరం గా గాయపడ్డారు. చుట్టూవున్న ప్రజలు వెనుకా ముందు చూడకుండా పోలీసులపై పడ్డారు. చితక కొట్టారు. ముగ్గురు పోలీసుల, ముగ్గురు జాగీరు ఉద్యోగుల ప్రాణాలు పోయినవి. మరి కొందరికి తీవ్రమైన గాయాలు తగిలినవి. నాయకులు సంకెళ్ళను పగులగొట్టి విడిపించు కున్నారు.

నల్లగొండలో పోలీసు కళేబరాల ప్రదర్శన జరిగింది. ప్రజలతో పోరాడే వారిగతి ఏమవుతుందో పోలీసు ఉద్యోగులు, వారి కుటుంబాలు తెలుసుకున్నారు. చనిపోయిన వారికొరకు ఏడ్చేవారు కొందరైతే, ముందేమీ కానున్నదోనని ఏడ్చేవారు మరికొందరు.

జమీందారీ అధికారులుదొమ్మీలలో, అరాచకంలో ఆరితేరిన రాయచూరు రిజర్వు దళాన్ని తెచ్చి పుల్లగిల్లపైన దాడి చేశారు. టాంకులు, ఫిరంగిదళాల విన్యాసాలు చేశారు గ్రామసమీపాన.

పులిగిల్ల మరొక ఆకునూరైంది. మరొక మాచిరెడ్డిపల్లె అయింది. జమీందారీ ప్రభుత్వం అంటే గ్రామాలను స్మశానాలను చేసే ప్రభుత్వమని పులిగిల్లలో మీర్జా ప్రభుత్వం ప్రకటించుకున్నది. మీర్జా తన వెనుక చూచుకోనవసరం లేదనుకొని ప్రజలను కాల్చమన్నాడు. కానీ ప్రజలకు జమీందారీ దోపిడీ నుండి విముక్తిపొందే పోరాటంలో

ప్రాణాలు వదలడమొక్కటే కాదు తెలిసివున్నది. హంతకులపై పగ సాధించడం, పోరాటంతో ముందుకుసాగడం అన్నీ తెలుసు.

ఆత్మరక్షణ కొరకు శత్రువులతో తుది దాకా పోరాడిన పులిగిల్ల వీరులకు జోహారులు.

టాంకులు, మర ఫిరంగులు, సాయుధ మోటారులు ప్రజా పోరాటాన్ని అణచలేవు. ఇంతవరకు అణచలేదు. జమీందారి విధానానికి చరమదశ వచ్చిందని ప్రజలు అర్థం చేసుకోడానికి, వీరోచితంగా పోరాడటానికే ఇది తోడ్పడతాయి.

ఎక్కడ దాడిచేసినా మిలటరీకి ఖాళీ గ్రామాలే ప్రత్యక్షం

ఇంతవరకు ప్రజలు మిలటరీని, పోలీసులను ఎదిరించి నిలిచి పోరాడినారు. ప్రాణం అంటే లెక్కచేయమని, దెబ్బకు ఎదురుదెబ్బతోనే జవాబు చెపుతామని నిరూపించారు.

ఇకముందు అధికారులను, మిలటరీని కుక్కలను తిప్పినట్లు తిప్పడానికే పూనుకున్నారు. ఏ గ్రామంపైన దాడిచేసినా ఖాళీ పూరిగుడిసెలే కనబడ్డాయి. వందల సంఖ్యలో అరెస్ట్ చేయడానికి ఉబలాటపడుతూ వెళ్లినవారు 10-15 మందికన్నా ఎక్కువ అరెస్ట్ చేయలేక పోయినారు.

కొత్తగూడెం (సూర్యాపేట) ప్రాంతంలో 5 గ్రామాలపైన ఒకే సారి దాడిచేశారు., 4-5 మైళ్ళ దూరంలో లారీలను వదలి, అంత దూరమూ నడిచి, గ్రామాలకు చేరుకునేసరికి, అధికారులకు పెద్దలు జ్ఞాపకమొచ్చారు. కొందరిని చేతులు, కాళ్ళు పట్టుకొని నడిపించుకుంటూ ఈడ్చుకుంటూ రావలసివచ్చింది. నాలుగు వైపులనుంచి ఈ గ్రామాలను ముట్టడించి 40-50 మందిని మాత్రం అరెస్ట్ చేసుకుపోగలిగినారు.

వస్తకొండూరు (భువనగిరి తాలూక) పైన దాడిచేస్తే 5 గురు కూడా చిక్కలేదు.

ప్రతి గ్రామంలో ఇదే ప్రత్యక్షం

రైతులు పాడిపంటలు వదలి గ్రామం వెలుపలికి వచ్చినారు.

కూలీలు రోజూ మానెడు సంపాదనను వదులుకొని గ్రామాన్ని ఖాళీచేసారు. గర్భిణీ స్త్రీలు, పిల్లతల్లులు అంతా వెలుపలికే వచ్చేసినారు.

వీరందులో తమ జీవితంలో కనీవినీ ఎరుగని కష్టాలను సహించారు. కాని నిజాం మిలటరీకి మాత్రం లొంగిపోలేదు.

మిలటరీ దళాలు, పోలీసు దళాలు గ్రామాలన్నీ తిరిగి వేసారినవి. జమీందారులు తమ సంపాదన నుంచి - వేలు, లక్షలు, అధికారుల జేబుల్లో నింపినారు. ఇచ్చేవారికి, తీసుకునేవారికి చాలు అనే స్థితి ఏర్పడిన తర్వాత, ఒక శుభముహూర్తాన మిలటరీ వారికి, అధికారులకు జమీందారుల తరుపున సూర్యాపేటలో విందు జరిగింది. హంతకులు-హంతకులు కౌగిలించుకొని, చేతిలో చేయి వేసి ఒకరినొకరు తోడుగా ఉంటామని బాసచేసుకున్నారు. "మీరు మేము అంతా ఒక్కటే" అంటూ మిలటరీ బయటపడింది.

మిగిలిపోయిన ఒక రిజర్వుదళం వెళుతూవున్న అధికారులను, మిలటరీ లారీలను చూస్తూ "పొండయ్యా పొండి, ఇక మా పనిపడతారు ప్రజలు" అని బిక్క మొగం వేసింది. ఔను హంతకుల పనిబట్టితీరతారు ప్రజలు.

ఐక్య వీరోచిత పోరాటం

నల్లగొండ జిల్లాలో మిలటరీ రెండు నెలలు రాజ్యం చేసింది. జమీందారీ దోపిడీ నుండి విముక్తి పొందడానికి పోరాడుతున్న 200 గ్రామాల ప్రజలు ఈ రెండు నెలలు ఎప్పుడు మిలటరీదాడులు జరుగునో అని నిద్రాహారాలు మాని, రక్షణకై పరుగులెత్త సాగారు.

మిలటరీ, పోలీసు దౌర్జన్యాలు తీవ్రంగా సాగినవి. లూటీలు, హింసాకాండ విచ్చల విడిగా జరిగినవి.

ప్రభుత్వ ప్రోత్సాహంతో సాయుధ రౌడీదళాలు విజృంభించినవి. దొమ్మీలను, ఇతర అరాచక చర్యలను తీవ్రతరం చేశాయి.

ప్రభుత్వ ఏజంట్ల భయానక దుష్ప్రచారం మితవాద కాంగ్రెసు వారి విచ్ఛిన్న చర్యలు ఏ క్షణమూ ఆగక సాగినవి.

ఒక్కమాటలో చెప్పాలంటే దాగియున్న, బయటవున్న, ప్రజాశత్రువులంతా కలసి, ఒక్కుమ్మడిగా ప్రజలపై దాడిచేశారు. ప్రజలను ఆర్థికంగా, భౌతికంగా, మానసికంగా, రాజకీయంగా లూటీ చేయడానికి భగీరథ ప్రయత్నాలు చేశారు.

కాని ప్రజలు విప్లవ చైతన్యంతో ఒక్కటిగా నిలిచారు. ఒక్కటై పోరాడినారు. కలసి మరణించినారు. జమీందారీవర్గానికి లొంగిపోకుండా పోరాటాన్ని కొసాగించారు. ఆంధ్ర, భారత ప్రజాసీకపు మన్ననలను పొందినారు.

అన్ని వర్గాల ఐక్యపోరాటం

జమీందారీ విధానానికి వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటంలో ధనిక రైతులనుంచి పేదప్రజానీకం వరకు పాల్గొన్నారు. పేదరైతు కూలీలు వీరోచిత పాత్రను నిర్వహించారు. కూలీరైతులు, స్త్రీ పురుషులు సాయుధ మిలటరీని ఎదిరించి పోరాడినారు. సంతోషంతో ప్రాణాలిచ్చినారు. ధనికుల, పేదల మధ్యన చీలికలు కలిగించి దోపిడీ సాగించుతున్న జమీందారీ దోపిడీపై ఈ విధంగా చావుదెబ్బ కొట్టినారు.

సంస్థానంలో జమీందారీ ప్రభుత్వం ముస్లింలను వెనుకవేసుకుని ప్రతిసమస్యకు హిందూ-ముస్లిం స్వరూపాన్ని ఇస్తూ, ఐక్య ప్రజాద్యమాన్ని విచ్ఛినం చేస్తూవచ్చింది. కాని, నేడో హిందూ- ముస్లిం ప్రజలు ఈ పోరాటంలో పాల్గొన్నారు. ముస్లింలు తమ హిందూ సోదరులతోబాటు తుపాకిగుండ్లకు ఎర అయినారు. ముస్లిం రాజ్యమనే నినాదం జమీందార్లదనీ, ప్రజలదృష్టిలో బూటకమనీ రుజువుచేశారు. సంస్థాన హిందూ-ముస్లిం ప్రజలకు ఐక్యతా సందేశాన్ని యిచ్చినారు. అభివృద్ధినిరోధకుల మతకలహాల ప్లానులను భగ్నంచేశారు.

జమీందారీ వర్గం ప్రజలు సాగించే ఈ పోరాటాన్నుండి అభివృద్ధి శక్తులను దూరంగా వుంచడానికి కమ్యూనిస్టు పెనుభూతాన్ని సృష్టించింది. కాని, అభివృద్ధికర ప్రజాశక్తులు ఆగిపోలేదు. స్టేటు కాంగ్రెసు నైజాం నిర్బంధ విధానాన్ని ఖండించింది. రాజకీయ చైతన్యం గల హిందూ-ముస్లిం ప్రజానీకం పోరాటాన్ని అభినందించింది. బ్రిటిషు సామ్రాజ్యవాదులు నిజాం సంస్థానాన్ని సృష్టించి, పెంచి పెద్దచేసి, ముక్కోటి ఆంధ్రులను చీలదీశారు. ఒకరి సంగతి మరొకరికి తెలియకుండా బ్రిటిష్ నిజాం పాలకుల క్రింద బానిసత్వం అనుభవిస్తున్నారు. దూరంగా వున్న ప్రజానీకాన్ని ఈ పోరాటం దగ్గరకు తెచ్చింది. ఆంధ్రదేశంలోని తెలంగాణా సహాయ ఉద్యమం ఇక్కడి ప్రజలను ఉత్తేజితులను చేయడమేగాక జమీందారీ వర్గాన్ని వెనుకకు పట్టించగలిగింది. బందరు రాయబారవర్గం వచ్చి జమీందారులతో ప్రజలనుభవించే కష్టాలన్నిటినీ అనుభవించి విశాలాంధ్రకు బలమైన పునాదులు వేసింది.



ఈ పోరాటం ప్రజావిజ్ఞానాన్ని ఎంతో ముందుకు తీసికొనిపోయింది. పండితులు, పామరులు ప్రజలు వీరోచిత చర్యలను కీర్తించు తూ గేయాలు వ్రాశారు. హైద్రాబాదు నగరంలో ఉర్దూ అభ్యుదయ కవులు ఉర్దూలో గేయాలు వ్రాసి కీర్తించారు.

తెలంగాణా ప్రజలు పోరాటానికి అర్హులు కారనే నాయకుల నిస్పృహను పోగొట్టింది. జమీందారీ వర్గం తమ దోపిడీని హెచ్చుగా సాగించుకోడానికి చేసే ప్లానులను ఐక్యంగా భగ్నంచేసింది. తెలంగాణా ప్రజల్లో వీరోచిత పోరాటసాంప్రదాయాలను కలిగించింది. రెండు నెలలుగా ఎదిరించి, భారతదేశంలో ఒక పెద్ద ప్రజాప్రతిఘటనగా, పోరాటంగా పేరొంది భారత ప్రజానీకపు మన్ననలను పొందింది.

కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్ర మహాసభలు ఈ పోరాటానికి నాయకత్వం వహించి నడిపినందుకు గర్విస్తాయి.

ప్రజలు కోరేదేమిటి?

1. ప్రజలు ఇంతవరకు సాగించిన పోరాటం – ప్రధానంగా వెట్టిచాకిరి, లంచాలు, దౌర్జన్యా లకు, ఇతర జమీందారీ దోపిడీకి వ్యతిరేకంగా మాత్రమే. ప్రభుత్వం పెద్దఎత్తున సాయుధ దాడులను జరిపినప్పటికీ, ప్రజలను తిరిగి ఈ పనులు చేయించే స్థితిలోకి తీసుకుపోలేక పోయింది. అయినా సాయుధ రౌడీదళాలు, రిజర్వు దళాలు, గ్రామాలకు జమీందారీ ముఠా అంగరక్షకులుగా వచ్చి తీవ్రమైన హింసాకాండ సాగిస్తూ; తిరిగి ప్రజలను వెనుకటి నరక కూపంలోకి పడదోయడానికి ప్రయత్నించు చున్నారు. రాజులు, యువరాజులు, ప్రధాన మంత్రులు, అధికార్లు యింకా ఈ అమానుష పనులను ప్రోత్సహించుతూనే వున్నారు.

ఎన్నో త్యాగాలుచేసి, జమీందారీ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి; వెట్టిచాకిరి, లంచాలు, దౌర్జన్యాలు రూపుమాపి సాధించిన విజయా లను జమీందారీవర్గం తిరిగి సాయుధ బలాల ద్వారా హరించడానికి ప్రయత్నించుచున్నది. ఈ ప్రయత్నాలను అరికట్టాలి. విజయాలను రక్షించుకోవాలి.

2. జిల్లాలో దేశముఖులు రైతుల నుండి వేల ఎకరాల భూమిని ఆక్రమించి వారిని కూలీలుగాను, కౌలుదారులుగాను చేశారు. జన్నారెడ్డి ప్రతాపరెడ్డి, కుందూరు లక్ష్మీకాంతా రావు (సూర్యాపేట), విసునూరు రామచంద్రా రెడ్డి(జనగామ), గడ్డం నరసింహారెడ్డి (నల్లగొండ), ఈ దురాక్రమణదారులలో కొందరు.

ఈ దురాక్రమణ ఫలితంగా పేదరైతులు, కౌలుదారులు, వ్యవసాయ కూలీలైనవారు ప్రతి గ్రామంలో 95% వరకున్నారు. వీరు తాము పండించిన పంటను దేశముఖుల ఇండ్లకుచేర్చి, తిండికిలేక బాధపడుతున్నారు. అనుదినం కరువు కాటకాలకు లోనౌతున్నారు.

ఈ విధంగా ఆక్రమించిన భూమిని తిరిగి రైతుకూలీల కిచ్చివేయాలి. బంజరు భూములు వ్యవసాయ కూలీలకు సాగుకు ఇవ్వాలి.

3. ఈ జమీందారీవర్గం గత 10-15 సంవత్సరాలలో గ్రామ ప్రజలనుండి లక్షల రూపాయలు లంచాలు దిగమ్రింగి తాము ఆర్థికంగా బలపడుటేగాక, ప్రజలకు నిలువ నీడ లేకుండా చేసినారు. ఒక్కొక్క పేద కుటుంబం వందల రూపాయలు లంచాలు చెల్లించు కున్నారు. లెవీ ధాన్యపు డబ్బునంతా దిగమింగి లాభాలు లాగినారు. ఈ డబ్బు వారు అనుభవించడానికి వీలులేదు. వారు ఈ విధంగా వుంటున్నంత వరకు ప్రజలు దోచుకుంటూనే వుంటారు. నేడు రైతు కూలీలు తమ ఆర్థిక స్థితిని చక్కబరచుకోవాలంటే తాము తిరిగి సంపాదించుకొన్న తమ భూములలో వ్యవసాయం సాగించుకోవాలంటే, వారి డబ్బు జమీందారుల నుండి తిరిగి వారికి ఇవ్వ బడాలి. ఇది ప్రజల న్యాయమైన కోరిక.

4. జమీందారులు, ధనిక రైతులు, వ్యవసాయకూలీలకు రోజుకు శేరువరకు మాత్రమే ఇస్తూ రాత్రింబవళ్లు పనిచేయిస్తూ వారిని ఆర్థికంగా, భౌతికంగా, మానసికంగా కొల్లగొడుతున్నారు. లక్షాధికారులై గ్రామ ప్రజలను నిలువు దోపిడీకి గురిచేస్తున్నారు.

5. జిల్లాలోని గ్రామగ్రామాలలో ప్రభుత్వం పోలీసు క్యాంపులను వేసి, ప్రజలను హింసించుతూ, వారిని వెట్టిచాకిరి వంటి అసహ్యకరమైన పనులను చేయడానికి నిర్భంధించింది. జమీందార్ల దోపిడీకి, రౌడీ దళాల అరాచకానికీ రక్షణ కల్పించు తున్నారు. అందువల్ల ఈ పోలీసు క్యాంపులను ప్రభుత్వం ఎత్తివేయాలి.

6. ప్రభుత్వం ప్రజల ప్రాణాలను బలిగొన్న వారిపైన, వారి ఆస్తులను కొల్లగొట్టి స్త్రీలను చెరచినవారిపైన కేసులను నడిపించలేదు. పైగా ఆత్మరక్షణకు పూనుకున్న ప్రజలపైన, కార్యకర్తలపైన దొమ్మి, హత్యకేసులు తెచ్చి, వారిని జైళ్ళలో పెట్టడానికి ప్రయత్నించుచున్నది. ఈ కేసులను ఉపసంహరించుకొని; జమీందారీ ముఠాను, రౌడీదళాలను శిక్షించాలి. అధికారు ల అత్యాచారాలపై బహిరంగవిచారణ జరపాలి.

7. జైలులోవున్న రైతుకూలీ ఖైదీలను, ప్రజా నాయకులను విడుదల చేయాలి. వీరు రైతు కూలీ బిడ్డలు. జమీందారుల కనుసన్నలపైన వారి స్వార్థంకొరకు అరెస్టు చేయబడినవారు. వారిని జైళ్ళలో వుంచడానికి ప్రభుత్వానికి అధికారంలేదు.

8. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీలపైన నిషేధాలు తొలగాలి.

9. ప్రజలందరిచే ఎన్నుకోబడిన ప్రజారాజ్యం కావాలి.

ప్రజల ఈ కోర్కెలు న్యాయమైనవి. వీటికై పోరాటాన్ని అప్పుడే ప్రారంభించారు. ఆంధ్ర ప్రజానీకం ఈ న్యాయమైన కోర్కెలను, వీటికై సాగించే పోరాటాన్ని బలపరచాలని ప్రజలు ఆశిస్తున్నారు. ◆

వెంకటగిరి జమీ వ్యతిరేకోద్యమం - ఒక పరిశీలన

కామ్రేడ్ జె. కిషోర్‌బాబు

బ్రిటీషు సామ్రాజ్యవాదం శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి కింద జమీందారీ విధానాన్ని సృష్టించింది. భూమిపై హక్కు రైతుదేనని, రాజుకి కేవలం పన్ను వసూలు మాత్రమేనన్న పాత స్వయం సంపూర్ణ వ్యవస్థ స్వభావాన్ని మార్చివేసి బ్రిటీషు తరహా అపభ్రంశరూపమైన జమీందారీ విధానాన్ని వలసవాదులు ప్రవేశపెట్టారు. రైతుల హక్కులు స్పష్టపరచకుండా జమీందారీ దోపిడీకి పరిమితులు నిర్ధిష్టపరచకుండా 1802 లో చేసిన ఎస్టేటు చట్టం జమీందారీల క్రింద ఉండే రైతుల పాలిట మరణ శాసనంగా మారింది. బ్రిటీషు ప్రభుత్వం తో కలసి రైతాంగాన్ని ద్వేషిస్తూ, పీడిస్తూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి సాంఘిక పునాదిగా జమీందారీ వర్గం సాగించిన దౌర్జన్యాలకి అంతులేదు. రాష్ట్ర భూభాగంలో 2/3 వంతు జమీందారీ పాలనలో వుండేది. అలాంటి పరిస్థితిలో జమీందారీ ప్రాంతాలలోని రైతుల కోసం జమీన్ రైతుసంఘం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభావంలో, సంస్కరణవాద దృక్పథంలో ప్రభుత్వమే చట్టం ద్వారా జమీందారీ విధానాన్ని రద్దు చేయాలని కోరింది.

మరోపక్క ప్రజలు తమ చైతన్యానికి అనుగుణంగా వీరోచితంగా పోరాడారు. మహిళలు, గిరిజనులు, రైతులు, కూలీలు ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొన్నారు. అలాంటి జమీందారీ ప్రాంతాలలో ప్రాముఖ్యత కల వెంకటగిరి జమీలో జరిగిన రైతుల ఆందోళనా, వీరోచిత పోరాటాలను; వాటి నాయకత్వాలను, వాటి పరిమితులను వ్యాసం వివరిస్తోంది.

- సంపాదకులు

వెంకటగిరి జమీ స్వరూపం

ఆంధ్ర రాష్ట్రంలోని జమీందారీలలో విజయనగరం జమీందారీకి దాదాపు విస్తీర్ణంలో బ్రిటిషు ప్రభుత్వానికి చెల్లించే పేష్కసులో సమానస్థాయిలో వుండేది వెంకటగిరి జమీ. ఇందులో మొత్తం గ్రామాల సంఖ్య 730. మజరా గ్రామాలు 617. జమీలో మొత్తం 4 డివిజన్లు వుండేవి. దక్షిణాదిన వెంకటగిరి, పోలూరు (సూళ్ళూరు పేట), ఉత్తరాన దర్శి, పొదిలి. ఈ నాలుగు డివిజన్ల కింద 554 గ్రామాలుండేవి. ఇవిగాక గూడూరు తాలూకాలో 42 గ్రామాలు, కనిగిరి తాలూకాలో 75 గ్రామాలు, ఒంగోలు తాలూకాలో 59 గ్రామాలు జమీలో వుండేవి.

1802లో బ్రిటిష్ వారు చేసుకున్న పర్మినెంట్ సెటిల్మెంట్ ప్రకారం జమీందార్లు భూమిశిస్తును రైతులనుండి వసూలు చేసి అందులో 2/3వ వంతు బ్రిటిష్ వారికి చెల్లించి తాము 1/3వ వంతు ఉంచుకోవచ్చు. రైతుకు శాశ్వత భుక్తపు హక్కును గుర్తించారు. జమీందారుకు భూమిహక్కు ఇవ్వలేదు. భూముల మీదనే కాదు బంజరు, కంచెల మీదగాని, చెరువులు వగైరా నీటివనరుల మీద గానీ జమీందార్లకు ఎలాంటి యాజమాన్య హక్కులు లేవు.

జమీందార్లు శిస్తులు తమ ఇష్టం వచ్చినట్లు పెంచారు. 1802సం॥లో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం 9 లక్షల రూపాయలు కాగా 1933సం॥ నాటికి అది రూ. 254 లక్షలకు పెరిగింది. అంటే 131 సం॥ల్లో సగటున సంవత్సరానికి 1లక్షా 75 వేల రూపాయలు చొప్పున పెంచారన్నమాట.

జమీలోని రైతు వెతలు

రైతుల నుండి పన్నులు వసూలు చేసుకోవటమే తప్ప నీటి వనరులైన చెరువులు ఏనాడు రిపేరు చేసిన పాపాన పోలేదు. జమీందార్ తనవేట, షికారు కోసం రైతాంగాన్ని బలిపెట్టేవారు. అడవుల నుండి పందులు, జింకలు, లేళ్ళు చేలపైబడి పంట

నేటి 'జమీన్‌రైతు పత్రిక' జమీందారీ రైతుగా ఆవిర్భావం

కృష్ణాజిల్లా మునగాల జమీలో జరిగిన రైతు మహాసభ వార్తలను ఏ పత్రిక సక్రమంగా రిపోర్ట్ చేయకపోవటంతో రైతు ఉద్యమానికి ఒక పత్రిక అవసరమని భావించారు. నెల్లూరు జిల్లా రైతు కార్యవర్గ సమావేశంలో చర్చించి పత్రిక ప్రారంభించేందుకు నిర్ణయించారు. సంఘం పేరులాగే పత్రిక పేరును 'జమీందారీ రైతు' అని పెట్టారు. 1934లో ఇవి రెండూ 'జమీన్ రైతు సంఘం', 'జమీన్ రైతు పత్రిక' అన్న పేర్లుగా మారాయి.

ఈ పత్రిక నిర్వహణ బాధ్యత రైతు సంఘ కార్యదర్శిగా ఎంపికయిన నెల్లూరు వెంకట్రామ నాయుడు తీసుకున్నారు. అప్పటికే ఆయన వివాహం కూడా మానివేసి వున్నారు. దాంతో ఆ కార్యనిర్వహణాభారాన్ని ఆయనకే అప్పగించారు.

వెంకటగిరి జమీందారీ పాలనకు వ్యతిరేకంగా రైతాంగం 1929 నాటికి సంఘటిత పడసాగారు. సన్నకారు, బడుగు రైతులే గాక ధనిక రైతులు కూడా జమీందారీ దౌష్ట్యానికి గురయ్యారు. జాతీయ భావాలవైపు ఆకర్షితులై కాంగ్రెస్‌ని సమర్థించేవారు.

జమీందారుల జస్టిస్‌పార్టీని సమర్థించనందుకు వారి ఆగ్రహానికి గురైనారు. ఇలాంటి ధనిక రైతులు, భూస్వాములు 1929వ సం॥ అక్టోబరు 19వ తేదీన నెల్లూరులో సమావేశమై నెల్లూరు జిల్లా జమీన్‌దారీ రైతుసంఘాన్ని ఏర్పరిచారు. దీనికి కార్యనిర్వాహకులుగా వెన్నెల కంటి రాఘవయ్య, కాటూరు వెంకట నరసప్ప నాయుడు, పోట్లపల్లి గ్రూపు గరపనాయుడు, వేనాటి వెంకటరెడ్డి, బద్దిపూడి వెంకట నారాయణరెడ్డి, పొణకా పిచ్చిరెడ్డి, దేశిరెడ్డి శేషురెడ్డి ఎన్నిక అయ్యారు. నెల్లూరు వెంకట్రామనాయుడు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వెంకటగిరి తాలూకాకు చెందిన రైతులెవరూ దీనికి హాజరు కాలేదు. కారణం జమీందారు ఆగ్రహానికి గురికావల్సి వస్తుందన్న భయమే.

నాశనం చేసినా రైతు నోరుమెదప వీలులేదు. 10 రూ. పందిని చంపినందుకు (పంట నాశనం చేస్తున్న కారణంగా) రైతులపై కేసుపెట్టి కోర్టుకీడ్చి 450 రూ. పెనాల్టీ వేసిన ఘటనలు ఉన్నాయంటే రైతు పంటకంటే తన వేటకు అడవి జంతువులు దొరకటమెంతో ముఖ్యమని జమీందార్లు భావించేవారో వూహించుకోవచ్చు. జమీందారు, కలెక్టరు వరకు వేటకు వస్తే రైతులంతా తప్పెట్లు, డబ్బాలు, ఈటెలు తెచ్చి పులిని జమీందారు ముందుకు తరుముకు రావాలి. వారి తుపాకి గుండు పొరపాటున ఏ రైతునైనా బలిగొన్నా నోరు మెదప వీలులేదు. గొప్ప మృగం ఎవరి నైనా కరిచినా, చంపినా గప్‌చిప్‌గానే నడవాలి. చచ్చిన మృగాలను దివాణం వారికే అందిం చాలి. పైగా మిగతా జమీ ఉద్యోగులకు రైతు కూలీల ఇండ్లలో విందులు సాగించాలి.

అందమైన ఆడపడుచు ఉద్యోగి కంట పడ్డదా ఆ ఊరికి ముప్పే. రోషమున్న రైతు వున్నాడా వాని పైరు దగ్ధమే. పాలిచ్చే పెద్ద పొదుగు ఆవు అందిందా ఉద్యోగులకు అందించాల్సిందే. రైతుల పశువుల మందలు, బండెల దొడ్లలో రొప్పుకుంటూ ఆకలితో నకనక లాడాల్సిందే.

రైతులు పంటలు పండినా, ఎండినా శిస్తులు చెల్లించాల్సిందే. లేకుంటే రెండు సూట్లు వేసి కోర్టుకు లాగి ఆ భూములను రైతులనుండి గుంజుకొనేవాళ్ళు. ఆ రైతుకి తెలియకుండా ఎక్స్‌పార్టీ డిక్రీలు కూడా చేయించేవారు. డిక్రీల అమలు కోసం స్థిర, చర ఆస్తులు, జప్తులు, అరెస్ట్ వారెంట్లు కూడా చేయించేవారు. భూము లను వేరే రైతుల పేర మార్చేవారు.

జమీందారీ కమిటీ రిపోర్టులో శిస్తులు ఎంత ఇష్టం వచ్చినట్లు నిర్ణయించిందీ వివరిం చారు. భూమి స్వభావాన్ని బట్టి (పల్లపు, మెరక) గాక వేసిన పంటను బట్టి కూడా రేట్లు నిర్ణయించారు. రిపోర్టు తయారైన కాలానికి (1937) అమలవుతున్న రేట్లలో కొన్ని చోట్ల ఎకరాకు 1 రూపాయి పన్ను వుండగా కొన్ని చోట్ల 26 రూ॥ ఉన్నట్లు చెప్పారు. తమలపాకుల తోటలకు ఎకరాకు 70 రూ॥ కూడా శిస్తు వేశారు. నీటి సప్లయ్ బాగా అవసరమైన పసుపుతోటలకు ఎకరాకు 30 రూ॥ శిస్తు వేశారు. పసుపు పండించినా పండించక పోయినా మూడేండ్లకొకసారి పసుపు పంట శిస్తు చెల్లించాల్సిందేనని నియమం పెట్టారు. పూర్వపు సర్కారు భూములకు శిస్తు రేటు పంట మొత్తంలో సగం కిమ్మత్తు వసూలు చేసేవారు. 1864 సెటిల్మెంటులో దీన్ని 50 శాతం నుండి 30 శాతానికి తగ్గించారు. (3వ వంతు) కానీ జమీందారులలో మాత్రం ఆ తగ్గింపు అమలులోకి రాలేదు.

ఎస్టేటులో 578 పెద్ద చెరువులున్నాయి. వాటి మొత్తం ఆయకట్టు 82 వేల ఎకరాలు. దీనిపై వచ్చే శిస్తు 51,200 రూ. ఈ చెరువులు కలుజులను కూడా రిపేరు చేయించేవారు కాదు. జమీలోని భూమి అంతా వర్షాధారపు భూమే. వానలువస్తేనే చెరువులు నిండుతాయి. నాలుగు పదున్లు వాన ఎక్కువ పడితే చెరువులు తెగిపోయేవి. అందులో చుక్కనీరు కూడా నిల్చేదికాదు. కొన్నిసార్లు పంటలు చివరి తడుపులేక ఎండేవి. ఈ విధంగా జమీలోని రైతులు అనావృష్టినీ, అతివృష్టినీ భరించాల్సి వచ్చేది. చిన్న రైతు మొదలు భూస్వాముల వరకు ఈ దుస్థితిని భరించారు.

ఎస్టేటులో 4,28,540 ఎకరాల పశువుల బీళ్ళు ఉండేవి. వీటిపై ఫీజు 63,418 రిజర్వు అడవి 90 వేల ఎకరాలు. అందులో 35 వేల ఎకరాలను పశువుల మేతకు ఉపయోగించారు. ఏయేటికాయేడు కౌలు హక్కును వేలం ద్వారా అమర్చే 'కంచె' పద్ధతిలో వీటిని కేటాయించేవారు. పశువులను ఉచితంగా మేపుకోవాల్సి ఉండగా జమీందార్లు పుల్లరి వసూలు పెట్టి తమ ఇష్టం వచ్చినట్లు పెంచివేశారు.

రైతుల అసంఘటిత ప్రతిఘటన

ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా రైతులు తమకు తోచిన రీతిలో తిరగబడ్డారు. 1928 ప్రాంతాల్లో 28 మంది మాలరైతులు కోరు, ధాన్యపు శిస్తులు తగ్గించాలనీ; పంట పండని సంవత్సరం శిస్తు ముజరా ఇవ్వాలని కోర్టులో దావా వేశారు. తీర్పు రైతుల పక్షమే అయినా జమీందార్లు దాన్ని అమలుపరచలేదు. రైతులు ప్రతిఘటించిన చోటనల్లా జమీందారులు తన అర్థబలంతోను, అంగబలంతోను వాటిని ఎప్పటికప్పుడు ఎదుర్కొంటూ అణచి వేస్తూండేవారు.

నెల్లూరు తాలూకా పోట్లపూడి గ్రామానికి చెందిన పొణకా సుబ్బరామిరెడ్డి జమీందారి గ్రామమైన పిడూరులో 570 ఎకరాల మాగాణి, 256 ఎకరాల మెట్ట భూముల్ని 20 వేల రూ॥ ప్రీమియం చెల్లించి కౌలుకు తీసుకున్నారు. 40 వేలు శిస్తు చెల్లించటమేకాక లక్షరూపాయల వరకు వెచ్చించి మరమ్మతులు చేయించి వ్యవసాయం సాగించారు.

ఈ భూములకు తగిన నీటిపారుదల సౌకర్యం లేదు. చెరువు బాగు చేయిస్తానని చెప్పిన జమీందారు మాట నిలబెట్టుకోలేదు. పైర్లు ఎండిపోయినా, భూములు సాగుకాక పోయినా శిస్తు రెమిషన్ ఇవ్వలేదు. దీంతో ఆ కుటుంబం చితికి పోయింది.

పొణకా సుబ్బరామిరెడ్డి భార్య కనకమ్మ అప్పటికే జాతీయోద్యమానికి ప్రభావితు రాలైంది. 1926 ఎన్నికల్లో ఈ కుటుంబం రాజాల జస్టిస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసింది. దీంతో జమీందార్లు ఆగ్రహించి శిస్తు బకాయి లకు దావాలు వేశారు. భూములు జప్తు చేయించారు. లక్షలరూపాయల విలువజేసే వారి భూములన్నీ బాకీకి వేలం పడిపోయాయి.

ఇది జమీలోని పెద్ద రైతులందర్నీ కదిలించింది. జమీందారీ దౌష్ట్యాలను ఎదుర్కొనటానికి పురి కొల్పింది. జమీందారీ పాలన అంతమైతే తప్ప తమకు రక్షణ లేదని గుర్తింపజేసింది. జాతీయోద్యమ ప్రభావానికి గురైనవారు జమీందారీ వ్యతిరేక చైతన్యాన్ని కూడా దానికి జోడించారు. అలాగే కోటపోలూరు గ్రామ మునసబు బద్దెపూడి వెంకటనారాయణ రెడ్డి విషయాలు కూడా. ఆయన నెల్లూరు నుండి సూళ్ళూరుపేట మీదుగా వారి గ్రామానికి పోగా పొణకా కనకమ్మ, ఓరుగంటి మహాలక్ష్మమ్మల నేతృత్వం లో వచ్చిన కాంగ్రెస్ సత్యాగ్రహులకు వారింట ఆతిథ్యం ఇచ్చారు. దాంతో ఆయనను, ఆ గ్రామకరణాన్ని సస్పెండ్ చేశారు. దీంతో వారు ఆ ఉద్యోగాలకు రాజీనామాలిచ్చారు. వీరేగాక ప్రభుత్వ దుశ్చర్యలకు నిరసనగా ఆబాక, మన్నె ముత్తూరు, నాదర్లవారికండ్రిగ గ్రామా ధికారులు కూడా రాజీనామాలు ఇచ్చారు.

అలా మొదలైనదీ జమీందారీ రైతు సంఘం.

జమీందారీ రైతు సంఘం ఏర్పడిన 4 1/2 నెలల తర్వాత 2-3-1930లో 'జమీం దారీ రైతు' పత్రిక తొలిసంచిక తేగలిగారు.

జమీందారీ పాలనలో రైతుల కడగండ్లను బహిర్గత పరచి, జమీందారీ దౌష్ట్యాలను ఎండగట్టడానికి వ్యతిరేకంగా రైతాంగాన్ని పోరాటోన్ముఖుల్ని చేయడమే పత్రిక లక్ష్యం.

ఈ పత్రిక మొదటి సంచికనుండి 'జమీందారీ రైతుసంఘం' చేపట్టిన కార్య కలాపాలు (గ్రామాల్లో మీటింగ్ రిపోర్టులు) ప్రచురించడంతోపాటు సర్కారీ ప్రాంతంలోని రైతులకన్నా. జమీందారీ పాలనలో రైతులు ఎదుర్కొంటున్న అదనపు కష్టాలను వెల్లడిచేస్తూ వచ్చింది. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న సత్యాగ్రహ ఉద్యమం లాగానే, జమీందారీ రైతు ఉద్యమాల ప్రధాన్యతను వివరిస్తూ దానికి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నించింది.

1930 ఆగస్టులో మద్రాసు శాసన సభ ఎన్నికల నందర్భముగా జమీందారు దుండగాలను వివరిస్తూ వారు ప్రాతినిధ్యం వహించే జస్టిస్ పార్టీని ఓడించి– ఎస్టేట్ చట్టానికి సవరణలు జరగాలంటే కాంగ్రెస్‌కే ఓటివ్వమని రైతులకు పిలుపునిచ్చింది. దీంతో ఈ పత్రిక ప్రభువుల కన్నెర్రకు గురైంది. దీన్ని అచ్చువేసే శారదా ముద్రణాలయంపై ఆర్డినెన్స్ ని ప్రయోగించారు. పత్రిక నిలిచి పోయింది. ఎన్నికల్లో జమీందార్ల అభ్యర్థులే గెలిచారు.

రంగా నాయకత్వాన రైతు విచారణ కమిటి

ఈ దశలోనే మద్రాస్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గోగినేని రంగనాయకులు, ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చారు. 1931 మే 14వ తేదీ అల్లూరులో నెల్లూరు జిల్లా రైతు మహాసభ జరిగింది. ఈ మహాసభలో జమీందారీ రైతు కష్టాలు విచారించేందుకు రంగా నేతృత్వంలో నలుగురితో కమిటీ ఏర్పడింది.

1931 జులై 29న విచారణ మొదలైంది. అది విచారణ మాత్రమే కాదని, రైతుల విమోచనోద్యమానికి పూరించిన శంఖమని పత్రిక వర్ణించింది. జమీందారీ రైతు పత్రిక కూడా 22-8-1931 నుండి మళ్లీ వెలువడింది. విచారణ కమిటీ ముందుకు రైతులు బాహాటంగా వచ్చి తమ కష్టాలు చెప్పుకుంటే అది జమీందారుకు తెలిస్తే ప్రమాదమన్న జంకును వదలగొట్టడం నాయకత్వానికి పెద్ద పనే అయింది. అందునా వెంకటగిరి తాలూకాలో 1931 ఆగస్టు 1వ తేదీన వెంకటగిరిలో ఇందుకోసం సభ ఏర్పాటుచేయగా అది సహించలేని జమీందారు తన తాబేదారులను పంపి గలబా చేయించ డంతో సభ అర్ధాంతరంగా ముగిసింది.

ఈ కమిటీ రైతులు ఇచ్చిన సాక్ష్యాలను పతాక శీర్షికలో రిపోర్ట్ చేసింది. ధాన్యపు పద్ధతిలో శిస్తులు వసూలు చేస్తూండేవారు. అందులో పంటతో సంబంధం లేదు. తరములననుసరించి ఎకరాకి పుట్టిలో నాలుగో వంతో, మూడో వంతో చెల్లించుకోవాలి. పంట పండకపోయినా కరువు కాటకాలతో అల్లాడుతున్నా ధాన్యం ఖరీదుననుసరించి 'రొక్కశిస్తు' చెల్లించాల్సిందే. తోట భూముల్లో పైరు పెడితే హెచ్చు శిస్తు విధించేవారు. మోహూరులో తమలపాకుల తోటలకు ఎకరాకు 64 రూపాయల శిస్తు. నవంబరు నుండి పిబ్రవరి దాకా 'షికారి రోజులు'. అప్పుడు అడవుల్లో గడ్డి బాగా పట్టివుంటుంది. అయినా పశువుల్ని మేపుకోవడానికి వీలులేదు. జమీందారు వేటకు వచ్చినపుడు మృగాలను 'వరవ' తోలాలి. ఒక్కోసారి ఈ 'వరవ' ప్రాణానికే ముప్పు తెచ్చేది. రాజుగారి చేతలు, చేతకాక పేల్చే తుపాకి జంతువులకు బదులు వరవతోలే రైతుల్ని బలి తీసుకునేది. కంచెల్లో పశువుల్ని మేపుకోడానికి పులవరి (పుల్లరి) చెల్లించాలి. ఈ పుల్లరి ఎప్పటికప్పుడు పెరిగి పోతుండేది. అత్తివరం కంచె పుల్లరి 200రూ॥ ఉండేది 800రూ॥లకు పెంచారు. చెల్లించక పోతే రైతులమీద దాడి చేసేవారు.

కోర్టు దావాలతో రైతుకుటుంబాలు గుల్లయిపోయాయి. ఒక్క మాటుమడుగు గ్రామంలోనే 50 మంది రైతుల మీద కోర్టు డిక్రీలు ఉన్నాయి.అలిమిలి గ్రామంలో దావాల జప్తుల్లో 150 ఎకరాలు సంస్థానానికి కలిసిపోయాయి.

రైతు మహాసభలు – నిర్బంధం

విచారణ కమిటీ తిరగడంతో మొదలైన రైతుల కదలికను మరింత విస్తరింపజేసే ఉద్దేశ్యంతో ఒక నెలరోజుల తర్వాత 1931 సెప్టెంబరు 8, 9 తేదీల్లో ఆంధ్ర రాష్ట్రీయ జమీందారి రైతుల మహాసభను, నెల్లూరు జిల్లా రైతు మహాసభను వెంకటగిరిలో జరిపారు.

దీన్ని భగ్నం చేసేందుకు జమీందారు లైట్లు, బెంచీలు, పాలు, పెరుగు మొదలగు చిల్లర వస్తువులు దొరకకుండా చేశాడు. బ్రీటీష్ అధికారుల అండతో నిషేధాజ్ఞలను (సెక్షన్ 144) జారీ చేయించాడు.

అయినా సభలు జరిగాయి. మద్రాసు శాసనసభలో ఎస్టేట్ యాక్టు సవరణ కోసం కృషిచేసిన విశ్వనాధదాసు మహాశయ గారు, కాశీనాధుని నాగేశ్వరరావు, సత్యమూర్తి, రంగా తదితర నాయకులు పాల్గొన్నారు. వెంకటగిరి నిండుగా పోలీసులను మోహరింపజేసారు. జమీందారును అప్పటికే వ్యతిరేకించి కాంగ్రెస్‌ను సమర్థించిన కటికనేని కళ్యాణరావు సోదరుల బంగ్లా ఆవరణలో సభలు జరిగాయి.

"జమీందారీ రైతులకు ప్రభుత్వానికి మధ్యనున్న జమీందారులు మొదలగు మధ్యవర్తులను ప్రభుత్వ శాసనముతో నిర్మూలింపజేయాలని" ఆంధ్రరాష్ట్ర మహాసభ తీర్మానించగా; నెల్లూరు జిల్లా రైతు మహాసభ "పుల్లరి లేకనే రైతులకు కంచెలు శాశ్వతంగా ఇవ్వాలని, ఆర్థికంగా చాలా బాధలు పడుతున్న జమీందారి రైతులను వెంటనే కాపాడవలసిందని, చెరువులను బాగు చేయించాలని" జమీందారును కోరుతూ తీర్మానించింది.

జమీందారు కాంగ్రెస్ పార్టీలో తనకున్న పరపతితో ఈ సందర్భంగా జరిగిన శాసనోల్లం ఘనముతో తమకు సంబంధం లేదని భోగరాజు పట్టాభిసీతారామయ్య ద్వారా ప్రకటింపజేసారు.

క్రమంగా రాజుకున్న ఉద్యమం

వెంకటగిరి సభల ప్రేరణతో గ్రామాల్లో రైతు సభలు జమీందారుల ఆటంకాలను ఎదుర్కొంటూ జరిగాయి. 1931 అక్టోబరులో మోహూరులో వెంకటగిరి తాలూకా మహాసభ జరిగింది. నవంబరు 6 పలుగోడు సభలో కంచెపుల్లరి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రైతాంగం సభలో పాల్గొన్న గ్రామాల్లో మామూలుగా జనవరి, మార్చి నెలల్లో వసూలు చేసే పుల్లరిని నవంబరులోనే వసూలు చేసేందుకు ఉద్యోగులు పూనుకున్నారు.

రైతు సంఘం తరుపున రంగా నాయకత్వాన జమీందారుతో చర్చలకు జరిగిన ప్రయత్నాలను జమీందారు దివాన్ ఎద్దేవా చేయడంతో విఫలమైనాయి.

10 నెలల కంచెపుల్లరి సత్యాగ్రహం-తీవ్ర నిర్భంధం

జమీందారి రైతు పత్రిక కంచెపుల్లరి వసూళ్ళలో అనుసరించబడుతున్న అన్యాయాలను ఎత్తిచూపి, సత్యాగ్రహమే శరణ్యమని చెప్పింది. ఈ సత్యాగ్రహం కోసం వెంకటగిరికి బయలుదేరుతున్న రంగా గారిని బెజవాడ రైల్వేస్టేషన్‌లో అరెస్ట్ చేసి సబ్‌జైలులో నిర్భంధించారు. ఈ విధంగా సత్యాగ్రహాన్ని విఫలం చేస్తామని జమీందారు భావించాడు. అయితే రంగాగారికి బదులుగా ఆయన భార్య భారతి దేవీ, గొట్టిపాటి బ్రహ్మయ్యలు వెంకటగిరి చేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భారతీ దేవి మాట్లాడుతుండగా జమీందారి ఏజంట్లు రాళ్ళు రువ్వగా ఆమె నుదుటిపై గాయం అయినా సభను సాగించి రైతులను ఉత్తేజపరిచారు.

గాంధీ – ఇర్విన్ ఒడంబడికను రద్దు చేసిన కాలమిది. గాంధీని నిర్భంధించారు. మద్రాసు రాష్ట్రమంతటా రైతు సంఘాలను, సత్యాగ్రహాలను నిషేధిస్తూ ఆర్డినెన్స్‌ను జారీ చేశారు. రంగానే కాక, ఆయన భార్య భారతీ దేవిని, గొట్టిపాటిని కూడా అరెస్ట్‌చేసి రైతు ఉద్యమానికి నాయకత్వం లేకుండా చేశారు. కటికనేని సోదరులపైన, నెల్లూరు వెంకట్రామ నాయుడిపైన 107 సెక్షన్ కింద జామీను కేసులు బనాయించి వెంకటగిరికి పోకుండా నిషేధించారు.

రైతుల మీద నిర్భంధం తీవ్రమైంది. రైతులపై కక్షతో పశువులు నోరు కొట్టారు. కంచెలకు పశువులను రానీయకుండా నిషేధించారు. ఇందుకోసం ప్రత్యేకంగా రెండు పోలీస్ స్టేషన్లను ఏర్పాటుచేశారు. కంచెలవైపు పశువులు పోతే బందిలదొడ్లకు తోలేవారు. రైతులపై కేసులు బనాయించారు. తుదకు రైతులు కంచెలను బహిష్కరించి, సర్కారీ గ్రామాలకు, శోత్రీయం గ్రామాలకు పశువులను తోలుకుంటుంటే దారులు అడ్డగించి బందిలదొడ్లకు తోలి వేలకువేలు బండెల వసూలు చేశారు. **గ్రామాల నుండి పశువులు బయటకు రాకుండా దిగ్బంధం చేస్తే బయటి గ్రామాల రైతులు గడ్డిపంపి పశువులను ఆదుకున్నారు.** ఈ సందర్భంగానే జమీందారుకు వ్యతిరేకంగా పోరాడుతుండిన పెట్లూరి గోవిందరెడ్డి అనేరైతును గ్రామంలో ఆయన ఇంటివద్దనే పోలీసులతో కొట్టించారు. ఇంట్లోని వస్తువులను చిందరవందర చేశారు. తాలూకా అంతటా రైతాంగాన్ని బీతావహుల్ని చేయజూసారు.

నెల్లూరు నుండి ఈ పరిస్థితుల్ని పరిశీలించడానికి వెళ్లిన 'హిందూ' విలేకరి చుండి విశ్వనాథం, వెన్నెలకంటి రాఘవయ్యగార్లు మోపూరు వెళ్తే అరెస్ట్ చేసి వెంకటగిరి తెచ్చి వదిలివేశారు. రైతుల మీద పెట్టిన కేసులకు లెక్కలేదు. కట్టెపుల్లలు కూడా సర్కారీ గ్రామాల నుండి సరఫరా చేయాల్సివచ్చింది.

ఈ సందర్భంగా మోపూరు రైతులు కంచెలు బహిష్కరించి, తమ పశువుల్ని పొరుగున వున్న శోత్రీయం గ్రామమైన భీమవరంకు తోలుతున్న సందర్భంలో రైతులకు, పోలీసులకు ఘర్షణ జరిగింది. స్త్రీలు పోలీసుల తుపాకులను ఎదిరించి పోరాడారు.

రైతులకు – జమీందారుకు రాజీ

అప్పటి జిల్లా కలెక్టరు మాస్టర్ మాన్ జోక్యం చేసుకొని ఈ ఘర్షణను సామరస్యంగా పరిష్కరించేందుకు కృషిచేశారు. 1932 సెప్టెంబరు 1వ తేదీన రాజకుమారుడు, రైతు ప్రతినిధులకు జరిగిన చర్చల్లో ఒప్పందం కుదిరింది. అప్పటికి 35 సం॥లుగా కంచె పుల్లరులు, కల్లుగీత చెట్ల, చేపల నీరుమానం వగైరాలమీద రూపాయికి అణా వంతున విధిస్తున్న ఇన్‌కంటాక్స్‌ను రద్దు చేయడానికి; కంచెల విషయంలో ముఖ్యమగు వసతులు కలగజేయడానికి; షికారి కంచెల విషయంలో అవసరమగు మార్పులు చేయడానికి రాజాగారు ఒప్పుకోవడంతో రాజీ కుదిరింది.

జిల్లాబోర్డు ఎన్నికలు- తిరిగి రైతాంగంపై దాడి

1933 జనవరిలో జరిగిన జిల్లా బోర్డు ఎన్నికలలో జమీందారు పార్టీతో రైతు ప్రతినిధులు ఢీ కొన్నారు. రైతుల్లో తమ ప్రతినిధులను గెలిపించుకునేందుకు తీవ్రమైన కదలిక వచ్చింది. **జబ్బుతో ఉన్న మహారాజంతటి మనిషి మంచం నుండి లేచి మనిషి సహాయంతో వచ్చి ఓటు వేయించారంటే ఎస్టేటు రైతు కదలికలను చూసి ఎంతగా బెంబేలు పడిందో ఊహించుకోవచ్చు.** ఈ ఎన్నికల్లో సూళ్ళూరుపేట, వెంకటగిరి తాలూకా బోర్డులకు రైతు సంఘం తరుపున నిలచిన బద్దెపూడి నారాయణ రెడ్డి, కటికనేని కళ్యాణరావులు గెల్చారు. జిల్లా బోర్డు మాత్రం రాజాకి దక్కింది. దీంతో రైతాంగం నైతికశక్తి పెరిగింది. ఉద్యమం బలపడింది.

అంతకుముందు చేసుకొన్న ఒప్పందాన్ని జమీందారు ఉల్లఘించపూనుకున్నారు. ఓట్లు పడని పల్లెల్లో పశువుల్ని బందెలదొడ్లకు తోలారు. రైతులపై కేసులు బనాయించారు. పేదసాదలు అడవుల్లో కోసుకొని అమ్ముకొనే పండ్లు, ఆకులు నేలపాలు చేశారు. రైతులు పుల్లరి కట్టబోయినా తమ షరతులకు ఒప్పుకోవాలన్నారు. రైతులపై కేసులు బనాయించారు. వెంకటగిరి, సూళ్ళూరు పేట మేజిస్ట్రేట్ కోర్టుల్లో లెక్కలేనన్ని కేసులు నమోదు అయ్యాయని; నెల్లూరు కోర్టులో శిస్తు కోసం మూడుగ్రామాల రైతులపైనే 190 కేసులు వేశారని 'జమీందారీ రైతు' రిపోర్ట్ చేసింది.

పాలెం కోట మహిళల వీరోచిత పోరాటం

వెంకటగిరి తాలూకా పాలెంకోటలో జమీందారీ ఆగడాలకు విసిగిపోసారిన రైతాంగం తిరగబడింది. 1933 మార్చి 20, 22 తేదీల్లో జరిగిన పోరాటం జమీవ్యతిరేక ఉద్యమానికి పరాకాష్ట.

పాలెంకోటకి చెందిన 'పనసకోన' అనే అడవిలో రైతులు అనాదిగా పశువుల్ని, మేకల్ని మేపుకునేవారు. ఎన్నికల్లో పాలెంకోట, తీర్థంపాడు రైతులు తమకు వ్యతిరేకంగా ఓటు వేసినందుకు; పెట్లూరు గోవిందరెడ్డి పోటీచేసినందుకు కక్షగా 'పనసకోన' పశువుల్ని రానివ్వకుండా చేశారు. పోలీసుల సాయంతో పశువుల్ని పారదోలారు.

రైతుల్లో ఆందోళన చెలరేగి ఏమైనా పశువుల్ని అడవికి తోలాల్సిందేనని తీర్మానించుకున్నారు. పాలెంకోట, తీర్థంపాడు ఇరుగు పొరుగు గ్రామాల రైతులు రెండు రోజులు మల్లగుల్లాలు పడి 22న పశువుల్ని 'పనసకోన'కు తోలపూనుకున్నారు.

పరిస్థితిని ముందుగానే ఊహించిన జమీందారు, ఎస్టేటు సిపాయిలకు తోడుగా డిఎస్పీతో సహా పోలీసు బలగాలను పిలిపించుకొని గ్రామంలో మకాంవేశారు. రైతుల చేతుల్లోని కర్రలు, వగైరాలు లాక్కొని, రైతుల్ని

నిరాయుధులను చేసి నిర్భంధించారు. ఎస్టేటు ఉద్యోగులు పశువుల్ని బండెలదొడ్లకు తోల పూనుకున్నారు.

విషయం గ్రామంలోని స్త్రీలకు తెలిసి స్త్రీలంతా చేతుల్లో చీపురు కట్టలు, చెప్పులు, పేడనీళ్లు, కారప్పొడి తీసుకొని ప్రతిఘటనకు సిద్ధపడ్డారు. యాకసిరి చెల్లమ్మ అనే గర్భిణి నాయకత్వాన పశువుల్ని దొడ్డికి తోలరాదని అడ్డుపడ్డారు. పోలీసులు వారిపై చెయ్యి చేసు కోబోయే లోపల వాళ్ళ కళ్ళల్లో కారంపొడి చల్లి చెప్పులు, చీపురుకట్టలతో దేహశుద్ధి చేశారు. ఇదిచూసిన రైతులు రెండోవైపు నుండి పోలీసులపై రాళ్ళతో యుద్ధం చేశారు. డియస్పితో సహా పోలీసులకు దెబ్బలు తగిలాయి. **ఫారెస్ట్ ఉద్యోగులు చెల్లమ్మ గర్భంపై మోకాళ్లతో తన్నారు. ఆమెను రైతులు వెంకటగిరి ఆసుపత్రికి తరలించారు.** రైతులపై కాల్పులు జరిపేందుకు కలెక్టరును, ఎస్.పి ని రాజా కోరినా వారు అనుమతించలేదు. పైగా ఈ ఉద్యమం తర్వాత ఈ అధికారులిద్దరూ రాజాను బెదిరించి రైతులతో ఒప్పందం కుదిర్చారు. ఏ గ్రామాలకు కంచెలు ఆ గ్రామా లకు వదిలివేయాలనీ, నిర్ణీత కాలంలో మొత్తం కంచెలకు పుల్లరి చెల్లించాలనీ, రైతులపై బనాయించిన కేసులు ఉపసంహరించు కోవాలనీ తీర్మానించారు.

55 మంది రైతులను అరెస్ట్ చేసి కేసులు పెట్టారు. ఇందులో 7గురు స్త్రీలు ఉన్నారు. సంస్థానం వారు ఈ పోరాటాన్నంతటిని సినిమా తీయించి కేసులో సాక్ష్యంగా పెట్టారు. కేసు రుజువు కాలేదు. చెల్లమ్మకు మాత్రం 15 రూ॥ జుర్మానా వేశారు. మిగిలిన వారిమీద కేసు తీసివేశారు.

జమీ వ్యతిరేకోద్యమంలో సామాన్య రైతులు ప్రత్యక్షంగా మిలిటెంట్‌గా పాల్గొన్నారు. **1931 నవంబరు నుండి 1933 మార్చి వరకు జరిగిన ఈ పుల్లరి వ్యతిరేక పోరాటాలు స్థానిక రైతు నాయకుల చొరవతోనే ఈ పోరాటాలు జరిగాయి. ఇంతకు మించి కాంగ్రెస్ నాయకత్వం రైతాంగాన్ని పోరాటపథంలో నడిపించిందేమీ కాదు.** ఎన్నికలవైపే ప్రజల దృష్టిని మరల్చి మద్రాసు శాసనసభలో తీర్మానం చేయించాలన్న ప్రచారమే సాగించారు.

పిచ్చిముంతల వ్యతిరేకోద్యమం

గ్రామాల్లో భూస్వాములు సరైన కొలతలతో తగ్గింపు కొలపాత్రలు చేయించారు. వీటిని పిచ్చిముంతలని పిలిచేవారు. ఒక్కొక్కరైతు వద్ద ఒక్కోరకం పిచ్చి ముంతలుండేవి. వీటితో కొలిచి తక్కువ కూలీ ఇచ్చేవారు రైతులు. ఈ అన్యాయాన్ని చాలా కాలంగా కూలీలు భరిస్తున్నారు. దీన్ని రద్దు చేయాలని, సరైన కొలతలు ఇవ్వాలని 1923లో వెంకటగిరిలో జరిగిన రైతు మహాసభ తీర్మానించింది.

1929లో మైపాడులో కూలీలు సమ్మె చేసి ఆ గ్రామం వరకు దాన్ని సాధించు కొన్నారు. తిరిగి 1935లో పూడపర్తిలో వెన్నెల కంటి రాఘవయ్య అధ్యక్షతన కూలీలు 3నెలల పాటు సమ్మె చేశారు. ఖరా కొలతలతో రెట్టింపు జీతం సాధించుకున్నారు. ఈ పోరాటాలు ఎక్కడికక్కడే పరిమితమయ్యాయి.

1934 కేంద్రం, 1937 రాష్ట్ర శాసన సభ ఎన్నికలు

1934 కేంద్ర శాసనసభ ఎన్నికల్లో జమీందారు అభ్యర్థులకు పోటీగా గుంటూరు, నెల్లూరు జిల్లాలకు కాంగ్రెస్ అభ్యర్థిగా రంగా పోటీ చేశారు. రైతు సంఘమూ, జమీన్‌రైతు పత్రికా ఈ ఎన్నికల్లో విస్తృతంగా జమీన్‌దారీ వ్యతిరేక ప్రచారం నిర్వహించాయి. కవి, గాయకుడు అయిన నెల్లూరు వెంకట్రామ నాయుడు పద్యాలు గ్రామ గ్రామాన రైతుల నోట ప్రతిధ్వనించాయి. రంగా అత్యధిక మెజారిటీతో గెలుపొందారు.

1935 జనవరి 7వ తేదీన వెంకటగిరి లో టంగుటూరి ప్రకాశం పంతులు అధ్యక్షతన జమీన్‌రైతు నెల్లూరు జిల్లా 4వ మహాసభ జరిగింది. జులై 28న ఉదయగిరి తాలూకా మొదటి మహాసభ జరిగింది. పొణకా కనకమ్మ గారు ఈ సభలో ప్రారంభోపన్యాసం చేశారు.

1936 సెప్టెంబరు 6న నెల్లూరు కాంగ్రెస్ సంఘం బుచ్చిలో సమావేశమై జమీందారీ రద్దును కాంగ్రెస్ మానిఫెస్టోలో చేర్చాలని కోరింది. పై నాయకత్వం పట్టించు కున్న పాపాన పోలేదు. 1936 అక్టోబరు 18న జిల్లా పర్యటనకు వచ్చిన నెహ్రూకు వెంకటగిరి లో ఇచ్చిన వినతిపత్రంలో "జమీందారీ సిస్టమ్ ఉన్నంతవరకు స్వాతంత్ర్యం సిద్ధించుట దుర్లభం" అని రైతు నాయకులు చెప్పారు. దీనికి బదులుగా నెహ్రూ జమీందారీ విధానం నశించవలసిందేనని అంటూనే - మన చేతుల్లోకి అధికారం వచ్చిన పిమ్మటనే ఈ విషయమును నిర్ణయింప వీలగునని చెప్పి నీరుగార్చారు.

1937 మద్రాసు శాసనసభకు జరిగిన ఎన్నికల్లో జమీన్ రైతు సంఘం, జమీన్ రైతు పత్రిక కాంగ్రెస్ అభ్యర్థులకు విస్తృతంగా ప్రచారం చేశారు. మొత్తం 215 స్థానాలకుగాను 158 స్థానాలు కాంగ్రెస్‌కు దక్కాయి. చల్లపల్లి జమీందారు తప్ప మిగిలిన జమీందారు లందరూ ఓడిపోయారు. నెల్లూరులో జమీందారు అభ్యర్థులు ఓడిపోయారు.

1937 జులైలో రాజగోపాలచారి నేత్రుత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. "శిస్తులు, రుణాలు, అడవులు, జమీందారులు మొదలగు భారాలచే రైతు అణగారి పోతు న్నాడ" ని చెప్పిన జమీన్‌రైతు పత్రిక బడ్జెట్ సెషన్ అయిన వెంటనే ఎస్టేట్ లాండ్ యాక్టును సవరించాలని మొదలుపెట్టింది.

ప్రకాశం విచారణ కమిటీ - కంటితుడుపు చర్యలు

కాంగ్రెస్ పార్టీపై తగినంత ప్రాబల్యం ఉన్న జమీందారీ వర్గం- తనకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోడానికి అడ్డుపడింది. రైతుల్లోని జమీందారీ వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని కాలయాపన చర్యలకు కాంగ్రెస్ మంత్రివర్గం పూనుకుంది. ప్రకాశం పంతులు నేత్రుత్వంలో జమీందారీ రైతు విచారణ సంఘాన్ని నియమించింది

"పర్మినెంట్ సెటిల్‌మెంట్ జరిగిన 135 సంవత్సరాలుగా ఈ ఒక్కటి రైతుకు దొరికిందని" జమీన్‌రైతు పత్రిక తృప్తి పడింది. బొబ్బిలి మొదలు మాధవరం (కడప జిల్లా) వరకు అన్ని జమీందారీల్లోని దౌష్ట్యాలకు వ్యతిరేకంగా రైతులు సాక్ష్యాలిచ్చేందుకు జమీన్‌రైతు కృషి చేసింది.

కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడినా జమీందారుల దౌష్ట్యం ఏమాత్రం తగ్గలేదని పలు సంఘటనలు పేర్కొంటూ 'జమీన్‌రైతు' బాధపడింది. విచారణ సంఘ నివేదిక 1938 ఏప్రిల్ 30 కే పూర్తిఅయినా దాన్ని వెలువరించ

దానికి కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం, కాంగ్రెస్ జమీందార్ల సంస్థగా రానురాను మారిన ఫలితమేనని కూడా విమర్శించింది. అయినా రైతుల్లో భ్రమలు పోగొట్టి కాంగ్రెస్‌పై పోరాటానికి ఏ కార్యక్రమాన్ని ఇవ్వలేకపోయింది. 1938 నవంబరు 28న రిపోర్టును శాసనసభలో ప్రకటించినపుడు ఈ రిపోర్టులో జమీందారీ పద్ధతి ఉండవలెనా? అక్కరలేదా? అనే విషయాన్ని గూర్చి బొత్తిగా చర్చించకపోవడం అన్యాయమని పేర్కొంది. **కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టింది ప్రజాబాహుళ్యం త్వరపెడుతున్నా జమీందారీ విధానం నిర్మూలన కాదు-శిస్తు విధానం నిర్ణయం మాత్రమేనని విమర్శించింది.**

ఆంధ్ర రాష్ట్ర జమీన్‌రైతు సంఘం 1938 డిసెంబరు 17న మద్రాసులో సమావేశమై ప్రకాశం కమిటీ రిపోర్టును చర్చించి దానికి కొన్ని సవరణలు సూచించింది. 1939 జనవరిలో సభలో చర్చ మొదలైనా దీనిపై బిల్లు రూపొందించకుండానే 1939 అక్టోబరులో కాంగ్రెస్ మంత్రివర్గం రెండో ప్రపంచ యుద్ధం కారణంగా రాజీనామా చేయాల్సివచ్చింది.

వెంకటగిరి క్షామం- ఎస్టేటు కౌర్యం

1939లో వెంకటగిరి జమీన్ వరకు వర్షం పడక తీవ్రమైన క్షామం ఏర్పడింది. రైతులకు సాయం చేయకపోగా ఎస్టేటు వారు శిస్తులు వసూలుకు పోలీసుల సహాయంతో జప్తులకు పూనుకున్నారు. దీంతో రైతాంగంలో కదలిక వచ్చింది. ఆ సంవత్సరం జూన్ 21న మనుబోలు గ్రామంలో జరిగిన జమీన్‌రైతు సభలో వేలాదిగా రైతులు హాజరైనారు. ఎండిపోయిన భూములకు కిస్తి రాయితీ, బంజరు ముజరాలు పూర్తిగా అనాధి ప్రకారం ఇచ్చి తీరాలని జమీందారు విధానం రద్దు కావాలని సభ కోరింది.

ఈ సభ ఫలితంగా జమీందారు సగం శిస్తు రాయితీ ఇవ్వటానికి ఒప్పుకొని 15 రోజుల్లో చెల్లించాలన్న షరతు పెట్టాడు. 1939 ఆగస్టులో వెంకటగిరి తాలూకా పిరిమిడిలోను, పారవోలులోను గ్రామాలపై రెవిన్యూ, పోలీసు, ఫారెస్ట్ అధికారులు జప్తులు చేశారు.

1939 అక్టోబరులో జిల్లా బోర్డు ఎన్నికల్లో 52 స్థానాల్లో 41 స్థానాలు పోటీలేకుండా కాంగ్రెస్‌కు దక్కాయి. పోటీ జరిగిన వాటిలో రాపూరు 2 స్థానాలు తప్ప 9స్థానాలు కాంగ్రెస్‌కే దక్కాయి. జిల్లా బోర్డు కాంగ్రెస్ వశమైంది.

1940లో గూడవల్లి రామబ్రహ్మం నిర్మించిన 'రైతుబిడ్డ' సినిమా రైతుల్లో చైతన్యం తెస్తుందన్న అక్కసుతో జమీందారు దీని ప్రదర్శనను అడ్డుకున్నాడు. **వెంకటగిరిలో సినిమా హాలు (దేరా) తగలబెట్టించడంతో పాటు గూడూరు డివిజన్‌లోనే సినిమా వెయ్యకూడదంటూ నెల్లూరు మెజిస్ట్రేటు ఉత్తర్వులిచ్చాడు.**

1940 అక్టోబరులో కంచె విషయంలో పూర్వపు రాజీని ఉల్లంఘించిన జమీందారు మరల కంచెలను ఏ గ్రామానికి ఆ గ్రామానికి ఇవ్వకుండా వేలం పెట్టాడు. దీనికి వ్యతిరేకంగా డిసెంబరు 22న వెంకటగిరిలో రైతు మహాసభ జరిగింది. వేలం పద్ధతి కాకుండా ఏ గ్రామానికి ఆ గ్రామం కంచె ఇవ్వాలని తీర్మానించారు.

జమీందారి రద్దు- కాంగ్రెస్ టోకరా

రెండో ప్రపంచం యుద్ధం నేపధ్యంలోనే దేశవ్యాప్తంగా తిరుగుబాటు వెల్లువ వచ్చింది. నైజాం నవాబుకు వ్యతిరేకంగా మొదలైన **ఆంధ్రమహాసభ ఉద్యమం కమ్యూనిస్ట్‌ల నేతృత్వంలో సాయుధపోరాటం తీసుకుంది. ఆ ప్రభావం వెంకటగిరి జిల్లాపై పడకుండా కాంగ్రెస్ రైతుల్లో భ్రమలు కల్పించపూనుకుంది.**

1945లో కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో నష్టపరిహారం ఇచ్చి జమీందారులను రద్దుచేసే అంశాన్ని చేర్చింది. 1946 ఎన్నికల ప్రచారంలో జమీందారీ బిల్లును ఈసారి కాంగ్రెస్ తప్పక తీసుకు వస్తుందని ప్రకాశం పంతులు ప్రకటించాడు.

1946 జూన్ 14న నెల్లూరులో జరిగిన జమీన్ రైతు సమావేశం "రైతులను ఆర్థికంగా సాంఘికంగా, రాజకీయంగా కృంగదీసి అధోగతి పాలు చేస్తున్న జమీందారీ విధానాన్ని రద్దు చేయాలని" తీర్మానించింది. అదే సంవత్సరం అక్టోబరు 16న ఒంగోలులో జరిగిన ఆంధ్ర రాష్ట్ర జమీన్ రైతు మహాసభ "ఎలాంటి నష్టపరిహారాన్ని ఇవ్వకుండానే జమీందారులను రద్దు చేయాలని కోరింది."

అయితే ఇదంతా చెవిటివాని ముందు శంఖం ఊదినట్లే అయింది. ప్రకాశం ప్రభుత్వం జమీందారీరద్దు జోలికి వెళ్లకుండా ఎస్టేట్

> నరరూపరాక్షసుడు
> వెంకటగిరి బుగత
> కరుకుకాటుకి
> రైతు సొంగలు కార్చినా
> కేసుల్లో ఇరికించి
> కోర్కుకిడ్పించాడు
> కంచపద్ధతి పెట్టి
> రైతుల్ని కొంసించి
> ఏనసకానకి
> ఏశువుల్ని తోలితే
> పాలకుల అండతో
> కాల్పుల్ని జరిపాడు
> కళ్లేర జేసి 'చెల్లమ్మ'
> పోరుబాటను పట్టగా
> కారెలు, చీపుళ్ళ
> కాళ్ల చెప్పులతో
> ఏణతులంతా కూడి
> ఏరుగులెట్టించారు.
>
> - అల

ల్యాండు రెవిన్యూ బిల్లును 24-2-47న శాసన సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు నిరర్థకమని "జమీన్‌రైతు" విమర్శించింది.

కాంగ్రెస్ ప్రభుత్వం విషయాన్ని పదే పదే నాన్చింది. అధికార మార్పిడి జరిగిన 1947 ఆగస్టు 17కు రెండు సంవత్సరముల తర్వాత 1949 సెప్టెంబరు 7వ తేదీకి చట్టం అమల్లోకి తెస్తూ ప్రకటించింది.

మొత్తం మీద వెంకటగిరి జమీలో సాగినరైతు ఉద్యమం కాంగ్రెస్ గీచిన గీతలకు లోబడి నడిచింది. జమీందారులకు వ్యతిరేకంగా రైతుల్లోని చైతన్యాన్ని పరిమితుల్లో ఉంచుతూ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగకుండా ఎప్పటికప్పుడు ఆశలతో ముంచెత్తుతూ నడిచింది. రైతాంగం చైతన్యమైనంత మేర పరిమితమైన ఫలితాలు సాధించింది.

('జమీన్ రైతు' పత్రిక స్వర్ణోత్సవ సంచిక నుంచి సమాచారం తీసుకోవడం జరిగింది.) ◆

అడవులు, ఆదివాసులు - షెడ్యూలు తెగల బిల్లు 2005

కా॥ కె.ఎం.మోషే

అడవులపై ఆదివాసుల హక్కులను గుర్తించే పేరుతో కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వశాఖ ఒక ముసాయిదా చట్టాన్ని విడుదల చేసింది. "షెడ్యూలు జాతుల (అటవీ హక్కుల గుర్తింపు) బిల్లు 2005" పేరుతో ఇది విడుదల అయింది. దీనిని కేంద్ర ప్రభుత్వానికే చెందిన అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ వ్యతిరేకిస్తుండగా హోంశాఖ బిల్లును ఆహ్వానించింది. దీనిపై దేశంలో వివిధ పత్రికలు, వేదికలపై అనుకూల, ప్రతికూల వాదనలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ బిల్లుకి వ్యతిరేకంగా క్రమ బద్ధమైన ఆదివాసీ వ్యతిరేక ప్రచారం బిల్లును వ్యతిరేకించే పేరుతో జరుగుతున్నది. "ఈ వర్షాకాల పార్లమెంటు సమావేశాలలోనే ఈ బిల్లును చట్టంగా తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వశాఖ ప్రయత్నించిందని, రహస్యంగా చేస్తున్న ఆ ప్రయత్నాలను అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ పత్రికలకు లీకుచేసి విషయాన్ని రచ్చచేసింద"ని కూడా పత్రికలే రాస్తున్నాయి. ఇదే సమయంలో మన రాష్ట్రంలో 1994 నాటి గిరిజన సలహా మండలి సిఫారసులను అనుసరించి రాష్ట్రంలోని ఆదివాసులు నివసించే గ్రామాలకు రిజర్వు ఫారెస్టుల నుండి రోడ్లు, విద్యుత్ ఇతర అభివృద్ధి కార్యక్రమాలకి '1980 అటవీ సంరక్షణ చట్టం', 1983 వన్యప్రాణి రక్షణ చట్టం వంటివి' అడ్డుగా ఉన్నాయని; అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు, మినీ హైడల్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం పై అటవీ చట్టాలు ఏజెన్సీ ప్రాంతంకి వర్తించకుండా గవర్నర్ నోటిఫికేషన్ కోసం మరో ముసాయిదా తయారైంది. ఇది ప్రస్తుతం గిరిజన సలహా మండలి పరిశీలనలో ఉంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముసాయిదాలు ఆదివాసులు - అడవులపై హక్కులు - ప్రభుత్వాల విధానాల వెనక ఉన్న దృక్పథాలకి సంబంధించిన లోతైన పరిశీలన జరపాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌చే విడుదల చేయాలనుకుంటున్న నోటిఫికేషన్ విషయం పక్కనుంచి కేంద్ర ప్రభుత్వ ముసాయిదా బిల్లు లోతుపాతుల్ని పరిశీలిద్దాం. **గత అనుభవాలన్నీ ఆదివాసీల పేర చేయబడిన ప్రతి చట్టం, ప్రతిచర్య అంతిమంగా ఆదివాసీ సమాజాన్ని, వారి హక్కులను మరింత దుర్భలం చేసేందుకు; రాజ్యాన్ని, రాజ్యం రక్షించే వర్గాలను బలోపేతం చేసేందుకే జరిగాయని తెలియ జేస్తున్నాయి.** అయితే ఆదివాసులు, వారి ఉద్యమాలు మౌనంగా లేవని, చట్టబద్ధంగా, చట్టవిరుద్ధంగా వారిపై జరుగుతున్న దాడులకి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూనే ఉన్నారని; జీవించే హక్కు కోసం ఎన్నో అనుకూలతల మధ్య - వారికి వ్యతిరేకంగా సాగుతున్న కుట్రలను ఎదుర్కొనేందుకు ఘర్షణ పడుతున్నారని గమనించాలి. 'గోదావర్మన్' కేసులో సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కేంద్ర అటవీ పర్యావరణ శాఖ 2002 లో అడవులలో నివసించే ఆదివాసులందర్ని ఆక్రమణదారులుగా గెంటివేయ ప్రయత్నించింది. అనేక రాష్ట్రాలలో గెంటివేతలు జరిగాయి. దీని అనంతరం ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన యు.పి.ఎ ప్రభుత్వం తన ఉమ్మడి కనీస కార్యక్రమంలో గెంటివేతలు వుండవని, అందుకే ఈ షెడ్యూలు జాతులు (అటవీహక్కులు రక్షణ) బిల్లు 2005ను ప్రవేశ పెట్టామని చేస్తున్న ప్రచారానికి వెనక ఉన్న మౌలిక అంశాలను అధ్యయనం చేయాలి. అదే సమయంలో ప్రభుత్వాల చట్టాలు-వాటి ముందు మాటలు ప్రకటించే గొప్ప గొప్ప ప్రకటనలకి భ్రమలు పెంచుకోకుండా గిరిజన ఉద్యమం, ప్రజాతంత్ర ఉద్యమాలు; రాజ్యం, పాలకుల నుండి గిరిజన సమాజాల న్యాయమైన హక్కులను నిలుపుకునేందుకు; ఏ మాత్రం వెసులుబాటు అయినా దొరికించుకొనేందుకు; స్వంత కాళ్ళమీద గిరిజన, ప్రజాతంత్ర ఉద్యమాలు నిలదొక్కుకొని పురోగమించేందుకు పరిస్థితులను ఉపయోగించుకోవాలి. నిరంతర కార్యవిధానాన్ని కొనసాగించేందుకు ప్రయత్నించాలి.

పై అంశాల వెలుగులో ప్రస్తుత కేంద్ర షెడ్యూల్ జాతుల బిల్లును, దానితో పాటు అడవులపై పాలకుల విధానాలు - చట్టాల ఉద్దేశ్యాల అమలును పరిశీలిద్దాం.

కేంద్ర ప్రభుత్వ ముసాయిదా షెడ్యూలు జాతుల బిల్లు; ఫారెస్టు చట్టాల, వాటి అమలు వల్ల "ఆదివాసులకి చారిత్రాత్మకంగా అన్యాయం" జరిగిందని ప్రకటించింది. తర తరాలుగా అడవులలో నివసించే ఆదివాసులు అడవులు, పర్యావరణంలో విడదీయరాని భాగమని; ఒకటిని వేరుచేసి మరొకటి మనుగడ సాధ్యం కాదని ప్రకటించింది. అడవుల నుంచి ఆదివాసులను వేరుచేయడం తీవ్ర తప్పిదమని, తమ స్వంత భూములలో వారు పరాయివారుగా చేయబడ్డారని; నిరంతరం గెంటివేతలకు, గెంటివేతల బెదిరింపులకు గురికావాల్సి వచ్చిందని బిల్లు పేర్కొంది. ఆదివాసుల కోసం చేయబడిన 1996 పంచాయితీరాజ్ సవరణ చట్టం ప్రకారం చిన్నతరహా అటవీ ఉత్పత్తులపై వారికి గల హక్కులు వారికి దక్కలేదని; అటవీ ఉత్పత్తులపై అటవీ కార్పోరేషన్ల గుత్తాధిపత్యమే కొనసాగిందని; 1980 అడవుల చట్టం, 1993 సెప్టెంబరు నాటి 6 సర్క్యులర్లు రిజర్వు అడవులలో తరతరాలుగా నివసిస్తున్న గిరిజనులను కొనసాగించేందుకు ఇచ్చిన అవకాశాలు అమలుకాలేదని ఆ బిల్లుని విడుదల చేసిన గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ తన నోట్‌లో పేర్కొంది. కనుక ఈ షెడ్యూలు జాతుల బిల్లు 2005 తరతరాలుగా అడవులతో నివసిస్తున్న ఆదివాసులకి కుటుంబానికి 2.5 హెక్టార్ల భూమి వారు సాగుచేస్తున్న దానితో పట్టాలు ఇవ్వాలని, అడవులలో పశువులను మేపుకొనేందుకు, చిన్నతరహా అటవీ ఉత్పత్తులను అమ్ముకునేందుకు హక్కులు ఉన్నాయని చెప్పింది. ఇప్పటివరకు రెవెన్యూ గ్రామాలుగా గుర్తించని అడవులలోని గిరిజన ఆవాసాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని, అడవులపై ఆదివాసులకి గల సాంప్రదాయిక హక్కులలో

ఒక్క వేట తప్ప అన్ని హక్కులు ఉంటాయని చెప్పింది. ఆదివాసులు ఇలా ఉంటున్నందుకు అడవిని కాపాడటం, సంరక్షించడం, విస్తరింప చేయడం చేయాలని; అడవిని సంరక్షించే బాధ్యత వారిదేనని బిల్లు పేర్కొంది. ఆదివాసీల హక్కులను గుర్తించి తెలియచేసేందుకు గ్రామసభకి అధికారం ఉందని గుర్తించింది. అదే సమయంలో ఏ గిరిజనుడైనా అడవిని సంరక్షించడంలోనూ, జీవ, వన్య ప్రాణులను వేటాడడం, చెట్లను కొట్టడం వంటివి చేస్తే గ్రామసభ ద్వారా అతనిని విచారించి మొదటి తప్పుకి వెయ్యి రూపాయల వరకూ జరిమానా వేయడం; మరోసారి చెస్తే అడవిపై అతనికి ఇచ్చిన హక్కులను లాక్కోవడం జరుగుతుందని కూడా ఈ బిల్లు పేర్కొంది. దీన్ని అమలు చేయడం కోసం సబ్‌డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి కమిటీలు ఉంటాయని; సబ్ డివిజనల్, జిల్లాస్థాయి కమిటీలదే తుది నిర్ణయం అని బిల్లు పేర్కొంది. ఈ బిల్లును చూపెట్టి ఏ ఫారెస్టు అధికారిపై చర్య తీసుకునేందుకు, కోర్టులకి వెళ్ళేందుకు గ్రామ సభకు, మరెవ్వరికీ హక్కులేదని బిల్లు పేర్కొంది. కేంద్ర ప్రభుత్వమే బిల్లు చట్టం అయిన తరువాత రూల్సును రూపొందిస్తుందని, వాటి విధి విధానాలను నిర్ణయిస్తుందని; ఈ బిల్లును చట్టం అయిన తర్వాత వీటి అమలును, పర్యవేక్షించే నోడల్ ఏజెన్సీ కేంద్ర ప్రభుత్వమే ఏర్పరుస్తుందని బిల్లు పేర్కొంది. ఇదే అడవులుకి సంబంధించిన చిట్టచివరి సెటిల్‌మెంట్ అని, ఇకముందు ఏ ఆక్రమణలను గుర్తించడం జరగదని బిల్లు స్పష్టపరిచింది. అంతేగాక అడవులు, పర్యావరణం, వన్యప్రాణ రక్షణకోసం ఉన్న చట్టాలను ఈ బిల్లు తొలగించజాలదని; వాటిని మరింత స్పష్టంగా అమలుచేయటం, అటవీ, పర్యావరణాలను పరిరక్షించడమే ఈ బిల్లు ఉద్దేశ్యమని; బిల్లు తయారుచేయడం వరకే గిరిజన మంత్రిత్వశాఖ బాధ్యత అని; దీన్ని అమలు చేయటం అంతా అటవీ, పర్యావరణ మంత్రిత్వ విభాగాలే చూస్తాయని గిరిజన మంత్రిత్వశాఖ విడుదల చేసిన నోట్‌లో పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వ ముసాయిదా ఆదివాసీ బిల్లును దాని గుణగణాలను పరిశీలించే ముందు మన దేశంలోని అటవీ చట్టాల, పాలకుల అటవీ విధానాల అసలు ఉద్దేశ్యాలు, ఆచరణను అర్థం చేసుకోవడం అవసరం.

బ్రిటీషు సామ్రాజ్యవాదం మన దేశంలోకి ప్రవేశించే ముందు అడవులపై ఆదివాసీ తెగల హక్కులు ప్రశ్నించ వీలులేనివి. ఈస్టు ఇండియా కంపెనీ మొదటినుంచీ గిరిజనుల స్వతంత్ర జీవనం – వారి పోరాట స్వభావాలను గమనించుతూ వచ్చింది. కానీ ఎపుడైతే రైలు మార్గాలు–రైలు మార్గాల కోసం కలప, బొగ్గు గనులు తవ్వకం కోసం అవసరాలు ఎపుడైతే పెరిగాయో బ్రిటీషు సామ్రాజ్యవాదం దృష్టి అడవులపై పడింది. మైదానప్రాంతంలో శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి ద్వారా జమిందారీ విధానాన్ని సెటిల్‌మెంట్ చేసినట్లే అడవులలో కూడా సెటిల్‌మెంట్ కోసం పూనుకొంది. అడవుల చట్టంను, ఫారెస్టు యంత్రాంగాన్ని సృష్టించింది. జమిందారీ స్వభావాన్ని పోలిన ఫారెస్టు యంత్రాంగం అడవులలోకి ప్రవేశించింది. రిజర్వు, అన్‌రిజర్వులని అడవులను విభజించింది. అన్‌రిజర్వులోని ఆదివాసీ తెగల ప్రాంతాలలోని వృక్షాలు ముఖ్యంగా తాటి, ఇప్ప, జీలుగు చెట్లపై తనకు హక్కు ఉందని ఎక్సైజ్ విధానాన్ని ప్రకటించింది. మైదాన ప్రాంతాల ద్వారా రాజ్యం – దాని తొత్తులైన భూస్వామ్య వర్గాల దురాక్రమణ; ఏజెన్సీలోని అడవులన్నీ రిజర్వు అనే పేరుతో ప్రభుత్వమే ఆక్రమించడం; వీటన్నింటి ముట్టడి మధ్య ఆదివాసీ సమాజాలు వీరోచితమైన రక్తతర్పణం చేస్తూ అసమానమైన పోరాటాలు చేసారు. బిల్లులు, ముండాలు, సంతాల్‌లు తిరుగుబాట్లు; మన రాష్ట్రంలో గోలుకొండ, రంప, రేకపల్లి, కొరుటూరు పితూరీలు దీనికి ఉదాహరణలు. ఆదివాసుల పోరాట పటిమను గమనిస్తూ వారి హక్కులను గుర్తిస్తున్నట్లు ప్రకటిస్తూ, తన ప్రాబల్యంను క్రమంగా సంఘటిత పరుచుకొనే దీర్ఘకాల వ్యూహాన్ని బ్రిటీషు సామ్రాజ్యవాదం అనుసరించింది. ఈ విధంగా 1927 ఫారెస్టు చట్టం నాటికి దేశంలో ఏ ప్రాంతాన్నైనా అడవిగా ప్రకటించుకొనే అధికారాన్ని పొందింది. మరోపక్క ఆదివాసీ హక్కులను రాయితీలుగా దిగజార్చింది. ఈ విధంగా రాజ్యం – దాని అనుకూల పాలకవర్గాల అవసరాలే, లాభాలే సమాజ అవసరాలుగా; వాటి కోసం అటవీ, ఖనిజ వనరులన్నీ ఉండాలని నిర్దేశించింది. బ్రిటీషు సామ్రాజ్య వాదం అడుగులలో నడచిన భారత పాలకులు అదే విధానాన్ని అనుసరించారు. అడవికి, గిరిజనుడికి ఉన్న సంబంధం సజీవమైనదని (Symboitic) అని ప్రకటిస్తూనే; అడవులను దురాక్రమించే విధానాన్నే కొనసాగించారు. జమిందారీ విధానానికి వికృత రూపమైన ఫారెస్టు యంత్రాంగానికి మరిన్ని కోరలు, పంజాలు అమర్చారు.

1961 నుంచి 1988 వరకూ మన దేశంలో రిజర్వు ఫారెస్టు అనేది అంతకుముందు కంటే 26 మిలియన్ హెక్టార్ల మేరకు విస్తరించింది. ఇది అంతకు ముందుకంటే 60శాతం దురాక్రమణ. 1893 నాటి ఉత్తరాంచల్‌లోని గ్రామాల, ప్రజల ఉమ్మడి భూములన్నీ ప్రభుత్వ రిజర్వు ఫారెస్టులుగా ప్రకటించబడ్డాయి. హిమాచలప్రదేశ్‌లోని మొత్తం బంజరు భూములలో 66.4 శాతం భూములు రిజర్వు ఫారెస్టులు అయ్యాయి. ఈ విధంగా స్వాధీనం చేసుకొన్న భూములు, అడవులలోని సహజ అరణ్యాలను నరికించి, ఎండపెట్టి యూకలిప్టస్, టేకు వంటి వాణిజ్య, పారిశ్రామిక అడవులను ఫారెస్టు యంత్రాంగం పెంచింది. అడవిలో గిరిజనులు పుల్ల నరికితే వెంటాడి వేధించిన ఫారెస్టు యంత్రాంగం; మరోపక్క స్మగ్లర్లు, మాఫియాలను అభివృద్ధి చేసి వేలాది ఎకరాల అటవీ విధ్వంసంలో ప్రత్యక్ష, పరోక్ష పాత్ర వహించింది. ఫలితంగా 1951 నుంచి 1979 నాటికి దేశం మొత్తంలోని 76.5 మిలియన్ హెక్టార్లుగా ప్రకటించబడిన అడవి భూమిలో 38.79 మిలియన్ హెక్టార్ల భూమి సార విహీనమై నశించింది. దీనిలో పారిశ్రామిక అవసరాల కోసమని 30లక్షల హెక్టార్ల పైబడిన అడవి ధ్వంసం అయింది. ఫలితంగా దేశ విస్తీర్ణంలో 33శాతం ఉండాల్సిన అడవి 11శాతమే ఉందని, దీనికి అడవులలో తర తరాలుగా నివసిస్తున్న ఆదివాసీలే కారణమని అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ ప్రచారం ప్రారంభించింది. అడవి అంటే అమెరికా తరహాలో మానవరహితంగా ఉండాలని; మనదేశ అడవులు, రిజర్వులు, వన్యప్రాణి

సంరక్షణాలయాలలో సైతం ప్రజలు నివసిస్తున్నారని; అడవుల అటవీతనం పోతున్నదని; కనుక గిరిజనులు ఇతర పేదల గెంటివేతే దీనికి పరిష్కారమని నిర్వచించబడింది. రాజ్యం యొక్క మూడు విభాగాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాలు దీని కోసం తమ తమ పాత్రలు పోషించాయి. 'స్వతంత్ర' పాలకుల పాలనలో 2 కోట్ల 60 లక్షల హెక్టార్ల, ఆదివాసుల ప్రజల భూములను, అడవులను ఫారెస్టు డిపార్ట్‌మెంట్ పేర "దురాక్రమించగా దాన్ని వదిలివేసి; దేశం మొత్తంలోని అటవీ భూములలో కేవలం 1.49 శాతంగా అంటే 10 లక్షల 25వేల హెక్టార్ల భూమి ఆదివాసీల, ప్రజల అనుభవంలో ఉండి దురాక్రమించ బడిందని చెబుతూ అడవితల్లి బిడ్డల్ని ఆక్రమణదారులుగా సుప్రీంకోర్టు తీర్పు చెప్పి తొలగించమని ఆదేశాలు ఇచ్చింది. సుప్రీం కోర్టు అనేక అంశాలపై ఇచ్చిన ప్రజానుకూల తీర్పులను అమలుచేయని పాలకులు ఈ విషయంలో మాత్రం వేగంగా కదిలారు. అస్సాం రాష్ట్రం నుంచే 40వేల ఆదివాసీ కుటుంబాలను తొలగించేందుకు ఏనుగులతో ఇళ్ళు పీకించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ సంవత్సరం (2005) జనవరి నుంచే గెంటి వేయబడినవారు 10 వేల కుటుంబాలు ఉంటారు. దేశ వ్యాపితంగా లక్షల కుటుంబా లను గెంటివేసారు. మనరాష్ట్రంలో 2000సం॥ నుంచి ఖమ్మం జిల్లాలో అనేక దశాబ్దాలుగా నివసిస్తున్న గొత్తికోయలను ఆక్రమణ దారులుగా ఫారెస్టు యంత్రాంగం చిత్రిస్తూ, వారి గ్రామాలను తగలబెట్టి, వారి పంటలను ధ్వంసం చేసింది. దీనిపై హైకోర్టు ఇచ్చిన తీర్పులను సైతం లెక్కచేయలేదు. గొత్తి కోయల తరలింపు దానికి ఒక ఆపరేషన్‌గా పేరుపెట్టి నిర్వహించింది. గొత్తికోయలు తమ తరతరాల అనుభవంతో నిర్మించుకొన్న అద్భుతమైన నీటి ఆనకట్టలను ప్రొక్లైనర్లుతో ధ్వంసం చేసింది.

ఈ విధంగా 1865 ఫారెస్టు చట్టం నుంచి 2002 అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశాల వరకూ పరిశీలిస్తే అడవులలో ఆదివాసుల స్థానం హక్కుల నుంచి రాయితీల స్థాయికి; అడవితో సజీవ సంబంధాలస్థాయి నుంచి ఆక్రమణదారుల స్థాయికి కుదించడం కనిపిస్తుంది. **మరోపక్క హక్కుల, అవకాశాల, సజీవ సంబంధాల గురించి ప్రకటనలతో నిర్దిష్ట పరచని హక్కులు ఒకవైపు; అంతకంతకూ చిక్కబడుతూ బలపడుతూ వస్తున్న రాజ్యం, దాని అంగాల దుష్టత్వం, నిరంకుశత్వం మరో వైపు కనిపిస్తాయి.** ఫలితంగా కుదించుకు పోతూ బలహీనపడుతున్న ఆదివాసీ సమాజాలు అభివృద్ధి పేరిట, ప్రాజెక్టుల పేరిట పర్యావరణ పేరిట, గెంటివేయబడుతూ పర్యవసానంగా ఆకలి, పేదరికం, వ్యభిచార కూపంలోకి నెట్టబడుతూ వస్తున్న అమానవీయ చిత్రమే ఎల్లెడలా కనిపిస్తున్నది.

మరి గిరిజనులకు ఇంతటి చారిత్రక అన్యాయం జరిగిందని గుర్తించిన 'షెడ్యూల్డు తెగల బిల్లు' అన్యాయాన్ని సరిచేసేందుకు ఏమైనా ప్రయత్నించిందా?.

ఈ షెడ్యూలు తెగల బిల్లు మొత్తం అడవిని ఆదివాసుల కుటుంబాలకి 2.5 హెక్టార్ల చొప్పున పంచేయబోతున్నదని "పర్యావరణ వాదులు" చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ గిరిజన మంత్రిత్వశాఖ ఈ బిల్లు కేవలం రిజర్వు అడవులలో 1980 అక్టోబరు 25 ముందు నుంచి మాత్రమే నివసిస్తున్న గిరిజన తెగలకు మాత్రమే వర్తిస్తుందని; ఎవరు, ఎక్కడ, ఎలా ఉన్నారో అలా, (As is where is) ఆ ప్రాతిపదికన మాత్రమే రెగ్యులరైజ్ చేయడం జరుగుతుందని; అంతేగాక అదీ అడవులను రక్షించి, కాపాడి విస్తరింపచేసే షరతు మీద; చెట్లను కొట్టమని, జంతువులను వేటాడమనే షరతు మీద అని స్పష్టపరిచింది. 1980 అక్టోబరు 25కి ఉన్న ప్రత్యేకత పవిత్రత ఏమిటి? 1975లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి చీకటిపాలన సాగించింది. ఆ సందర్భంగా తనకి ఉన్న విస్తృత నిరంకుశ అధికారాలను ఉపయోగించుకొని అనేక రాజ్యాంగ సవరణలు చేసింది. దానిలో ఒక సవరణ ప్రకారం 1976లో అడవులను కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిలోకి తేవడం ఒకటి. అంతవరకు రాష్ట్రాల పరిధిలోని అడవులను కేంద్ర ప్రభుత్వ ఉమ్మడి పరిధిలోకి తెచ్చారు. 1977లో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం ఇందిరాగాంధీ నిరంకుశ చట్టాలన్నీ తిరగ రాసింది. కానీ అడవులపై కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని మార్చలేదు. పాలకవర్గాల, సామ్రాజ్యవాదుల ఉమ్మడి ప్రయోజనం దాని వెనక ఉండడమే కారణం. తిరిగి ఇందిరాగాంధీ అధికారంలోకి వచ్చాక 1976 చీకటి రాజ్యాంగ సవరణను అనుసరించే 1980 అడవుల బిల్లు తెచ్చి దాన్ని చట్టం చేసింది. ఆనాడే గిరిజన, ప్రజాతంత్ర సంస్థలు, శక్తులు ఈ బిల్లును వ్యతిరేకించారు. ఆందోళనలు జరిపారు. '1980 అడవుల చట్టం'ను అనుసరించి 'వన్యప్రాణి పరిరక్షణ చట్టం' వచ్చింది. గిరిజనులకు వన్యప్రాణులకి పోటీ పెట్టింది. పోతే 1980 అక్టోబర్ 25కి ముందు ఒక నిర్దిష్ట అడవీ ప్రాంతంలో గిరిజనులు నివసించే ఆధారాలు ఏమిటి? దానిని గిరిజనులు ఎలా చూపగలరు? ఒకే ఒక ఆధారం ఫారెస్టు డిపార్ట్‌మెంటు పెట్టిన కేసులే. అయితే విచారించేది, తీర్పు చెప్పేది, శిక్షించే అధికారం తమకే ఉందనే ఫారెస్టు డిపార్ట్‌మెంట్ కేసులు పెట్టకుండానే లంచాలు తీసుకొనో, ఇళ్ళు తగులపెట్టో, రికార్డులకి ఎక్కకుండానే చేసిన జులుంకి ఆధారం దొరకనీయరు. అంతేగాక అనారోగ్యాల, అంటువ్యాధుల భయంతో పోడులు పండలేదని సంచార జీవనం చేసే ఆదివాసీ తెగలు ఇప్పుడు ఉన్న ప్రాంతం గురించి 1980 కి ముందున్న ఆధారాలు చూపటం మరింత కష్టం. కనుక 1980ని ఆఖరి గడువుగా గుర్తించడం అన్యాయం. కనుక దానిని తొలగించాలి. ఈ బిల్లు ప్రవేశపెట్టే నాటికి రిజర్వు అడవులలో నివసిస్తున్న ఆదివాసీ తెగలను అందర్ని ఆ ప్రాంత హక్కుదారులుగా గుర్తించి ప్రకటించాలి.

మరొక అంశం ఈ చట్టానికి సంబంధించిన రూల్సు విషయం. గిరిజనుల హక్కులను గురించిన చట్టాలు, ప్రకటనలకి వాటిని అమలు చేసే రూల్సుకి చాలా తేడా ఉంది. 1970 లో 1/70 రెగ్యులేషన్ వస్తే దాని రూల్సును 1977కి గానీ తయారు చేయలేదు. ఈ మధ్య కాలంలో తాపీగా భూస్వాములకి ఎన్నో దొంగ రికార్డులను పుట్టించుకొనేందుకు వీలు ఇచ్చింది. 1996లో చేయబడిన "పంచాయితీరాజ్ సవరణ చట్టం 40/96" దానిని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం చేసిన 7/98కి నేటికీ రూల్సు తయారు చేయబడలేదు. అదేవిధంగా ప్రస్తుత షెడ్యూలు

తెగల బిల్లు రూల్సును కేంద్రం రూపొందించాలి. ఈ బిల్లు ప్రకారం గ్రామసభ గిరిజనులకి సంబంధించిన స్థితిగతులను వివరిస్తుంది. దీనిపైన నిర్ణయం తీసుకునే హక్కు, గ్రామసభ తీర్మానాలను వీటో చేసే హక్కు జిల్లా కమిటీకి దఖలు చేయబడింది. జిల్లా కమిటీ సబ్ డివిజనల్ కమిటీలలో ఫారెస్టు యంత్రాంగపు ప్రాబల్యం ఉంటుందనేది స్పష్టం. ఇప్పటికే ఎన్నో అధికారాలను డిఫాక్టో (చట్ట విరుద్ధం)గా చెలాయించిన ఫారెస్టు అధికార్లు ఇకముందు కూడా చెలాయిస్తారు. వారిని విచారించే అధికారాలు గ్రామసభలకి గానీ, ఎవరికీగానీ లేవు అని ఈ బిల్లు స్పష్టం చేస్తున్నది. స్మగ్లర్లు, మాఫియాలు ఖనిజాలను తరలించుకొనేందుకు బహుళజాతి సంస్థలు, ప్రభుత్వాధికార్లు కుమ్మక్కైన సమయం ఇది. ప్రాజెక్టులు, ఫ్యాక్టరీల వల్ల కలిగే లాభాల కోసం పర్యావరణం ధ్వసం అయినా, గిరిజనులు గెంటి వేయబడినా సమర్థించుతూ, గిరిజనులు పోడు చేస్తే పర్యావరణ విధ్వంసంగా చిత్రించే న్యాయమూర్తులున్న కాలం ఇది. ఇలాంటి స్థితిలో ఫారెస్టు డిపార్ట్‌మెంట్ అధికారాలను, ప్రజావ్యతిరేక ఫారెస్టు నల్ల చట్టాలను ఈ బిల్లు పరిరక్షిస్తుండగా; అడవిని కాపాడి సంరక్షించే, విస్తరింపచేసే బాధ్యత కేవలం గిరిజనుడిదేననడం; చెట్టుకొట్టినా, వేటచేసినా, అడవిపై హక్కులు రద్దుచేస్తామని చెప్పడం; ఈ బిల్లు గిరిజనుల మేలుకోసం కాదని తెలియచేస్తున్నది. దేశవ్యాపితంగా ఈనాడు అనేక జాయింట్ ఫారెస్టు మేనేజ్‌మెంటులు ఉన్నాయి. పేరుకి గిరిజనులదే అయినా ఫారెస్టు అధికారులదే పెత్తనం సాగుతున్నది. రేపు గ్రామసభల పేరుతోనే ఫారెస్టు యంత్రాంగం ఎన్నో దుర్మార్గాలు చేయగలదు. కనుక గ్రామసభలపై ఫారెస్టు యంత్రాగానికి ఏరకమైన పట్టూలేని పరిస్థితి కల్పించాలి. **ఆదివాసీల బిల్లు ఇప్పటికే ఉన్న 'గెంటివేత' అనే నెత్తిన వేలాడుతున్న కత్తిని తొలగించక పోగా, ఆ కత్తిపై 'అటవీ సంరక్షణ' అనే ముసుగును అదనంగా తగిలించింది. యు.పి.ఏ ప్రభుత్వం చెప్పే 'మానవీయ కోణం' ఇదే.**

ఈ బిల్లును అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ వ్యతిరేకిస్తుంటే హోంశాఖ ఆహ్వానించింది. అంటే ఇప్పటివరకు ఏజెన్సీ ప్రాంతాలలో తమ మానాన తాము జీవిస్తున్న చట్టపరిధిలోకి రాని తెగలను చట్టపరిధిలోకి; రాజ్యం, దాని నిఘా సంస్థల నిఘా పరిధిలోకి తేవడానికి వీలవుతుందని; గెంటివేతల భయం నుంచి తీవ్రవాద విప్లవ సంస్థల ప్రాబల్యంలోకి ఆదివాసులు వెళ్ళకుండా నిరోధిస్తుందని; వారిని ఈ రాజ్యాంగ పరిధిలోకి తేవడానికి బిల్లు ఉపయోగపడుతుందని భావించడమే దాని వెనక ఉన్న రాజకీయ కోణం. ఇదే అసలైన కారణం.

అసలు ఈ బిల్లు చట్టమే కాకపోవచ్చు. చట్టంగా చేయబడినా, దాని సారాంశంలోని గిరిజన అనుకూల అంశాలు ఏ మాత్రం లేకుండా దాని రూపాన్ని మాత్రమే మిగిలేలా చేయవచ్చు. లేదా రూల్సును రూపొందించే క్రమంలో ఈ చట్టం ప్రకటిస్తున్న ఉద్దేశ్యాలకు తూట్లు పొడవచ్చు. దీనిపై భ్రమలు పెంచుకోవలిసిన అవసరం లేదు. ఈ బిల్లు ఆదివాసులకి ఇప్పటివరకు చారిత్రకంగా అన్యాయం జరిగిందని మొసలి కన్నీరుకారుస్తూ మొట్ట మొదటి సారి దేశ అత్యున్నత ప్రభుత్వ విభాగం అంగీకరిస్తూ ప్రకటించింది. ఈ విధంగా ఇప్పటి వరకు భూమి కోసం, అడవి కోసం, జీవించే హక్కు కోసంజరిగిన ఆదివాసీ పోరాటాలన్నీ న్యాయసమ్మతమైనవని గుర్తించినట్టైంది. ఇది గిరిజనుల, ప్రజాతంత్ర సంస్థలు, శక్తుల ఉద్యమాల నైతిక విజయం. అదే సమయంలో ఈ బిల్లు రాజకీయ పరమైన అంశాలకే ప్రాధాన్యత నిచ్చిందని; గిరిజనులు జీవించే హక్కులకి భద్రత, హామీ ఇవ్వలేదని గుర్తించాలి. 1980 అక్టోబర్ 25ని ఆఖరి గడువుగా గుర్తించడంను తొలగించి ప్రస్తుత కాలం వరకూ రిజర్వు ఫారెస్టులోని ఆదివాసులందర్ని గుర్తించాలి. అన్ని నిర్భంధ నల్ల ఫారెస్టు చట్టాలను రద్దుచేయాలి. అటవీ పర్యావరణ, గిరిజన విభాగాలు విడివిడిగా కాక ఒకే విభాగంగాను; గిరిజన గ్రామసభలను ఆదివాసుల స్వయంపాలన హక్కును గుర్తించి గౌరవించే, ప్రజాస్వామిక విలువ ప్రాతి పదికన నడిచే అధికార యంత్రాంగంను పునర్ వ్యవస్థీకరించాలి. అడవులను వాణిజ్యపర అంశంగా కాక సజీవ మానవ సమాజపర అంశంగా, దీర్ఘకాల ప్రయోజనంతో ముడి పడిన అంశంగా గుర్తించాలి. అప్పుడే గిరిజనులకి జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరి చేసేందుకు నిజమైన మార్గం దొరుకుతుంది. ★

అడవి అంటే అభినవ భావావేశం కాదు
రొమాంటసిజమ్, కేరీరిజమ్ కానే కాదు
అనంత విశ్వంలో ప్రకృతి ఆక్రోశం
అడవి అంటే ప్రకృతితో పోరాటం, కృత్రిమత్వంతో పోరాటం
పోరాటంలో ఐక్యత, ఐక్యత కొరకు పోరాటం
ప్రకృతి చలన సూత్రాల పొందిక

ఇప్పుడు అడవి అంటే!
జంతువును వేటాడినట్లు గిరిజనులను వేటాడటం
కన్నవారిని, ఊరివారిని, ఊరు నుండి తరిమినట్లు ఉరిమినట్లు
అడవి నిర్మూలన, గిరిజనుల నిర్మూలన
ఏలుతున్న వారి నేటి ఎజండా

మరి అడవి అంటే
అరణ్యరోదన కాదు, వర్గ పోరాటాల హోరు
ఆది మానవుని ఆట, పాట, మాట, చరితల పదకోశాల రేల
వేట, నిప్ప, నీరు, సాగుల చరిత
దాడి, రక్షణ, ప్రతిఘటన, ఎత్తుగడ, వ్యూహాల
ప్రధమ పాఠాల పోరాట గురువు
విలుకాని, సమిష్టి వీరావేశం
విరామం ఎరుగని వజ్ర సంకల్ప మాత
నడుస్తున్న చరిత్రకు అడవి తల్లి దిక్సూచి

- గోదావరి

" ... బావా. మీచట్ట ప్రకారం తేల్చలేనివి - మా చట్ట ప్రకారం తేల్చినాడు తేల్చుతాం! వొదిలీం! వొక నాటికి - మా చట్టం వొస్తాది గాక వొస్తాది - గురుతుంచుకోండి..." - **అట్టాడ అప్పల్నాయుడు** (కథ నుంచి)

జలయజ్ఞంలో రైతాంగం ప్రజలు సమిధలు కారాదు!

సామ్రాజ్యవాదుల - దళారీల కుట్రలు, కుతంత్రాలను త్రిప్పికొట్టండి!!
సమగ్ర జలవనరుల సాధనకోసం సమైక్యంగా ఉద్యమించుదాం!!!

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)

కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 46 వేల కోట్ల రూపాయల "జలయజ్ఞం" ప్రారంభించింది. గత ప్రభుత్వం నీటి పారుదల రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, ఫలితంగా రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని చెప్పింది. అందుకే మెట్ట, కరువు ప్రాంతాలకి నీరు అందించాలని; ఈ జల యజ్ఞం లక్ష్యం అదేనని ప్రకటించింది.

అయితే ఈనాడు రాష్ట్రంలోని పాలక పార్టీల నాయకులు, కమీషన్ పంపకాల సమస్యలలో మునిగితేలుతుంటే; తోటపల్లి, జంఝావతి, పోలవరం నిర్వాసితులు సమగ్ర పునరావాసం కోసం లాఠీఛార్జీలను, నిర్భంధాలను ఎదుర్కొంటుంటే; కాంట్రాక్టర్లు, సంపన్న వర్గాల భూస్వాములు ఈ ప్రాజెక్టులు తెచ్చే ప్రయోజనాల కోసం ఉవ్విళ్ళూరుతుంటే; తెలంగాణా, రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాల మేధావులు, ప్రజాతంత్ర వాదులు ఆందోళన చెందుతుంటే; పాలక శక్తులు ప్రాంతీయ విభేదాలను రెచ్చగొడుతున్న స్థితిలో మన రాష్ట్రం ఉంది.

ఇప్పుడే నిబ్బరంగా, గందరగోళపడకుండా మొత్తం ప్రజల ప్రయోజనాల కోసం ఆలోచించాల్సిన, కదలాల్సిన అవసరం ఉంది. ఇప్పుడే పాలకుల కుయుక్తులతో చిత్తవకుండా స్థిరంగా నిలబడవలసిన అవసరమూ ఉంది.

ప్రభుత్వ నీటిపారుదల విధానం ఏమిటి? గత ప్రభుత్వాల కంటే ఏ విధంగా భిన్నమైంది.? నీటిపారుదల విధానం గతం కంటే భిన్నంగా ఉందా? అసలు గత ప్రభుత్వాల విధానాలు ఏమిటి? అన్నది చూద్దాం.

బ్రిటీషు సామ్రాజ్యవాదం మన దేశంలోకి ప్రవేశించక ముందు మన వ్యవసాయ, నీటిపారుదల వ్యవస్థ ఉన్నత ప్రమాణాల్లో ఉండేదని అనేక రచనల ద్వారా తెలుస్తోంది. నిర్మించబడిన మట్టి ఆనకట్టల నిర్మాణ కౌశల్యాన్ని మెచ్చుకుంటూనే తన ఇంజనీరింగు ప్రతిభను స్థానిక ఇరిగేషన్ అనుభవాలకి జోడించాడు. ఆ విషయాన్ని ఆయన వినమ్రంగానే ప్రకటించాడు. తెలంగాణా జిల్లాలో చరిత్ర ప్రసిద్ధి చెందిన చెరువులు, విజయనగర సామ్రాజ్య కాలం నాటి అనంతపురం చెరువుల గొలుసుకట్టు నిర్మాణాల విశిష్టత, కళింగసీమలో చెరువులు, గెడ్డల ద్వారా జరిగిన సేద్య విధానాలు; నాటి పరిస్థితిని తెలియచేస్తాయి. అంతేగాక నేటికీ సవరలు, జాతాపులు, కొండ వాలులలో నీరు, భూసార పరిరక్షణ కోసం చేసే నిర్మాణాలు, గొత్తికోయల నీటిఆనకట్టలు; తరతరాలుగా మన ప్రజలలో నిబిడీకృతమైన జలసంరక్షణ, జలవినియోగపు ప్రతిభా పాటవాలను తెలియచేస్తాయి.

భారతదేశంలోకి ప్రవేశించిన ఈస్టు ఇండియా కంపెనీ వీటన్నింటినీ ధ్వంసం చేసింది. నాశనం అయిన వ్యవసాయం, చేతివృత్తులు ఫలితంగా కరువులు, వలసలతో దారి పొడవునా మనుష్యుల, పశువుల ఎముకలతో మన దేశ నదీ మైదానాలు తెల్లగా కనపడుతున్నాయని; అయినా కంపెనీ రెవిన్యూ పెరిగిందని బ్రిటీషు అధికారులు రాసుకున్నారు. ధాత నామ కరువు, డొక్కల కరువుల వంటి కరువులతో ఆ రెవెన్యూ కూడా పడిపోతున్నపుడు నీటిపారుదల వ్యవస్థల గురించి వారు ఆలోచించారు. ఫలితంగా 'సర్ ఆర్థర్‌కాటన్' కృషి ఫలితంగా గోదావరి, కృష్ణ నదులపై ఆనకట్టల నిర్మాణం జరిగి కరువును పారదోలడం జరిగింది. అదే సమయంలో కర్నూలు, కడప కాలువ (కె.సి.కెనాల్) నిర్మాణంలో పెట్టిన పెట్టుబడికి నష్టం వచ్చిందని; వడ్డీ రాలేదని నిర్ణయించి కాలువను తరువాత బ్రిటిషు ప్రభుత్వం నీటి పారుదల విధానంలో 1) పెట్టిన పెట్టుబడికి వడ్డీ రావాలి, అలా వడ్డీ అయినా రాని ప్రాజెక్టులను చేపట్టకూడదు. 2) రేవు పట్టణాల ద్వారా ఎగుమతులకోసం, పరిశ్రమలకి ముడిసరుకులు సరఫరాచేసే మేరకే కొద్ది ప్రాంతంలో వ్యవసాయం అభివృద్ధి చెందాలి. మిగతా ప్రాంతాలు చౌక కూలీలు సరఫరా చేసే కేంద్రాలుగా, రిజర్వులుగా ఉండాలి. 3) ఈ దేశం నుంచి దళారీ, కంట్రాక్టర్ల సెక్షను అభివృద్ధి చెంది తమ సాంఘిక పునాదిగా నిలవాలి. 4) ఒక జాతి మరో జాతి, ఒక జాతిలో ఒక ప్రాంతం మరొక ప్రాంతాన్ని అణచి ఉంచాలనే విభజించి పాలించే సూత్రం ఈ విధానంలో అమలుకావాలి. 5) ఈ దేశ ప్రజలు తమలో తాము సమిష్టిగా కాకుండా, వ్యక్తులుగా నిరంతరం ప్రభుత్వంపై ఆధారపడే విధంగా పబ్లిక్‌వర్క్ డిపార్టుమెంట్‌ను ఏర్పరచాలి. ఈ విధానాన్నే బ్రిటీషు సామ్రాజ్య వాదం తన 1901 ఇరిగేషన్ పాలసీ అనంతరం కూడా అమలు చేసింది. ఆ విధంగా రాయలసీమ, దక్షిణకోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాలను కరువు పీడిత ప్రాంతాలుగా మిగిల్చింది. బ్రిటిషు సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమం బ్రిటీషు ప్రభుత్వం సృష్టించిన అన్ని అసమానతలు రద్దుకావాలని కోరింది. కానీ 1947లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు ప్రభుత్వం బ్రిటీషు సామ్రాజ్యవాదపు అడుగుజాడలలోనే నడవడం ప్రారంభించింది. మెకంజీ పథకం పేరున కృష్ణా-పెన్నారు అనే పథకాన్ని ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తెచ్చినపుడు, దీని ద్వారా కర్నూలు, కడప జిల్లాల్లో 8 లక్షల ఎకరాలు, 300 గ్రామాలు మునిగిపోతున్నపుడు దీనికి వ్యతిరేకంగా నాటికమ్యూనిస్టు పార్టీ చొరవతో

కాంగ్రెసు, స్వతంత్రపార్టీలు కూడా కలసి రైతాంగాన్ని కదిలించి కృష్ణాజలాల సమగ్ర వినియోగం కోసం పోరాడింది. సిద్ధేశ్వరం, గండికోట, ఎగువ తుంగభద్ర ఛానల్, నందిగొండ ప్రాజెక్టుల కోసం ప్రజల పోరాట ఫలితంగా వేయబడిన 'ఖోస్లా కమిటీ' చేసిన సూచనల్ని నాడు నెహ్రూ కాంగ్రెసు ప్రభుత్వం తిరస్కరించింది. రెండవసారి 'ఖోస్లా కమిటీ' ఇచ్చిన నివేదికలోని సిద్ధేశ్వరం, గండికోటలకు అనుమతి నిరాకరించి, కేవలం నందికొండనే నాగార్జున సాగర్‌గా అనుమతి ఇచ్చింది. ఆనాటి శ్రీశైలం బహుళార్ధసాధక ప్రాజెక్టుగా నిర్మించి ఉంటే నేడు రాయలసీమలో ఇన్నిసార్లు కరువులతో అల్లాడిపోయేది కాదు. కానీ శ్రీశైలంను కేవలం జలవిద్యుత్ ప్రాజెక్టుగా నిర్మించేందుకు అనుమతి ఇచ్చింది. అదే విధంగా నాటి కాంగ్రెసు ప్రభుత్వం హయాంలోనే తెలంగాణాలోని 42 లక్షల ఎకరాలకు నీరందించే 'సర్‌నవాబ్ అలీ జంగ్' రూపొందించిన 'దిగువ గోదావరి పథకాన్ని' అనేక మార్పులు చేసి 1963లో పోచంపాడుకి శంకుస్థాపనచేసి, నత్తనడక నడిచేలా చేసారు. అదే విధంగా ఉత్తరకోస్తా జిల్లాలో ఎన్ని జలవనరులున్నా జూట్ మిల్లులకి గోగునార సరఫరా చేసే ప్రాంతాలుగానే ఉంచారు. గుంటూరు, పశ్చిమ గోదావరి తదితరచోట్ల పొగాకు పండే ప్రాంతాలను నీటిపారుదల సౌకర్యం నుంచి మినహాయించారు. అదే సమయంలో కరువు వాతపడుతున్న ప్రజలను జోకొట్టడానికి 1969లో కేంద్ర ప్రభుత్వం నియమించిన ఇరిగేషన్ కమీషన్ "పెట్టుబడికి వడ్డీ వచ్చే విధంగా కాక కరువు ప్రాంత అవసరాలను తీర్చే విధంగా ఇరిగేషన్ పాలసీ ఉండాలని " చేసిన సూచనలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం బుట్టదాఖలా చేసింది. బ్రిటీషు ప్రభుత్వ అడుగు జాడలలోనే జాతుల మధ్య విభేదాలు, జాతిలో ప్రాంతాల మధ్య విభేధాలు, అసమానతలు కొనసాగేలా వ్యవహరించింది. సంజీవరెడ్డి, పి.వి. నరసింహారావు, వెంగళరావు, చెన్నారెడ్డి వరకు రాయలసీమ, తెలంగాణా ముఖ్య మంత్రుల పరిపాలనలోనే కేంద్ర ప్రభుత్వ కనుసన్నలలో ఇది జరిగిందని గమనించాలి. వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో శ్రీరాంసాగర్‌ను 20 లక్షల 60 వేల ఎకరాలు నుండి తగ్గించి కాకతీయ కాలువను దిగువ మానేరులో కలిపి కరీంనగర్, నల్గొండజిల్లాల మెట్ట ప్రాంతాలకి నీరు అందే ఏర్పాటు లేకుండా చేసారు.

ఇక్కడ మరో అంశం గమనించాలి. రాష్ట్రంలోని కరువు ప్రాంతాలకి నీరందించే సమగ్ర అభివృద్ధి కోసం పాటుపడే ఉద్దేశ్యంలేని పాలకులు; నీటి ప్రాజెక్టుల పేరుతో ప్రాంతీయ విభేదాలను ఒక పథకం ప్రకారం రెచ్చగొట్టడం, విభేదాల వాతావరణంలో రాష్ట్ర కరువు ప్రాంత ప్రజల స్థితిగతులు యధాతథంగా ఉండటం కనిపిస్తుంది. నెహ్రూ కాలంలో నాగార్జున సాగర్‌కి శంకుస్థాపన చేసి ఆంధ్ర, రాయలసీమ విభేదాలను; ఎన్.టి.రామారావు కాలంలో తెలుగుగంగ పేర ఆంధ్ర, రాయలసీమ విభేదాలను; ప్రస్తుతం రాజశేఖర్‌రెడ్డి పులిచింతల, పోలవరంల ద్వారా ఆంధ్ర-తెలంగాణా విభేదాలను తేవడం; పాలక, ప్రతిపక్ష పార్టీలు ఈ విబేధాల మంటలో చలికాగి తర్వాత బొగ్గులేరుకోవడం; ఇవన్నీ కనిపిస్తున్న వాస్తవాలే.

అదే సమయంలో 1947 తర్వాత పాలకులు ప్రారంభించిన ఏ ప్రాజెక్టు సంపూర్తి కాలేదు. నాగార్జునసాగర్ 2వ దశ, శ్రీరాంసాగర్ 16లక్షల ఎకరాలకి నీరు అందించాల్సింది కేవలం 4-5 లక్షల ఎకరాలకే పరిమితం అవడం; ఇంకో ప్రక్క ప్రాజెక్టు నిర్మాణ ఖర్చులు విపరీతంగా పెరిగి కంట్రాక్టర్లు, ప్రభుత్వాధికారులు బాగుపడటంను గమనించగలం. కనుక నాడు బ్రిటీష్ సామ్రాజ్యవాదులు ప్రత్యక్ష ఆధిపత్యం; తరువాత సామ్రాజ్యవాదులు, ప్రపంచబ్యాంకు పరోక్ష పెత్తనంలో నేటి నీటిపారుదల విధానాల అమలుని ఈ విధంగా చూడగలం.

1) బ్రిటీషు సామ్రాజవాదం నిర్ణయించిన ఆయకట్టునే స్థిరీకరించడం. 2) ప్రజల పోరాట ఫలితంగా తప్పనిసరై ప్రభుత్వం చేపట్టిన ఇతర ప్రాంతాల ప్రాజెక్టులు నెమ్మదిగా నడిచేలాగా, కంట్రాక్టర్ల జేబులు నింపేలాగా, ఆయా ప్రాంతాల స్థానిక పాలకవర్గ నాయకుల రాజకీయ పెత్తనాలకి అనుగుణంగా ఉండేలా పరిమితం చేయడం. 3) తమకి అనుకూలురుగా బ్రిటీషు కాలంలో ప్రారంభమైన కాంట్రాక్టర్ల వర్గంను రక్షించి వారి దోపిడీని మరింత పెంచి పోషించి తమ అంతర్జాతీయ దోపిడీ చట్టంలో జూనియర్ భాగస్వాములుగా మార్చటం. 4)నిరంతరం ప్రాంతాల మధ్య అసమానతలను, విభేదాలను ప్రోత్సహిస్తూ ఈ విభేదాలను పాలకపార్టీలు, నాయకులు ఎదగడానికి, బలపడటానికి అనువుగా ఉంచడం.

అంతిమంగా 1947 నాటి ఒక యధాతథ స్థితిని కాపాడటం. 1947 తర్వాత ప్రభుత్వాలు కల్పించిన నీటిపారుదల సౌకర్యం నాటి బ్రిటీషు నైజాం నవాబులు తమ క్రూర పరిపాలన కోసం, దోపిడీ కోసం కల్పించినంత కూడా లేదన్నది గమనించాలి. 1998-99 నాటికి గత 100సం॥పై నుండి ప్రభుత్వాలు కల్పించిన సాగునీటి భూమి విస్తీర్ణం కాలువల కింద 11.36 లక్షల హెక్టార్లు ఉంది. ప్రభుత్వం నీటిపారుదల కల్పించే బాధ్యత రైతుల మీద నెట్టినందున రైతులు అప్పులుచేసి, కష్టాలుపడి బోర్లు, బావుల కింద సాగులోకి తెచ్చిన భూమి 18.70 లక్షల హెక్టార్లుగా ఉందంటే వ్యక్తులుగా రైతులు, ఒక వ్యవస్థగా రాజ్యం, నీటిపారుదల రంగం కోసం చేసిన కృషి అర్థం అవుతుంది. మరోవైపు చెరువులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా 11 లక్షల ఎకరాలకి నీరు అందించే చెరువుల పరిస్థితి 4లక్షల 906వేల ఎకరాలు నీరందించే దిగా దిగజారింది.

ఫలితంగా ఈనాటికీ మహబూబ్‌నగర్, నల్గొండ, అనంతపురం ఉత్తరాంధ్ర జిల్లాలు; కోస్తా ప్రాంతంలో నెల్లూరు నుండి తూర్పు గోదావరి వరకూ ఉన్న మెట్ట, ఏజన్సీ ప్రాంతాలు; కరువు ప్రాంతాలుగా, చౌక కూలీల సరఫరా కేంద్రాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. నీటి పారుదల సౌకర్యాల కోసం, రుణభారం నుంచి విముక్తి కోసం రైతాంగం పోరాడుతూనే ఉన్నారు.

"జలయజ్ఞం" పై తప్పుడు విధానాలన్నింటినీ సరి చేస్తుందా? దీని పరిశీలించే ముందు గుల్హతి కమీషన్ నివేదికను మరోసారి పరిశీలించాలి.

కరువు పీడిత ప్రాంతాలు – ముఖ్యంగా రాష్ట్రం నుండి ఎంపికైన పార్లమెంటు సభ్యులు ఆందోళన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 1961 మే 1వ తేదీన జస్టిస్ ఎన్.డి. గుల్హాతి ఛైర్మన్‌గా కమీషన్‌ను నియమించింది. కమీషన్‌నే కృష్ణా, గోదావరి కమీషన్ అని అంటూ; ఈ కమీషన్ రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలను అధ్యయనం చేసి తన నివేదికను అందజేసింది. నేటికీ ఆ నివేదిక ప్రభుత్వ కార్యాలయం అటకల మీదే ఉంది. గుల్హతీ కమీషన్ గోదావరి జలాలను కృష్ణానదితో కలుపుతూ తెలంగాణా, రాయలసీమ నుంచి కరువు రక్కసిని తరిమివేసే సూచనలుచేసింది. అవి : 1) పోచంపాడు-నాగార్జున సాగర్‌ను కలపటం. 2) ఇచ్చంపల్లి లేదా దుమ్ముగూడెం లేదా వీలైనచోట్ల నుంచి గోదావరి నదీ జలాలను పులిచింతలకి కలపడం. 3) పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీకి కలపడం. 4) పోచంపాడుకి జల లభ్యత కోసం పెన్‌గంగ నుంచి పోచంపాడుకి వరకు కాలువ నిర్మాణం. దీనిలోని ప్రాధాన్యత గల అంశాలు ఏమంటే నాగార్జునసాగర్ జలవిద్యుత్ కేంద్రం నిర్మించకుండా ఆపి వేయడం; గోదావరి జలాల మీదే ఆధారపడే పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం, తద్వారా నాగార్జునసాగర్, శ్రీశైలంల వద్ద లభించే నీటిని రాయలసీమ, తెలంగాణాలకే వినియోగించడం – ఇవీ గుల్హాతీ కమీషన్‌లోని ముఖ్య అంశాలు. గుల్హతీ కమీషన్ రిపోర్టు ముఖ్య సారాంశం తెలంగాణా, రాయలసీమలు సస్యశ్యామలం అయ్యే విధంగానూ; కృష్ణా, గోదావరి డెల్టాలు స్థిరపడే విధంగానూ చేసిన గోదావరి జలాల తరలింపు పథకం.

పై పథకాన్ని వివరించి 44 సంవత్సరాలు గడిచిపోయింది. పాలకుల చిత్తశుద్ధే కరువుకాని, కరువుకి వేరే కారణం లేదన్నది స్పష్టం. ఈ 44 సంవత్సరాలలో మహారాష్ట్రలో నీటి ప్రాజెక్టులు నిర్మాణం అయ్యాయి. పోచంపాడు నీటి లభ్యత తగ్గింది. ప్రాణహిత నుంచే ప్రస్తుతం పోచంపాడుకి (శ్రీరాంసాగర్) నీరు తేవాలి. 1961 కంటే ఈనాటికీ పునరావాస సమస్య ముందుకు వచ్చింది. పోలవరం బ్యారేజీ నిర్మాణం పునరావాస సమస్యతో ముడిపడింది. ముఖ్యంగా 1980 అడవీ చట్టం, ఇపుడుగిరిజనులకి ఏజెన్సీలో పునరావాసంకి పెద్ద అడ్డంగా ఉంది. అయిన ప్పటికీ ముంపును నివారించే ప్రత్యామ్నాయ ఆధునిక సాంకేతిక అంశాలు, కొత్త వనరులు అందుబాటులో ఉన్నాయి. కానీ కాంగ్రెసు ప్రభుత్వ ప్రయత్నాలు ఆ వైపు లేవు.

1) రాష్ట్ర ప్రభుత్వ 'జలయజ్ఞం' మొదట తెలంగాణాను గోదావరి జలాలతో తడుపుతూ కృష్ణానదికి చేర్చి తద్వారా రాయలసీమను సాగులోకి తెచ్చే ప్రయత్నాలు ప్రారంభించాలి. ఆవైపుగా కాకుండా పోలవరం ప్రాజెక్టు పేర ఎలాంటి నీటి నిల్వచేసే అవకాశం లేని విధంగా కృష్ణా బ్యారేజీకి నీరు అందించే కార్యక్రమం తీసుకున్నారు.

2) 1990ల నుంచి ప్రపంచబ్యాంకు సూచనలలో ముఖ్యఅంశం విద్యుత్ సంస్కరణలు. మన సమాజాన్ని ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణలో నడపడానికి కీలకమైన అంశంగా విద్యుత్ సంస్కరణలను ప్రపంచబ్యాంకు మనదేశం ముందు ఉంచింది. ఒరిస్సా, ఆంధ్రా, ఇలా అనేక రాష్ట్రాలు ఆ బాటలో నడిచాయి. అంతకు ముందు నుంచే పాలకులు నాగార్జునసాగర్‌ను నీటిపారుదల ప్రాజెక్టు కంటే జలవిద్యుత్ ప్రాజెక్టుగా మారుస్తూ పోయారు. ఫలితంగా కృష్ణా నదిలో కృష్ణాడెల్టాకి 184 శతకోటి ఘనపుటడుగులు సరిపోయే పరిస్థితి ఉన్నా ఏ సంవత్సరం 200కి తగ్గకుండా శతకోటి ఘనపుటడుగుల నీరు ప్రవహించింది. జలవిద్యుత్ ఉత్పత్తికోసం, విజయవాడ ధర్మల్ పవర్‌స్టేషన్ కూలింగు కాలువల కోసం ప్రకాశం బ్యారేజీ దగ్గర జలాలు నిలపబడినాయి. ఫలితంగా కృష్ణా డెల్టా ఖరీఫ్, రబీలకి అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. వ్యవసాయం కన్నా విద్యుచ్ఛక్తి ప్రాధాన్యత కలదిగా; ప్రైవేటు విద్యుత్ కొనుగోళ్ళకి జల విద్యుత్ ఉత్పత్తి, అమ్మకం అవసరమైనదిగా ఏర్పడింది.

వ్యవస్థాగత సంస్కరణలలో భాగంగా విద్యుత్ సంస్థను కార్పోరేషన్‌లుగా విభజించి నాక మార్కెట్ ప్రయోజనాలే వాటిని నడిపిస్తున్నాయి. ఈ సంవత్సరం కృష్ణా డెల్టాకి జులై 15 నాటికి 6వేల క్యూసెక్కులు విడుదల చేస్తామని నీటి పారుదల శాఖామంత్రి చెప్పినా జెన్‌కో ఖాతరు చేయకుండా తను విద్యుత్ ఉత్పత్తి చేసుకొని 3వేల క్యూసెక్కులే వదిలింది.

ప్రభుత్వ 'జలయజ్ఞం'– నాగార్జునసాగర్ కృష్ణా జలాల మీదే ఆధారపడి పులిచింతల నిర్మాణం చేస్తున్నది. ఇది గుల్హతీ కమీషన్ నివేదిక మౌలిక అంశాలకి పూర్తిగా విరుద్ధ మైంది. ఏ రాయలసీమ, తెలంగాణాలకు నీరు అందించడమే తమ లక్ష్యమని చెపుతున్నారో దానికి విరుద్ధమైనది. సప్లయ్-డిమాండ్ సూత్రం అనుసరించి శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో పూర్తిస్థాయిలో జలవిద్యుత్ ఉత్పత్తి చేస్తున్నంత కాలం; ప్రైవేటు విద్యుత్ కేంద్రాల విద్యుత్ కొనుగోళ్ళ కౌంటర్ గ్యారంటీల ఖర్చులో జలవిద్యుత్ ఆదాయంను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం రాజకీయస్థాయిలో నిర్ణయంను కొనసాగిస్తున్నంత కాలం; ప్రపంచ బ్యాంకు ఉచ్చులో ప్రభుత్వం ఉన్నంతకాలం; రాయలసీమ, తెలంగాణాలు సస్యశ్యామలం కావడం దుర్లభం.

ప్రభుత్వం ఈ జలయజ్ఞాన్ని కూడా పులిచింతల, పోలవరం జలవిద్యుత్ కేంద్రాల ను నిర్మించి అదనపు విద్యుత్ ఉత్పత్తి కోసమే ఖర్చుపెడుతున్నది కానీ తాము చెప్పే మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలం కోసం కాదు.

ఈ విధంగా గుల్హతీ కమీషన్ నివేదిక లోని కీలకాంశమైన తెలంగాణా, రాయల సీమలను గోదావరి జలాల ద్వారా సస్య శ్యామలం చేసే సూచనలను తిరస్కరించిన ప్రభుత్వం పోలవరం, ప్రకాశం బ్యారేజీ లింకు పథకమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో అత్యుత్సాహం చూపుతున్నది. ఇపుడు పోలవరం ప్రాజెక్టు తీరుతెన్నులను పరిశీలిద్దాం.

పోలవరం ఎవరికి వరం? ఎవరికి శాపం?

పోలవరం ప్రాజెక్టు బహుళార్థ సాధక ప్రాజెక్టుగా నిర్మించేందుకు ప్రభుత్వం 7,981 కోట్ల అంచనా ఖర్చుగా ప్రకటించింది. (చీఫ్ ఇంజనీర్, హైడ్రాలజీ, హైదరాబాద్) దీనిలో పునరావాసం గురించిన ఖర్చులేదు. ప్రభుత్వం ఆర్.ఆర్.ప్యాకేజిని ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేయాలని కేంద్ర పునరావాస విధానం ప్రభుత్వాల ప్రకటన, క్యోటో సదస్సు లోని తీర్మానాలు చెబుతున్నాయి. పునరావాసం

కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తున్న 2వేల 51 కోట్ల రూపాయల పైచిలుకు ఖర్చు కలిపితే ఇది మరింత పెరుగుతోంది. 2 లక్షల మందిని ముంచే జన వ్యయం, ధన వ్యయంతో జరుగుతున్న ప్రాజెక్టు హెక్టారుకి లక్ష రూపాయలు ఖర్చుగా వేసినా అంచనా పెరుగుతుంది. ఇప్పటికే ఉభయ గోదావరి జిల్లాలలో పుష్కర తాడిపూడి ఎత్తిపోతల పథకాల ద్వారా అదనంగా సుమారు 600 కోట్ల రూపాయలు ఖర్చుతో సాగులోకి వస్తున్న భూములను కూడా దీనిలో కలిపారు.

ప్రజలు, వివిధ రాజకీయ పక్షాలు చేస్తున్న ఆందోళనతో పోలవరం ప్రాజెక్టు ముంపు తగ్గించేందుకు తగిన సూచనల కోసం నిపుణుల కమిటీని ప్రభుత్వం నియమించుతున్నట్లు ప్రకటించింది. మరోపక్క కాలువ, ప్రాజెక్టు పనులు యధాతథంగా సాగుతాయని చెపుతూనే నిపుణుల కమిటీని నియమించడం; కాలువ ఎత్తు 38 మీటర్లుగా నిర్ణయించుతున్న తర్వాత నిపుణుల కమిటీ ఏర్పాటు యొక్క విశ్వసనీయత లేకుండా పోతున్నది. 45 మీటర్లు నుంచి 42 మీటర్ల కంటే తగ్గింపు సాధ్యం కాదని, లేకపోతే కాలువలకి నీరందదని, 38 మీటర్లకన్నా తక్కువ ఉంటే కృష్ణా నదికి చేరవని; అధికారులు, నిపుణులే అంటున్నారు. పోలవరం ప్రాజెక్టును 1986 వరదల సందర్భంగా విడుల అయిన 3 లక్షల 60వేల క్యూసెక్కులకి అనుగుణంగా నిర్మించాలన్నది అవగాహన. కనుక పోలవరం ప్రాజెక్టు అంటే 1986 నాటి పెద్ద గోదావరి వచ్చి అంతకంటే ఎక్కువ నీరు ఎప్పటికీ అలాగే ఉండిపోవడం. 1986 ఆగస్టు 16నాటి వరద కూనవరంలో 80 అడుగులు ఉంది. పోచవరంలో 102 అడుగులు ఉంది. పోలవరంలో 52 అడుగులు ఉంది.కానీ పోలవరం ప్రాజెక్టు 42 మీటర్ల ఎత్తులోనే కడితే 125 అడుగుల నీరు ఉండి 100 కిలో మీటర్లు వెనక్కి తన్ని పెడుతుంది. పోలవరం నుంచి వెనక్కితన్నే జలాలవల్ల దుమ్ముగూడెం విద్యుత్‌కేంద్రం పెడితే మునుగు తుంది. కనుక పోలవరం ఎత్తు తగ్గించాలని ఆస్ట్రియా ప్రభుత్వం చెపుతున్నది. దీని వలన పోలవరం మొదలుకొని ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా వరకు గోదావరి, శబరి వద్ద గల లంకలన్నీ మునిగిపోతాయి. భూమి అంతా మునిగి పోయాక ఒకటి, రెండు కొండ మీద ఉన్న గ్రామాలు ఉండి చేసేది ఏముంటుంది? కనుక పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు అన్నది నిపుణుల పేర ప్రజల్ని ఏమార్చే పద్ధతి తప్ప మరేమీ కాదు.

పోలవరం కుడికాలువ ద్వారా మొత్తం ప్రవహించే 17,500 క్యూసెక్కులలో కృష్ణా నదిలోకి నికరంగా 11,750 క్యూసెక్కులు కలిపే విధంగా కృష్ణా బ్యారేజీకి చేరేలా నిర్మాణం అవుతున్నది. వరద సమయం 3 నెలల్లో 80 టి.ఎం.సి.లు కృష్ణా బ్యారేజీకి చేరేలా నిర్మాణం అవుతుంది. అయితే ప్రకాశం బ్యారేజీ నీటి సామర్థ్యం చాలాతక్కువ. ఇంత నీటిని నిల్వచేసే ఏర్పాట్లు ఏమీ లేకుండానే ఈ కాలువ నిర్మాణం ఉంది. సాగర్ నుంచి నీరు విడుదల అవుతూ, పులిచింతల నిర్మాణం అవుతూ కూడా ఇంత నీరు– అదీ వర్షాలు, వరదల సమయంలోనే ప్రకాశం బ్యారేజీకి చేర్చడం వ్యవసాయం కోసం మాత్రం కాదని స్పష్టం. మరోపక్క ఎడమకాలువను విశాఖ వద్ద కల తాళ్ళపాలెం వరకు తీసుకెళుతున్నారు. ఏలేరు ప్రాజెక్టు నీరు విశాఖకి తరలిస్తూ గోదావరి నుంచి విశాఖ అవసరాలకోసం ప్రత్యేకమైన పైపులైను నిర్మించి, తూర్పు గోదావరి అంతా పుష్కర ద్వారా నీరు అందిస్తూ కూడా 17,500 క్యూసెక్కులు నీరు విశాఖపట్నం ఇవతలవరకూ తరలించే ఏర్పాటు ఇది.

అంతిమంగా చూస్తే తాడిపూడి పుష్కర ఆయకట్టు కాక పోలవరం ప్రాజెక్టు కొత్త ఆయకట్టు కంటే పాత ఆయకట్టును స్థిరీకరించడానికే ఉద్దేశించబడింది. కృష్ణా డెల్టాలో విద్యుత్ ఉత్పత్తికి నదీజలాలను నిల్వచేయడం అన్న సమస్య లేకపోతే ఆ ఆయకట్టు స్థిరీకరణకి తక్షణ సమస్యలేమీ లేవు. ప్రపంచబ్యాంకు కూడా కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) కిందే– అంటే ఆయకట్టు స్థిరీకరణకే దీనికి నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది.

పోలవరం ప్రాజెక్టు రాజకీయ అర్థ'శాస్త్రం'

భారతదేశ కంప్రోల్టర్ అండ్ అడిటర్ జనరల్ నివేదిక ప్రకారం 2003–04 సంవత్సరానికి మన రాష్ట్రం మీద ఉన్న మొత్తం అప్పు 64,545 కోట్లు. ఈ అప్పుకి వడ్డీ కిందే 6,856 కోట్లు అవుతుంది. ఇది 1999 కంటే 121% పెరిగింది. ఇదిగాక ముఖ్యమంత్రి ఇప్పటికే 46 వేల కోట్ల రూపాయల 'జలయజ్ఞం' కోసం అప్పులు సేకరించే పనిలో వున్నారు. 46వేల కోట్లు ఏమిటి? అవసరమైతే లక్ష కోట్లు సేకరిస్తా మంటున్నారు. మరి ఇదంతా తీర్చడం ఎలా? ఇక్కడ మరొక అంశం ఉంది. ఈ ప్రాజెక్టులకి ఇచ్చే విదేశీ సంస్థల అప్పులకి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కావాలి. ఉదాహరణకి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ ఈ ప్రాజెక్టుకి సంవత్సరానికి 7శాతం వడ్డీమీద అప్పు ఇవ్వడానికి సిద్ధపడింది. అదే ఆస్ట్రియా ప్రభుత్వం 4.9% వడ్డీకి ఇవ్వడానికి సిద్ధపడింది. ఆస్ట్రియా నుంచి అప్పుతెస్తే దాన్నికేంద్ర ప్రభుత్వం తీసుకొని దానినే రాష్ట్రానికి 12శాతం వడ్డీకి ఇస్తుంది. ఈ విధంగా రాష్ట్రాలు తెచ్చుకొనే అప్పుల నుంచి వడ్డీ గుంజటమేకాక రాష్ట్రాలు అప్పుల ఊబిలో చిక్కుకొనేలా చేసి సరళీకరణ విధానాలను రాష్ట్రాలపై రుద్దటానికి ప్రపంచ బ్యాంకు సూచనలకి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుంది. ఇదీ ఈ అప్పులోని రాజకీయ ఆర్థిక అంశం.

పోలవరం ప్రాజెక్టుకి ఇప్పటికి అవుతుం దనుకొన్న ఖర్చు నిర్మాణం, పునరావాసంతో కలిపి 9,265 కోట్లు. అయితే దీనికి 7సం॥ల కాలవ్యవధిలో ప్రభుత్వం 7శాతం వడ్డీకే తెచ్చిందనుకొంటే 13,904 కోట్లు చెల్లించాలి. 10శాతం వడ్డీకి తెచ్చిందనుకొటే 16,414 కోట్లు చెల్లించాలి. నూటికి 12శాతం చొప్పున వడ్డీకి తెస్తే 18,287 కోట్లు ఖర్చుపెట్టాలి. అంటే సంవత్సరానికి 1,196 కోట్లు సగటున వడ్డీకి ఖర్చు అవుతుంది. 1,196 కోట్లు అంటే రాష్ట్రం మొత్తం మీద విద్య, వైద్య, ఆరోగ్య రంగాల మీద ప్రభుత్వం పెడుతున్న ఖర్చుకి సమానం (సమత రిపోర్టు ఆధారంగా) అయితే ఈ ప్రాజెక్టులు నిర్మాణం అనుకున్నట్లు పూర్తయితే పండేపంట, వచ్చే ఆదాయం విలువైనదే.కానీ మన రాష్ట్రంలో అవినీతి రాజకీయ నాయకత్వం కింద తలపెట్టిన

ప్రాజెక్టులు సకాలంలో పూర్తికాక పోవడం, ఖర్చు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రాజెక్టుల ప్రయోజనం ప్రజలకి చేరటం లేదు.

చంద్రబాబునాయుడు కాలంలో తెలుగు దేశం ప్రభుత్వం 40వేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చిందని, వాటితో హైదరాబాద్ నగరంలోని 13 కిలోమీటర్లే అభివృద్ధి చేసారని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెపుతున్నది. ప్రస్తుత ప్రభుత్వం మరో 46 వేల కోట్ల నుంచి ఆపైన ఎంత దొరికినా అప్పు చేస్తుంది. అంతిమంగా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకొని పోతుంది. అప్పులకి వడ్డీలు చెల్లించలేక పోతున్నాం అంటూ ప్రభుత్వ సంస్థలను అమ్మడం; ప్రజోపయోగమైన విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల ఖర్చులను, ఉద్యోగులను తగ్గించి ప్రపంచబ్యాంకు కోరిన స్మశానాంధ్రను మాత్రం రూపొందించడం జరుగుతుంది.

కనుక కొత్తగా నీరు అందించని కేవలం పారిశ్రామిక, వాణిజ్య నౌకా రవాణా అవసరాల కోసం, విద్యుత్ ఉత్పత్తికోసం ఇంత జన వ్యయం, ధనవ్యయం జరుగుతోంది. పారిశ్రామిక ప్రగతి కూడా అవసరమే. అయితే మన ప్రజలకి కాక విదేశాల నుంచి తెచ్చిన యంత్రాలకి పనులు కల్పించే విధంగానూ, మన పర్యావరణంను నాశనం చేసే పరిశ్రమలకి అంటే చింతపల్లి బాక్సైట్ మైనింగు, కాకినాడ షిప్ బ్రేకింగు యూనిట్‌ల వంటి వాటికి మన నదీజలాలను మళ్ళించడం నష్టకరం. ఈ పోలవరం ప్రాజెక్టు ఏ మెట్ట ప్రాంతాల ప్రయోజనం నెరవేర్చదు. ఏలేరు జలాలను విశాఖకి తరలిస్తే తమ భూములు ఎండిపోతున్నాయని గగ్గోలు పెట్టిన రైతులను తరిమివేసి ఏలేరు కాలువపై పోలీసులను కాపలా పెట్టిన ప్రభుత్వాలు రేపు మన కళ్ళముందే ఈ నీళ్ళను మనల్ని ముంచి విదేశీ బహుళజాతి కంపెనీలకి, బాక్సైటు మైనింగుకి తరలిస్తాయని గమనించాలి. ప్రభుత్వం ఎత్తి పోతల కింద వరి, చెరకు వంటి పంటలు వేయరాదని ఇప్పటికీ ఆంక్షలు పెడుతూ; కరెంటు, నీరునిలుపు చేస్తామని బెదిరిస్తున్నది. రేపు మెట్ట ప్రాంతాలకి చెందిన రైతాంగం ఏ పంట పండించాలో తాము నిర్ణయించకోలేని స్థితిలో పడతారు.

కనుక జననష్టం, ధననష్టం, పర్యావరణ, సాంస్కృతిక విధ్వంసం కల్గించే ఈ పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టును నిలిపివేయాలి. దాని స్థానంలో ఇంజనీరింగు నిపుణులు చెబుతున్నట్లు దుమ్ముగూడెం వద్ద ప్రాజెక్టును నిర్మించి ఖమ్మం, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల మెట్ట ప్రాంతాలు మీదుగా పులిచింతలకి కలపటం; శబరి నుంచి పాములేరు మీదగా తూర్పు, విశాఖ మెట్ట ప్రాంతాల గుండా ఉత్తరాంధ్రకి నీరు తరలించడం సాధ్యమే; అని అంటున్న దానిని పరిశీలించాలి. అనంతరం పోలవరం వద్ద ముంపు సమస్య లేని బ్యారేజీ నిర్మాణం జరిపి గోదావరి బేసిన్‌లో దొరికే సహజవాయు విద్యుత్ కేంద్రాలను నెలకొల్పి నీటిని ఎత్తిపోతల ద్వారా తూర్పు విశాఖ జిల్లా ఎగువ ప్రాంతాలకి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకి అందించాలి.

కనుక కాంగ్రెసు ప్రభుత్వ జలయజ్ఞం తెలంగాణా, రాయలసీమలను సస్యశ్యామలం చేయదు. కోస్తా జిల్లాల కొత్త ఆయకట్టుకి నీరుఇవ్వదు.

ఇక ఉత్తరాంధ్ర జిల్లాలలో ప్రభుత్వ జలయజ్ఞం జంఝావతి జలాలను విశాఖకి తరలించేందుకు ప్రయత్నించింది. ప్రజలు దీన్ని తీవ్రంగా ప్రతిఘటించడంతో రబ్బరు డ్యాం నిర్మాణం పేరుతో ఇటు రైతాంగ అవసరాలు తీర్చకుండానే; ఆంధ్రా, ఒరిస్సా నిర్వాసితులకి న్యాయమైన నష్టపరిహార సమస్యల్ని పరిష్కరించకుండానే పారిశ్రామిక అవసరాలకి తరలించాలనే ప్రయత్నంలో ప్రభుత్వం ఉంది.దీనికి వ్యతిరేకంగా ప్రజల ఆందోళన సాగుతూనేవుంది. నాగావళి, వంశధారల మీద నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులను అంతఃరాష్ట్ర సమస్యలను చూపించి మరింత పరిమితం చేసి మరోపక్క సక్రమ పునరావాస చర్యలు చేపట్టకుండా వ్యవహరిస్తున్నది.

రాయలసీమలో నీటిపారుదల వ్యవస్థ ఫ్యాక్షనిజం పడగనీడలో, ఊడలు దిగిన అవినీతిలో నిరుపయోగం అవుతున్నది. నిర్మించ బడిన జలవనరులు సైతం వాటి కెపాసిటీకి తగ్గట్టుగా నిల్వచేస్తే డ్యాంలు, కాలువలు కొట్టుకొనిపోయే పరిస్థితి ఏర్పడింది. రాయల సీమ భూస్వామ్య పెత్తందారీ ఫ్యాక్షనిజం నిరంకుశాధికార పెట్టుబడి ద్వారా పెరుగుతూ రాయలసమీ కరువును కూడా తన దోపిడీకి వనరుగా మార్చుకొంటున్నది.

రాజశేఖర్‌రెడ్డిగారు 1985లో రాయల సీమ సంయుక్త కార్యాచరణ సమితి తరపున రాయలసీమలో పాదయాత్ర చేసారు. మరల 2004లో పాదయాత్ర చేసారు. కరువు, రైతుల కన్నీళ్లు, విలాపాలు, గ్రామీణ జీవిత విధ్వంసం ఆయనకి స్పష్టంగా తెలుసు. రాష్ట్రంలోని కరువుకి, కష్టాలకి మౌలిక పరిష్కారం ఏమిటో కూడా తెలుసు. కానీ ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ బకాయిలు మాఫీ చేసారు. సాధారణ రైతులెవరికీ విద్యుత్ బకాయిలు ఉండవని తెలిసిందే. ఉన్నా లైన్‌మెన్లు ఊరుకోరు. విద్యుత్ బకాయిలు పథకం వల్ల ప్రయోజనం పొందింది వ్యవసాయ క్షేత్రాల యజమానులు, భూస్వామ్య పెత్తందార్లే. వాళ్ళను సంతోషపరచి అనంతరం గత 10-15 సంవత్సరాలుగా రోడ్లు, ఇతర నిర్మాణాల ద్వారా వందల కోట్ల స్థాయికి ఎదిగిన కంట్రాక్టర్లను సంతోష పరచదలచుకొన్నారు. ఈ జలయజ్ఞం అందుకే. ప్రపంచ బ్యాంకు కనుసన్నలలో, కేంద్ర ప్రభుత్వ గుప్పెటలో ఆయన ఒద్దికగా నడవాలి. ప్రపంచ బ్యాంకు ఇప్పటికే మన రాష్ట్రాన్ని తనదైన దోపిడీ విధానాల కోసం పునర్నిర్మించ దలచుకుంది. 4 లైన్లు, 6 లైన్ల రోడ్లు, జాతీయ రహదారులు; ఇచ్ఛాపురం – తడ తీరప్రాంతం వైపు 4 లైన్ల ఎక్స్‌ప్రెస్ రోడ్లు; రైలుమార్గాల విద్యుదీకరణ, అదనపు లైన్ల నిర్మాణం; విశాఖ నుంచి చైన్నై వరకూ కృష్ణా, గోదావరిల నుంచి ముడిసరుకు చౌక రవాణాకోసం జలమార్గ వ్యవస్థ – దాని పథకంలోని ముఖ్యాంశాలు. మన సహజ వనరులను తరలించడం; యూరప్, అమెరికాలలో పర్యావరణం రీత్యా అంగీకరించని బాక్సైట్ తవ్వకంను మన నీరు, నదులు, కలుషితం చేసినా చేపట్టడం దీనిలో భాగాలు. సాంప్రదాయక ఆహార పంటల వ్యవసాయాన్ని మార్కెట్టు శక్తుల ద్వారా ధ్వంసం చేసి నిరుత్సా హపరచడం; కార్పోరేట్, కాంట్రాక్టు పేర ఆధునిక విశాల భూఖండాలను, భూకేంద్రీకరణను ప్రోత్సహించడం దాని విధానం. ఆర్.టి.సి.ని, సింగరేణిని ప్రైవేటీకరించి కార్మికులను గెంటివేసి

ప్రైవేటీకరణ బాట పట్టించడం ఈ విధానాల అమలులోని ఒక కర్తవ్యం. కనుక కాంగ్రెసు ప్రభుత్వం చేయగలిగింది పై విధానాలను అమలుచేస్తూనే ప్రజలను మభ్యపరడచం తప్ప మరో మార్గం లేదు. ప్రజలు భ్రమల నుండి బయటపడితే నిర్బంధం తప్ప మరొక గత్యంతరం లేదు. సామ్రాజ్యవాదుల, దళారీల, భూస్వామ్య పెత్తందార్ల కబంధ హస్తాలలో దున్నేందుకు భూమి; భూములకి నీరు; రైతుకి రక్షణ; శ్రమకి గౌరవం దక్కవని గమనించాలి.

ఇలాంటి స్థితిలో నీటి పారుదల సమస్యను చూపెడుతూ ప్రజలను ప్రాంతాలను విభజించే పాలకుల కుట్రలను త్రిప్పికొట్టాలి.

అదే సమయంలో గోదావరి డెల్టాలో గత 150 సంవత్సరాలుగా కాలువల క్రింద నీరుపారుతూనే ఉంది. అయినా అక్కడ దరిద్రం, పీడన తక్కువేమీ కాదు. కౌలు రైతాంగం అప్పుల బాధలు పడలేక ఆత్మహత్య లకి పాల్పడుతున్నది. కనుక నీటి పంపిణీ మాత్రమే కాదు, సమగ్ర భూసంబంధాల ప్రజాస్వామీకరణ కూడా అత్యవసరం. మిగులు భూమి పంపిణీ జరుగకుండా, రైతుల మీద మార్కెట్టు శక్తుల దోపిడీ నశించకుండా గ్రామాల వికాసం అసాధ్యం అని గమనించాలి.

మేము రాష్ట్ర వ్యాపితంగా భూమికోసం పోరాడుతూనే నీటి పారుదలరంగసమస్యల గురించి అధ్యయనం చేస్తూ వచ్చాం. 1983 నుంచి తెలంగాణా, రాయలసీమలలో నీటి పారుదల రంగంలో పాలకుల కుట్ర, వివక్షతను ఎండగడుతూ కృషి చేసాం. పోచంపాడు వరద కాలువ కుంభకోణంకి, నల్గొండ జిల్లా కరువుసమస్యలైన వేలాది మంది రైతాంగాన్ని కదలించడంలో ముఖ్య నాయకత్వ పాత్ర వహించాము. రాయలసీమ కరువు సమస్యలపై నిరంతరం ప్రచారం సాగించాలి. రాయలసీమ సంయుక్త కార్యాచరణ సమితిలో నేటి ముఖ్యమంత్రితో కలసి పాదయాత్ర చేస్తూ అమరుడు కా॥ మండ్ల సుబ్బారెడ్డి రాయలసీమ సమస్యలకి సరైన పరిష్కారాలను ప్రజల ముందు ఉంచారు. తిరిగి 1993లో కరీంనగర్ జలవనరులపై నాటి ఎం.ఎల్.ఎ. కా॥ ఎన్.వి. కృష్ణయ్యగారి ఆధ్వర్యంలో గొప్ప కదలిక వచ్చింది. అంతేకాక "కరువు జిల్లా కన్నీటి గాధలు" మహబూబ్‌నగర్ జిల్లా జలసాధన సమితిని స్థాపించి 1992-99 వరకు సాగిన ఉద్యమంలోను భాగస్వాములమయ్యాము. మహబూబ్‌నగర్ జిల్లా కోసం రూపొందించిన పథకాల అమలు కోసం మ్యాపులతో సహా పుస్తకం తెచ్చి జనాన్ని మేల్కొలిపాము. ఈ కృషి అంటూ కొనసాగించవలసిందే. విప్లవ ప్రజాతంత్ర శక్తులందరూ ఈ కృషిలో నిలచి నట్లైతే కరువులు, వరదల సమస్యకై సరైన శాస్త్రీయమైన పరిష్కారం చూపుతూ స్వతంత్ర మైన, కష్టజీవులైన పేద, మధ్య తరగతి రైతుల పునాదిగా ఒక రైతాంగ ఉద్యమం నిలిచి ఉండేది. కానీ ఉద్యమశక్తులనుకొంటున్నవారు, తామే నిజమైన పోరాట యోధులం అనుకున్న వారు నాడు ఈ నినాదాలను సొంతం చేసుకోక పోగా భూస్వాముల ప్రయోజనాలను రక్షించే కార్యక్రమమని ఎద్దేవా చేసారు. కానీ వారిలో అత్యధికులు ఈ రోజు తెలంగాణా నుంచి ఎదిగిన స్థానిక నూతన సంపన్న వర్గాల పాలక పార్టీ అయిన టి.ఆర్.ఎస్. వెనుక చేరి ప్రాంతాల అసమానత్వం గురించి మాట్లాడు తున్నారు. ఇదొక రాజకీయ విషాదం.

కనుక నదీజలాల సమగ్ర వినియోగం కోసం గోదావరి జలాల సక్రమ పంపిణీకోసం కృషి చేయాలని పిలుపు ఇస్తున్నాం.

ప్రాణహితను శ్రీరాంసాగర్‌కి కలపడం. తద్వారా వరంగల్, కరీంనగర్ ప్రాంతాలకి నల్గొండ జిల్లాకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నాగార్జునసాగర్‌కి కలపటం జరగాలి.

దుమ్ముగూడెం ప్రాజెక్టు నుంచి ఖమ్మం, పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లా మీదుగా కృష్ణానది కి కలపాలి.

దేవాదుల ఎత్తిపోతల ద్వారా ధర్మసాగర్, ఘనాపూర్ చెరువులకు అందించడం ద్వారా అక్కడి నుండి మిగులు జలాలను మధ్య తెలంగాణాకి నీరందించుతూ నాగార్జునసాగర్‌కి చేర్చాలి.

గోదావరి, కృష్ణా నదీజలాలు ఆధారంగా పులిచింతల నిర్మాణం జరగాలి.

శ్రీశైలం జలాలను రాయలసీమ, తెలంగాణాలకే వినియోగించి విద్యుత్ వినియోగం కన్నా వ్యవసాయ అవసరాలు ముఖ్యమని; నదీ జలాలపై మొదటి హక్కు రైతాంగం, ప్రజలదేనని ప్రకటించాలి. సిద్ధేశ్వరం వద్ద 870 అడుగుల వరకూ అన కట్ట నిర్మాణం ద్వారా శ్రీశైలం నుండి కృష్ణా జలాల ను కె.సి. కెనాల్‌కి అందించి తుంగభద్ర జలాలను అనంతపురం మళ్ళించాలి.

హైదరాబాద్‌కి గోదావరి జలాలను తరలించి మంజీరా నది జలాలను నిజామా బాద్, మెదక్‌లకి కేటాయించాలి. పాత ఆయకట్టుల పరిరక్షణకి కొత్త జలవనరరుల కమీషన్ ముందు ప్రభుత్వం డిమాండ్ చేయాలి.

ఆదిలాబాద్ జిల్లా సమగ్ర జలవనరుల అభివృద్ధికి ప్రత్యేకమైన అధ్యయనం చేయాలి. అన్ని జలవనరులను అభివృద్ధి పరచాలి. ఆ ప్రాజెక్టుల సీపేజి వాటర్ శ్రీరాంసాగర్ చేరే విధంగా ప్లాన్ చేయాలి. నాగార్జునసాగర్‌లో ఉన్న నీటిని వినియోగించి రెండవ దశ నాగార్జునసాగర్ నుంచి సోమశిల లేక కండలేరు వరకూ, ఇటు ఖమ్మంకు నీరు అందించాలి. అంతఃరాష్ట్ర నదీవివాదాలను పరిష్కరించి ఉత్తరాంధ్ర జలవనరుల సమగ్ర వినియోగంకి చర్యలు తీసుకోవాలి. నదులు అన్నీ విశాఖ పారిశ్రామిక అవసరాలకే అన్న వైఖరి విడనాడాలి.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపి వేయాలి. ఒకవైపు పుష్కర పథకాలను, పోలవరం కాలువను ఒక కాలువగా చేసి ఎత్తిపోతల ద్వారా 10 వేల క్యూసెక్కుల నీరును రెండు వైపుల తరలించాలి. మెట్ట ప్రాంతాలకీ ఎత్తిపోతలు అమర్చాలి.

శబరి జలాలను పాములేరు మీదుగా తూర్పుగోదావరికి విశాఖ మెట్ట ప్రాంతాలు మీదగా ఉత్తరాంధ్రకి అందించాలి. ఏజెన్సీ ప్రాంతాల నీటి వనరుల అభివృద్ధికి తగిన చర్యలన్నీ తీసుకున్న తర్వాతే ఈ తరలింపు ఉండాలి.

గోదావరి బేసిన్‌లో దొరికే అపార సహజవాయు నిక్షేపాలను శరీరంలో నరాలు, నాడీ కేంద్రాలు లాగా రాష్ట్ర వ్యాపితంగా విస్తరింపచేసి జల, సహజవాయు, మానవ

వనరుల మేళవింపుతో సమగ్ర వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి సాగించాలి. రేవు పట్టణాల చుట్టూ పరిశ్రమలు కాక ముడి సరుకులు, శ్రమశక్తులు ఉన్నచోట పరిశ్రమలు నిర్మించాలి.

ప్రజల ప్రకృతి సమతూకంను, పర్యావరణంను విధ్వంసంచేసే ఏ పరిశ్రమలను, పంటలను మనదేశంలో అనుమతించరాదు.

ప్రాజెక్టు నిర్మాణ క్రమంలో అనివార్యమైన ముంపు సమస్య ఏర్పడితే బాధిత ప్రజలతో చర్చించి, భూమికి భూమిగా భౌతిక పునరావాసం మొదట కల్పించి, ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత చేపట్టాలి. ఆదివాసులకి అడవిపై హక్కులు గ్యారంటీ చేయబడాలి.

పై డిమాండ్‌ల సాధనకి మన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలే అడ్డంకి. బలమైన ఏకీకృతమైన, స్వతంత్రమైన రైతాంగ ఉద్యమమే పాలకుల రైతు వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలకి సమాధానం చెప్పగలదు. •



హరించుకుపోయి ఆత్మహత్యల్లో పాలిపోతున్న పత్రహరితం
'హరితాంధ్ర' వంచనాశిల్పానికి మళ్ళీ మోసపోవడం!
వేలకోట్ల అప్పుల ఆనకట్టలు
నీటిపన్నులై పాడుచుకొచ్చి
జానెడు నేల బక్కపాట్టల్ని
దేశ దిమ్మరుల్ని చేసి
దేశాన్ని బిచ్చగాళ్ళ ఆకలికేకల్తో నింపడం!
బతకడాన్ని నేరం చేయడం!

రక్తాన్నీ, చెమటనీ ధారసోసి
అనుబంధాన్నీ, మమకారాల్నీ కలగలిపి
నిర్మించుకున్న ఇల్లూ-వాకిలీ-ఊరూ-వాడా
అక్క-అన్న-అయ్య-అమ్మ-బిడ్డ-గొడ్డు-గోడులూ-
'వాడి' దళారీ దాష్టీకానికి పేలిపోతుంటే
'వాడి' బహుళ జాతీయ కుహకానికి కూలిపోతుంటే
నేరాల జాబితాలోకి నెట్టబడుతున్న పునరావాసం హక్కు!
శిక్షాస్మృతి చిహ్నాలుగా న్యాయస్థానాలు!
న్యాయస్థానాల నెరదల శిథిలాల్లోంచి
పాడుచుకొస్తున్న రాకాసి కోరలు!

- పి.ఎస్.నాగరాజు

ఎండుటాకు

అమ్మంగి వేణుగోపాల్

శిఖరాల మీద కుట్ర జరుగుతున్నప్పుడు
జలపాతం పంటకాలువై తన పాలంవైపు రాదని
రైతుకు తెలియదు
వెన్నెముకను నాగలిచేసి దున్నటం ఒకటే తెలుసు
అరచేతి గీతలు అరిగేదాకా విత్తనాలు చల్లటం ఒక్కటే తెలుసు
ఇంతచేస్తే
బీడుపడ్డ కళ్లలో కనీసం కలల పంటలైనా పండలేదు
ఏడాది పాడుగునా ఒకటే - ఆకలి రుతువు
ఏరెండిపోయింది
పాలం తాకట్టులో వుంది
తెగనమ్ముదామంటే
పాలంలో తరతరాల ఆత్మ వుంది
ఎక్కడికి వలస పొమ్మంటావు?
నీవు
దారిద్ర్యరేఖకు ఆకుపచ్చరంగు పులిమి
హరితవిప్లవం అని అరుస్తున్నప్పుడు
ఎండుటాకులు ఏమని వ్యాఖ్యానించాయో
నీకు తెలుసా?

దురదృష్టవశాత్తూ
రైతుకు ఎండుటాకుల భాష తెలుసు

బట్టబయలు అయిన భూపంపకం బండారం

కామ్రేడ్స్ యద్దనపూడి సోని, జగన్

రాష్ట్రంలో అధికారంలో కొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 'భూపంపకాన్ని' అట్టహాసంగా చేపట్టింది. భూపోరాటాలను ఒక ప్రక్క ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేయ ప్రయత్నిస్తూనే, తనే భూములు పంచబోతున్నానని పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించి ప్రజలను భ్రమలలో ముంచెత్తాలని ప్రయత్నించుతున్నది.

మిగులు భూమి లెక్కల అంకెల గారడి

ఆంధ్రరాష్ట్రంలో భూపరిమితి చట్టం ప్రకారం 1973లో 20లక్షల ఎకరాలు మిగులు భూమి వుంటుందని అంచనా వేశారు. కాని 1978 సం॥ నాటికి 12లక్షల ఎకరాల విస్తీర్ణం వుందని ప్రకటించారు. తీరా 1991 కొచ్చేసరికి 7.25 లక్షల ఎకరాల మిగులు భూమి వుందని తేల్చారు. ఈ 13 సం॥రాల కాలంలో 5.60 లక్షల ఎకరాలభూమి రెక్క లొచ్చి ఎగిరి పోయిందన్నమాట! భూసంస్కరణల చట్టంలో ఏనుగులు దూరే కంతలున్నందున తరిగి పోయిన ఆ లక్షల ఎకరాలు భూస్వామ్య పెత్తందారీ వర్గాల పరమయ్యాయని అర్థం చేసుకోవచ్చు. మిగిలిన మిగులు భూమిలో 25శాతం 1.85 లక్షల ఎకరాల భూమి కోర్టు వివాదాల్లో చిక్కకుందని ప్రభుత్వమే ప్రకటించింది. కోర్టు లిటిగెన్సీలో వున్న భూమి పోను ఇంకా 5,37,865 ఎకరాల మిగులు భూమి వుండాలి. కాని వ్యవసాయశాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు కేవలం 2135 ఎకరాలు మాత్రమే వుందని ప్రకటించాడు. అయితే మరి ఆ 5 లక్షల ఎకరాల భూమంతా ఏమైనట్టు? 2135 ఎకరాలు మాత్రమే ఎలాగైంది? దీన్ని బట్టి చూస్తే అన్యాక్రాంతమయిన మిగులు భూములను భూస్వామి, ధనిక, పెత్తందారీ వర్గాల నుండి స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తారనే ఆశకు నీళ్ళొదలడమే అవుతుంది. మిగులు భూముల వ్యవహారం ఇంత 'చూడ ముచ్చటగా' వుంటే ఇక దేవాలయ, బంజరు, ఇతరత్రా భూముల వివరాలు ఎంతో లోపభూయిష్టంగా వుంటుంద నడంలో సందేహం లేదు.

2003-04 సం॥ కాలంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం 95-96 సం॥లో వ్యవసాయ గణాంకాల ఆధారంగా రాష్ట్రంలో వ్యవసాయ కమతాల సరాసరి విస్తీర్ణం 1.36 హెక్టార్లు. 63 లక్షల మంది పేద రైతుల వ్యవసాయ కమతాల సగటు విస్తీర్ణం 1.43 హెక్టార్లు. దిగువ, మధ్యస్థాయిలో వున్న 13.95 లక్షల రైతుల సరాసరి విస్తీర్ణం 2.68 హెక్టార్లు. 5.63 లక్షల మంది మధ్య తరగతి రైతుల వ్యవసాయ కమతాల సరాసరి విస్తీర్ణం 5.74 హెక్టార్లు. 83 లక్షలమంది పెద్ద రైతుల కమతాల సరాసరి విస్తీర్ణం 15.31 హెక్టార్లు కల్గి వున్నారు. గత కాంగ్రెస్ పాలనలో 43 లక్షల ఎకరాల భూమిని పంచామని జబ్బలు చరుచుకున్నారు. ఆ భూమిలో అధిక భాగం భూస్వాములు, ధనిక రైతులు, పెత్తందార్లు అన్యాక్రాంతం చేసారని పై గణాంక వివరాలు స్పష్టం చేస్తున్నాయి. పలు జిల్లాలలో నిరుపేదలకు గతంలో పంపిణీచేసిన ప్రభుత్వ భూములు 'పెద్దల' చేతుల్లోకి వెళ్ళాయని; ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టిలకు ఇచ్చిన డి.ఫారం పట్టాలు; ప్రభుత్వ అసైన్డు సీలింగ్, బంజరు భూములు వేలాది ఎకరాలు వారి స్వాధీనంలో లేవని; రెవెన్యూ అధికారుల విచారణలో అసైన్‌మెంట్ కమిటీల సమావేశాల్లో వెల్లడయింది. (1.8.05 వార్త) పేదల అసైన్‌మెంట్ భూముల అన్యాక్రాత నిరోధక చట్టం 9/77 అమలులో ఉన్నప్పటికీ పేదల నుంచి అన్యాక్రాంతాలు యధేచ్ఛగా జరిగాయని గమనించాలి.

ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమి స్వర్ణోత్సవాల్లో ముఖ్యమంత్రి వై.ఎస్ "పేదల భూములు భూస్వాముల వశమయ్యాయని" అంగీకరించటం విశేషం. అదే సభలో "అలాంటి భూములను వెనక్కు తీసుకోవాలని" అంటూనే, "అందుకు పరిష్కారంగా, విచారణ కొరకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తాయని అనడం చూస్తుంటే సమస్యను తేల్చకుండా కాల హరణం చేయడం మినహా ఆచరణలో ఒరిగేదేమీ వుండదు. మిగులు భూమి తేల్చడంలోనే ప్రభుత్వ బండారం ఆదిలోనే బహిర్గతమయింది. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం చేపడ్తున్న భూపంపకం నిర్వాకం ప్రజల్ని క్రూరంగా పరిహసించడం కాక మరేమవుతుంది?

చిత్తశుద్ధి లేని భూ పంపిణీ !

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన వెలుగు సర్వే ప్రకారం దారిద్ర్యరేఖ క్రింద ఉన్న కుటుంబాల సంఖ్య 79,08,850. అందులో పేద కుటుంబాలు 52,23,135. నిరుపేద కుటుంబాలు 25,70,846 ఉన్నాయి. వాస్తవానికి సర్వే లెక్కలు కన్నా పేదరికం ఎన్నో రెట్లు ఎక్కువ వుండే అవకాశం ఉంది.

భూస్వాములు కాగితపు మడతలలోను, కోర్టు వివాదాలోనూ దాచగా ప్రభుత్వ లెక్కల ప్రకారం మిగులు భూమిగా ప్రకటించి ప్రభుత్వం స్వాధీనం చేసుకొనని భూమి 2 లక్షల 29వేల ఎకరాలు. దేవాదాయ భూములు 3 లక్షల ఎకరాలు. బంజరు భూములు సుమారు 18 లక్షల ఎకరాలు. భూదానయజ్ఞ బోర్డు భూముల 1 లక్షా 42 వేల ఎకరాలు. మొత్తం సుమారు 25 లక్షల ఎకరాల భూమిని పంచేందుకు ప్రభుత్వానికి ఎటువంటి ఆటంకాలు లేవు.

ప్రభుత్వం భూపరిమితి చట్టాన్ని పకడ్బందీగా అమలుచేస్తే మరో 50-70 లక్షల మిగులు భూమి లభించే అవకాశం వుంది. వెలుగు సర్వే తేల్చిన సుమారు 80 లక్షల కుటుంబాలకు ఈ భూములు పంచాలంటే చిత్తశుద్ధి వుండాలి. అది కొరవడింది. కనుకే సుమారు 31 లక్షల భూమికి బదులు మొదటి విడత 80,612 మంది లబ్ధిదారులకు 1,26,104 ఎకరాలు, రెండవ విడతలో 80,847 మంది లబ్ధిదారులకు 1,48,649 ఎకరాలు, వెరశి 2,74,753 ఎకరాల భూమిని మాత్రమే ప్రభుత్వం పంపిణీ

చేయడానికి పూనుకుంది. భూస్వాములు అన్యాక్రాంతం చేసిన మిగులు భూములు గాని, దేవాలయ, భూదాన భూములు గాని ముట్టుకోలేదు.

ఇంతకీ ఏ రకం భూములు పంచుతున్నారు?

ప్రభుత్వ ఉత్తర్వుల్లో "డొంకలు, పుంతలు, వాగులు ప్రభుత్వ బంజరు భూములు అన్నీ కల్సి వాటిని గుర్తించి; మండలాల వారిగా భూమి వివరాలు, లబ్దిదారుల గుర్తింపు ఎసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటు జరగాలని" ఆదేశించారు. (10.1.05 వార్త జిల్లా టాబ్లాయడ్) అదే వార్తలో "వాగులు ఉన్న భూములను ఎప్పటి లాగానే వుండాలని వాటిని పంపిణీ చేయకూడదని సుప్రీంకోర్టు తీర్పు వుందని; పుంతలు, నిబంధనలు ప్రకారం పంపిణీ చేయడం సాధ్యం కాదని ఉన్నందున, ఆ భూములను ఏ విధంగా లెక్కలోకి తీసుకోవాలో తెలీక రెవిన్యూ అధికారులు సతమమతమవుతున్నారు. అందుకే, సూక్ష్మంలో మోక్షం' ఆలోచించిన ప్రభుత్వం, అధికారులు దశాబ్దాలుగా సాగులో వున్న ఎలాంటి వివాదాలు లేని భూములను క్రమబద్ధం చేసేందుకు, సాగులో ఉన్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. సేకరించిన భూమి సాగుకు అనుకూలంగా లేక రాళ్ళు, రప్పలు, తుప్పలతో నిండివుంటే వాటిని తొలగించి సాగుకు అనుకూలంగా చేసి లబ్దిదారులకు పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. ఆ భూముల అభివృద్ధి కొరకు 'ఇందిర ప్రభ' పథకం పేరుతో తొలివిడత 500కోట్లు, మలివిడత 207 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. గతంలో పనికి ఆహార పథకం 'పచ్చ చొక్కా' గల వారి జేబులు నింపిన మాదిరిగానే ఈ పథకం కూడా 'త్రివర్ణ కండువా'ల ముడుపులకు వినియోగపడుతుందనటంలో సందేహం లేదు. నిజానికి రాజకీయ నాయకుల అండలేనిదే, రెవిన్యూ అధికారులకు 'లాంఛనాలు' సమర్పించుకోనిదే పేదలకు భూమి దక్కడం కల్ల.

ప్రహసనంగా మారిన భూ పంపిణీ

రిపబ్లిక్ దినోత్సవం నాడు రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఆర్భాటంగా ప్రారంభించిన భూ పంపిణీని అరచేతిలో వైకుంఠం చూపిస్తూ తూతూ మంత్రం చేస్తూ చేతులు దులుపు కోవడం సర్వత్రా కానవచ్చింది. 'మెతుకు ముట్టుకున్నంత' తేలిగ్గా భూ పంపిణీ నిర్వాకం అంతా ప్రహసనంగా మారిందని ఈ క్రింది ఉదాహరణలు నిదర్శనంగా నిలుస్తాయి.

కృష్ణా జిల్లాలో 3498.09 ఎకరాలు భూమిని పంపిణీ చేయడానికి పూనుకోగా అందులో 1666.17 ఎకరాలు పూర్వం నుండి ఆక్రమించుకుని అనుభవిస్తున్న 2358 మందికి పట్టాలు మంజూరు చేసారు (27.1.05 వార్త). అందులో నందిగామ, చందర్లపాడు, వారాలపాడు మండలాల్లో వరసగా 33,50,100 ఎకరాలను అధికారులు సిద్ధం చేసిన ఆ భూములు ప్రజలు అనుభవిస్తున్నవే. వారి వద్ద ఉన్న పట్టాలు రద్దుచేసి మరలా పట్టాలు మంజూరు చేసేందుకు పూనుకోవడం విడ్డూరం (10.1.05 వార్త). కొత్తపల్లె తుమ్మల పాలెం గ్రామంలో ఏమాత్రం సాగుకు పనికిరాని తీరప్రాంత బంజరు భూమిని అధికారులు పంపకానికి పూనుకున్నారు. విచిత్రమేమిటంటే పంపిణీ చేసే భూమి ఏకఖండంగా కాక 2-3 భాగాలుగా వేర్వేరు సర్వే నెంబర్లలో వుంది. అక్కడక్కడ ఉన్న భూమిని ఒకే పట్టాగా ఇవ్వబోతే ఆ గ్రామస్తులు మూకుమ్మడిగా తిరస్కరించి, సర్వేను అడ్డుకొని అధికారులను వెనక్కి పంపారు.

నల్గొండలో పంచింది 14,200 ఎకరాలు. 50% ఆ భూములు పేదల అనుభవంలో వున్నవే. మిగిలిన భూమి రాళ్ళు, రప్పలతో సాగుకు అనుకూలంగా లేదు.

(24-1-05 ఆంధ్రజ్యోతి)

వరంగల్ జిల్లాలో పంపిణీ చేసిన భూములలో సింహభాగం రాళ్ళూ రప్పలతో ఉన్నాయని ఫిర్యాదులొచ్చాయి. "ఆ భూములను తాను స్వయంగా పరిశీలించాలని, ఎయిర్‌పోర్ట్‌ను తలపించేలా సాగుకు నోచుకోకుండా ఆ భూములు ఉన్నాయని" క్రీడలు, సాంస్కృతిక శాఖామంత్రి ఎం.ఎస్. అంగీకరించటం గమనార్హం.

(24-8-05 ఆంధ్రజ్యోతి)

గుంటూరు జిల్లాలో మొత్తం 2500 ఎకరాలను పంపిణీచేసారు. పూర్వం నుండి సాగుచేసుకుంటున్న వారికే పట్టాలిచ్చారు. తాళ్ళూరు మండలం మందడం గ్రామంలో 250 ఎకరాలు, భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామంలో 134 ఎకరాలు ఇలాంటివే. ఈ భూములు సొసైటీ భూములు కావడం విశేషం (24.1.05 ఆంధ్రజ్యోతి)

ఖమ్మం జిల్లాలో పంపిణీకి సిద్ధం చేసిన 4200 ఎకరాల భూమి అంతా గతంలో పంచినవే. దీనిలో కొత్తగా పంచేభూమి లేకపోగా, గతంలో పంచిన భూకమతాలను తగ్గించి ఆ లబ్దిదారులకు ఇవ్వడానికే అధికారులు పూనుకొన్నారు. వారికి పట్టాదారు పాసుపుస్తకాలు, పట్టాలు వున్నప్పటికీ అవి రద్దుపర్చి మరల కొత్తగా పట్టాలు ఇవ్వాలని నిర్ణయించటం విడ్డూరంగా ఉంది.

(22-1-05 ఆంధ్రజ్యోతి)

ఈ విధంగా గతంలో ఇచ్చిన భూములనే మరల పంపిణీ చేసారు. "తొలివిడత భూ పంపిణీలో 50శాతం ఇదివరకే సేద్యం చేసుకుంటున్న వారికే పట్టాలు ఇచ్చామని, ఇందులో తప్పు పట్టడానికి ఏముందని" సమర్థించుకున్నారు. (15.1.05 ఆంధ్రజ్యోతి) ఇదిలా వుంటే రెండో విడత భూ పంపకాన్ని పురస్కరించుకుని హోంమంత్రి జానారెడ్డి మాట్లాడుతూ "భూ పంపిణీ కోసం అనేక మంది ఎదురుచూస్తుంటే, ఒకసారి పంపిణీ చేసిన భూమినే మళ్ళీ మళ్ళీ పంపిణీ చేస్తున్నామని, దీన్ని నివారించాలని" అధికారులను ఆదేశించారు (26.5.05 వార్త). భూ పంపిణీ పాలసీని లోపభూయిష్టంగా రూపొందించిన పాలకులు, అధికారులు, అందరికి తెల్సి ఆడుతున్న భూభాగోతంలో, రెండో విడతలో ఎన్ని సరిక్రొత్త అంకాలు వీక్షించాలో!

మొదటి విడతలో ప్రహసనంగా జరిగిన భూపంపకం వల్ల ప్రభుత్వం ప్రజలముందు అభాసుపాలైంది. ప్రధానితో ప్రారంభించిన రెండో విడత భూ పంపిణీలో కూడా లొసుగులు, వైఫల్యాలు పునరావృత్తమయ్యాయి.

కడప, జమ్మలమడుగు కేంద్రాల్లో ఎన్నో ఏళ్ళుగా రైతులు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ బంజరు భూములకే పట్టాలు అందజేసారు (28.8.05 ఆంధ్రజ్యోతి).

ఖమ్మం జిల్లాలో 4526 ఎకరాలను పంపిణీచేస్తుండగా, వాటిలో 4327 (97%) ఎకరాలు, తూర్పుగోదావరి జిల్లాలో 2714 ఎకరాలకు గాను 2645 (97%) ఎకరాలు, గుంటూరు జిల్లాలో 3861 ఎకరాలకుగాను 2801(71%) ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో 17,103 ఎకరాలకు గాను 13,215 (77%) ఎకరాలు సాగులోవున్న పాత భూములనే పంపిణీ చేసారు. (21.8.05 ఈనాడు)

రాష్ట్రంలో అత్యధికంగా మెదక్ జిల్లాలో 22వేల ఎకరాలు సేకరించారు. ఈ మొత్తం భూమిలో కొత్తవారు పొందే భూమి 6వేల ఎకరాలు మాత్రమే. అదికూడా అత్యధికులకు రాజకీయ అండవున్న వారికే భూమి ఇస్తున్నట్లు ఫిర్యాదులు వినవస్తున్నాయి. (1.8005 వార్త)

నెల్లూరు జిల్లాలో లక్ష్యాన్ని మించి 4334 మందికి 6302 ఎకరాలు పంపిణీ చేయాలని అధికారులు చేస్తున్న సన్నాహంలో ఆక్రమణలను క్రమబద్ధం చేయడమే ప్రధానంగా వుంది. (1.8.05 వార్త)

ప్రకాశం జిల్లాలో 15,280 ఎకరాలు భూమిని సేకరించి లబ్ధిదారులను ఎంపిక చేసారు. వారిలో 65వాతం మందికి గతంలో పంపిణీచేసిన వారికే పంపకం చేస్తున్నారు. కనిగిరి, అద్దంకి, పర్చూరు నియోజక వర్గాల్లో భూమి పొందిన వారిలో అత్యధికులు పాత వారే. (12.8.05 ఆంధ్రజ్యోతి)

చిత్తూరు జిల్లాలో భూపంపిణీకి 4105 ఎకరాలు సిద్ధం చేసారు. దీన్లో 3800 ఎకరాల భూమిని రైతులు సాగుచేసుకొంటున్నారు. కొత్తగా పంచింది మాత్రం 229 ఎకరాలు మాత్రమే. (27.8.05 ప్రజాశక్తి)

రెండవ విడత భూపంపిణీకి లక్ష ఎకరాలకు పైగా పంపిణీ చేయాలనుకుంటూ అందులో కొత్తగా భూములు పొందుతున్నవారు 10శాతంకి మించడం లేదంటే భూపంపిణీ ఏ తీరుగా వుందో అర్థం చేసుకోవచ్చు. "భూములకు హక్కులు కల్పించడమే ముఖ్యం తప్ప, ఆ భూములు పాతవా? కొత్తవా? అని ఇంకెప్పుడు అడుగవద్దని" విలేఖరులపై మండిపడ్డ రెవిన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు రెండవ విడతలో "సాగులో వున్న పాత భూములనే మరల పంచుతున్నట్టు" అంగీకరించారు (21-8-05 ఈనాడు). "గాలికి పోతే పేలపు పిండి కృష్ణార్పణం" అన్న చందంగా పేదలు చొరవతో, ఆందోళనలతో ఆక్రమించుకున్న భూములను క్రమబద్ధీకరించి పట్టాలిస్తున్నప్పుడు, లక్షల ఎకరాల భూమిని పంచుతున్నామని గప్పాలు కొట్టడం ఈ దళారీ పాలకులకే చెల్లింది.

అన్యాక్రాంత భూముల స్వాధీనంలో, మిగులు భూముల పంపిణీలో రెవెన్యూ యంత్రాంగపు కుట్రలు, మోసాలు

రాష్ట్రంలో మిగులు భూముల సేకరణ 1690 ఎకరాలకు మించలేదు. ప్రభుత్వం, అధికారులు నిమ్మకునీరెత్తినట్టుగా వుండడం చూస్తుంటే ఒక రాజకీయ నిర్ణయం ప్రకారమే భూస్వాముల స్వాధీనంలోని మిగులు భూముల జోలికి పోలేదని అర్థం అవుతుంది. కాగా మోషే ఆత్మహత్య ఉదంతం రెవెన్యూ అధికారుల ఆగడాలకు అద్దం పడుతోంది. కృష్ణాజిల్లా ముదినేపల్లి మండలం పెద్దపాల పర్రు గ్రామ నివాసి, దళిత పేద రైతు మోషే 1995 లో 21 సెంట్లు సీలింగ్ భూమి కొని దానిపై జీవనం సాగిస్తున్నాడు. భూమిని స్వాధీనం చేసుకునేందుకు గ్రామ కార్యదర్శి నోటీసు ఇచ్చాడు. ఆ పొలం దక్కాలంటే 10వేలు లంచం అడిగాడు. లంచం ఇచ్చుకోలేని మోషే తన పొలంలో నాట్లు వేసుకొంటుంటే అధికారులు అడ్డుకున్నారు. మనస్తాపానికి గురైన మోషే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భూస్వాములు అన్యాక్రాంతం చేసిన భూముల జోలికి పోని ఈ రెవెన్యూ అధికారులు మోషే వంటి బక్కరైతుపై వీరంగం చేయడం వారి ఆగడాలకు పరాకాష్టగా ఉంది.

కంకిపాడు మండలంలో మిగులు భూమి కేవలం 0.50 సెంట్లు మాత్రమే పంపకం చేసారు. వేల్పూరు గ్రామంలో ఈ భూమి సాగుచేసుకుంటున్న నల్గురికి కొత్తగా ఒకరికి పట్టాలిచ్చారు. ఆ లబ్ధిదారుల్లో కొత్త అతనికి 1 సెంటు భూమి మాత్రమే ఇచ్చారు. (26.1.05 ప్రజాశక్తి)

బంటుమిల్లి మండలం బండ్ల గూడెం, ముదినేపల్లి మండలం తైవాక గ్రామాల్లో 236 ఎకరాలు పెత్తందారైన బొల్లాసోదరులు ఆక్రమించారు. ప్రభుత్వం సర్వేచేసి 176.62 ఎకరాలను స్వాధీనం చేసుకొని అందులో 76 ఎకరాలు మాత్రం బండ్లగూడెం, రామవరపు మోడి గ్రామస్తులు 26 మందికి పంపిణీ చేసారు. కొండను తవ్వి ఎలకను పట్టినట్టుగా వుంది కదూ!

విసన్నపేట మండలం తెల్లదేవర పల్లి గ్రామ భూస్వాములు సీలింగ్‌లో ఉన్న భూమి 100 ఎకరాలను బినామీ పేర్లతో అనుభవిస్తున్నారు. దీనిపై స్థానిక పేదలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించటం లేదు.

ముసుమారు మండలం సూరంపల్లిలో 93లో దళితుల కిచ్చిన పట్టా భూములు 500 ఎకరాలు స్థానిక భూస్వాములు అనుభవిస్తున్నారు. దళితులకు సర్వే చేసి ఆ భూమిని అప్పగించదు. భూమి కోసం దళితులు ఆందోళన చేస్తున్నా పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం పూడిపర్తి గ్రామంలో 70 మంది గిరిజన కుటుంబాలకు 91.50 రూ॥లు విలువైన భూమిని పంచారు. కండలేరుక్రీకు సమీపంలో ఉన్న ఈ భూములు రొయ్యల పెంపకానికి అనువైనవి. దళారీలు సాగుకు పనికిరాని భూమని నమ్మించి ఎకరాకు 1-3 వేలు ముట్టజెప్పి వాళ్ళు మాత్రం 20-30 వేలు దండుకున్నారు. గత ఏడాది జిల్లా కలెక్టర్‌కు ఈ విషయం దృష్టికెళ్ళేసరికి గిరిజనులకు ఆ భూములు స్వాధీనం చేయాలని స్థానిక ఎమ్మార్వోను ఆదేశించారు. దీంతో ఆ భూములు కొన్న ఆసాములు గిరిజనులపై మూకుమ్మడి దాడిచేసి తీవ్రంగా కొట్టి భయభ్రాంతులను చేసారు.

మన రాష్ట్రంలోని107.05 హెక్టార్ల నికరసేద్యం భూమికి గత 50 సంత్సరాల కాలంలో బంజర్లు, ఇతర భూములుగా ప్రభుత్వం పంచింది కేవలం 14.20 లక్షల హెక్టార్లు. (ఆంధ్రప్రదేశ్ వ్యసాయంపై రైతుల కమీషన్ నివేదిక తెలుగు అనువాదం రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) ప్రచురణ) దీనితో ఇటీవల రెవెన్యూశాఖమంత్రి చెప్పినదాని ప్రకారం 40% భూమి 9/77 అన్యాక్రాంత నిరోధకచట్టం ఉన్నప్పటికీ ఉల్లంఘించబడి

మరల భూస్వాముల పెత్తందార్ల పరం అయింది. అంటే ప్రభుత్వం పంచినట్లు చెపుతున్న భూమినుంచి 5 లక్షల 68వేల హెక్టార్ల భూమి (13 లక్షల 90వేల ఎకరాలు) తిరిగి పెత్తందార్ల పరం అయింది. ప్రభుత్వం భూసంస్కరణల చట్టం పేర స్వాధీనం చేసు కొన్నట్లు చెప్పిన దానికన్నా ఎక్కువ భూమి భూస్వాములు, పెత్తందార్ల పరం అయింది. ఈ విధంగా భూస్వాముల చేతుల్లోంచి ప్రజలకి చేరిన దానికంటే పేదరైతాంగం, పేదలనుంచి తిరిగి భూస్వాములు, పెత్తందార్ల చేతుల్లో కేంద్రీకృతమయిన భూమి ఫ్నన్నోరేట్లు ఎక్కువ అని గమనించాలి. షెడ్యూలు ప్రాంతాలలోని గిరిజనేతర భూస్వామ్య వర్గం కబళించి నేటీకీ గిరిజనులకి దక్కకుండా చేస్తున్న 4 లక్షల ఎకరాల భూమి సమస్యను దీనితో కలిసి చూస్తే పరిస్థితి తీవ్రత అర్థం అవుతుంది.

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి చెప్పినట్లు "ఒకవైపు భూసంస్కరణలను, దున్నే వానికి భూమి పంపిణీ తన విధానాలుగా ప్రకటిం చడం; మరోవైపున గ్రామీణ ప్రాంతా లలో 10శాతంగా ఉన్న భూస్వాముల చేతుల్లో భూమి కేంద్రీకరణకే దారితీసే విధానాలను అనుసరించడం, ప్రభుత్వం ఈ కాలం అంతటా అనుసరిస్తున్న చీదరపుట్టించే మోసపూరిత విధానం". పేజీ 376 (తాకట్టులో భారతదేశం)

భూపంపకం అంటే ... !

పై వాస్తవాల్ని పరిశీలించినపుడు ప్రభుత్వం భూపంపిణీ కార్యక్రమాన్ని ఉద్దేశ్య పూర్వకంగా నీరు గార్చిందని స్పష్టమవుతోంది. భూపంపిణీ అనేది ఒకరికి ఉదారంగా, ఐచ్ఛికంగా ఇచ్చే భూబదలాయింపు మాత్రమే కాదు. భూమి ఉపాధి కల్పించే ఆర్థిక వనరు మాత్రమే కాక రాజకీయ, సాంఘిక హోదాను ఒకవర్గం నుండి వేరొక వర్గానికి దఖలు పర్చుతోంది. కాబట్టి పేదలు సొంత భూమి కల్గి ఉండడం అంటే ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా తగినంత అధికారం పొందినట్టే. భూమికి ఇంతటి ప్రాధాన్యత, విలువ ఉండడం వల్ల భూస్వాములు ఆ భూములను తమ గుప్పెట్లో వుంచుకొని పేద ప్రజానీకంపై దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. వారిపై అధికారాన్ని, పెత్తనాన్ని చలాయిస్తున్నారు. భూస్వాముల ప్రయోజనాలను పరిరక్షించే పాలకులు సహజంగానే భూ పంపిణీ సక్రమంగా, చిత్తశుద్ధితో చేపట్టరు. కాబట్టి పాలకులు చేపట్టిన భూపంపిణీ ప్రహసనంగా మారడంలో ఆశ్చర్యమేముంది? భూస్వామ్య, ధనిక, పెత్తందారీ వర్గాల అన్యాక్రాంతం కాబడిన మిగులు, బంజరు, దేవాలయ, ఇతరత్రా భూములు, అన్యాక్రాంతం కాని ఇతర భూములు వాస్తవంగా పేదలు సాధించు కోవాలంటే పోరాడి సాధించుకోవడం మినహా మరో మార్గం లేదు. పాలకులు భూసమస్య ఎజెండాలోంచి పోయిందని, దున్నే వానికే భూమి నినాదం కాలం చెల్లిపోయిందని ఎంత ప్రచారం చేసినా భూపోరాట వెల్లువ అలలు అలలుగా వస్తునే ఉంది. భూమికోసం ప్రజల డిమాండ్ ఉన్నది. కనుకనే ప్రభుత్వాలు యిలాంటి తతంగాలను నడుపుతున్నాయి.

ఇలాంటి స్థితిలో అమరుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి పాలకుల భూసంస్కరణల ప్రచార బండారాన్ని, వారి అసలు స్వభావాన్ని ఎండగట్టి చేసిన కర్తవ్య బోధనను గుర్తు తెచ్చుకొందాం.

"భూమి కోసం ప్రజలలో అప్రయత్నం గా పెల్లుబుకే డిమాండ్ భూసంస్కరణల పట్ల, బూర్జువా వర్గం ఎడల ప్రజలలో ప్రారంభమైన అసంతృప్తిని బయటపెట్టే అత్యంత ముఖ్యమైన లక్షణాలలో ఒకటి. భూమికోసం ప్రజలలో ఉన్న ఈ వెల్లువని, ఈ ఆర్థిక చైతన్యపు వెల్లువని రాజకీయవంతం చేయడానికి వినియోగించు కోవాలి. దానికై సర్వశక్తులను మలచాలి. అయితే ఇదేలా చేయాలి? బూర్జువా వర్గ ప్రభావంలో నుంచి వారు విముక్తు లయ్యేలా దీనిని ఎలా పూర్తి చేయాలి? వ్యవసాయక విప్లవం ఆవశ్యమన్న చైతన్యాన్ని వారిలో ఎలా కల్గించాలి? దున్నేవానికే భూమి అన్న నినాదాన్ని గుర్తించి, దాన్ని పదే పదే వల్లించడమా? అంటే ఆందోళనతో, పరిమిత పోరాటంతో ప్రస్తుత ప్రభుత్వమూ, అనాటి యజమాని వర్గాలు దున్నేవానికే భూమి నిస్తాయని భ్రమలు కల్పించి ప్రజలను మోస గించడమే. వ్యవసాయకూలీ, పేదరైతాంగ జన బాహుళ్యానికి సంతృప్తి కలిగేలా భూస్వామ్య విధానాన్ని పాలకులు రద్దుచేయడానికి అవి (పరిమిత పోరాటాలు) చాలునని చెప్పి ప్రజల ను మోసగించడమే. అలాంటి వంచనకన్న హానికరమైంది ఏదీ లేదు. ప్రజలలో గల ఈ వాంఛల ఆధారంగా వారిని భూ పంపకపు, విప్లవ చర్యలకు ఉత్తేజితుల్ని చేయడం; ప్రజల చొరవను, శక్తిసామర్థ్యాలను ఉత్తేజితం చేయడం విప్లవకారుల కర్తవ్యం". (తాకట్టులో భారతదేశం పేజీ 482)

ఈ కర్తవ్య నిర్వహణ కోసం సామాజిక చోదకశక్తులు, రైతుకూలీ ఉద్యమ కార్యకర్తలు ప్రజలను ఆర్గనైజ్ చేయాలి. ☆

పాలేరు పాట

- చెరబండరాజు

కాడి నీదిగాదు కాడెద్దు నీదిగాదు
కర్రు నీదిగాదు ములుగర్ర నీదిగాదు
నాగళ్ళ మాటలేల రేగళ్ళ మాటలేల

పుల్లెద్దు నీదిగాదు బొల్లెద్దు నీదిగాదు
దొడ్డి నీదిగాదు గడ్డివాము నీదిగాదు
నాగళ్ళ మాటలేల రేగళ్ళ మాటలేల

గట్టు నీదిగాదు ఏ చెట్టు నీదిగాదు
చాట నీదిగాదు ఏ తోట నీదిగాదు
నాగళ్ళ మాటలేల రేగళ్ళ మాటలేల

బావి నీదిగాదు కోనేరు నీదిగాదు
పాడి నీదిగాదు ఏ పంట నీదిగాదు
నాగళ్ళ మాటలేల రేగళ్ళ మాటలేల

వానల్లు నీవిగావు కాల్వల్లు నీవిగావు
కొడవళ్లు నీవిగావు కోతల్లు నీవిగావు
నాగళ్ళ మాటలేల రేగళ్ళ మాటలేల

మబ్బులు నీవిగావు కార్తెల్లు నీవిగావు
కంచెల్లు నీవిగావు కళ్లాలు నీవిగావు
నాగళ్ళ మాటలేల రేగళ్ళ మాటలేల

కుక్కిన పేనోలె నీవు కూర్చుంటే ఇంతేరా
నువ్వులేనిదే నువ్వుగింజయినా మొలవదనీ
కూలిగాదు పాలంమీద అధికారం అందరిదని

కలిసికట్టుగా నడిచీ తిరగబడీ పోరాడితె
నాగలేమి రేగడేమి అప్పుడసలె వుండవురా

"దున్నేవాడికే భూమి పంపకం చేయాలి"

జయతీఘోష్ అధ్యక్షతన వ్యవసాయ కమిషన్ నిర్వహించిన సమావేశానికి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) తరపున సహాయ కార్యదర్శి జె.కిషోర్‌బాబు పాల్గొని సూచనలందజేశారు. దాని పూర్తిపాఠాన్ని ఇస్తున్నాము.

కమీషన్ గౌరవనీయ అధ్యక్షులు, సభ్యులకు,

ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న ఆత్మహత్యలూ, మూత్రపిండాల అమ్మకాలు వ్యవసాయరంగంలో నెలకొన్నలోతైన సంక్షోభానికి వ్యక్తీకరణలు. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యూటివోలు రూపొందించిన ప్రపంచీకరణలో భాగంగా 1990లలో అమలవుతున్న సరళీకరణ, ఆర్థిక పునర్నిర్మాణ విధానాల నేపథ్యంలో 1997 నుండీ ఈ సంక్షోభం సాగుతున్నది. సబ్సిడీల తగ్గింపుతో ధరలు పెరిగి లేదా తగ్గటం జరుగుతున్నది. సరళీకరణతో కల్తీ పురుగుమందులు, విత్తనాలు, ఎరువుల సరఫరా అదుపు లేకుండా సాగుతున్నది. ప్రభుత్వం దీన్ని అదుపు చేయటం లేదు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి మదుపు తగ్గిపోతుండగా, అన్ని ప్రభుత్వశాఖలలోనూ ఉద్యోగులను తగ్గించటంతో నిధుల కేటాయింపులు తగ్గిపోతున్నాయి. అధికారిక పర్యవేక్షణ దాదాపు లేకుండా పోతున్నది. ఈ మొత్తం కలిసి లోతైన సంక్షోభానికి దారితీసాయి. దీనిని సరిచేసేందుకు తక్షణమే విధానపర మార్పులు, వ్యవస్థాగత సంస్కరణలు చేపట్టవలసి వుంది.

ఈ వ్యవస్థ నుండి రైతాంగానికి మేలు జరిగేందుకు కృషి చేస్తున్న రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) కమీషన్ పరిశీలన కోసం యీ క్రింది సూచనలనూ, చర్యలనూ అందజేస్తున్నది.

1. భూసంస్కరణలు

వ్యవసాయానికి భూమి ప్రధానం. దున్నేవానికి భూమితో వున్న సంబంధమే వ్యవసాయాభివృద్ధిలో కీలకమైనది. నేటి భూమి యాజమాన్య వ్యవస్థ దున్నేవాని నుండి అదనపు విలువను పిండివేసి నగరాలకు తరలిస్తున్నది. దానితో భూమి అభివృద్ధికి దున్నేవాని వద్ద పెట్టుబడి లేకుండా పోతున్నది. చాలా పరిమితుల్లో సాగిన చట్టాలు మధ్య దొంతరలను రద్దు చేసాయిగానీ దున్నేవానికి భూమినందజేయలేదు. అధిక కౌలు కూడా కౌలుదారులకు కనీస ఆదాయాన్నే యిస్తున్నది.

1.1 భూ పరిమితి చట్టాల సమగ్ర సమీక్ష జరపాలి.
1.2 బినామి ట్రాన్స్‌ఫర్‌లను సర్వే చేసి తేల్చాలి.
1.3 భూపరిమితి చట్టాలను అమలు జరిపి భూ సంస్కరణలు అమలు చేయాలి.
1.4 కౌలుదారులను రిజిష్టరు చేసి రక్షణ కల్పించాలి.
1.5 దేవాలయ భూములను గ్రామీణ పేదలకు కౌలుకివ్వాలి
1.6 బంజరుభూములను గ్రామీణ పేదలకు పంచాలి.
1.7 సమగ్రభూమి వినియోగ పథకాన్ని రూపొందించాలి.
1.8 1/70 రెగ్యులేషన్ ఖచ్చితంగా అమలు జరిపి ఆదివాసీ భూములను వారికి అప్పగించాలి.
1.9 అడవిపైనా, అటవీసంపదపైనా ఆదివాసుల సహజ హక్కును గౌరవించాలి.
1.10 ఏజెన్సీ ప్రాంతాల్లో అంతర్జాతీయ, భారత స్వార్థపరవర్గాల చొరబాటును ఆపాలి.

2. సాగునీరు

వ్యవసాయాభివృద్ధికి సాగునీరు కీలకమైనది. అపరిమిత నీటి వనరులూ, విశాల సారవంత భూములు గల భారత్‌లో వ్యవసాయ అవసరాలకు సాగునీటి సరఫరాకు కేంద్రీకృత అధికారిక వ్యవస్థ అవసరమౌతుంది. భూయాజమాన్యానికి, సాగునీటికీ మధ్యగల అంతఃసంబంధాన్ని కూడా వదలి వేయలేము. ప్రపంచబ్యాంకు సూచనలకు భిన్నంగా, భూ సంస్కరణలనూ, పంచాయితీ స్థాయిలో ప్రజాస్వామికంగా నీటి పారుదల నిర్వహణనూ జోడించినప్పుడే వ్యవసాయాభివృద్ధి సాధ్యమౌతుంది. దేనికి దానికి విడిగా చేసే ప్రయత్నాలు గ్రామీణ భారతంలో ఉన్నవారికీ, లేని వారికీ మధ్య అగాధాన్ని పెంచుతాయి. ఈ విషయంలో శాస్త్ర పరిజ్ఞానానికి ముందు పీటవేయాలి.

2.1 సమగ్రనీటి వినియోగ పథకాన్ని రూపొందించాలి.
2.2 నీటి ప్రైవేటీకరణను ఆపివేయాలి.
2.3 పెండింగ్ ప్రాజెక్టులను ఐదేళ్ళలో పూర్తి చేయాలి.

3. రుణ సమస్యలు

దీనికి కారణాలు అనేకం; అందరికీ తెలిసినవే. ప్రధానమైనవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు. ప్రస్తుత పరిస్థితిలో కనీస సహాయంగా ఈ క్రింది చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

3.1. రాజ్యాంగం ప్రకారం రుణవిమోచన రాష్ట్రాలకు చెందినది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంతో ఈ రాష్ట్రాల హక్కును కేంద్రం కత్తిరించింది. పూర్వ యథాస్థితిని నెలకొల్పాలి. దీనిలో కేంద్రం జోక్యం ఉండరాదు.

3.2 అప్పులలో కూరుకుపోయిన రైతాంగానికి వడ్డీ, అపరాధ వడ్డీ ఎన్నో రెట్లు ఎక్కువగా వుంది. కనుక ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) వ్యవసాయదారుల సహాయచట్టం, 1938లోని సెక్షను 9,13ల ప్రకారం అన్ని రుణాలను నియంత్రించాలి. దీనర్థం అప్పులన్నింటినీ 5 శాతం సాధారణ వార్షిక వడ్డీరేటు, ఇప్పటివరకు అదనంగా కట్టిన వడ్డీని అసలులో తీసివేసి, ఇంకా మిగిలి వుంటే దానిని చెల్లించవలసిన రుణంగా లెక్కగట్టాలి.

3.3. 5 ఎకరాల మాగాణి, 10 ఎకరాల మెట్టలోపు వుండే రైతులందరికి రుణాలనూ – ప్రైవేటు వడ్డీ వ్యాపారులవైనా, ఉత్పాదకాల వ్యాపారులవైనా, సహకార సంస్థలతో సహా ప్రభుత్వ ద్రవ్య సంస్థలవైనా – మాఫీ చేసి తక్షణ ఉపశమనం కలిగించాలి.

3.4 రైతులకు అవసరమైన పరపతి సౌకర్యాలను పూర్తిగానూ, సరైన సమయంలోనూ అందజేసేందుకు ప్రభుత్వ ద్రవ్య సంస్థలను బలీయం చేయాలి.

3.5 5 శాతం వార్షిక సామాన్యవడ్డీ

3.6 చెల్లింపుకిస్తీని మొదట అసలులో నుండి తగ్గించాలి. వడ్డీకి చెల్లు వేయరాదు.

3.7 అపరాధ వడ్డీ విధింపును అపాలి.

3.8 రుణవసూలుకు రైతాంగపు ఉత్పాదక స్థిర, చరాస్తులను జప్తుచేయరాదు.

3.9 విద్యుత్తు సరఫరా లోపాలకు ట్రాన్స్‌కోను బాధ్యురాలిని చేయాలి. విద్యుత్తు సబ్సిడీని కొనసాగించాలి.

4. విత్తనాలు

బహుళజాతి కంపెనీల, వ్యాపారుల కల్తీ విత్తనాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫల మైంది. పంట నష్టానికి ఇదొక ప్రధాన కారణం. కొన్ని సందర్భాలలో కల్తీ విత్తనాలే కరువుల కంటే ఎక్కువ వినాశనకరంగా వున్నాయి. ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

4.1 విత్తన సరఫరాను ప్రభుత్వం చేపట్టాలి.

4.2 విత్తన రంగం నుండి బహుళజాతి కంపెనీలను తొలగించాలి.

4.3 సీడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌ను మూసివేసే చర్యలను ఆపివేయాలి.

4.4 సరియైన ధరకు విత్తన సరఫరా కోసం పరిశోధనా సంస్థలు రైతాంగంలో సమన్వయం సాధించాలి. రైతుల స్థాయిలో వారి పొలాలలోనే విత్తన తయారీ సాగేలా, తల్లి, తండ్రి రకాలను నేరుగా రైతాంగానికే సరఫరా చేసి వారికి శిక్షణనందించాలి.

5. ఎరువులు

ఎరువుల వినియోగంలో శాస్త్రీయ పద్ధతిని ప్రోత్సహించటానికి ఈక్రింది చర్యలు తీసుకోవాలి.

5.1 ప్రభుత్వ భూసార పరీక్షా కేంద్రాలను విస్తృతపరిచి నాణ్యమైన సేవలనందించాలి.

5.2 పచ్చిరొట్ట విత్తనాలు, జీవన ఎరువులు, సూక్ష్మపోషకాలు మొదలగు వాటిని ప్రోత్సహించి సమగ్ర పోషక నిర్వహణను పెంపొందించాలి.

5.3 ఎరువుల సబ్సిడీలను కొనసాగించాలి. ఇది రైతులకు ఉపశమనమే కాక, ప్రజలకు ఆహార ధాన్యాలు అందుబాటు ధరలలో లభ్యమయ్యేలా చేస్తుంది.

6. సస్యరక్షణ మందులు

6.1 సమగ్ర సస్య రక్షణ చర్యలను ప్రోత్సహించాలి

6.2 కల్తీమందుల నివారణకు మార్కెట్టులో ప్రవేశపెట్టే ముందుగా వాటి ప్రభావాలను వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ధృవీకరించాలి. దీని కోసం ప్రత్యేక కఠినతర చట్టాన్ని చేయాలి.

6.3 మందు డబ్బాపై ఫ్యాక్టరీ ధర, పన్నులు, గరిష్ట అమ్మకం ధరలను ముద్రించటం చట్టబద్ధ చర్యగా చేయాలి.

7. మార్కెట్ల సమస్యలు

వ్యవసాయ వ్యయం, ధరల కమీషన్ నిర్ణయిస్తున్న ప్రొక్యూరుమెంటు ధరలు గిట్టుబాటుగా లేవు. అన్ని వ్యవసాయ ఉత్పత్తుల టోకు ధరలు వ్యాపారుల చేతిలో విపరీత ఎగుడు దిగుళ్ళకు లోనవుతున్నాయి. ఇది రైతులకు రావాల్సిన ఆదాయాన్ని పట్టపగలే దోచుకోవటమే. భవిష్యవాణిజ్యం ఈ చట్టా వ్యాపారులను బలీయం చేస్తుంది. ఎఫ్‌సిఐ వంటి సంస్థలను మార్కెట్టు నుండి తప్పించడం కూడా ఈ చట్టా మార్కెట్టు శక్తులకే రైతాంగం లొంగిపోయేట్లు చేస్తున్నది.

7.1 ఎఫ్‌సిఐ తదితర సంస్థలను పటిష్టం చేసి పెద్ద ఎత్తున ప్రొక్యూరు మెంటును చేపట్టాలి.

7.2 ఒక్కో సరుకువారిగా సహకార సమాఖ్యలను అన్నిస్థాయిలలో ఏర్పరచి ప్రపంచ మార్కెట్ శక్తుల నుండి జాతీయ ప్రయోజనాలను రక్షించాలి.

7.3 వ్యవసాయ ఉత్పత్తుల్లో భవిష్య వాణిజ్యాన్ని అనుమతించరాదు.

7.4 వివాద పరిష్కారం కమిటీలు ఏర్పాటు చేయకపోవటం, కమీషన్ ఏజంట్లు, వ్యాపారుల కుమ్మక్కు, తప్పుడుతూకాలు, గోదాముల సౌకర్య కల్పనలేమి మొదలగు అన్ని లోపాలను సరి దిద్దుతూ ఆంధ్రప్రదేశ్ మార్కెట్ చట్టం 1966 ను సవరించాలి.

8. పరిశోధన

8.1 రైతుల అవసరాలకు స్పందించే విధంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాలను మార్చాలి.

8.2 కొత్త సాంకేతిక పరిజ్ఞాన సృష్టితోపాటు దానిని రైతాంగానికి అందజేసే వ్యూహం కూడా వీటికి ఉండాలి.

8.3 కాంట్రాక్టు సేద్యం విధానాన్ని ఆపివేయాలి. అన్ని ప్రభుత్వ శాఖలను రైతుల అవసరాలకు తగిన విధంగా పునఃసంస్కరించాలి.

9. వ్యవసాయ కూలీలు

9.1 నిర్దిష్ట పరిపాలనా వ్యవస్థతో కనీసం వేతన చట్టాన్ని అమలు చేయాలి.

9.2 యంత్రాలు, కాంట్రాక్టర్లు లేకుండా శ్రమ ముఖ్యంగా ఉపాధి కల్పన పనులు చేపట్టాలి.

9.3 మిగులు భూములను వ్యవసాయ కూలీలకు పంచాలి.

9.4 చౌకధరల దుకాణం ద్వారా ఆహార ధాన్యాలు,ఇతర అత్యవసర సరుకుల సరఫరాను కొనసాగించాలి.

9.5 వైద్య-ఆరోగ్య సేవలతో పాటు సమగ్ర సంక్షేమ పథకాన్ని అమలు చేయాలి.

10. స్వావలంబన నుండి ప్రపంచీకరణపై ఆధారపడే వైపుగా జరిగిన విధానపర మార్పులే వ్యవసాయరంగంలో ప్రస్తుత సంక్షోభానికి మూలకారణం. ఇది వ్యసాయం పై ఆధారపడిన ప్రజలను దారిద్ర్యంలో ముంచి, వారిని భూమి నుండి తొలగిస్తుంది. కాగా ఉత్పత్తికి ఆధారమైన భూమి,నీరు కొద్ది మంది గుత్తాధిపత్యంలోకి పోతాయి. తక్షణమే ఈ విధానాలను ఆపివేయాలి. దేశ ప్రయోజనాలను, భారతప్రజల ప్రయోజనాలను రక్షించేందుకు ఇది అవసరం.

హైద్రబాదు,
28-10-04.

అధ్యక్షులు
ఎస్.ఝాన్సీ

కార్యదర్శి
కె. కోటయ్య

సహాయ కార్యదర్శి
జె.కిషోర్‌బాబు

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)

జిల్లా మహాసభల రిపోర్టులు

"సహజ వనరుల్ని కొల్లగొడుతున్న సామ్రాజ్యవాదుల, బహుళ జాతి సంస్థల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుదాం!" అని పిలుపునిచ్చిన శ్రీకాకుళం జిల్లా మహాసభ

రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా ఎన్నో వీరోచిత ఉద్యమాలకు పుట్టిల్లు. చారిత్రాత్మక మైన రైతు రక్షణయాత్ర నుంచి, శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటం వరకూ; నాటి నుంచి నేటి వరకు ఎన్నో మజిలీలతో రైతు కూలీ ఉద్యమం సాగుతున్నది. పాలకులు, సామ్రాజ్యవాదుల కనుసన్నలలో ఎన్ని జీవ నదులున్నా ఉత్తరాంధ్ర జిల్లాలను చౌక కూలీలను సరఫరాచేసే ప్రాంతాలుగానే ఉంచారు. ఇన్నేళ్ళైనా శ్రీకాకుళం జిల్లాలోని తోటపల్లి, వంశధార ప్రాజెక్టు పథకాలు పూర్తి కాకపోవడం; వెనుకబడిన జిల్లాల పారిశ్రామి కాభివృద్ధి పేరుతో తెస్తున్న రసాయనిక, మందుల కంపెనీలు స్థానిక ప్రజలకి ఉపాధి చూపకపోగా కాలుష్యంను వెదజల్లుతున్న పరిస్థితి ఉంది. ఈ సమస్యలను ప్రతిబింబిస్తూ శ్రీకాకుళం జిల్లా రైతుకూలీ సంఘం మహా సభ 8-11-04న శ్రీకాకుళంలో బాపూజీ కళామందిరంలో జరిగింది.

మహాసభ ప్రారంభానికి ముందు ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం జంక్షన్‌లోని శ్రీకాకుళ గిరిజన ఉద్యమ అమరవీరుల స్థూపం ముందు మహాసభలకు వచ్చిన ప్రతి నిధులు, నాయకులు నివాళులు అర్పించారు. శ్రీకాకుళ అమరుల పోరాటస్ఫూర్తిని కొనసాగి స్తామని ప్రతినబూనారు. అనంతరం బాపూజీ కళామందిర్‌లో జరిగిన జిల్లా మహాసభలో జిల్లా కార్యదర్శి కా॥ టి. ప్రకాష్ పతాకావిష్కరణ చేశారు, అధ్యక్షతన వహించారు. ప్రారంభోప న్యాసకులుగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ తన ఉపన్యాసంలో నవంబరు నెలకున్న ప్రాధాన్యతను వివరించారు. మహత్తర రష్యా విప్లవం ప్రపంచగతిని మార్చివేసిన క్రమాన్ని; ఒక మనిషి మరో మనిషిని దోచుకునేందుకు వీలులేని సమాజాన్ని నెలకొల్పిన తీరును గుర్తుచేశారు. జిల్లా ఉజ్వల పోరాటాల చరిత్రను, ఎందరో వీరుల బలిదానాలను స్మరిస్తూ వారిందరికీ జోహార్లు తెలిపారు. ఎన్నో నీటి వనరులున్నా కరువు పీడిత ప్రాంతంగా శ్రీకాకుళం జిల్లా ఉండిపో తున్న స్థితిని; దీనికి వ్యతిరేకంగా రైతుకూలీ సంఘం, రైతాంగం చేస్తున్న పోరాటాన్ని వివరించారు. తెలంగాణా, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజలు ఎదుర్కొంటున్న వెనుకబాటుతనం, సమస్యలు పాలకుల విధానపరమైన సృష్టేనని దుయ్యబట్టారు. మరోపక్క ఉన్న సహకార చక్కెర కర్మాగారాలను మూతపడేలా చేసి, బడా వ్యాపారులకు అమ్మజూస్తున్న ప్రభుత్వ విధానాలను వివరించారు. మౌలికమైన అభివృద్ధి ఏదీ జరగ కుండానే శ్రీకాకుళం జిల్లాలో పెరిగిపోతున్న భూముల రేట్ల వెనుక ఉన్న మర్మమేమిటని ప్రశ్నించారు. వ్యవసాయేతర సంపన్న వర్గాలు, కోటీశ్వరులు, అధికారులు వందలాది ఎకరా లను కొనుగోలు చేస్తున్నారని; ఈ గైరుహాజరీ భూస్వామ్య విధానం గ్రామ జీవితాలకి ఉపద్రవంగా ఉందని; దీనికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తీరప్రాంతంలో మత్స్యకార జీవన విధానంను దెబ్బతీస్తూ పాలకులు తెచ్చిన ఆక్వా సాగు మరలా ఎంత సంక్షోభానికి కారణమయిందో వివరిస్తూ; ఈ వ్యవస్థలో సంక్షోభమే శాశ్వతమని, పోరాటమే దానికి పరిష్కారమని వివరించారు. ఈ "గడ్డమీద నిలబడి, ఈ నీరు, ఈ భూమి, ఈ వనరులు మావి" అని పోరాడాలన్నారు. "మందస రైతాంగ పోరాట చరిత్ర ఉన్న మనం; వీరోచిత శ్రీకాకుళం గిరిజన పోరాట చరిత్ర ఉన్న మనం; ఈ వ్యవసాయ సంక్షోభం నుంచి బయటపడటానికి బలమైన ఉద్యమాలను నిర్మించి; పోరాటాల పురిటిగడ్డ అని నిరూపిం చాలని" పిలుపునిచ్చారు.

ప్రతినిధుల సభకి కామ్రేడ్స్ నీలం రాజు, యన్. భాస్కరరావు, బి. భాస్కరరావులు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. జిల్లా కార్యదర్శి కా॥టి. ప్రకాష్ కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్న అనంతరం మహాసభ 14 తీర్మానాలు చేసింది. అవి 1) తోటపల్లి, వంశధార రిజర్వాయర్ల నిర్మాణాలు, జంపకోట ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయాలని 2) తీరప్రాంత అటవీ బంజర్లను మత్స్యకార బడుగుజీవులకు పంపకం చేయాలని 3) దేవాదాయ, బంజరు, పోరంబోకు సీలింగు భూములు పంపకం చేయాలని 4) 1/70ని అమలుజరిపి గ్రామసభల అధికారా లను గుర్తించాలని 5) ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, మందస, ములియపుట్టి, సారవకోట, గంజాం, సంతకవిటి మొ॥ మండలాలను కరువుప్రాంతాలుగా ప్రకటించాలని 6) కనీస వేతనాల చట్టాన్ని అమలుచేసి పనికి ఆహార పథకం అమలుచెయ్యాలని 7) ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు తెరచి మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని 8) వెనుకబడిన జిల్లా పేరుతో వస్తున్న రసాయనిక కర్మాగారాలు ఉపాధి ఇవ్వకుండా, కాలుష్యాన్ని నియంత్రించకుండా ప్రజలని అనారోగ్యానికి గురిచేస్తున్న తీరుకి వ్యతిరేకంగా పోరాడాలని 9) ఆముదాలవలస కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ అమ్మకాన్ని నిలుపుచేసి పునరుద్ధరిం చాలని 10) అరబిందో ఫార్మాస్యుటికల్స్ కార్మికుల సంఘం పెట్టుకొనే హక్కుపై యాజ మాన్యాల కక్షసాధింపు చర్యలను ఖండించాలని 11) శ్రీకాకుళంలో జరిగిన బ్లాస్టింగ్‌లో చనిపోయిన వారికి నష్టపరిహారం ఇచ్చి అసలు కారకులను సమగ్ర దర్యాప్తు చేసి శిక్షించాలని 12) పేదల ఇళ్ల పట్టాలపై అవకతవకలను విచారించాలని 19) ధాన్యం రైతులను మోసగి స్తున్న ధాన్యం దళారీలపై చర్యలు తీసుకోవాలని తీర్మానించింది.

అనంతరం పట్టణంలో ప్రదర్శన జరిగింది. తప్పెటగుళ్ళు, అరుణోదయ కళా కారుల ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కా॥ నీలంరాజు అధ్యక్షత వహించిన సభలో కామ్రేడ్స్ ఝాన్సీ, జనసాహితీ రాష్ట్ర నాయకులు ఏ. అప్పలనాయుడు, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు టి.అరుణ, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి టి.ప్రకాష్, విజయనగరం జిల్లా కార్యదర్శి డి.వర్మ, ఏ.పి.టి.ఎఫ్ నాయకులు భానుమూర్తి తదితరులు ప్రసంగిం చారు. జిల్లా కమిటీ సభ్యులు ఎన్. వెంకట్రావు వందన సమర్పణతో సభ ముగిసింది. ☆

దున్నేవానికే భూమి హక్కును సాధించే వ్యవసాయక విప్లవ ఉద్యమ లక్ష్యాల కోసం సాగుదాం విజయనగరం జిల్లా మహాసభల పిలుపు

గత 14 సంవత్సరాలుగా విజయనగరం జిల్లా రైతుకూలీ, గిరిజన, దళిత, పీడిత ప్రజలను నిరంతరం పోరాటంలోకి సమీకరిస్తూ; నిరంతరం భూస్వాముల, ప్రభుత్వ నిర్భంధకాండను ఎదుర్కొంటూ సాగుతున్న క్రమంలో జిల్లా మహాసభలు 2004 అక్టోబరు 11,12 తేదీలలో పార్వతీపురంలో జరిగాయి.

అక్టోబరు 11వ తేదీన పార్వతీపురం అంతా ఒక ఉత్సాహపూరిత వాతావరణం నెలకొని ఉంది. దీనికి నెల రోజులుగా కార్యకర్తలు 10 వేల కరపత్రాలు ముద్రించి గ్రామ గ్రామాన ప్రచారం చేశారు. సమావేశాలు, గ్రూపు మీటింగులు నిర్వహించారు. ఈ ప్రచార కృషి ఆంధ్రా, ఒరిస్సా ప్రాంతాలు రెండింటిలో జరిగింది. ఫలితంగా 11వ తేదీ ఉదయం నుంచి వేలాదిమంది పార్వతీపురంకి తరలి వచ్చారు. వేలాదిజనం పార్వతీపురంను ముంచెత్తారు. కళాకారుల కళాప్రదర్శనలు, కిందిరి నృత్యాలు, తుడుందరువులతో ఉత్తేజకరమైన, ఉత్సాహకర వాతావరణంలో ప్రదర్శన, బహిరంగసభ ప్రారంభమైనాయి. గత 20 సంవత్సరాలలో ఇంతటి ప్రదర్శన జరగలేదని పట్టణ ప్రజలు భావించారు. బహిరంగసభ ప్రారంభమయ్యేసరికి మబ్బులు కమ్మి వర్షం ప్రారంభమైంది. ఎంత వర్షం పడినా సభ జరుగుతుందని నాయకులు ప్రకటించడంతో జనం అంతా బహిరంగ సభకి సిద్ధపడ్డారు. అమరవీరుల స్థూపంపై రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥కోటయ్య పూలమాలవేసి అమరవీరులకు నివాళి తెలిపారు. కామ్రేడ్ మోనంగి భాస్కర రావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్స్ సింహాద్రి ఝాన్సీ, రాష్ట్ర కార్యదర్శి కోటయ్య, సి. హెచ్. ప్రభాకర రావు(ఎపిటిఎఫ్), అట్టాడ అప్పలనాయుడు (జనసాహితి) తదితరులు ప్రసంగించారు. జోరున వర్షం కురుస్తున్నా లెక్కచేయక ప్రజలు ఉపన్యాసాలన్నీ విన్నారు.

12వ తేదీ ఉదయం ప్రారంభ సభ జరిగింది. రైతుకూలీ సంఘం పతాకాన్ని జిల్లా కార్యదర్శి డి. వర్మ ఎగురవేసారు. అనంతరం నాగార్జున యూనివర్శిటీ ప్రొఫెసర్ అబ్దుల్‌నూర్ భాషా తన ప్రారంభోపన్యాసంలో వ్యవసాయ రంగ సంక్షోభ తీవ్రతలను వివరించారు. బ్రిటీష్ వాడి వలస దోపిడీకన్నా నేటి అమెరికా నయా వలస దోపిడీ మరింత తీవ్రంగా ఉందని; ఆహార ధాన్యాల ఉత్పత్తిని తగ్గించి రొయ్యలు, పూల తోటలు, పండ్ల తోటలు వైపు నెడుతున్నారని; ఇప్పటికే 20 లక్షల ఎకరాల వరిసాగు మాయమైందని వివరిస్తూ; ప్రజలు ప్రతిఘటించాలని కోరారు. ప్రారంభసభకి అధ్యక్షత వహించిన కా॥వర్మ జిల్లాలో భూసమస్య తీవ్రతను వివరిస్తూ దేవాదాయ భూములు, బంజరుభూములు, భూస్వాములు, పెత్తందార్ల చేతుల్లో ఉన్నాయని చెప్పారు. అనంతరం కా॥బొత్స నరసింగరావు అధ్యక్షత వహించిన "వ్యవసాయరంగం సంక్షోభం-పరిష్కారాలు" అనే అంశంపై కా॥కోటయ్యగారు ప్రసంగిస్తూ విత్తనాలు, ఎరువులలో సామ్రాజ్యవాదుల దోపిడీని, పెరుగుతున్న భూకేంద్రీకరణలను వివరించారు. సంఘటిత పోరాటాల అవసరాన్ని వివరించారు. అనంతరం జరిగిన "గిరిజన భూపరాయీకరణ - ప్రభుత్వ విధానాలు" అనే అంశంపై గిరిజన గిరిజనేతర పేదల హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ ఊయక ముత్యాలు అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ ప్రసంగించారు. శ్రీకాకుళ గిరిజనుల వీరోచిత పోరాటాల ఫలితంగా పాలకులు ప్రకటించిన చట్టాలను, వాటి అమలు తీరుని సమీక్షించారు. జీవించే హక్కుకోసం పోరాటం తప్ప గిరిజనుల ముందు ఏ మార్గంను పాలకులు మిగల్చలేదని; ఆదివాసు లను గెంటివేసి; ప్రతిఘటించిన వారిని కాల్చి చంపి సామ్రాజ్యవాదులకి, భూస్వాములకి భూములను కట్టబెట్టాలని ప్రభుత్వం ఉందని; ప్రతిఘటించాలని; ప్రతిఘటిస్తానే పురోగమించాలని పిలుపునిచ్చారు.

అనంతరం జరిగిన ప్రతినిధుల సభ 500 మందితో జరిగింది. జిల్లా కార్యకలాపాల నివేదికను కార్యదర్శి డి. వర్మ ప్రవేశపెట్టారు. సభ చర్చించి ఆమోదించిన అనంతరం రైతుకూలీ సంఘం జిల్లా కమిటీని సభ ఏకగ్రీవంగా ఎన్నుకొంది. కామ్రేడ్స్ తాండ్ర అరుణ గౌరవ అధ్యక్షులుగా, గంటి ఎరుకనాయుడు అధ్యక్షులుగా, బొత్స నరసింగరావు ఉపాధ్యక్షులుగా, డి. వర్మ కార్యదర్శిగా, మోనంగి భాస్కరరావు సహాయ కార్యదర్శిగా, పువ్వుల సుందరం దొర కోశాధికారిగా 17 మందితో కమిటీని ఎన్నుకొంది.

అనంతరం జిల్లాలోని ఇటు మైదానం, అటు ఏజన్సీ ప్రాంతాల్లో ఇటీవల కాలంలో భూముల కొనుగోళ్ళ పేరుతో భూ పరాయీకరణ పెరిగిపోతున్నదని; స్థానిక భూస్వామ్య శక్తుల తోపాటు వలసవచ్చిన భూస్వామ్యశక్తులు, కార్పోరేట్ సంస్థలు, వందల ఎకరాలను కొనుగోలు చేస్తున్న తీరును; గిరిజన, చిన్న, మధ్యతరగతి రైతులను బలహీనులుగా మారుస్తున్న క్రమంను; మహాసభ తీర్మానం రూపంలో ఎత్తిచూపింది. దీనికి వ్యతిరేకంగా రైతుకూలీలు ఉద్యమించాలని; అదేవిధంగా బంజరు, దేవస్థానం భూములు కలిగి ఉంటున్న భూస్వామ్య పెత్తందార్లకు వ్యతిరేకంగా భూపోరాటాలను ముందుకు తీసుకువెళ్లాలని; గిరిజన గ్రామాలన్నింటినీ షెడ్యూల్డ్ ప్రాంతంగా ప్రకటించాలని; అటవీ ఉత్పత్తులకి గిట్టుబాటు ధర సాధించుకోవాలని; కిలో చింతపండు గిరిజనుల నుంచి జి.సి.సి. 6 రూ॥లకే కొంటుంటే, బయట అదే చింతపండు 30 రూ॥ ఉన్న తీరును ఖండిస్తూ; ఐటిడిఎ ద్వారా తునికాకు కొనుగోలు చేయాలని తీర్మానించింది. అదేవిధంగా కరువులు, వలసలు, పెండింగ్ ప్రాజెక్టులపై సాగిస్తున్న ఆందోళనను గుర్తుచేస్తూ అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని తీర్మానించింది. రైతాంగానికి గిట్టుబాటు ధరలు, ఆప్పుల రద్దు కోసం ఉద్యమించమని పిలుపునిచ్చింది.

జిల్లా మహాసభ భూస్వామ్య, పెత్తందారీల దోపిడీ పద్ధతులకు తోడు నూతన వలస భూస్వామిక శక్తుల, కార్పొరేట్‌శక్తుల భూకేంద్రీకరణ ప్రమాదాన్ని ఎత్తి చూపింది. ఈ మహాసభకి ఒరిస్సా ప్రాంతం నుండి చషీమూలియా అదివాసీ సంఘం నుండి వందలమంది ప్రతినిధులు ప్రారంభసభలో పాల్గొనడం జరిగింది. ☆

భూపోరాటాలను నిలుపుకొంటూ పురోగమించాలని పిలుపునిచ్చిన తూర్పు గోదావరి జిల్లా మహాసభ

తూర్పుగోదావరి జిల్లా మహాసభ ప్రతినిధుల సభగా తేది 30-5-2005న రాజమండ్రిలో జరిగింది. జిల్లా వివిధ ప్రాంతాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరైనారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్స్ కరుపోతు దేవానందం, కొండమొదలు సంఘ నాయకురాలు వంజం కన్నమ్మల మరణానికి మహాసభ సంతాపం ప్రకటించింది.

రాష్ట్ర కార్యదర్శి కోటయ్యగారు తన ప్రారంభ ఉపన్యాసంలో రాష్ట్రంలో ఎదురౌతున్న వ్యవసాయ సంక్షోభాన్ని, దీనికి వ్యతిరేకంగా గతం నుండి వివిధ శక్తులతో కలిసి రైతుకూలీ సంఘం సాగించిన కృషిని, వివిధ రైతాంగ సంస్థలతో పి.ఏ. చౌదరి కమీషన్‌ను, తరువాత ప్రభుత్వం వేసిన జయతీఘోష్ కమీషన్‌ను; ఈ నివేదిక గత 40 సం॥లుగా ప్రభుత్వాల విధానాలే వ్యవసాయ సంక్షోభానికి, రైతుల ఆత్మహత్యలకి కారణమని వెల్లడించిన తీరును; జయతీఘోష్ కమీషన్‌లోని వివిధ అనుకూల అంశాల అమలుకై ఉద్యమించాల్సిన అవసరాన్ని వివరించారు. రాజకీయ పరిస్థితిని, రైతు కూలీ సంఘటిత పోరాటాల అవసరాన్ని తెలియజేసారు. అనంతరం జిల్లా కార్యదర్శి కా॥వనచర్ల సుబ్బారావుగారు ప్రవేశపెట్టిన కార్యకలాపాల నివేదికను మహాసభ చర్చించి ఆమోదించింది.

అనంతరం కామ్రేడ్ వనచర్ల సుబ్బారావు కార్యదర్శిగా, గుబ్బల అమ్మాజీ అధ్యక్షులుగా, 15మందితో కార్యవర్గం ఎన్నిక జరిగింది.

జిల్లాలోని 8 వేల ఎకరాల దేవస్థాన భూముల్ని, భూమిలేని పేదలు, దళిత ప్రజానీకానికి పంచాలని; భూదానోద్యమ బోర్డు సీలింగు భూములను పంచాలని; పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకి సమగ్ర పునరావాసం కల్పించిన తర్వాతే నిర్మాణం సాగించాలని; రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని; జిల్లాలోని ఎత్తిపోతల పథకాలకి ప్రైవేటు విద్యుత్ కంపెనీలన్నీ ఉచిత విద్యుత్ అంద జేయాలని తదితర తీర్మానాలను సభ ఆమోదించింది. ☆

కారం పార్వతి ఆశయసాధనలో భూపోరాటాలను నిలుపుకొంటూనే, సమగ్ర పునరావాసం కోసం పోరాడాలని పిలుపునిచ్చిన పశ్చిమ గోదావరి జిల్లా మహాసభ

పశ్చిమ గోదావరి జిల్లా రైతుకూలీ సంఘం మహాసభలు 2004 నవంబరు 4,5 తేదీలలో జరిగాయి. నవంబరు 4వ తేదీ కారం పార్వతి అమరత్వం చెందిన రోజు. 1997లో దుష్ట జమీందారు కాల్పులకి బలైన సందర్భంగా 2004 నవంబరు 4న కారం పార్వతి స్థూప నిర్మాణం పూర్తయి ఆవిష్కరణ జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మండలం మనుగోపులలో జరిగిన స్థూపావిష్కరణకి వివిధ ప్రాంతాల నుంచి 2వేల మందికి పైగా ఆదివాసీ రైతుకూలీలు, క్వారీ కార్మికులు హాజరైనారు. రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ అమరజీవి కారం పార్వతి స్థూపాన్ని ఆవిష్కరించారు. ఏజెన్సీ గిరిజన సంఘం కార్యదర్శి కుంజం రామారావు పతాకాన్ని ఎగరవేయగా, ముఖ్య అతిథిగా వచ్చిన విరసం నాయకులు కా॥రత్నమాల, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కా॥కాటం నాగభూషణం తదితరులు పూలమాలలు వేశారు. అనంతరం అక్కడి నుండి 8 కిలోమీటర్ల దూరంలోని పోలవరం గ్రామంలో బహిరంగసభలో పాల్గొనేందుకు అందరూ నినాదాలతో తరలివెళ్లారు. జిల్లా కార్యదర్శి కామ్రేడ్ చింతలాడ చిన్నబ్బాయి అధ్యక్షత వహించిన బహిరంగసభలో కామ్రేడ్ రత్నమాల మాట్లాడుతూ, పోలవరం ప్రాంతంలో ఎన్నో నిర్బంధాల మధ్య జరుగుతున్న మీ పోరాటం కొనసాగుతూనే ఉందని, కొనసాగుతూ ఉండాలని; ఆదివాసుల ఈ పోరాటాలకు తాను కూడా సంఘీభావాన్ని తెలియజేస్తున్నానని తెలిపారు. గిరిజన, గిరిజనేతర పేదల హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఇల్లా రామిరెడ్డి మాట్లాడుతూ రాబోతున్న పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపుకి గురికాబోతున్న 276 గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనలు చెందుతున్నారని; భూమికోసం, భుక్తికోసం పోరాడుతున్న మనం జీవించే హక్కుకోసం, సమగ్ర పునరావాసం కోసం పోరాడాల్సి ఉందని పిలుపు నిచ్చారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్యగారు మాట్లాడుతూ నవంబరు నెల బలిదానాల కాలం అని, నీలం రామచంద్రయ్య, పోట్ల రామనర్సయ్య తదితర నాయకులు; కుంజం రాజులు, మడెం లక్ష్మయ్య వంటి గిరిజన ఉద్యమ వీరులు; కారం పార్వతి, జెన్ని తిరుపతి వంటి గిరిజన బిడ్డలు వ్యవసాయక విప్లవం కోసం, భూమికోసం పోరాడుతూ అమరులైనారని వివరించారు. రైతు సంక్షోభం దేశసంక్షోభంగా ఉన్న పరిణామాలను తెలియజేసారు. రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ ఉపన్యసిస్తూ కారం పార్వతి ధన్యజీవి అని, ఆమె ఆశయాన్ని ముందుకు కొనిపోవాలని కోరారు. ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరి సామ్రాజ్యవాదుల విధానాలు అమలు జరుపుతున్న తీరుని ఎండగడుతూ కొత్త ప్రభుత్వానికి వ్యవసాయ రంగ సంక్షోభాన్ని నివారించే పాలసీ ఉందా? అని ప్రశ్నించారు. పోరాడటం, సంఘటిత పడడం నేటి అవసరాలని; భ్రమలకి లోనుకాన వసరం లేదని వివరించారు. అనంతరం జిల్లా నాయకులు కామ్రేడ్స్ మాదేపల్లి వెంకటరత్నం, కుంజం రామారావు, పద్దం కృష్ణమూర్తిలు ప్రసంగించారు.

5-11-05న జిల్లా మహాసభ కామ్రేడ్ పద్దం కృష్ణమూర్తి, మాదేపల్లి వెంకటరత్నం, కలుం గంగాదేవిల అధ్యక్షతన జరిగింది. కామ్రేడ్ కోటయ్యగారు పతాకావిష్కరణ

(తరువాయి 86వ పేజీలో ...)

అన్నపూర్ణ ఇంటిలో ఆకలిచావులా? అంటూ కరువు వలసలు, రుణభారంపై నినదించిన కృష్ణాజిల్లా మహాసభ

రాష్ట్రానికి ధాన్యాగారం అనదగిన కృష్ణాజిల్లాలో దశాబ్దకాలంగా 23 మండలాలు కరువువాతన పడుతూ ఉండడం; పశ్చిమ కృష్ణాలో రుణభారంతో మొదలైన ఆత్మహత్యలు తూర్పు కృష్ణాకి కూడా వ్యాపిస్తున్న సమయంలో జిల్లా రైతుకూలీ సంఘం మహాసభలు మచిలీపట్నంలో 16-11-04న జరిగాయి. జిల్లా వ్యాపితంగా వివిధ ప్రాంతాల నుండి 600 మందికి పైగా ప్రతినిధులు హాజరైనారు. కామ్రేడ్స్ యద్దనపూడి సోని, చంద్ర శ్రీమన్నారాయణ, సాంబశివారెడ్డిలు అధ్యక్ష వర్గంగా నిర్వహించిన ఈ మహాసభలో మొదట పాలస్తీనా విమోచన నేత యాసర్ ఆరాఫత్‌కి, జిల్లా నాయకులు గాలి సైదులుకి, ఇంకా ఆత్మహత్యలు చేసుకున్న రైతాంగానికి నివాళి అర్పించారు. ప్రారంభోపన్యాసకులుగా విచ్చేసిన రిటైర్డ్ జడ్జి శ్రీ సత్యనారాయణ రెడ్డిగారు గత 50 సం॥లుగా నీటిపారుదల రంగంలో పాలకుల నిర్లక్ష్య వైఖరిని విమర్శించారు. ఆహారంలో స్వావలంబనలో ఉన్న స్థితి నుండి విదేశాలపై ఆధారపడే స్థితికి తేవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రధాన ఉపన్యాసకులైన కామ్రేడ్ ఝాన్సీ అన్నపూర్ణ ఇంటిలో ఆకలిచావులు ఏమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టుల నిర్మాణం పేర ప్రాంతాల విభేదాలను రెచ్చగొడుతున్న పాలకుల కుట్రలను వివరించారు. యంత్రాలను తెచ్చి వ్యవసాయ కూలీల కడుపులు కొడుతున్న విధానాలను ఖండించారు. రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్యగారు ఇక్కడ హాజరైన ప్రజలు అత్యధికులు పోషకాహారలోపంతోనే ఉన్నారని; దేశంలో సంపదలు, ఉత్పత్తులు సృష్టిస్తున్న శ్రమజీవులు పౌష్టికాహారలోపంతో బాధపడుతున్నారని, దీనికి కల కారణాలను మార్చేందుకు రైతుకూలీ సంఘం పోరాడుతున్నదని వివరించారు. జిల్లా నాయకులు కామ్రేడ్ భార్గవశ్రీగారు మాట్లాడుతూ గత 4 ఏళ్లలో జిల్లాలో 80 మంది ఆత్మహత్య చేసుకున్నారని; కూలీల వలసలు, తక్కువ కూలీరేట్ల కోసం కరువు ప్రాంతాలుగా ఉంచుతున్నారని వివరించారు. ఓపిడిఆర్ నాయకులు ఏసు సందేశం ఇచ్చారు. కా॥ యద్దనపూడి సోని కార్యకలాపాల నివేదికను మహాసభ ముందుంచారు. అనంతరం కామ్రేడ్స్ మందా జార్జి అధ్యక్షులుగా, యద్దనపూడి సోని కార్యదర్శిగా, సాంబశివారెడ్డి ఉపాధ్యక్షులుగా, చంద్ర శ్రీమన్నారాయణ సహాయకార్యదర్శిగా, తలశిల మనోహర్ కోశాధికారిగా 8 మందితో జిల్లా కార్యవర్గం ఏర్పడింది.

అనంతరం మచిలీపట్నం వీధులలో ప్రొద్దుటూరు యువకులు కర్రసాము సాగిస్తూ ముందుకు నడవగా ప్లే కార్డులు, బ్యానర్లతో ఉత్తేజకరంగా సాగిన ఊరేగింపుతో కార్యక్రమం విజయవంతం అయింది.

ఈ మహానభ-కృష్ణాజిల్లాలో ప్రకటించిన 16 కరువు మండలాల ప్రకటన అసమగ్రమైందని, వివాదస్పదమైందని; శాశ్వత కరువు ప్రాంతాలను గుర్తించి సహాయక చర్యలను చేపట్టాలని; ఆత్మహత్యలు చేసుకుంటున్న కుటుంబాలకు 2 లక్షల నష్టపరిహారం, సంవత్సరానికి 4 శాతం వడ్డీకి రుణాలు ఇవ్వాలని; పనికి ఆహార పథకంను గ్రామకమిటీ లకి అప్పగించాలని, యంత్రాల ప్రమేయం లేకుండా పనులు కల్పించాలని; మహాసభ తీర్మానం చేసింది. అదేవిధంగా పంటల గిట్టుబాటు ధరలు ప్రకటించాలని; పెట్రోలు, డీజిల్‌పై పెంచిన రేట్లను తగ్గించాలని; ఆక్వా సంక్షోభంలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తీర్మానించారు. చేనేత కార్మికుల ఆకలి చావులను నివారించాలని, చేనేత రకాలను 11 నుండి 22కి పెంచాలని మహాసభ తీర్మానించింది. అదేవిధంగా గుండేరు ముసురు కాల్వపై చిన్నాపురం వద్ద చెక్‌డ్యామ్ నిర్మించి 22 వేల ఎకరాలకి నీరు అందించడం; మహాలక్ష్మమ్మ డ్రైన్‌పై జీవిస్తున్న యానాదులకు చేపలు పట్టుకునే హక్కు కల్పించడం; వికలాంగుడు జోగి శ్రీనివాసరావు ఆత్మహత్యకి ప్రభుత్వం బాధ్యత వహించి 2 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని; మచిలీ పట్నంలోని పేదలకు నివాసస్థలాలు, ఆటో కార్మికులకు పోలీసుల నుంచి బెదిరింపులు ఆపాలని మహాసభ డిమాండ్ చేస్తూ తీర్మానించింది.

ఈ మహాసభ విజయవంతం అయ్యేందుకు 1-11-04 తేది నుండి 10-11-04 వరకూ అనేక గ్రామాలలో విస్తృతంగా ప్రచారం జరిగింది. ☆

(85వ పేజీ తరువాయి...)

చేయగా కామ్రేడ్ ఝాన్సీగారు మహాసభల ప్రారంభ ఉపన్యాసం చేసారు. భూపోరాటాన్ని కొనసాగిస్తూనే పునరావాసం కోసం, జీవించే హక్కు కోసం పోరాడాల్సిన అవసరాన్ని వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కాటం నాగభూషణం, ఓ.పి.డి.ఆర్ నాయకులు రంగనాథ్, ఆదివాసీ సంఘీభావ కమిటీ తరపున పి. త్రినాధరావుగారు సందేశాలు ఇచ్చారు. త్రినాధరావు గారు వ్రాసిన 'ఆదివాసీ ఉద్యమాలు' అనే పుస్తకాన్ని కా॥ కలుం గంగాదేవి ఆవిష్కరించారు. జిల్లా కార్యకలాపాల నివేదికను కార్యదర్శి కా॥చింతలాడ చిన్నబ్బాయి ప్రతిపాదించగా సభ అమోదించింది. అనంతరం కా॥చింతలాడ చిన్నబ్బాయి కార్యదర్శిగా నంద్యాల వెంకట్రామిరెడ్డి అధ్యక్షులుగా, మాదేపల్లి వెంకటరత్నం ఉపాధ్యక్షులుగా, పద్దం కృష్ణమూర్తి సహాయ కార్యదర్శిగా ఏడుగురితో కమిటీ ఎన్నికైంది.

ఏజెన్సీ ప్రాంత భూములపై ఆదివాసులకి గల హక్కులు తిరుగులేనివని, పంచాయితీ రాజ్ సవరణ చట్టం 7/98 అనుసరించి అన్ని భూవివాదాలను గ్రామసభలే పరిష్కరించాలని; ప్రాజెక్టుపేర సమగ్ర శాస్త్రీయ పునరావాసం లేకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మించరాదని; పత్తి, చెరకు, పొగాకు తదితర గిట్టుబాటు ధరలకై మరింత సంఘటితంగా రైతాంగం పోరాడాలని; చిన్న నీటి వనరుల అభివృద్ధికై ఉద్యమించాలని; జిల్లాలో ముఖ్యం గా చింతలపూడిలో దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలను ఖండిస్తూ మహాసభ తీర్మానాలు చేసింది. ☆

అమరులు కామ్రేడ్స్ విశ్వమోహన్‌రెడ్డి, అంగడి చెన్నయ్యల స్ఫూర్తితో రైతుకూలీ ఉద్యమాలను ముందుకు కొనిపోతామని ప్రతిజ్ఞ చేసిన గుంటూరు జిల్లా మహాసభ

గుంటూరు జిల్లా మహాసభ 2004 నవంబరు 7న పిడుగురాళ్ళ లెనిన్‌నగర్‌లో జరిగింది. మహాసభకి జిల్లా సంఘం అధ్యక్షులు కామ్రేడ్స్ ముత్తిరెడ్డి శ్రీరాములు, జిల్లా నాయకులు సింహాద్రి లక్ష్మారెడ్డి, వీరారెడ్డిలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. అమరులకు నివాళులు అర్పించిన అనంతరం మొదలైన ప్రారంభసభకి కా॥ ఝాన్సీ ప్రారంభోపన్యాసం ఇచ్చారు. గుంటూరు జిల్లా రైతాంగ పోరాట చరిత్ర విశిష్టమైందని; బ్రిటీష్ వ్యతిరేక-జమీందారీ భూస్వామ్య వ్యతిరేక, జాతీయ ప్రజాస్వామిక ఉద్యమాల చరిత్ర ఉందని; గత కొద్దికాలంలో రైతుకూలీ ఉద్యమ నేతలు కా॥అంగడి చెన్నయ్య, కా॥ విశ్వమోహన్‌రెడ్డి, కా॥దూపాటి అప్పారావు, మరియమ్మలను కోల్పోయినప్పటికీ రైతుకూలీ ఉద్యమం మరింత పట్టుదలతో ముందుకుసాగుతున్న క్రమంలో ఈ సభలు జరుగుతున్నాయని వివరించారు. రైతుకూలీల సమస్యలు, ప్రజల కనీస సమస్యలపై ఆందోళన చేస్తున్న; క్రమంలో ఎదురౌతున్న నిర్భంధాన్ని వ్యవసాయ కూలీల సమస్యలు, గిట్టుబాటు ధరలపై పోరాడాల్సిన అవసరాన్ని వివరించారు.


జిల్లా మహాసభలో జిల్లా కార్యదర్శి కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు తన కార్యదర్శి నివేదికలో గత 4 స॥రాల కార్యక్రమాలను, అనుభవాలను వివరించారు. కా॥ అంగడి చెన్నయ్య, కా॥దూపాటి అప్పారావుల నాయకత్వంలో ఉన్న రైతుకూలీ సమాఖ్య, కా॥ముత్తిరెడ్డి శ్రీరాములు, విశ్వమోహన్‌రెడ్డిల నాయకత్వంలో ఉన్న రైతుకూలీ సంఘం - రెండు సంఘాలు ఐక్యమై గత 4 స॥లుగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) గా సాగిస్తున్న కృషిని, ఏర్పడుతున్న మంచి ఫలితాలను సభ ముందు ఉంచారు.

అనంతరం 22 మందితో నూతన కార్యవర్గం ఏర్పడింది.

అధ్యక్షులుగా కామ్రేడ్స్ ముత్తిరెడ్డి శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా గంటా సీతా రామయ్య, కాంద్రకుంట ముసలయ్య, జిల్లా కార్యదర్శిగా ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా సింహాద్రి లక్ష్మారెడ్డి, బి.రఘు, కోశాధికారిగా పీతా వెంకటేశ్వర్లును ఎన్ను కోవడం జరిగింది.

1) నకిలీ విత్తనాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని 2) పల్నాడు ప్రాంతానికి సాగునీరు అందించే పరికపూడిల, దొమ్మర్లగొంది, జర్రివాగు, అనుపు తదితర నీటిపారుదల పథకాలకి ప్రారంభోత్సవం చేయాలని 3) పులిచింతల నిర్వాసితులకి పూర్తిస్థాయి నష్టపరిహారం తర్వాతే ప్రాజెక్టు నిర్మించాలని 4) నిజాంపట్నం మీదుగా హైవే నిర్మించాలని 5) నారాకోడూరు ప్రాంత రైతాంగానికి కూరగాయల విత్తనాలు సప్లయిచేసి గిట్టుబాటు ధర కల్పించాలని 6) పేదలు ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని; ఇంకా చేనేత రంగానికి నూలు, రసాయనాలు, అధిక ధరలు అరికట్టడం, ఆకలిచావులు, ఆత్మహత్యలు నివారించాలని; కూలిరేట్లు పెంపుచేయాలని తదితర తీర్మానాలను సభ ఆమోదించింది.

మహాసభ ముగింపులో రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్య, నూతన కార్యవర్గం రైతాంగం ఆకాంక్షలను నెరవేర్చే విధంగా సంఘ నిర్వహణను, ఉద్యమ నిర్మాణాన్ని పరిపూర్తి చేయాలని; పాలకుల సామ్రాజ్యవాద అనుకూల, భూస్వామ్య అనుకూల విధానాలతో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతున్న పరిస్థితులలో రైతుకూలీల జీవితాలు దుర్భరమౌతున్న స్థితిలో పోరాటం తప్ప మరొక మార్గం లేదని, ముందుకుసాగుతూనే అమరులకు నివాళులు అర్పించగలమని తెలపడంతో మహాసభ ముగిసింది. ☆



కరువు అంటే నిత్యం కొద్దికొద్దిగా రక్తం పీల్చే రక్తపింజరి
కరువు అంటే ఆత్మల్ని నడిరోడ్ల మీద వేలం పాటతో తెగనమ్మకోవటం
కరువు అంటే నిత్యం ఆత్మహనన కాదు
కరువు అంటే అనునిత్యం ఆత్మహత్యించుకోవటం
ప్రకటించాల్సిందే
కరువు మీద యుద్ధం ప్రకటించాల్సిందే
మానవ క్రౌర్యం మీద కౌటిల్యం మీది
కపట రాజకీయం మీద యుద్ధం ప్రకటించాల్సిందే
సరళీకృత ప్రపంచీకరణ అభివృద్ధి పరంపర మీద యుద్ధం ప్రకటించాల్సిందే
జీవితంలో పద్ధతనన్ని పునరుద్ధరించి నేలనూ జీవితాన్ని పదును చేసే
చినుకు దీపాన్ని చిదిమి చిరుదీపాన్ని వెలిగించి
చీకటి భీభత్సం మీద యుద్ధం ప్రకటించాల్సిందే

- జూపల్లి ప్రేంచంద్

పాలకుల సామ్రాజ్యవాద అనుకూల విధానాలే వ్యవసాయ రంగ సంక్షోభానికి కారణమని ఉద్ఘాటించిన ప్రకాశం జిల్లా మహాసభ

ప్రకాశం జిల్లా గుంటూరు, నెల్లూరు, కర్నూలు ప్రాంతాల కరువు ప్రాంతాలతో ఏర్పడిన జిల్లా. ప్రారంభం నుంచి ఐ.టి.సి. వంటి బహుళజాతి కంపెనీల విధానాలకు ప్రయోగశాల. రాష్ట్రంలో ఈరోజు విస్తారంగా సాగుతున్న రైతాంగ ఆత్మహత్యలు మొట్ట మొదట ప్రారంభమైంది ప్రకాశం జిల్లాలోనే.

ప్రకాశం జిల్లా రైతుకూలీ సంఘం మహాసభ 10-9-04న కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డినగర్ (వేమూరి కల్యాణ మండపం) లో జరిగింది. కామ్రేడ్స్ రవి, శ్రీరాములు అధ్యక్షులుగా జరిగిన ఈ సభకి జిల్లా నలుమూలల నుండి ప్రతినిధులు హాజరైనారు.

మహాసభ ప్రారంభ ఉపన్యాసకులుగా వచ్చిన రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ జిల్లాలోని పేద, మధ్య తరగతి రైతాంగ పరిస్థితిని, ధనాఢ్య వర్గాల స్థితిగతులను వివరించారు. కరువు, మరోప్రక్క గ్రానైట్, రొయ్యల చెరువుల లో సంపదల కేంద్రీకరణలను వివరించారు. మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, శ్రీలక్ష్మి హత్య ఉదంతాన్ని వివరిస్తూ; వీటి వెనుక ఉన్న సామాజికదోపిడీ పీడనలను వివరించారు. సామ్రాజ్యవాద అనుకూల వ్యవసాయ విధానాలను అమలుచేస్తూ పోవడం వల్ల రైతుల ఆత్మహత్యలు, వలసలు జరుగుతున్నాయని వివరించారు. 1967 సస్య విప్లవంతో వ్యవసాయంలో సంక్షోభం ప్రారంభమైందని, 1990 డంకెల్ ఒప్పందంతో అది ఉన్నతస్థాయికి చేరుకొందని; దాని దుష్ఫలితాలను అనుభవిస్తున్నామని వివరించారు. ఆహార పంటలు పండించడం ఆపించి సుబాబుల్ తోటల పేర భూగర్భ జలాలు ఎండిపోయేలా చేస్తున్నారని, రాష్ట్రంలో మొట్టమొదట రైతాంగ ఆత్మహత్యలు ప్రకాశం జిల్లాలో ప్రారంభమైనాయని; ఇక్కడ ప్రారంభమైన సంక్షోభాన్ని పాలకులు నివారించకపోగా ప్రోత్సహించిన ఫలితంగా రాష్ట్రం మొత్తం ఇదే పరిస్థితి ఏర్పడిందని; సామ్రాజ్యవాద దళారీ విధానాలను తిప్పి కొడితేనే రైతాంగానికి రక్షణ అని వివరించారు.

రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్యగారు బ్రిటీష్ సామ్రాజ్యవాదులు కొంత ప్రాంతాన్ని కరువుప్రాంతంగా, మరికొన్ని ప్రాంతాలను వారికి కావలసిన వాణిజ్య పంటల ప్రాంతంగా మార్చారని; రుణభారం, గిట్టుబాటు ధరల విధానం అన్నవి రైతులను పీల్చి పిప్పి చేస్తున్నాయని; సమైక్య ఉద్యమాలకి కదలాలని కోరారు.

అనంతరం జిల్లా కార్యకలాపాల రిపోర్టును జిల్లా కన్వీనర్ కా॥ లలితకుమారి సమర్పించారు. తరువాత జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. కామ్రేడ్స్ వేజెండ్ల రామారావు అధ్యక్షులుగా, యస్. లలిత కుమారి కార్యదర్శిగానూ, పి.కోటేశ్వరరావు, పిల్లి నాగయ్య ఉపాధ్యక్షులుగా, యస్.యం.డి. భాషా సహాయ కార్యదర్శిగా, డి. వెంకారెడ్డి కోశాధికారిగా 13 మందితో కార్యవర్గం ఏర్పడింది.

ఈ సభలో జిల్లా కన్వీనర్ కా॥ లలిత కుమారి, కార్మిక నాయకులు కా॥ కత్తి పేరయ్య, పింజల సుబ్బారావుగార్లు ప్రసంగించారు.


మహాసభ ఈ క్రింది తీర్మానాలు చేసింది

నెల్లూరు, గుంటూరు, కర్నూలు ప్రాంతాలకు చెందిన కరువు ప్రాంతాలతో ఏర్పడిన ప్రకాశం జిల్లా నిరంతరం సాగునీరు, త్రాగునీరు కొరతలతో ఇబ్బందిపడుతోంది. అన్ని చెరువులను సకాలంలో సాగర్ నీటితో నింపాలని; జిల్లాలోని సాకేరు, మున్నేరు, మూసి, గుండ్లకమ్మ వంటి వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించాలని; ఎన్నో సంవత్సరాల పాలకుల వాగ్దానమైన వెలిగొండ ప్రాజెక్టు నిర్మించాలని మహాసభ తీర్మానించింది. అదే విధంగా పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి ఐ.టి.సి. వంటి బహుళజాతి కంపెనీల వ్యూహంకి తలఒగ్గుతున్న, ఆంధ్రా, కర్నాటక రాష్ట్రాల మధ్య తగాదాలు పెడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వమే పొగాకు నిల్వలు కొనుగోలు చేయాలని తీర్మానించింది. ఇంకా పేదలకి భూముల పంపిణీ జరగాలని, రైతుల మోటార్లు క్రమబద్ధం చేయాలని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని తదితర తీర్మానాలను మహాసభ చేసింది.

ప్రతినిధుల సభ అనంతరం ఊరేగింపు, బహిరంగ సభ జరిగాయి. ☆

నేనిప్పుడు
వాడి చేతిలో పంట నొల్లుకుని
కంట్లో కారంజల్లిన వాళ్ళనే ప్రశ్నిస్తాను
ఖండాంతర లావాదేవీల్లో
జాతి వెన్నెముకని తాకట్టుపెట్టిన వాళ్ళనే ప్రశ్నిస్తాను
శవాల ఉసురు పోసుకునే చీకటి డబ్బునీ
దాని కావలికుక్కల్నీ ప్రశ్నిస్తాను
మట్టిని నమ్ముకున్న బతుకు మట్టిలోనే పాలి అయినప్పుడు
అది ఖచ్చితంగా హత్యే-
చేసిందెవరనే నేను ప్రశ్నిస్తాను

- పాపినేని శివశంకర్



పేద రైతాంగం చోదక శక్తులుగా రైతుకూలీ పోరాటాలను నిర్మించమన్న పిలుపుతో విజయవంతమైన నెల్లూరు జిల్లా మహాసభ

నెల్లూరు జిల్లా రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) మహాసభ నెల్లూరు జిల్లా రాపూరులో 8-9-04న జరిగింది. కామ్రేడ్స్ ఆర్.సుబ్బారాయుడు, వి.వి. రమణయ్య అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ మహాసభలో తొలుత సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥జె.కిశోర్‌బాబు సంఘం జెండాను ఎగురవేశారు. రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఝాన్సీ తన ప్రారంభోపన్యాసంలో గత టిడిపి నేడు కాగ్రెస్ పాలనలకి విధానపర తేడా ఉండదని; ఇజ్రాయిల్ తరహా వ్యవసాయం ప్రారంభించిన కుప్పంలో చిన్న, పేద రైతులను గెంటివేసే పరిస్థితి ఏర్పడుతుందని; పంజాబ్‌లో కూడా రైతాంగం ఆత్మహత్యలకి పాలకుల సామ్రాజ్యవాద అనుకూల విధానాలే కారణ మని, 50 వేల రకాల విత్తనాలను నిలువ చేసుకున్న మన సాంప్రదాయక వ్యవసాయాన్ని ధ్వంసం చేసి విత్తనరంగాన్ని బహుళజాతి కంపెనీలకు అప్పగించాలని ప్రయత్నిస్తు న్నారని; దానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.


ముఖ్యఅతిథిగా వచ్చిన సీనియర్ రైతుఉద్యమ నాయకులు కా॥ జొన్నా కోటయ్యగారు పేద రైతాంగం చోదక శక్తులుగా రైతుకూలీ పోరాటాలు సాగాలని; జిల్లాలో వెంకటగిరి జమీందారులకు వ్యతిరేకంగా గత పోరాటాల అనుభవం ఇదేనని; దెబ్బలాడందే భూమి రాదని పేర్కొన్నారు.

పి.డి.ఎస్.ఒ. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥యస్.కె. భాషా, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు కా॥ రమ, ఎ.పి.ఎఫ్.టి.యు. నుంచి కా॥ జహీర్‌ఖాన్ తమ సందేశాన్నిచ్చారు. సందేశాల అనంతరం కా॥ జె. కిశోర్‌బాబు సంఘ ప్రణాళిక, నిబంధనావళిని వివరించారు. జిల్లా కన్వీనర్ కా॥ సునీత కార్యకలాపాల రిపోర్టునిచ్చారు. అనంతరం కా॥ జె. కిశోర్‌బాబు అధ్యక్షులుగా, కా॥ సునీత కార్యదర్శిగా 7 గురితో కమిటీ ఏర్పడింది.

మహాసభ అనంతరం రాపూరులో రైతుకూలీల ప్రదర్శన జరిగింది. దున్నేవానికి భూమి హక్కును; సోమశిల, కండలేరు ప్రాజెక్టులను పూర్తిచేయాలని; సోమశిల, స్వర్ణముఖి లింకు కెనాల్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

అనంతరం జరిగిన బహిరంగ సభలో రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥కోటయ్య నీటిపారుదల పథకాలలో అమలవు తున్న నిర్లక్ష్యం - వలస పాలకుల వ్యతిరేక విధానాలనే కొనసాగిస్తున్న తీరును విమర్శించారు. ప్రముఖ కార్మిక నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కా॥ ఎన్.వి. క్రిష్ణయ్యగారు పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ప్రయివేటీకరణ మూలంగా నిరుద్యోగం ప్రబలుతుందని, వైద్యం అందడం లేదని, దేశ అవసరాల కోసం విదేశాల నుంచి డబ్బు తేనవసరం లేదని, వేలకోట్ల రూపాయల నల్లడబ్బు ఉందని వివరించారు. ఈ సభలో కా॥ ఝాన్సీ, జె. కిషోర్‌బాబు, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, రమణయ్య తదితరులు ప్రసంగించారు.

మహాసభ కోసం రాపూరు, వెంకటగిరి ఏరియాలో 40 గ్రామాల్లో విస్తృత ప్రచారం జరిగింది. ☆



మట్టి శ్వాస

డా॥ బీరం సుందరరావు

డాలర్ వాసన వేసేవాడికి

మట్టి మాళిగల పరిమళం తెలియదు

యాంత్రిక స్పర్శకు నాగేటి కర్రుపదును అంతుపట్టదు.

వాడికి తెలిసిందల్లా ఒక్కటే!

నాగలిని పురావస్తువుగా చేసి

తరతరాల భూమి స్వరూపాన్ని ధ్వంసం చెయ్యడం

చేల మధ్య హద్దుల్ని చెరిపేసి చేపల చెరువులుగా మార్చడం

వాడు ముద్దనుహరిస్తే

గుప్పెడు మట్టిని దేశమంతా చల్లుతాను.

మట్టి ఉద్యమమై మొలకెత్తుతుంది.

కా॥ తరిమెల నాగిరెడ్డి పోరాట స్ఫూర్తితో గత ఉద్యమ వెలుగుతో ముందుకు సాగాలని పిలుపు నిచ్చిన అనంతపురం జిల్లా మహాసభ


అనంతపురం జిల్లా మహాసభ 2005 ఏప్రిల్ 21, 22 తేదీల్లో కణేకల్లులో జరిగింది. 21వ తేదీ సాయంత్రం ఊరేగింపు, బహిరంగ సభ; 22వ తేదీ ఉదయం ప్రతినిధుల సభ జరిగాయి. 21వ తేదీ మధ్యాహ్నం నుంచే వందలాదిమంది రైతుకూలీలు ఊరేగింపు స్థలాన్ని చేరుకున్నారు. డప్పులు, చెక్క భజనలు, బాలల నృత్యాలతో ఉత్తేజకరమైన వాతావరణం లో ఊరేగింపు, బహిరంగసభ జరిగాయి

22వ తేదీ ఉదయం ప్రతినిధుల సభలో జిల్లా సీనియర్ నాయకులు కా॥మరుట్ల ఇమాంసాహెబ్ సంఘం జెండాను ఎగుర వేశారు. కామ్రేడ్స్ ఇమాంసాహెబ్, హెచ్. హనుమంతప్ప, తరిమెల గంగమ్మలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

తన ప్రారంభోపన్యాసంలో రాష్ట్ర కార్యదర్శి కా॥కోటయ్య, కా॥ తరిమెల నాగిరెడ్డికి నివాళులర్పిస్తూ ఈ గడ్డమీద కా॥ టి.ఎన్. నాయకత్వాన సాగిన వివిధ రైతుకూలీ భూపోరాటాలను గుర్తుచేశారు. రైతాంగ సమస్యలపై, రైతుల ఆత్మహత్యలపై జయతీ ఘోష్ కమీషన్ నివేదిక గత 45 సం॥ల పాలకుల రైతువ్యతిరేక విధానాలను వెల్లడిచేసిందని; కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ నివేదికను అమలుచేసే స్థితిలో లేదని వివరించారు. గ్రామాలలో భూస్వామ్య దోపిడీ కొనసా గుతూ కొత్తరూపాలను సంతరించుకుంటుందని; దున్నేవాడికి భూమి నినాదంగా వ్యవసాయ విప్లవాన్ని ముందుకు తీసుకొని వెళ్ళాలని పిలుపునిచ్చారు. ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥సి. పెద్దన్న, ఓపిడిఆర్ నాయకులు కా॥తిమ్మారెడ్డి, నవయువ సమాఖ్య నాయకులు కా॥లక్ష్మిరెడ్డి తమ సందేశాలను ఇచ్చారు.

సంస్థ ఆశయాలను, లక్ష్యాలను రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥జె.కిశోర్‌బాబు వివరించారు. గత మహాసభల నుండి జరిగిన కార్యకలాపాల నివేదికను జిల్లా కార్యదర్శి కా॥ చెన్నంపల్లి నాగరాజు వివరించారు. అనంతరం కా॥ మరుట్ల ఇమాంసాహెబ్ అధ్యక్షులుగా కా॥నాగరాజు కార్యదర్శిగా 13 మందితో జిల్లా కార్యవర్గం ఎన్నికైంది.

పెన్నా అహోబిళం రిజిర్వాయరుకి (పిఎబిఆర్) 10 టిఎంసిల నీటిని విడుదల చేసి ధర్మవరం ప్రాంతానికి తాగునీరు సదుపాయం కల్పించాలని; తుంగభద్ర సమాంతర కాలువకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని; శోత్రీయం భూములను, బంజరు మిగులు భూములను పేదలకు పంచాలని; గార్లెదిన్నె, కణేకల్లు ప్రభుత్వ పోరంబోకు భూములను పేదలకు పంచాలని; ఎర్రగుంట, పూలచెర్ల, కొండాపురం, కదరంపల్లి దేవాలయ భూములను పేదలకు పంచాలని మహాసభ తీర్మానాలు చేసింది. ఇండ్లస్థలాల పంపకం-వలసలను నిరోధించి, పనికి ఆహారపథకం సక్రమ అమలు; జయతీఘోష్ కమీషన్ నివేదికని పూర్తిగా అమలును చెయ్యాలని; ప్రపంచ వాణిజ్యసంస్థ నుండి ప్రభుత్వం బయటికి రావాలని మహాసభ తీర్మానించింది. ☆




'అనంత' వేదన

తలలెండిపోయిన తాటిచెట్లు
తల వాలిపోయిన టెంకాయ చెట్లు
ఉరేసుకున్న మా రైతుల్లాగే
స్వతంత్ర భారత చిహ్నాలై వ్రేలాడుతున్నాయి.
తలుపులు కంటించిన వేలం నోటీసులు
మా ఇళ్ళకు రెండో తాళం వేసి
మరణశాసనాన్ని ప్రకటిస్తున్నాయి
వలసపోయిన 'అనంత' పక్షులు
గూటికి తిరిగొచ్చేలోగా
గూళ్ళే చెదిరిపోతాయో
వాటి ఆనవాళ్ళే మాయమౌతాయో
మా గ్రామాల్లో
కరువు విధించిన కర్ఫ్యూ మాత్రం చూద్దురు రండి.

మా కరువు బతుకుల
మాడిన కడుపులు పేగుల తంబురనాదం వినాలంటే
మా నాగులగుడ్డం తాండాకు రండి
మా దండువారి పల్లెకు రండి
మా మాహమ్మదాబాద్‌కు రండి
పోస్ట్ మాడర్నిస్టునై
ఆత్మగుహలు తవ్వుకుందామంటే
'అనంత' కరువు కొక్కెం
నా బుర్రను చేపలాగా పైకి లాగుతున్నది
ఇంకెంత మాత్రమూ
అంతరంగ సముద్రస్నానం చెయ్యలేను

- రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి



స్వదేశీ పరశీమల్లో

- అరణ్య కృష్ణ

వాళ్ళను మెర్క్యురీ దీపస్థంభాలు ఆకర్షించలేదు
వాళ్ళ వలసలో పక్షుల సహజాతం లేదు
పాలు వట్టి పోయిన కన్నతల్లిని వదిలి
కరెంటు తీగెపడ్డ నీటిమడుగు దగ్గరికి
దాహంతో పరిగెత్తే పసిబిడ్డల్లా
పల్లెల్ని వదిలి పట్నాలకు ఎగబాకారు
ఉత్తరంలో సారాంశం పూర్తవగా
మిగిలిన ఖాళీస్థలం లాంటి జాగా మీద
చింపిరి గుడిసెల్ని వేసారు
నగరానికి ఆరోవేలులా అతుక్కుపోయారు
ఇప్పుడు వాళ్ళ
కుమ్మర్లు కమ్మర్లు సాలెలూ హరిజనులూ-ఏదీకారు
వర్ధి లేబరోళ్ళే!
పనిలోనే తప్ప శ్రమలో మార్పులేని బతుకులో
కోడికూత స్థానాన్ని సైరన్ మోత కబళిస్తుంది
మందుల కంపెనీలు కాలువలు కాలువలుగా
వాంతి చేసుకున్న కాలుష్యం ఒడ్డున
ఏకునుండి దారం వచ్చినట్లు
కొగితం మీద ఉల్లి రసంతో రాసిన అక్షరాలు
కొవ్వొత్తి సెగకు బైటపడ్డట్లు
అకాల వృద్ధాప్యం ఆవరిస్తుంది
చంకల్లో బిడ్డల్తో గంపల్లో సామానుల్తో చేతుల్లో పనిముట్లతో
సరిహద్దుల్లో తరమబడుతున్న కాందిశీకుల్లా
వేసిన ప్రతి అడుగుని హడావిడిగా ఖాళీ చేసుకుంటూ
వాళ్ళు ఉత్తరం ముక్క వచ్చేంత కాసింత చిరునామా కోసం.....

కాపుల దశ

- చిలకమర్తి లక్ష్మీనరసింహం

అధికార భూతంబు లడుగు లంచము లిచ్చి
పరిపరి విధముల పన్ను లిచ్చి
మునసబు కరణాల ముడుపులన్నియు నిచ్చి
కోసి నూర్చిన వరి కూలి నిచ్చి
కచ్చేరి బంట్రోతు గముల కీనామిచ్చి
పాలేళ్ళకును కొంత పంట నిచ్చి
యజమానులకు పంట నర్ధభాగం బిచ్చి
పై కమిచ్చిన వాని వడ్డి నిచ్చి
గడ్డి మాత్రమే మిగిలించు కాపువాడు
సేద్యమున తాను పశుల రక్షించు కొరకు
కటకటా! యెట్టులున్నదో కాపుల దశ
సుగుణ ధనులార! జనులారా! చూడరయ్య!

(1895 నాటి చిలకమర్తి వారి గోదావరి మండల పద్యాలలోనిది. 2005 సం॥కి పరిస్థితిలో మార్పు లేకపోగా కౌలు రైతుల ఆత్మహత్యలదశకు పరిస్థితి చేరింది.) - సం.

ఉత్పత్తి శక్తుల విముక్తి కోసం
ఉద్యమిస్తున్న రైతులు నాగళ్ళు
మేధావుల ముఖానికి వెయ్యికళ్ళు
కవుల కళ్ళకు కలాలు నాగళ్ళు
ఆశలు ఆధారాలు - భవిష్యత్తుకు మంజీరాలు
కార్మికులకు మిత్ర బృందాలు
శ్రామికవర్గ రిజర్వులు
వికృత దుర్భర దాస్య విధానాన్ని
బద్దలుకొట్టేందుకు వేచి ఉన్నాయి నాగళ్ళు

నాగావళీ! నువు ప్రవహించు
సాగు తిరిగి చేతికొచ్చిందాకా
కోతకొచ్చిందాకా ఒక రీతికొచ్చిందాకా
లాంగుల్యా! నువు ప్రవహించు
రైతు వడిలోనికి మాన్య మొచ్చిందాకా
రైతు జబ్బల్లోనికి రక్తమెక్కిందాకా
రైతు పోరాటాలు రక్తిగట్టిందాకా

- భాయరాజ్

VISAKHA DAIRY



Natural Pure Fresh

VISAKHA DAIRY

Manufactured & Marketed by :

VISAKHA CO-OP. DAIRY

An ISO : 9001-2000 & HACCP Certified

VISAKHAPATNAM–12. Ph : 2517230, 2517555, 2517290, Fax : 2757708

With Best Compliments From :



SAROVAR COFFEE SHOPPE



5-9-22, Sarovar Complex, Secretariat Road,
Hyderabad - 500 063. Phone : 23237299

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED

Regd. Office: 6-3-655/11A, Civil Supplies Bhavan, Somajiguda, Hyderabad

PUBLIC.DISTRIBUTION SYSTEM

Janasree Bhima Yojana:

All the hamalies working in the MLS Points of A.P. State Civil Supplies Corporation and GCC were covered under Group Insurance Policy "Janasree Bhima Yojana". The benefits under the said scheme are as follows:

(i) On death (due to accident) : Rs.50,000/-
(ii) Permanent total disability : Rs.50,000/-
(iii) Loss of two eyes, 2 limbs : Rs.50,000/-
(iv) Loss of one eye or one limb : Rs.25,000/-
(v) Death prior to terminal date : Rs.20,000/- (Normal death)

In addition, the children of hamalies sweepers, who are under coverage of group insurance scheme "Janasree Bhima Yojana" by 31st May of every year, who are studying between 9th class to Intermediate are eligible to get Scholarship of Rs.300/- for every three months in an academic year per each child to a maximum of two children by the Central Government through LIC of India.

Procedure for claiming of benefits:

In case of normal death, claim should be preferred with the LIC of India, Pension & Group Schemes Unit, Saifabad, Hyderabad in the prescribed proforma along with death certificate through the Nodal Agency i.e. A.P. State Civil Supplies Corporation.

In case of accidental death, claim should be preferred with the LIC of India, Pension & Group Schemes Unit, Saifabad, Hyderabad in the prescribed proforma along with FIR and Post Mortem report.

Sl. No.	Scheme	Monthly quota is MTs.	Scale	End Consumer
1.	PDS (BPL Families)	197355	4 Kgs. Per head upto a maximum of 20 Kkgs.	Rs. 5.25
2.	APL families	55577	35 Kgs. For family	Rs. 9.00
3.	Antyodaya Anna Yojana	43176	35 Kgs. For family	Rs. 3.00
4.	Welfare Hostels			Rs. 4.00
5.	Annapurna	932	10 Kgs. for family	Free of cost
6.	Wheat Based Nutrituion Programme (per annum)	29008		Rs. 4.00
7.	National Nutrition Mission	22100	6 Kgs to each beneficiary for three months	Free of Cost
8.	Mid Day Meal Scheme (NPNSPE)	21341	3 Kgs. per child per month	Free of cost
9.	Wheat	12806	30 Kgs per child per month	Rs. 7.00
10.	Sugar	14006	1 Kgs per card for BPL/AAY families	Rs. 13.50
11.	Kerosene	55.000 KLs. Per month	Rs. 9.50	
	1) Municipal Corporations (other than Hyderabad but including 9 Municipalities in Ranga Reddy District adjoining Hyderabad)		10 Litres	Rs. 9.50
	ii) Municipalities		6 Litres	Rs. 9.50
	iii) Mandal head Quarters		5 Litres	Rs. 9.50
	iv) Rural Areas		3 Litres	Rs. 9.50
	v) Hyderabad Municipal Corporation	White card holders Pink Card holders	19 Litres 7 Litres	Rs. 9.50
	vi) Others to meet the requirement of illumination during power load shedding etc.		One litre per family per month	Rs. 9.50

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము మార్కెటింగ్ శాఖ

రైతుల ఆత్మబంధు - "రైతుబంధు" పథకము

రైతు సోదరులారా!

మీరు చెమటోడ్చి కష్టించి పండించిన పంటలకుఆశించిన ధర రావటంలేదా? తక్షణ అవసరాల కోసం తక్కువ ధరకే మీ కష్టార్జితాన్ని తెగనమ్ముకోవటానికి సిద్ధపడుతున్నారా? అలాగైతే తొందరపడకండి!!

మార్కెట్లో ధర తక్కువగా వున్నప్పుడు గత్యంతరం లేక వ్యవసాయోత్పత్తుల్ని అయిన కాడికి అమ్ముకొని నష్టపోకుండా ఆత్మబంధువులా ఆదుకునే 'రైతుబంధు పథకం' మీకు అందుబాటులో వుంది. మార్కెట్లో ధర తక్కువగా వున్నప్పుడు రైతులు తమ వ్యవసాయోత్పత్తుల్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాముల్లో నిల్వవుంచి, వాటి విలువపై సులభంగా రుణాలు పొందవచ్చు.

గోదాము సదుపాయం వున్న అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలలో ఈ పథకం అమలులోవుంది. దీర్ఘకాలం మార్కెట్‌కమిటీ గోదాముల్లో నిల్వవుంచదగిన అన్ని వ్యవసాయోత్పత్తులకు ఈ పథకం వర్తిస్తుంది.

ఈ పథకం ద్వారా రుణం పొందాలంటే ఏం చేయాలి?

రైతులు తమ భూమి విస్తీర్ణం, సాగుచేస్తున్న పంట వివరాలతో సమీప వ్యవసాయ మార్కెట్ కమిటీకి దరఖాస్తు చేసి రైతుబంధు కార్డు తీసుకుంటే చాలు. ఎటువంటి బాదరబందీ లేకుండా సులువుగా రుణం పొందవచ్చు.

'రైతుబంధు' ద్వారా రైతులకు కలిగే లాభాలు

- రైతులు తక్షణ అవసరాల కోసం తమ కష్టార్జితాన్ని తక్కువ ధరకు తెగనమ్ముకోకుండా సులభంగా రుణం పొందవచ్చు.
- ఆశించిన ధర వచ్చినప్పుడు నిల్వవుంచిన వ్యవసాయోత్పత్తుల్ని అమ్మి లాభం పొందవచ్చు.
- మార్కెట్ కమిటీ గోదాములలో నిల్వవుంచిన వ్యవసాయోత్పత్తుల విలువలో 75 శాతం మొత్తాన్ని 50,000/- రూపాయల గరిష్ట పరిమితికి లోబడి రుణం తీసుకోవచ్చు.
- కేవలం మార్కెట్ కమిటీ గోదాముల్లోనేగాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థల గోదాముల్లో వ్యవసాయోత్పత్తులు నిల్వ చేసుకున్న రైతులు కూడా ఈ పథకం ద్వారా రుణాలు పొందవచ్చు.
- రైతులు నిల్వవుంచిన వ్యవసాయోత్పత్తులకు పూర్తి భద్రతలోపాటు భీమాసౌకర్యం కూడా కల్పిస్తారు.
- వ్యవసాయోత్పత్తులను 90 రోజులదాకా నిల్వవుంచుకోవచ్చు. ప్రత్యేక పరిస్థితుల్లో రైతుల అభ్యర్థన మేరకు 180 రోజుల దాకా కూడా నిల్వవుంచుకునే సదుపాయం వుంది.

[illegible]

ఇప్పటికే ఈ పథకం ద్వారా వేలాదిమంది రైతులు లాభం పొందారు. ఇక ఆలస్యం దేనికి? మీరు కూడా 'రైతుబంధు పథకం' ద్వారా వెంటనే లాభం పొందండి.

కమిషనర్

మార్కెటింగ్ శాఖ

Visit Website : http/gist.ap.nic.in/market E-mail : marknet@apts.gov.in

With Best Compliments From :

Sri Sarathi Studios Private Limited



8-3-321, AMEERPET,
HYDERABAD - 500 073.
PHONE : 23237299

An Evolutionary Revolution in Engineering

MAHARAJ VIJAYARAM GAJAPATHI RAJ COLLEGE OF ENGINEERING

Ph: 08922-241732

(Approved by AICTE, New Delhi & Affiliated to JNT University, Hyderabad)

VIJAYARAM NAGAR, CHINTALAVALASA, VIZIANAGARAM- 535 005

The institution is making rapid strides with an exceptional perspicacity in promoting value based technocrats perpetuating scintillating academic records since its inception

With the blessings of



Late **Dr.P.V.G. Raju**
Raja Saheb of Vizianagaram
Founder, MANSAS.

Under the noble guidance of



Dr. P.Anand Gajapati Raju
Chairman-MANSAS



Sri P.Ashok Gajapati Raju
Vice-Chairman MANSAS



Replication of Royal Fort
- The Admn. Block









GLIMPSES OF SUCCESS

- **All India 3rd Rank in GATE 2004**.(Chem.)
- Securing University second rank in Mech. Engg. by two of its second batch (98-2002) students.
- Bagging Gold medal in Mechanical Engineering with the first batch (97-2001) itself.
- Ranking 5th among all JNTU constituent colleges at its first instance.
- Bagging 1st prize at 'SYNOPSE-2003' &2nd prize at 'CSIXXXVIII National Convention-2003.
- Securing 1st place in Chess at JNT University Inter Collegiate Sports Meet.
- Intranet with OFC Backbone

Hostel facilities for boys & girls provided
Transportation facilities from VZM & VSKP.

Visit Us : www.maharajah-mvgr.org

AAKRUTI.(08922) 236673

COURSES

M.Tech. **Mechanical** Machine Design

B.Tech. C.S.E. C.S.I.T. E.C.E. E.E.E. MECHANICAL CHEMICAL



పర్యావరణ పరిరక్షణే మా ధ్యేయం - ప్రకృతి సిద్ధ ఉత్పత్తులే మా లక్ష్యం

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం - ప్రకృతి ఆరాధకుల మహోత్సవం.

అడవి తల్లిని అనుదినమూ ఆరాధిస్తూ, పచ్చని మొక్కలకి ప్రాణం పోస్తున్న గిరి పుత్రులైన గిరిజనులకు ఉపాధి కల్పిస్తూ, అటవీ ఉత్పత్తులను ప్రపంచానికి అందిస్తూ విశేష సేవలందిస్తోంది - **గిరిజన సహకార సంస్థ.**

ప్రతి ఒక్క ఉత్పాదనా సహజసిద్ధం - ప్రకృతి బద్ధం. పర్యావరణ నిబద్ధం.

అందుకే గిరిజన సహకార సంస్థ ఉత్పత్తులనే ఎల్లప్పుడూ వాడదాం.

రండి ప్రాణవాయువునిచ్చే ప్రకృతిని ప్రాణప్రదంగా కాపాడుకుందాం.

Abin

గిరిజన సహకార సంస్థ

(ఆం.ప్ర. ప్రభుత్వ రంగ సంస్థ)

విశాఖపట్నం -530 017

ఆరోగ్యానికి భరోసా

Website : www.apgirijan.com

ప్రకృతిని ప్రేమిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

అభినందనలతో

మండల సమాఖ్య

మెరక ముడిదాం మండలం


విజయనగరం జిల్లా

With best compliments from

THE ETIKOPPAKA CO-OPERATIVE AGRICULTURAL AND INDUSTRIAL SOCIETY LIMITED.NO. M - 191

ETIKOPPAKA, VISAKHA DT.

PIN - 530082.



A.P. State Seeds Development Corporation Limited
HACA Bhavan, Hyderabad - 500 004.
Phone: 23236088

APSSDC

ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్,
హాకా భవన్, హైదరాబాద్ - 500 004.
ఫోన్ : 23236088


AP SEEDS QUALITY SEEDS ఎ.పి.సీడ్స్-నాణ్యమైన విత్తనములు



ఒక ఉల్లాస ప్రపంచంలోకి తేలిపొండి.

మీరు ఉండే జనారణ్యం, రద్దీగా ఉండే వాహనాల జోరు నుండి నడుము వడిపోయే పనులతో తీరిక లేని పని వత్తిడితో సతమతవుతున్నారా?
విశ్రాంతి కావాలనుకుంటున్నారా? మీరుండే పరిసరాలకు దూరంగా, ప్రశాంతతకు దగ్గరగా ఉందామనుకుంటున్నారా అయితే రండి. గోదావరి, ఉపనదులైన వైనతేయ, వశిష్ఠల పవిత్ర నదీ జలాలలో తేలియాడండి. సకల హంగులూ, ఆధునిక సౌకర్యాలతో కూడిన నదీ విహారం ప్రభాత వేళలో మొదలై అనేక మలుపులు తిరిగి విశాలమైన కొబ్బరితోటలున్న ద్వీపసముదాయాల దగ్గర మజిలీ మీకు అత్యద్భుతమైన ఉల్లాసాన్ని, అనుభూతినీ కలిగిస్తుంది. నోరూరించే రుచులతో, తెలుగుతనం నిండిన ఆంధ్రా భోజనం మీ కోసం ప్రత్యేకం.
ఇక రాత్రి అంటారా. . . వామ్మో! సుతి మెత్తని అలల తాకిడికి మీ పడవ ఉయ్యాల జోల పాట తో కలిగే సుఖమైన నిద్ర గురించి వర్ణించలేము. ఆ అనుభూతి పొందితేనే తెలుస్తుంది.





ప్యాకేజి ఖరీదు - ఒక జంటకు (ఒక రోజుకు) 2,500/- అన్ని ఖర్చులతో కలిపి (పడవ ప్రయాణం, గది మరియు భోజనం) అదనంగా వచ్చే అతిథులకు (ఒక్కరికి) రూ. 300/-
5 సం॥ల లోపు పిల్లలకు ఉచితం.
ప్రయాణం సమయం ఉ॥10 గం॥ ల నుండి ఉ॥9.00 గం॥ ల వరకు.

కార్పొరేట్ సంస్థలకు, గ్రూపు బుకింగులకు ప్రత్యేక ప్యాకేజి సౌకర్యం కలదు.

aptdc
ANDHRA PRADESH TOURISM DEVELOPMENT CORPORATION

బేస్ క్యాంప్ కి చేరుకునే మార్గం - రోడ్డు ద్వారా: తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలను కలుపుతూ, తూర్పు తీర రేఖకు సమాంతరంగా సాగే NH-5, ఒక చక్కటి అంతర్గత రోడ్డు రవాణా వ్యవస్థ కలిగి నదీతీర ప్రాంతానికి సులువుగా చేరడానికి వీలు కల్పిస్తుంది. రాజమండ్రి నుండి రావులపాలెం, సిద్ధాంతం మీదుగా 65 కి.మీ దూరంలో ఉన్న (APTDC base camp) పెద్దమల్లం చేరుకోవచ్చు.

రైలు ద్వారా: పెద్దమల్లం (base camp) రోడ్డు మీదుగా చేరుకోడానికి రైలు ద్వారా వచ్చే వారికి, రాజమండ్రి తాడేపల్లిగూడెం మరియు భీమవరం దిగడానికి అనువైన ప్రదేశాలు. ఈ మూడు స్టేషనులలో అన్ని ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్ళు ఆగే వసతి కలదు. వివిధ రాష్ట్రాల రాజధానులైన కోల్‌కత్తా, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ మరియు బెంగుళూరు నుండి రాజమండ్రి వరకు రైలు వసతి కలదు.

పికప్ పాయింట్స్: నర్సాపురం, రాజోలు, పెద్దమల్లం

టూరిజం హౌస్, హిమాయత్ నగర్, హైదరాబాద్ - 29
ఫోన్: 040-2326 2151/52/53 ఫ్యాక్స్: 2326 1801
మార్కెటింగ్ విభాగం: 040-2345 0179
రిజర్వేషన్స్ కొరకు: హైదరాబాద్: 040-2329 8456/7
విశాఖపట్నం: 0891-2746446
విజయవాడ: 0866-2571393
తిరుపతి: 0877-2255385
చెన్నై: 044-2538 1213
కోల్‌కత్తా: 033-2281 3679
ఇ-మెయిల్: aptdc@satyam.net.in
www: aptourism.com

ramakantadvertising.com

. . . కోనసీమ, నదీ జలాల్లో పడవ మీద విహరించండి.

గర్భస్థ శిశు (భ్రూణ) పరీక్షా ప్రక్రియ (పి.ఎన్.టి.టి) (లింగ నిర్ధారణ నివారణ) చట్టం 1994

పి.ఎస్.టి.డి. 1994 సవరణ చట్టం 1996 ప్రకారం గర్భస్థ శిశు (భ్రూణ) ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సంస్థలు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు, జన్యు చికిత్సా కేంద్రాలు నిర్దేశిత అధికారి పి.సి. మరియు పి.ఎన్.డి.టి. చట్టం 1994 సవరణ చట్టం 1996 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, విశాఖపట్నం నందు నమోదు చేయించుకోవాలి.

ప్రకటన గర్భస్థ శిశు (భ్రూణ) పరీక్ష ప్రక్రియ (లింగ నిర్ధారణ నివారణ) చట్టం - 1994

ఈ చట్టం యొక్క ఆవశ్యకత, పూర్వాపరాలు, నియమనిబంధనలు ఉల్లంఘించిన వారికి శిక్ష గురించి, ప్రజల, వివిధ సంస్థల అవగాహన, సమాచారం నిమిత్తం ఈ ప్రకటన జారీ చేయడమైనది. సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య ఏ వివక్షా ఉండకూడదు. అన్ని రంగాల్లోనూ స్త్రీలు, పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారు. అయినా పుట్టబోయేది ఆడ శిశువని తెలియగానే ఒక్కసారి గర్భస్రావానికి కొన్ని కుటుంబాలు సిద్ధపడటం జరుగుతోంది. రోజు రోజుకు తరిగిపోతున్న స్త్రీ, పురుష నిష్పత్తి, పెరిగిపోతున్న స్త్రీ, భ్రూణ శిశు హత్యలను నివారించాల్సిన అవసరాలను దృష్టిలో వుంచుకొని భారత ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది.

చట్టంలోని అంశాలు : ఈ క్రింది సందర్భాలలో మాత్రమే గర్భస్థ పిండ పరీక్షలు అనుమతించబడినవి. గర్భిణీ వయస్సు 35 సం॥రాలు పైబడినపుడు, స్త్రీలలో రెండుసార్లు గానీ అంతకుమించి గాని గర్భస్రావం లేక పిండ నష్టం జరిగినపుడు గర్భిణీలు హానికరమైన మందులు, అణధార్మికశక్తి, అంటువ్యాధులు లేక రసాయనాల ప్రభావానికి గురయినపుడు, గర్భిణీలు కుటుంబంలో ఎవరైనా మానసిక వికలాంగులు, జన్యు సంబంధమైన వ్యాధులు కలిగినవారున్నపుడు.

నేరము - శిక్ష : గర్భస్థ పిండ పరీక్షలు చేసే ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సంస్థలు, జన్యు సలహాకేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు, జన్యు చికిత్సా కేంద్రాలు చట్టప్రకారం నమోదు చేయబడినవై వుండాలి. ఈ పరీక్షలు నిర్వహించుటకు సౌకర్యాలు ఉన్న ప్రతీ సంస్థ నిర్దేశిత అధికారి వద్ద నిర్ణీత రుసుము చెల్లించి నమోదు చేయించుకోవాలి. ఈ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది పూర్తి స్థాయి ప్రమాణాలు కలిగి వుండాలి. ఈ సంస్థలు నమోదు పత్రాలను సందర్శకులకు కనిపించే స్థలంలో తప్పనిసరిగా ప్రదర్శించాలి. పరీక్షల నిమిత్తం ఆమోద పత్రాన్ని గర్భిణీ స్త్రీల నుంచి రాతపూర్వకంగా తీసుకోవాలి. ఆమోదపత్రం నకలును గర్భిణీకి అందజేయాలి. గర్భస్థ పిండం ఆడోమగో పరీక్షల ద్వారా తెల్సినా ఆ విషయాన్ని గర్భిణీ స్త్రీకి గాని, ఆమె కుటుంబ సభ్యులకు మాటల ద్వారా గానీ, సైగల ద్వారా గానీ ఏవిధంగా తెలియజేయరాదు. ఈ చట్టంలో పొందుపరచనిన నియమాలను ఉల్లంఘించడం నేరం. అట్టివారికి శిక్షపడటం ఖాయం. మొదటి తప్పుకు మూడు సంవత్సరాల జైలు శిక్ష రూ. 15వేల రూపాయాల జరిమానా, అదే తప్పు రెండోసారి చేస్తే అయిదు సంవత్సరాల జైలుశిక్ష రూ. 50వేల జరిమానా విధించబడును. ఈ చట్టం అమలుకు జిల్లాలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని నిర్దేశిత అధికారిగా ప్రభుత్వం నియమించింది. జిల్లా స్థాయిలోనూ, ఉపజిల్లా స్థాయిలోనూ సలహా మండలాలను కూడా ఏర్పాటుచేయడం జరిగింది.

డా.పి.రామారావు
జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, విశాఖపట్నం

ప్రవీణ్ ప్రకాష్, ఐఎఎస్
జిల్లా కలెక్టరు, విశాఖపట్నం

జిల్లా నీటి యాజమాన్య సంస్థ, విజయనగరం

నిరుపేద ప్రజల ఆర్థిక సామాజిక విజయంజిల్లా -
——— జిల్లా నీటి యాజమాన్య సంస్థతోనే సాధ్యం ———

అమలవుతున్న పథకాలు :

1. వాటర్‌షెడ్ కార్యక్రమాల ద్వారా నిరుపయోగ భూముల అభివృద్ధి :

★ జిల్లాలోని 12 మండలాలలో 60 వాటర్‌షెడ్‌ల పరిధిలో 2004-05 సం॥లో మొత్తం రు॥ 343.00 లక్షలతో 65॥ హె॥ల నిరుపయోగభూమిని అభివృద్ధి చేయడమైనది.

★ 2004-05 సం॥లో 398 పొడిరాతి కట్టడాలు, 47 సమతల కందకాలు, 143 ఫారం పాండ్లు, 544 నీటి కుంటలు నిర్మించడమైనది.

★ 1507 హె॥లలో సామాజిక అడవుల పెంపకం, 1192 హె॥లలో ఉద్యానవన చెట్ల పెంపకం చేపట్టబడినవి.

2. ఇందిరాప్రభ సమగ్రభూమి అభివృద్ధి పథకము :

★ సన్నకారు, చిన్నకారు, షెడ్యూల్డు కులములు, షెడ్యూల్డు తెగల రైతులకు చెందిన అతుకుబడి, మిగులు భూములను వ్యవసాయయోగ్యంగా మార్చి వారి భూములపై వచ్చు ఆదాయంతో జీవించగల సమర్థతను తీసుకురాడం జరుగుతుంది.

★ ఆర్‌ఐడిఎఫ్ - పథకము క్రింద రు॥ 6.14 కోట్లు, ఆర్‌ఐడిఎఫ్ - క్రింద రు॥ 24.89 కోట్లు కాబడినవి. మొత్తం 698 బ్లాకులకు చెందిన 25526 ఎకరాలను అభివృద్ధి చేయుటకు నిర్ణయించడమైనది. 21,505 రైతు కుటుంబాలు లబ్ధిపొందెదరు.

★ RIDF IX క్రింద 2004-05 సం॥లో మొత్తం 120 బ్లాకులలో రు ॥ 43.00 లక్షల నిధులతో వివిధ పనులు చేపట్టబడినవి.

3. బిందు సేద్యం ద్వారా నీటి ఆదా :


★ మొక్కల వ్రేళ్ళ భాగానికి బొట్లు, బొట్లుగా నీటి చుక్కలను అందించడం ద్వారా 50% నీటి ఆదా, కూలీల ఖర్చు ఆదా, కరెంటు ఆదా, అధిక దిగుబడి, ఉత్పాదకత నాణ్యత పెరుగుతుంది.

★ 2004-05 సం॥లో 735 హె॥లలో రు ॥ 169 లక్షలతో 688 రైతుల పొలాల్లో ఈ పథకం అమలు చేయబడినది.

4. ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి మరియు చెట్లు చట్టము క్రింద, బోరు త్రవ్వేటప్పుడు ప్రమాణాలకు లోబడి సరైన నీరు లభించని యెడల లేక బావి నిరుపయోగమైనచో రు॥ 10,000/-లు వరకు నీటి లభ్యతను బట్టి, భీమా చెల్లించబడును. ఇందుకు ప్రతి రైతు రు॥ 1200/-లు ప్రీమియడం చెల్లించవలసి ఉంటుంది. ప్రీమియం సొమ్ము పథక సంచాలకులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, విజయనగరం వారి పేరు మీద డిమాండ్ డ్రాఫ్టుతో మండల రెవెన్యూ అధికారి వారి ఫారం - 3 తో పాటు ధాఖలు చేయవలెను.



శ్రీ ఎస్. కృష్ణమూర్తి,
ప్రాజెక్టు డైరెక్టరు,
డుమా, విజయనగరం



శ్రీ బి. వెంకటేశ్వరరావు ,
ఐ.ఎ.ఎస్.
జిల్లా కలెక్టరు, విజయనగరం

రాష్ట్ర మహాసభల్లో కళా ప్రదర్శనలు







'భూబాగోతం' లో
ఒక దృశ్యం







ఓ దళారి పాలకులారా !
ఓ వంచన నాయకులారా !
తాకట్టున భారతదేశం
ఎంతకాలమీ ఘోరం !



భరతఖండంబొక చక్కని పాడియావు.....

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)